# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక ఏప్రిల్, 2012 ₹ 20



అస్సామీ అందం

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 23 ఏప్రిల్ 2012 సంచిక 4**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా* **మిసిమి** *పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ..... 3

మానవతే గొప్పదన్న కమలాదాస్ ..... 5

- *డాక్టరు మంతెన సూర్యనారాయణరాజు*

మల్లాది విశ్వనాథ కవిరాజు ..... 8

- *డాక్టరు యు.ఎ. నరసింహమూర్తి,*

మగవాళ్లకే ధైర్యం చెప్పిన మగువ ఇస్మత్ చొగ్తాయి ..... 13

- *సామల సదాశివ*

అవే రాగాలు-అవే కృతులు ..... 18

- *పన్నాల సుబ్రహ్మణ్యభట్టు*

నేను-నా భావావేశాలు ..... 23

- *డాక్టరు ఎ. శ్రీదేవి*

అవధానాలు-ధారణ ..... 25

- *డాక్టరు పానుగంటి శేషకళ*

నీలగిరి పత్రిక స్థాపకుడు షబ్నవీసు ..... 27

- *కుర్రా జితేంద్రబాబు*

అగాధం DE PROFUNDIS ..... 32

- *ఆస్కార్ వైల్డ్ - అశ్విని. కె*

చరిత్ర గర్భంలోకి ..... 40

- *నండూరి పార్థసారథి*

నోటీసు ..... 44

- *సి.వి. కృష్ణారావు*

చీకటంతా చీల్చి పాడిన ఊట్ల కొండయ్య ..... 45

- *పరిణతవాణి*

నా స్వగతం ..... 54

- *భాగవతుల యజ్ఞనారాయణ శర్మ*

అముక్తం ..... 56

- *డాక్టరు వి. భార్గవ*

విదేశీయులు ప్రచురించిన తెలుగు గ్రంథాలు ..... 58

- *డాక్టరు వెలగా వెంకటప్పయ్య*

శాసన పరిష్కారం ..... 63

- *జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి*

పలుకు తీరు ..... 69

- *డాక్టరు వోలేటి పార్వతీశం*

కులాల కూడలిలో నిలువెత్తు ప్రశ్న దాటు ..... 72

- *జి. లక్ష్మి*

చదవండి (పుస్తక పరిచయం) ..... 76

నవ్వులు ..... 78


| | | |
|---|---|---|
| *ముఖచిత్రం* | : కరతలతాళమేళాలు | - చిత్రకారుడు : టి.సాయికృష్ణ |
| *రెండవ అట్ట* | : అస్సామీ అందం | - చిత్రకారుడు : తలసాని రవీంద్ర |
| *మూడవ అట్ట* | : స్నానానికి | - చిత్రకారుడు : ఆగాచార్య |
| *నాల్గవ అట్ట* | : పద్మావతీ చరణ చారణ చక్రవర్తి | - చిత్రకారుడు : టి. సాయికృష్ణ |

(*వివరాలు :* 53వ పుటలో..)

గత దశాబ్ద కాలంలో తెలుగు సాహిత్య ధోరణుల మూల్యాంకనం చేసిన వ్యాసాలు పరిశీలిస్తే పరిస్థితి చాలా నిరాశాజనకంగా వుంది. ఇలా ఎందుకుంటుందో అనేది ఇప్పటి ప్రశ్న. అస్తిత్వ వేదనల నుంచి, మాండలికపు మలుపులలో నుంచి తెలుగు వాఙ్మయాన్ని బైటకు తెచ్చి కొత్తపుంత తొక్కించ వలసిన అవసరం ఎంతైనా వుందనేది నిర్వివాదం. ఇందుకు పూర్తి బాధ్యత పురస్కారాల కోసం పరుగులెత్తే రచయితలు – విశ్వ విద్యాలయాలలోని ఆచార్యులు తలకెత్తు కోవలసి వుంది.

ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన సామల సదాశివతో ఇష్టాగోష్ఠి జరిపి వీడియో తీశాము. అప్పటికింకా పురస్కార ప్రకటన జరగలేదు. ఆయన మాటలలో మాండలిక ధోరణులుగాని, ప్రాంతీయ దురభిమానంగాని మాకెక్కడా వినిపించలేదు – బడిపంతులుగా జీవితాన్ని గడిపిన నిరాడంబర జీవి. హిందూస్థానీ సంగీత ధోరణులేగాక ఎన్నో విషయాలపై **మిసిమి**కి వ్యాసాలు గత రెండు దశాబ్దాలుగా రాస్తూనే ఉన్నారు. వారి సహకారానికి కృతజ్ఞతలు – వారి పురస్కారానికి అభినందనలు!

ఊట్ల కొండయ్య–స్వయం శిక్షణతో జీవితంలో ఎన్నో ప్రయాణాలు చేసి ఎన్నో మజిలీలు చేరిన కొండయ్య ఏ కొండా ఎక్కక పోయినా తెలుగుకు కొండంత సేవ చేశారు.

మనం ఎవరిని దేశం వదిలి పొమ్మని ఆందోళనలు – ఉద్యమాలు నడిపామో, ఆ తెల్లవారిలో కొందరు తెలుగులో ఎన్నో అపురూపమైన తాళపత్ర గ్రంథాలను పరిష్కరింపజేసి ప్రచురించారు. వాటి వివరాలు కొన్ని ఇస్తున్నాం.

ఎనిమిది జ్ఞానపీఠ పురస్కారాలు పొందిన కన్నడ సాహిత్యకారులలో ముఖ్యులు భైరప్ప. వారి 'దాటు' సమీక్షలో కులాలకూడలిలో నిలబడి నేటి సాంఘిక పరిస్థితిని పరిశీలించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

'గూడవల్లి రామబ్రహ్మం' జీవితం – ఆదర్శం – ఆయన మర్త్యప్రపంచాన్ని వదిలి దశాబ్దాలైనా – ఇప్పటికీ చూడగలిగిన వారికి వెలుగు చూపుతూనేవుందని పాఠకులు రాసిన ఉత్తరాలే మాకు ప్రమాణాలు – అలాగే 'బెంగుళూరు నాగరత్నమ్మ', 'రావిచెట్టు రంగారావు', 'ఒద్దిరాజు సోదరులు' వ్యాసాలు కూడ ఎంతో స్పందనను తెచ్చాయి.



**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

---

✶ "...ఈ నెల *మిసిమి* 2వ తేది నా చేతికి వచ్చింది. వరుసగా కమ్మతెమ్మెరలు, సంపాదకీయం, వ్యాసాలు, అట్టమీదవి వెనుకా 4 పేజీలు చిత్రకారులను తెలుసుకుని మనస్సంతా సంతోషం. వెయ్యిఏనుగుల బలం వచ్చినంత ఉత్సాహం పొందాను. *సామాన్యుని సాహిత్యం– స్వాతంత్ర్యం యాత్ర* వ్రాసిన వారు దర్శి చెంచయ్యగారు మావారికి స్వయాన పెద్దనాన్నగారు. ఇంకచూడండి మాఇంట్లో అందరికి చూపించి, ఆరోజంతా, ఆమరునాడు కూడ మా వారి నడిగి ఆయనగురించి బోలెడు సంగతులు తెలుసు కున్నాను. మా దగ్గర *నేను–నాదేశం* పుస్తకం ఉంది. అది ఈమధ్యనే చిరుగుతూంటే మా ఆడబడుచు నాగసూరి వనజకు చెప్పి క్రొత్తది తెప్పించాము. మా వారు దర్శి జనార్ధనరావు. ఆయనకు డిటో అని తెల్సినవారంటారు. దర్శి గురుస్వామి చిన్న మామగారు. మా మామగారు దర్శి రంగయ్యగారు. రాజమండ్రిలో డిస్ట్రిక్ట్ జడ్జిగా చేసి 1955 లో రిటైరు అయినారు. మాది విజయనగరం. 1956లో మా వివాహం జరిగింది. దర్శిచెంచయ్యగారి పుస్తకాలు, రష్యా నుండి ఇంగ్లీషు అనువాదాలు తెలుగువి దొరికే స్థలం, అడ్రసు చెప్పండి..."

**– దర్శి సత్యవతి,** నాగపూర్.

✶ "...ముచ్చటైన ముఖచిత్రాలేగాక, ప్రామాణికమైన రచనలతో వెలువడుతున్న *మిసిమి* మా అభిమాన పత్రికల్లో ప్రథమస్థానం అందుకుంది. ఫిబ్రవరి సంచికలో అందించిన *అతిప్రాచీన వాద్యాలు* సచిత్రంగా అందించడం అభినందనీయం. అలాగే *తొలిస్త్రీవాద మహిళ* వ్యాసం ద్వారా అనేక విలువైన తెలియని విషయాలు తెలిసాయి. ఆరుద్రగారి *కాటమరాజు కథ* నాటకం గురించి కూడా *మిసిమి* లో చదివేదాక తెలియదు. *మిసిమి* నాబోటి పరిశోధక విద్యార్థుల పాలిట కల్పవల్లి అనడంలో అతిశయోక్తి లేదు..."

**– అమ్మిన శ్రీనివాసరాజు,** ఖమ్మం.

✶ "...*మిసిమి* ఫిబ్రవరి సంచికలో *సంజీవదేవ్ స్వీయ చరిత్ర* సమీక్ష ఎంతో ఆసక్తిగా పఠించాను. ఎన్నో జ్ఞాపకాలు ఎన్నెన్నో స్మృతిబింబాలు, గతంలో తొంగిచూచి ఏరికూర్చిన అక్షరసత్యాలను, వారు స్వీయచరిత్రలో పేర్చారు. కల్పన కంటే యథార్థం ఎప్పుడూ నిత్యనూతనంగా ఉంటుందన్నమాట నిజం. Fact is Always Stranger than Fiction నమ్మిన సృజనకర్త. అది ఆయన సెన్స్ ఆఫ్ హ్యూమర్ అనడం అతిశయోక్తి కాదు. "జీవితాన్ని కళను నిరంతరం శ్వాసించిన వ్యక్తి... స్తబ్దంగా ఉండలేడు" అనడం నిజమనాలి. ఈ మాట ఆకోవకు చెందిన మహోన్నాత్ములకు నూరు శాతం అన్వయిస్తుంది. వారిలో ఒకరు సంజీవదేవ్ కావడం మన అదృష్టం. తన దివ్యానుభూతులను డైరీల్లో మరో విధంగానో నిక్షిప్తం చేసి ఉంటే, ఆ అక్షరనిధిని బయట పెట్టాలనే సూచన ఆచరణలోకి రావాలని ఆ కాంక్ష...

...*సంజీవదేవ్ చిరంజీవిలో* "ప్రకృతినే మహతి చేసి / మధుశృతులను మీటినచోట / రసరేఖలు ప్రసరించిన / సంజీవుని కథనాలు" రసజ్ఞులైన పాఠకులకు సంజీవని అనాలి, అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఆయన చిత్రకళ, వ్యాసరచనా పటిమను గురించి ఏమాత్రం పేర్కొనక పోవడం ఆశ్చర్యంగా ఉంది. కారణం స్వీయ చరిత్ర లో ఆ అంశానికి చోటు కల్పించకపోవడమా? ఉంటే విస్మరించడమా జరిగింది? వివరిస్తే...నమస్తే!..." **– ఎన్. సత్యనారాయనాచార్యులు,** తెనాలి.

✶ "...అతి చిన్న సవరణ, పుట 71లో 'వెన్నెలంతా సొగసు ఏటిపాలేనటరా' అని వుంది... 'ఎన్నెలల సొగసంతా ఏటిపాలేనటర' అన్నది సరియైన పాఠమని *తహశీల్దారులో* ఎం.ఎస్. రామారావు పడవవాని వేషంలో పాడిన పాటయని

గుర్తు... పుట 72లో రాబందులు బతికివున్నవాటిని తీయవు, తినవు. మీ డైరీలో వున్నాసరే యిది తప్పు. అన్యాపదేశంగా చేసిన హితబోధ అయినాసరే..." **– వి.ఎ.కె. రంగారావు,** మద్రాసు.

✶ "...నెలానెలా మీ నుంచి అందుతున్న ***మిసిమి*** మాసపత్రిక నెలమొత్తం నాకు ఉదయం వేళ ఒక గంటపాటు పసందైన విందు (రోజుకొక వ్యాసం చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఇది రెండు సంవత్సరాల నుంచి నా దినచర్యలో ఒక భాగం. ***మిసిమి***లోని ఏ పుట కూడా వదిలి వేయడానికి వీలులేనంత పకడ్బందీగా ఉంటుంది మీ కూర్పు...ఈ పత్రిక ద్వారా నేను ఎన్నో అపురూపమయిన విషయాలు తెలుకుంటున్నాను. ఈ వ్యాసాలు చదివిన ప్రేరణతోనే కొనసాగింపుగా ఆయా విషయాలలోకి మరింత లోతుగా వెళ్ళే అవకాశం నాకు కలుగుతున్నది..."

**– కర్లపాలెం హనుమంతరావు,** హైదరాబాదు.

✶ "...నేడు మనసనేది మొద్దుబారి పోయినది. మనసు మూలాలలో చికిత్స జరగాలి. రుజాగ్రస్థమైన, మూలాలను కనిపెట్టి శుద్ధి చేయాలి. దీనికి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, ఎంకి, నాయుడు బావ, శశికళ, కిన్నెరసాని, వంటి ప్రణవ మూర్తులు వెలగాలన్న రచయిత కె.బాలకృష్ణారెడ్డిగార్కి ...

...వెనువెంటనే రాబందుల సందడి ద్వారా ప్రాచీన కాలం నుండీ ఆధునిక కాలం వరకూ జరిగే మనిషి మృగాల హింసను కండ్లకు కట్టినట్లు చూపిన ఎ.కేగార్కి...ముఖచిత్రము భారత్ హిందూ, క్రైస్తవ, ముస్లిం పిల్లలను సమానంగా లాలిస్తున్న తల్లి భారతి సమైక్య చిహ్నం– చాలబాగున్నది. గిరిధరగౌడ్ గారి చిత్రం చివరిఅట్టపై మాతృమూర్తి తన చిన్నారికి కాంతివంతమైన భవిష్యత్‌ను చూపుతున్నది. ఈ నాటి పరిస్థితులన్నీ వ్యతిరేకమై కవుల చిత్రకారుల హృదయాలకు వేదన కలిగిస్తున్నది..." **ఉపాసిక పైడితల్లి,** సర్పవరం.

✶ "...***మిసిమి*** అక్టోబరు – 2011 సంచికలో 11వ పుటలో ప్రచురించిన *తెలుగు సాహిత్యంలో దళిత సంస్కృతి* వ్యాసము చాలా బాగుంది. మరీ మరీ చదవాలనిపిస్తుంది. రచయిత్రికి హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఇలాంటి వ్యాసాలు ఇంకా ప్రచురించాలని మనవి..." **– టి.లక్ష్మీసాయి,** తిరుపతి.

✶ "...***మిసిమి***ని ప్రశాంతంగా చదివినప్పుడే దానిని సంతోషంగా ఆస్వాదించగలను. ***మిసిమి***ని చదువుతుంటే మనసు కెంతో హాయిగా వుంటుంది... జూన్ సంచికలో గాన గంధర్వ బాలమురళీ కృష్ణ గురించి వ్రాసినది చదివితే, ఆయన తెలుగువారు అయినందులకు... ఆనందంగాను, గర్వంగాను వుంది. ప్రతి ఒక్క రచనా చదవాలనిపించేలాగ వుండటమే గాక విజ్ఞానదాయకంగా కూడా ***మిసిమి*** వుంటోంది. ధన్యవాదాలు..." **– కె. సర్వమంగళ,** చెన్నై

✶ "...***మిసిమి*** మళ్లీ మా యింటికి వచ్చి ముదిమి కూర్చినది. సంతోషాన్ని సూటిగా చెప్పుదామని రెండుసార్లు ఫోను చేసినా ప్రయత్నం ఫలించలేదు. ప్రత్యక్షమే మేలని ఈ లేఖ. ***మిసిమి*** మిసమిసలు రవీంద్రనాథ్ అభిలాషను అనుసరణ మేలుగానే వుంటున్నందుకు అభినందనలు. రామబ్రహ్మం గురించిన రచన ప్రారంభించారు. 96 ఆగస్టు సంచికలో అనుకుంటాను నేను ఆయన గురించి రాసింది వుంది. ఓసారి చూడండి...దర్శి చెంచయ్య గురించి కొంచె పరిచయం చేస్తే బాగుండేది...వెంకటప్పయ్య విషయంలో వలె రచయితలందరిసలహా సూచనలుండటం మంచిది. రచన చదవటంతోటే రచయితతో పాఠకులు మాట్లాడే వీలుంటుంది. అవసరమయినపుడు ఇట్లా వ్రాస్తూ వుంటాను. పనికి వచ్చేదేమైనా వుంటుందోమో చూస్తూ ఉండండి..." **– మద్దాలి సత్యనారాయణశర్మ,** హైదరాబాదు.

✶ "...ఫిబ్రవరి సంచికలో వచ్చిన 'ఎందుకీ పయనం–ఎక్కడకీ ప్రయాణం?' చదివాను. రచయిత మామూలు ప్రయాణాన్ని తాత్త్విక పయనంగా ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయం. ప్రపంచం నాలుగు మూలలా తిరిగిన అనుభవాన్ని ఇంకించుకొని తన వ్యక్తిత్వాన్ని పరిణత పరుచుకొని జీవితానికి అన్వయించుకోవటం ఈ నాటి యువతకు మార్గదర్శకమే...ముఖ్యంగా హాంకాంగ్ వ్యవహారాన్ని–ఆంగ్లేయుల చేతుల్లోనుంచి చైనా పరమవటం– అక్కడి ప్రజల మనోభావాలను, వారి భయాలను కళ్లకు కట్టినట్లు పాఠకునికి విశదీకరించారు..." **– రంగనాథ్,** హైదరాబాదు.




# మానవతే గొప్పదన్న కమలాదాస్

– *మంతెన సూర్యనారాయణరాజు*

సాహిత్యం, జర్నలిజం రెండింటికి నెలవైన కుటుంబంలో కమలాదాస్ మార్చి 31, 1934లో కేరళ రాష్ట్రంలో జన్మించారు. మలబార్ ప్రాంతంలోగల ఒక గ్రామంలో నళ్‌పట్ సంపన్న కుటుంబంలో బాలమణి అమ్మ అనే కవయిత్రికి కుమార్తెగా ఆమె పుట్టడం విశేషం. చిన్నప్పుడు ఆమెకు తలిదండ్రులు పెట్టిన పేరు మాధవకుట్టి. అనంతర కాలంలో ఆంగ్లసాహిత్య కవయిత్రిగా, రచయిత్రిగా కమలాదాస్ అనే పేరుతో ప్రఖ్యాతిపొందారు.

ఆమె పుట్టిన 56 రోజులకే తల్లితో బాటు తండ్రి కలకత్తాలో ఉద్యోగం చేస్తున్నందువల్ల అక్కడికి వెళ్లక తప్పలేదు. మాధవకుట్టి ప్రాథమిక విద్యాభ్యాసం కలకత్తాలో జరిగింది. అప్పుడప్పుడూ మాధవకుట్టి వాళ్ళ అమ్మమ్మగారింటికి కేరళ వచ్చి వుంటుండేది. మలయాళ సంప్రదాయబద్ధంగా ఆమె తలనిండా చమురు రాసుకుని, ఒత్తుగా జడ వేసుకుని, తోటపనిలో నిమగ్నం కావడమంటే ఇష్టం. చల్లని నీరు, పైన నింగిలో మండే సూర్యుడు అదొక విలక్షణతతో కూడిన బాల్యం.

ఆమె చిన్నతనంలో తండ్రి విధించే క్రమశిక్షణ, సంస్కృతీ సంప్రదాయాల పట్ల వైముఖ్యం కలిగి వుండేది. తండ్రి ఆదేశానుసారం మాధవకుట్టి స్వగ్రామానికి చేరుకుంది. ఆమెకు పరిస్థితుల ప్రభావమో, తల్లి వారసత్వమో, లేక సరదానో కారణాలు కావొచ్చు కవిత్వం రాయడం, రచనలు చేయడం అలవాటయ్యింది.

అతి చిరుతప్రాయంలోనే అంటే ఆమె పదిహేనవ ఏట మాధవన్ దాస్‌తో పెండ్లి జరిగింది. మాధవన్‌కి భార్య అంటే ఎంతోప్రేమ. వివాహానంతరం 'తర్పవాడ్' కుటుంబంలో మామగారి పెత్తనం అధికంగా ఉండేది. ఆంగ్ల కవయిత్రిగా, రచయిత్రిగా ఆమె కమలాదాస్ పేరుతో రచనలు చేయసాగింది. కమల మామగారు నళ్‌పట్ నారాయణమీనన్ తత్త్వవేత్త. వారిది అతి సంపన్నకుటుంబం. అక్కడ నివశించే ఐదు ధనిక కుటుంబాలకు పనిపాటలు చేసేటందుకుగాను 200 బీద కుటుంబాలు ఆ ప్రాంతంలో చుట్టుపక్కల కాపురాలు వుండేవి. వారింట్లో వున్న గ్రంథాలయంలో ఎన్నో అమూల్య గ్రంథాలుండేవి.

ఆమెకు ఆ లైబ్రరీతో మంచి కాలక్షేపం జరిగేది. కమలకు ఆమె పదహారవ యేట అంటే పెళ్ళైన ఏడాది తిరక్కుండానే కొడుకు పుట్టాడు. ఎం.డి. నళ్‌పట్ (మోసు). భర్త మాధవ దాస్ బ్యాంక్ ఆఫీసర్‌గా పనిచేస్తుండేవాడు. వరుసగా ఆమెకు ముగ్గురూ మగసంతానమే కలిగారు. మోసు, చిన్నన్, జైసూర్య. ఆడపిల్లలు లేరు.

మలయాళ భాషలో ఆమె రచనలు చేసేటప్పుడు మాధవకుట్టి పేరుతో రచనలు సాగిస్తూ, ఆంగ్లంలో కవిత్వం రాస్తే, కమలాదాస్‌గా ద్వినామధేయురాలుగా ప్రసిద్ధి పొందుతూ వచ్చింది. ఈ రెండు పేర్లతో 25 పుస్తకాల వరకూ ఆమె వ్రాసింది. ఒక మలయాళ పత్రికలో కాలమిస్టుగా ఆమె తన రచనలతో పాఠకుల్ని ఆకట్టుకుని, ఆ పత్రిక సర్క్యులేషన్‌ని గణనీయంగా పెంచిన విదుషీమణి.

మాతృభాష మలయాళంలో కవిత్వంతో బాటు కమలాదాస్ నాటకం, నవల, కథ వంటి పలు ప్రక్రియల్లో రచనలు చేసి తనకంటూ ఓ ట్రెండ్ సృష్టించు కోగలిగింది. ఇదే పంథాలో ఆంగ్లభాషలో కూడా కమలాదాస్‌గా విపరీత ప్రభావంతో పుంఖాను పుంఖాలుగా రచనలు సాగించిన ఆంగ్లకవయిత్రి, రచయిత్రికూడా. మాధవదాస్ భార్యకూ బిడ్డకూ తండ్రిలాగే వ్యవహరిస్తుండే వ్యక్తి. అదీగాక ఆయన

భార్య రచనా వ్యాసంగానికి, తోటి వారితో కలిసి మెలసి వుండటానికి ఎంతగానో స్వేచ్ఛనిచ్చిన సంస్కార హృదయుడు. రూపంలో కమలాదాస్ అందగత్తె. ఆ విషయం ఆమె వయసులో వుండగా వ్రాసిన కవిత్వమే చెబుతుంది. ఆమెది బ్లాంక్‌వెర్స్. పైగా హృదయం ఎటువంటి కట్టుబాట్లకూ ఏవిధంగానూ తలొగ్గేదికాదు. హృదయం మాదిరిగానే కవిత్వం కూడా జాలువారేది. పల్లం ఎటువుంటుందో అటువైపు తుళ్ళీ తుళ్ళీ సుళ్ళు సుళ్ళుగా ప్రవహిస్తున్న నదిలా కొనసాగేది కమలాదాస్ కవితాధార. చిన్న ఉదాహరణ చూడండి.

Through peep holes neighbours watch
They watch me come and go like rain
They ask me,
Why he is called a lion,
...................................
...................................
Ask me why life is short
And love is shorter still.......

దీనిని బట్టి జ్వలిస్తున్న జ్వాలలా ప్రకృతికి ప్రతిరూపంగా అగుపించట్లేదూ– కమలకవిత్వం. ఒక్కముక్కలో చెప్పాలంటే సంకెళ్ళు తెంచుకున్న స్త్రీస్వాతంత్ర్యానికి అద్దం, ఒక ప్రతిరూపం అనిపిస్తుంది. కమలాదాస్ రచనలలోని నిర్భీతి, నిజాయితీ, సత్యం మరే మహిళా కవయిత్రుల్లోనూ అగుపించవు. తన కవిత్వంలోని నగ్నత్వం ప్రతిపాఠకుడి హృదయాన్నీ తట్టి లేపేదిగా వుంటుంది. అందుకే ఆమె పేరు ప్రపంచమంతటా మారుమ్రోగిందటంటే ఆ విషయం సత్యదూరమెలాగౌతుంది. ఆమె రచనలు చదువుతుంటే మన తెలుగు సాహిత్యంలో ఒక గుడిపాటి వెంకట చలం, లత (తెన్నేటి హేమలత) తప్పక గుర్తుకొచ్చి తీరతారు.

అందువల్లనే ఆమె స్త్రీలోని విశృంఖలతను తట్టి లేపడం మూలంగా అభిశంసనలను ఎదుర్కోవలసి వచ్చింది. సెక్స్ విషయంలో నిర్భయంగా ఆమె 'నాభర్త నా స్తనాలకోసం నన్ను ప్రేమిస్తారు', 'మేమిరువురం కలుసుకునేది పడకమీదనే...' ఈ వాక్యాలతో సాహిత్య రంగంలో అలజడి రేకెత్తించింది. 1984లో కమలాదాస్ పార్లమెంటు మెంబర్‌గా స్వతంత్ర అభ్యర్థిగా స్వరాష్ట్రంలో పోటీచేసి ఓడిపోవడం బాధాకర మయ్యింది. సాహిత్యవేత్తగా జీవితంవేరు, రాజకీయంగా జీవన శైలివేరు. ముఖ్యంగా కమలాదాస్‌కి స్త్రీలే ఆ నియోజక వర్గం వారు ఓటు వెయ్యలేదు. అందువల్ల ఆమె కొంత శారీరకంగా, మానసికంగా దెబ్బతింది. తొలిసారిగా రాజకీయరంగ ప్రవేశం చేసిన ఆమె ఊరూరా తిరిగి ఉపన్యాసాలివ్వడంతో గొంతు పోగొట్టుకుంది. ఆ పరాజయం నుండి కోలుకోవాలని విశ్రాంతి కోసం తమిళనాడులోని సోదరి ఇంటికి అన్నామలై వెళ్ళింది కమలాదాస్. అక్కడే *అన్నామలైపోయెమ్స్* జరిగిన వాస్తవానికి బాధాతప్త హృదయంతో వ్రాసింది.

మొదట్లో ఒంటరితనం, బాధ, ఆత్మావలోకనం వలన రాసిన కథ *మలన్ చెరివుకల్లిల్.* తర్వాత కమలాదాస్ రెండు సంవత్సరాలపాటు శ్రీలంక రాజధాని కొలంబోలో గడపాల్సి వచ్చింది. అప్పుడామె వలస పక్షులైన అమాయక తమిళుల ప్రాణాలు అన్యాయంగా బలితీసుకునే సింహళప్రభుత్వం మీద *కొలంబోపోయెమ్స్* వ్రాసింది. ఊహల్లో బ్రతికే వాడు కవికాదు. నడుస్తున్న చరిత్రను అక్షర బద్ధం చేసి, నమోదు చేసేవాడే నిజమైన కవి అని ఎలుగెత్తి చాటింది.

కమలాదాస్ వ్రాసిన వాటిలో *చైల్డ్ హుడ్ రెమినిసెన్సస్* చాల గొప్పదని పాఠకుల అభిప్రాయం. అందువల్లే కాబోలు నేషనల్ బుక్‌ట్రస్టువారు ఆ పుస్తకాన్ని 12 భారతీయ భాషల్లోకి అనువాదం చేయించి ప్రకటించడం ప్రశంసార్హమైన అంశం. మాధవకుట్టి పేరుతో వ్రాసిన ఎన్నో చిన్నకథలు సినిమాలకు ఇతివృత్తాలుగా మారాయి.

ఒక చిత్రానికి ఆమె దర్శకురాలి అవతారం ఎత్తాల్సి వచ్చింది. *సనాతన్ వర్మాస్ వైఫ్* అన్న స్వీయ వీడియోచిత్రాన్ని పూర్తి కథాచిత్రంగా ఆమె బాధ్యత చేపట్టడం జరిగింది. కమల కేవలం ఒక రచయిత్రిగానే ఒకే చట్రంలో ఇమిడిపోక కేరళ రాష్ట్ర ఫారెస్టు బోర్డు అధ్యక్షురాలుగా పనిచేసింది. ఆమె చేసిన విశేష కృషికి 1990 లో 'ఇందిరా ప్రియదర్శిని' అవార్డు కూడ పొందడం విశేషం.

స్త్రీ సమస్యల మీద లోతుగా అధ్యయనం చేసిన పి.పి. రవీంద్రన్ కమాలాదాస్‌ను ఇంటర్వ్యూ చేశారు. అప్పుడామె తన హృదయ గతభావాల్ని కొన్ని ఈ విధంగా వ్యక్త పరచింది. "ఫెమినిజం గురించి నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. మనకూ పడమటి దేశాల వారికీ ఆలోచనా విధానంలో చాలా తేడావుంది. అక్కడి స్త్రీలు పురుషుల్ని ద్వేషిస్తారు. ఎందుకంటే వాళ్లంతా లెస్బియన్స్. ఇక్కడి వాళ్లు కాదు. నేను మగాడి కండరాల బిగువుల్లో ఆనందాన్ని అనుభవించిన దాన్ని. నేను అబద్ధం చెప్పకూడదు. ఈ దేశంలో స్త్రీలు మగాళ్లను ద్వేషించరు. తనను కూడా వాళ్లతో సమంగా చూడాలని

మాత్రమే కోరతారు. నేను నా భర్తను ప్రేమించాను. నా కొడుకుల్ని ప్రేమించాను. ఆ బంధాల్లోని సౌకుమార్యం నిలుపుకుంటేనే అందం...ఆనందం... ఇంతెందుకు నేను లెస్బియన్‌గా మారదామని ప్రయోగం చేశాను. కాలేక పోయాను. అంటే సమాజంలో మనకు సరిపడనివి ఏవి ఉన్నా వాటిని పక్కన పెట్టాల్సిందే. కుళ్ళు రాజకీయాలైనా, ఛాందసపు మతాలైనా, స్త్రీని బానిసను చేసే సామాజిక విధానాలైనా మందులు ఎక్స్‌పైరీ డేట్ తర్వాత ఎలాగైతే విషపూరితమౌతాయో, విషపూరితమైన భావాల్ని, విధానాల్ని కూడా మనం ఈ సమాజం నుండి తీసిపారేయాలి" అంటారు.

మాధవదాస్‌కి తనకి కలిగిన కొడుకులు ముగ్గురున్నా, కమలాదాస్ విశాలహృదయురాలై ఇద్దరు గుడ్డి కుర్రాళ్లని ఇర్షాద్, ఇంతియాజ్ అనే వాళ్లని దత్తత తీసుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పించింది. పట్టుచీరలన్నా, నగలన్నా ఆమెకు మొదట్నుంచీ మోజు బాగా వుండేది. పొగతాగే అలవాటు వున్నా తర్వాత తర్వాత దానికి స్వస్తి చెప్పింది.

*మనోమి* ఆమె వ్రాసిన పెద్దకథ అయితే, *మదిలుగళ్* (గోడలు), *పత్‌కదగళ్* (పదికథలు), *చువన్నపావడ* (ఎర్రలంగా), *పక్షాయెడెమణవల్,* (పక్షివాసన), *సమ్మర్ ఇన్ కలకత్తా, ది డిస్సేడన్స్, ద ఓల్డ్ ప్లే హౌస్ అండ్ అదర్ పోయెమ్స్, మై స్టోరీ,* ప్రసిద్ధ రచనలుగా సాహిత్యవేత్తలు గుర్తించారు.

కమలాదాస్ రచనలకు కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, చమన్ లాల్ అవార్డు, ఏషియన్ పెన్ పొయెట్రి అవార్డు, కుమారన్ ఆశాన్‌ల ప్రశస్తి లభించాయి. మనసులో వున్న భావాల్ని కుండ బద్దలు గొట్టినట్లు నిర్మొహమాటంగా చెప్పడానికి ఆమె భయపడదు.

స్త్రీలు పురుషుల్లాగా మనీ మైండెడ్‌గా ఉండరు. మగవారి కంటే ఎక్కువగా సేవాభావం స్త్రీలలో ఉంటుంది. దేవాలయాల్లో బందీగావున్న దేవునిపట్ల నాకంతగా నమ్మకం, శ్రద్ధా రెండూలేవు. నాచుట్టూ వున్న ప్రజల కోసం శ్రమించడం నా కిష్టం. నా రచనలు నిర్మొహమాటంగా సాగాలి. స్త్రీత్వాన్ని కాపాడాలి. జాతీయతకన్నా మానవత గొప్పదని ఆమె బల్లగుద్ది వాదించిన ధీమంతురాలు. ఆమె ఒక వ్యక్తిగా కాక శక్తిలాగ దర్శనమిస్తుంది. జీవితంలో తాను విశేషార్థం కోసం అన్వేషణ సాగించి, పరిభ్రమించి జీవిత అవసానదశలో కమలాదాస్ ఇస్లాం మతం స్వీకరించి శాంతిని పొందడం జరిగింది. ఎవరైతే రహస్య మనోద్రేకాలకు స్వాగతం పలికారో, ప్రేమాగ్నిలో జ్వలించి పోయారో, సంఘనిబంధనల్ని తుంగలోకి తొక్కారో వాళ్ళే స్త్రీల యొక్క హక్కులు, సమానత్వం, స్వాతంత్ర్యాన్ని అణచి వేసే మతంగా భావించే ఇస్లాములోనే అంతిమ శాంతి పొందగలిగేది అన్నదానికి ఇది ఋజువు అని నొక్కివక్కాణించింది కమలాదాస్.

మతపరంగా ఆమెకు కొన్ని విశ్వాసాలు లేకపోలేదు. ప్రార్థన అనేది ఎవరికి వారు చేసుకోవాలి. అది వ్యక్తిగతం. జనబాహుళ్యానికి ఇబ్బంది కలిగిస్తూ, బహిరంగంగా, బాహాటంగా మతం పేర చేసే ఆర్భాటాల్ని చట్టబద్ధంగా నిషేధించడం మంచిదంటుంది ఆమె. ఒకప్పుడు కొన్ని మంచి ప్రయోజనాల్ని ఆశించి మనిషి మతాల్ని పెంచుకున్నాడు. కాలానుగుణంగా అవి వెర్రితలలు వేశాయి.

ఎప్పటికప్పుడు వాటిని పునరుద్ధరించుకోవాల్సిన ఆవశ్యకత అన్ని మతాలవారికీ వుంది. యదార్థం ఆలోచించగలిగితే అతిని ఎవరూ హర్షించరుగదా! కమలాదాస్ శాంతికోసం అన్వేషిస్తూ, సాంత్వన కోసం పరితపిస్తూ తాను వ్రాసిన కవిత్వం పరిశీలించినట్లైతే కొన్ని విషయాలు అవగతమౌతాయి.

" I Who last
My way and beg now at stranger's door
To receive love, at least in small exchange"...

మరికొన్ని మహత్తర అంశాల్ని ఆమె ప్రస్తావించడం మనం గమనించాలి. "ప్రతి రచయితా రెండు ప్రపంచాలలో బ్రతకాల్సి ఉంటుంది.

ఒకటి వాస్తవ ప్రపంచం. రెండు నీడ (అంటే అవాస్తవ జగత్తు.) ఈ రెంటిలో రచయిత ఒకేసారి బ్రతకాల్సి వుంటుంది" అని కమలాదాస్ ప్రతిపాదన. ఆలోచిస్తే ఇది సత్యదూరం కాని విషయమేకదా! ఈమె జూన్ 1, 2009 లో తన 75 వ ఏట తనువు చాలించింది.

కమలాదాస్ మరణానికి భారతప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ తన సంతాపాన్ని పత్రికాముఖంగా ప్రకటించడాన్ని బట్టి ఆమెలోగల గొప్పదనం ఏపాటిదో విజ్ఞులకు అర్థమయ్యే వుంటుంది.

# మల్లాది విశ్వనాథ కవిరాజు

*- యు.ఎ. నరసింహమూర్తి*

"సారస్వత చరిత్రమున నాటకయుగమారంభమైనది. కొన్ని మంచి నాటకములు బయలువెడలకపోలేదు. కాని పెక్కులు నాటక నామార్హములైనవి యున్నవి. సలక్షణములగు నాటక రంగస్థలములు లేనినాడు నాటక వాఙ్మయము వర్ధిల్లనేరదు. రూపకగ్రంథములకును, నాటక సమాజములకును అవినాభావ సంబంధమున్నది. వీని రెంటిని సంస్కరించి యభివృద్ధిపరచు నుద్దేశముతో నీ పత్రిక వెలిబుచ్చు చున్నాము"– ఈ వాక్యాలు నేటి శ్రీకాకుళం జిల్లాలో, 'పోలాకి' అనే ఒక కుగ్రామం నుండి 1923 జనవరిలో వెలువడిన 'నాటక కళ' అనే తొట్టతొలి తెలుగు నాటక విమర్శకు సంబంధించిన పత్రిక సంపాదకీయంలోనివి.

ఆ పత్రికకు సంపాదకుడు మల్లాది వేంకట విశ్వనాథశర్మ. పోలాకి గ్రామానికి, మల్లాది వేంకట విశ్వనాథ శర్మగారికి గల విశిష్టతను బట్టి తెలుగువాళ్లకు నిజమైన నాటక కళాభిమానమే ఉంటే ఆ గ్రామం ఇప్పుడు ఒక నాటక కళాక్షేత్రంగా ప్రఖ్యాతిని పొంది ఉండేది. అలా జరుగకపోవడం ఒక దురదృష్టం. ఈ గ్రామానికి చెందిన మల్లాది వేంకట విశ్వనాథశర్మ, వారి కుమారుడు మల్లాది సూర్యనారాయణ అవధాని, వారి సోదరుడు మల్లాది వేంకట కృష్ణశర్మ తెలుగు నాటకరంగానికి మరపురాని సేవలు చేశారు. వీరు ముగ్గురు స్వతంత్రంగా నాటకాలు, నాటికలు వ్రాశారు. నాటకానువాదాలు చేశారు. నాటకవిమర్శ చేశారు. నటించారు.

ఆంధ్రనాటక కళాపరిషత్తును స్థాపించిన వారిలో విశ్వనాథశర్మ ప్రథములు. నాటక కళను అభివృద్ధి చేయడం కోసం ఒక పత్రికను స్థాపించారు. ఈ కార్యక్రమాలన్నింటికీ పోలాకి గ్రామం ఒక కుదురు. అక్కడే 1923 జనవరిలో బుర్రా శేషగిరిరావు అధ్యక్షతన ఆంధ్ర నాటక పరిషత్తు ఉత్సవము జరిగింది. ఇప్పుడు ఆ ఊరిపేరు తెలుగు నటులకు, నాటక సమాజాలకు తెలియదు. దాని ప్రాధాన్యమూ తెలియదు. మల్లాది వారి కుటుంబం తెలుగు నాటకరంగానికి తమవంతు సేవలందించడం మాత్రమే కాక తెలుగు నాటకరంగ వికాసానికి ఎనలేని సేవలందించిన సురభినాటక కళా సమాజం వారికి వెన్నెముకగా నిలిచింది. వారు కోరినన్ని రచనలను కుమ్మరించింది. విశ్వనాథశర్మ "సారస్వత చరిత్రమున నాటక యుగ మారంభమైనది" అని రాయడంలో ఒక ఔచిత్యముంది. ఇది కేవలం తెలుగు నాటకరంగానికి సంబంధించిన విమర్శనా వ్యాసం. అందులోనూ సాంఘిక నాటకాన్ని గూర్చి చెప్పేది.

1892లో మొదటి కన్యాశుల్కం ప్రదర్శనతో తెలుగు సాంఘిక నాటకం జయపతాకం ఎగురవేసింది. కానీ ఆ తరువాత చాలాకాలం పాటు గురజాడ ఆశించిన మార్గంలో అసలు సిసలైన సాంఘిక నాటక రచన జరుగలేదు. విశ్వనాథశర్మ, రాజమన్నారు వంటివారు నాటక రచనకు పూనుకున్న తరువాతనే మళ్లీ ఆధునికాంధ్ర సాంఘిక నాటక చైతన్య వికాసం మొదలయింది. ఆ చారిత్రక సందర్భాన్ని సంస్మరిస్తూనే విశ్వనాథశర్మ తన 'నాటక కళ' మాసపత్రిక తొలి సంపాదకీయంలో పై మాటలు వ్రాశారు. ఈ కాలంలో కందుకూరి, చిలకమర్తి తరహా ప్రహసన రచన అంతరించి ఆద్యంతం ఆహ్లాదభరిమైన సరికొత్త నాటికల యుగం ఒకటి అవతరించింది. ఆ తెలుగు నాటక యుగానికి మకుటధారులు మల్లాదివారు.

గురజాడకు, విశ్వనాథశర్మకు ఒకానొక ఆంతరిక సంబంధమున్నది. ఇద్దరి కార్యక్షేత్రమూ విజయనగరమే. ఇద్దరూ హాస్యప్రియులే. ఇద్దరూ హాస్య ప్రధానమైన నాటక రచన చేసినవారే. గురజాడ మార్గంలోనే విశ్వనాథశర్మ తన నాటకాలను వాడుక భాషలో వ్రాశారు. గురజాడ పనిచేసిన విజయనగరం మహారాజా కళాశాలలోనే విశ్వనాథశర్మ తెలుగు

డాక్టరు యు.ఎ. నరసింహమూర్తి, ఫోన్ : 9963421460

ఉపన్యాసకుడుగా పనిచేశారు. విశ్వనాథశర్మ అధ్యాపక ప్రవణతను గూర్చిన సన్నివేశమొకదానిని చాసో తెలియ జేశారు. విశ్వనాథశర్మ ఉపన్యాసకుడుగా పనిచేసిన రోజుల్లో చాసో మహారాజా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిగా చదువుతూ ఉండేవారు. ఆయన స్పెషల్ ఇంగ్లీషు చదివారు. విశ్వనాథశర్మ ఒక అనువాద వ్యాసాన్ని పాఠం చెప్తూండగా చాసో ఆ పాఠం వినకుండా అదే పనిగా పక్క విద్యార్థితో కబుర్లు చెప్తూ కనబడ్డారట. అది చూసిన శర్మగారు పాఠం ఆపి "ఒరేయ్! పాఠం నువ్వు చెప్తావా? నన్ను చెప్పమన్నావా?" అని అడిగారట. చాసో నిర్భయంగా లేచి "నేనే చెప్తానండి. మీరు చెప్తున్న దాంట్లో తప్పులున్నాయని" వేదికమీదకు వెళ్ళి అనువాదకుని దోషాలను గూర్చి వివరించారట. ఆ పాఠం కార్లైర్ రాసిన ఆంగ్లవ్యాసానికి తెలుగు అనువాదం. చాసో అది ముందుగా చదివిన కారణంచేత అనువాదంలోని దోషాలను గుర్తించారు.

చాసో చెప్పిన విషయం గ్రహించి కార్లైర్ అసలు వ్యాసాన్ని తెప్పించుకొని ఆ రాత్రి దానిని చదివి మరుసటిరోజు నిర్దుష్టంగా పాఠం చెప్పడమే కాక చాసోను మెచ్చుకుంటూ, అనువాదం చేసిన తన మిత్రుని మందలిస్తూ ఒక లేఖ వ్రాశారట. ఉపన్యాసకుడిగా శర్మగారి నిజాయితీని వెల్లడించే సన్నివేశమిదే. 1893లో జన్మించిన శర్మగారు గురజాడను చూడడానికి, ఆయనతో పరిచయం కలిగి ఉండడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. హాస్యము, మాండలిక పద ప్రయోగము, సరళ సంభాషణలు, వేగము, సమకాలీనత, పరిచిత కుటుంబ విషయ చిత్రణ, వాస్తవిక వాదం, సహజత్వం, హాస్యం కేవలం సంభాషణగతమై ఉండడం-వంటి విశిష్ట లక్షణాల నెన్నింటినో గురజాడ కన్యాశుల్కాన్ని చూసి శర్మ నేర్చుకున్నట్లు కనిపిస్తుంది.

ఇన్ని విషయాలలో గురజాడ ప్రభావమున్నా ఆయన నాటికలలో గురజాడ అనుసరణ కనబడదు. అవన్నీ స్వతంత్ర రచనలు. గురజాడ పట్ల తనకు గల గౌరవాన్ని సూచిస్తూ శర్మ 'వినోదనాటికలు' అనే ఐదు నాటికల సంపుటిని ఆయనకు అంకితం చేశారు. ఈ నాటికల సంపుటిని శర్మ కూమారుడు మల్లాది అవధాని ప్రచురించారు. భారతిలో ఈ నాటికలను సమీక్షిస్తూ దామెర రాజగోపాలరావు "ఆంధ్రనాటక సారస్వతమునందు ఈ రెండు- 'కన్యాశుల్కము', 'ప్రతాపరుద్రీయము' నాటకాల్లో తప్ప మళ్లీ చూద్దామంటే కంచుకాగడా వేసి వెదకినా ఉత్తమనాటకము కనుపించదు. అందుచేతనే కాబోలు కవిరాజు తన యీ సంపుటమును గురజాడ అప్పారావు పంతులుకు కృతి యిచ్చేరు." మంచిది, కేవలము కృతినిచ్చిన చాలదు. 'కన్యాశుల్కము' వంటి నాటకమొకటి వ్రాసి ఆంధ్రసారస్వతమునకు అలంకారము కూర్చుట కవిరాజుగారి విధియై యున్నది!" అని వ్రాశారు. విశ్వనాథశర్మ నాటకరచనా సామర్థ్యాన్ని తెలియజేసే వాక్యాలివి.

విశ్వనాథశర్మ సంస్కృతాంధ్రాలలో నిష్ణాతుడు. దిట్ట. సావిత్రి, హరిశ్చంద్ర, మహానంద, కుశలవ మొదలైన తెలుగు నాటకాలు, ప్రసిద్ధ సంస్కృత నాటకానువాదాలు ఈ విషయాన్ని ఋజువు చేస్తాయి. ఈ నాటకాలన్నీ శర్మ సురభినాటక సమాజం కోసం వ్రాశారు. అంతే కాదు శర్మ కొంతకాలం ఉప్మాక నారాయణమూర్తి గారితో కలసి 'హరిహర కవులు' అనే పేరుతో జంటకవిత్వం చెప్పారు. ఆ రోజుల్లో జంటకవిత్వ సంప్రదాయం బహుళ జనాకర్షణను పొందింది. కవిత్వ రచనలో శర్మ సామర్థ్యాన్ని ప్రశంసిస్తూ జగద్గురు శంకరాచార్యులు 'కవిరాజు' అనే బిరుదాన్నిచ్చారు.

అప్పటినుండి తెలుగునాట ఆయనకు 'విశ్వనాథ కవిరాజు' అనే పేరు నిలిచిపోయింది. త్రిపురనేని రామస్వామిచౌదరి విషయంలో 'కవిరాజు' అనేది ఒక బిరుదుగా మాత్రమే నిలిచిపోతే విశ్వనాథ కవిరాజు అనేది ఒక పేరుగా స్థిరపడిపోయింది. ఆ తరువాత అలా పిలిస్తే గానీ ఎవరికీ తెలిసేది కాదు. అందరికీ తెలిసే ఇంకొక ఉపనామం 'దిబ్బ శర్మ.' ఇది పరోక్ష వ్యవహారం. లావుగా ఉండేవారు హస్యచతురులై ఉంటారని ఒక వాడుక. అది విశ్వనాథ కవిరాజు విషయంలో నిజమయింది. 'దిబ్బశర్మ' అనే పేరును శ్రీశ్రీ సాహిత్యపాఠంలోకి ఎక్కించి అందరికి అతడెవరో తెలుసుకునే జిజ్ఞాస కలిగేలా చేశాడు.

**'పెద్దచెఱువు దోమలలో**
**పెద్దదయిన దిబ్బశర్మ పేరింటిది తా**
**మొద్దబ్బాయి చరిత్ర ర**
**చిద్దామని సిద్ధపడదె సిరిసిరిమువ్వా!'**

అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్లు తనకు అయిష్టులైన వారి నెవరినో ప్రలారించడానికి పూనుకున్న శ్రీశ్రీ విజయనగరం రచయితలందరినీ పేర్కొనడం కేవలం హాస్యంకోసమే అయినా విజయనగరానికి, విజయనగర

రచయితలకు లాఘవాన్ని ఆపాదించేదిగా కనిపస్తుంది. ఒక్కొక్క వ్యక్తి చిత్త సంస్కారం ఒక్కొక్క విధంగా ఉంటుంది. జగద్గురు శంకరాచార్యులు విశ్వనాథశర్మను కవిరాజు బిరుదంతో సత్కరిస్తే శ్రీశ్రీ ఆయనను దిబ్బశర్మగా మాత్రమే చూడగలిగాడు. ఇక్కడ "పరిహాస విజల్పితం సఖే! పరమార్థేన న గృహ్యతామ్ వచః" అని శ్రీశ్రీ మనసులో అనుకునే ఉంటాడు. అలా అనుకుని ఉంటే అది ఉన్నత సాహిత్య సంస్కారం అవుతుంది.

ఇరవైయవ శతాబ్ది రెండవపాదంలో తెలుగులో రచయితలనేకులు నాటికలు, ఏకాంకికలు విస్తారంగా వ్రాశారు. ఆ విధంగా వ్రాసిన వారిలో కవిరాజు ప్రముఖులు. ఆయన ఏభైకి పైగా నాటికలు వ్రాశారు. అందులో కొన్ని ముద్రణకు నోచుకున్నాయి. అవికూడా ఇప్పుడు అందుబాటులో లేవు. కవిరాజు రచనలు సన్నివేశ ప్రధానమైనవి. ప్రేక్షకులను చివరివరకు ఉత్కంఠలో నిలిపి ఉంచడం వారి నాటిక జీవలక్షణం. ఎవరినీ బాధించని హాస్యం కవిరాజు నాటికలలో కనిపిస్తుంది.

ప్రహసనాలలో లాగా ఒక వ్యక్తిని గానీ, ఒక కులాన్నిగానీ, ఒక మతాన్నిగానీ, ఒక సమాజాన్ని గానీ, బాధతో గిలగిలా కొట్టుకునేలా చేసే తరహా హాస్యాన్ని కవిరాజు పూర్తిగా వ్యతిరేకించారు. వారి నాటికలలో సంభాషణ ఎంత సరళంగా ఉంటుందో సన్నివేశం అంత సున్నితంగా ఉంటుంది. ఒక కొసమెరుపుతో నాటిక నడిచినంతసేపూ బయట పడని వాస్తవం ఒకటి బైటపడి ప్రేక్షకులను చకితులను చేయడమనే నాటికా సామాన్య లక్షణాన్ని కవిరాజు తన నాటికలన్నింటోను నిపుణంగా పొందుపరచ గలిగారు.

ఈయన నాటికలలో అవసరం లేని వ్యూహరచన ఉండదు. ఎక్కువ నాటికలలో సాంసారిక జీవన సన్నివేశాలే కనిపిస్తాయి. స్థానికము, వ్యక్తిగతము, సమకాలీనము అయిన వస్తువును గ్రహించినా అందులో సర్వమానవ సంబంధమైన, సార్వకాలీనమైన, శాశ్వతమైన ఒక ఉదాత్త లక్షణాన్ని నిబంధించడం కళాప్రయోజనం అవుతుంది.

ఉత్తమ రచయితల రచనలలో ఈ కళాత్మకత ఉంటుంది. ఇందులో కూడా రెండు రీతులు ఉన్నాయి. ఉపదేశం స్పష్టంగా తేటపడేలా రాసే రీతి ఒకటి, ఉపదేశం సూచనప్రాయంగా గుప్తంగా ఉండే రీతి ఇంకొకటి. కళామర్మజ్ఞులు ఇందులో రెండవరీతికి చెందిన రచనలను శ్రేష్ఠమైనవిగా ఎంపికచేస్తారు.

కవిరాజు రచనలు ఇందులో రెండవర్గానికి చెందినవి. ఆయన రచనలలో ఒకదానిలో కూడా ఆడంబరం, హడావుడి కనబడవు. ఒకటికూడా ప్రేక్షకులకు భారమనిపించదు. ఇది కవిరాజు శిల్పం. కవిరాజు నాటికలకు కాలదోషం పట్టదు. దృశ్యకావ్యానికి ప్రాథమిక అవసరమైన ప్రదర్శనా సౌలభ్యము కవిరాజు నాటికల వ్యాప్తికి కారణమయింది.

*దొంగాటకం, డొంకలోషరాబు, వైవాహికం, సరాగం, కిర్రుగానుగ, రాజీ, నేపథ్యం, దిద్దుబాటు, సారెగదిలో, ప్రహ్లాద, అపశ్రుతి, పునస్సంధానము, లేత విడాకు, హంసపాద*– వంటి నాటికలు బహుళ ప్రచారాన్ని పొందాయి.

*దొంగాటకం*లో పాత్రలు మూడు. ప్రకాశరావు, రాజ్యం భార్యాభర్తలు. కుటుంబశాస్త్రి రాజ్యం అన్నదమ్ముడు. ప్రకాశం "ఆంధ్రాషెర్లాక్ హోమ్స్"నని, రాత్రి ఊర్లో తిరిగి చాకచక్యంగా దొంగను పట్టుకుంటానని భార్య రాజ్యం దగ్గర బడాయి కబుర్లు చెప్తూ ఉంటాడు. ఆయన ధైర్య సాహసాలు పరీక్షించడానికి రాజ్యం తనను చూడడానికి వచ్చిన అన్నయ్యను ముందుగా సంప్రదించి అతణ్ణి ఒకరాత్రి దొంగవేషంలో తమ ఇంట్లో ప్రవేశింప జేసింది.

దొంగ అడుగులకు మడుగులొత్తి చివరకు ఇల్లుకూడా రాసి ఇవ్వడానికి ప్రకాశం సిద్ధపడిన సందర్భంలో అన్నా చెల్లెళ్ళిద్దరూ కలిసి ఆడిన నాటకం వెల్లడయింది. దొంగ తన బావమరిది జయంతి కుటుంబశాస్త్రి అని తెలిసి ప్రకాశం నివ్వెరపోవడంతో నాటిక ఆద్యంతం కొనసాగిన ఉత్కంఠ ఉపశమించింది.

కుటుంబశాస్త్రి ఆంధ్రాషెర్లాక్ హోమ్స్ అన్న పౌరుషనామాన్ని వ్యాఖ్యానిస్తూ "ఆంధ్రా అంటే ఇమిటేషన్ అన్న మాట. ఆ తర్వాత ఎంత గొప్ప పేరున్నా ఫర్వాలేదు. దాని శక్తిని ఇది ఆర్పేస్తుంది" – అనడంలో ఒక లలితమైన చమత్కారంతో పాటు ఒక చర్నాకోలా విసురు కూడా ఇమిడి ఉంటుంది.

ఇది కవిరాజు హాస్యానికి ఒక ఉదాహరణ. "ఈయన 20 వ శతాబ్ది మనిషి" అనేమాట తరచుగా ఈ నాటకంలో వినిపిస్తుంది.

20 వ శతాబ్ది మనిషి అంటే "మంచి మంచి ఘరానా మనిషన్న మాట" అనే వ్యాఖ్యానంలో హాస్యసృష్టికి అవసరమైన వ్యంగ్యస్పర్శ ఉంది.

నవలలు, సినిమాలు వ్యాప్తిలోకి వస్తున్న కొత్తరోజులవి. వాటి ప్రభావం సమాజం మీద బాగా పడిందని చెప్పడానికి ప్రకాశం చేత "నిజంగా ఈ నోవల్సు వల్లా సినిమాల వల్లా దొంగతనం మోస్తరు మారి పోయి యెంత నాజూకుగా తేలిందో చూశావు?" – అనిపిస్తాడు కవిరాజు. కవిరాజు నాటికలు చదివిన వారికి, చూసినవారికి, ఇంత మృదువుగా కూడా సంఘాన్ని విమర్శించ వచ్చునని తెలుస్తుంది.

*దొంగాటకం, డొంకలోషరాబు* – రెండు నాటికల నిర్మాణ రీతి ఒకటే. *దొంగాటకం*లో కోతలరాయుడి కథ ఉంది. *డొంకలోషరాబు*లో అనుమానపు భర్త కథ ఉంది. రెండు నాటికలలోను ఆడవాళ్ళదే పై చేయి. ఆ రెండింటిలోను తెలివైన భార్య లిద్దరూ తమ భర్తలకు మెత్తటి చెప్పుతో బుద్ధిచెప్పారు. *డొంకలోషరాబు*లో సన్యాసిరాజుపంతులు, కనకయ్య, సీతారామమ్మ, చలపతిరావు, రాధ అనే ఐదు పాత్రలున్నాయి. సన్యాసిరాజుకు తన భార్య సీతారామమ్మ పరపురుషులతో సంపర్కం పెట్టుకుంటోందని అనుమానం. వీధిలోకి వెళ్ళేటప్పుడల్లా తలుపుగొళ్ళెం పెట్టి తాళం వేసి మరీ వెళుతూ ఉంటాడు.

ఒక పర్యాయం అలా తాళం వేసి వీధిలోకి వెళ్ళి వచ్చేటప్పటికి తాళం అవసరం లేకుండానే తలుపు వచ్చేసింది. సన్యాసిరాజు మనసులో అనుమానపు పిశాచం గంతులేసింది. అగ్నికి ఆజ్యం పోసినట్లు కనకయ్య అనే పనికిమాలిన అనుచరుడు ఆ పిశాచాన్ని ఇంకా గంతులు వేయించాడు. సీతారామమ్మ భర్తకు బుద్ధి చెప్పడానికి ఆ పిశాచాన్ని గెంతించి ఇంకా పిల్లి మొగ్గలు వేయించింది. చివరకు ఆ ఇంట్లో పరపురుషుడెవడూ లేడని సీతారామమ్మ సోదరుడు చలపతిరావు, సోదరి రాధ ఇంట్లో లోపల కనబడకుండా దాగి ఉండి ఈ వినోదమంతా చిత్తగించారని తెలియడంతో నాటిక ముగుస్తుంది. సన్యాసిరాజు ఊహల్లో మాత్రమే ఉండి వాస్తవంగా లేని పరపురుషుడే ఈ డొంకలో షరాబు.

ఇందులోని ప్రతి సంభాషణము, పాత్రల ప్రతి చలనము నిమిష నిమిషానికి హాస్యానుభూతిని పెంచి పోషించి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంది. ఇతివృత్తం క్లిష్టమైనదైనా ఎక్కడా ఒక్క పరుషమైన మాట వినబడదు.

ఇందులో ఉన్నదంతా సన్నివేశగతమైన హాస్యమే. సంభాషణాగతమైన హాస్యం కనకయ్య మాటలలో కనిపిస్తుంది. అతడు చీటికిమాటికి సంస్కృత భాషలో ఉండే లోకోక్తులను ఉపయోగించడం హాస్యజనకమయింది. "అదీ పాయింటు" – అన్న కనకయ్య ఊతపదం కూడా ఈ నాటికలో హాస్యపోషకంగా ఉంది. సన్యాసిరాజు తన భార్య పరపురుషుణ్ణి దాచి పెట్టిందనుకొని ఆమెతోనే "ఇంకా వుంటారా? కొంపతీసి వెళ్ళిపోతారా?" అంటూ ఉండగా అతడి నోట్లోమాట నోట్లో ఉండగానే కనకయ్య జనాంతికంగా "కొంపతీసి అని మంచి శ్లేషమీద విసిరారే!" అంటాడు.

ఈ శ్లేషచమత్కారం చెవుల పడేటప్పటికి ఎంతటి విరసుడైన ప్రేక్షకుడైనా సరసుడు కాక తప్పదు. సున్నితమైన సమకాలీన విమర్శకూడా కవిరాజు నాటికలకు హాస్యకళను చేకూరుస్తుందనడానికి ఈ కింది సంభాషణలు సాక్ష్యం పలుకుతాయి.

**సీతా:** పోనీ, ఒక సినీమాకైనా తీసికెళ్ళారేమో అడుగు అన్నయ్యా!

**చలం:** అందులో ఆడవాళ్ళందరు పడుచు వాళ్ళనా!

**సీతా:** పోనీ, తెలుగు టాకీలలో అందరు ముసిలివాళ్ళే కదా వేషాలు వేస్తారు; దానికైనా తీసుకు వెళ్ళారా?

తెలుగులో మూవీలయుగం పోయి టాకీలయుగం ప్రవేశించిన కొత్తలో కథానాయికలందరూ ఎలా ఉండేవారో పై వాక్యాలు చెప్తాయి.

బహుళ జనాదరణ పొందిన కవిరాజు నాటికలలో *కిర్రుగానుగ* ఒకటి. ఈ నాటికలోని సంభాషణలన్నీ చాలా చమత్కారంగా ఉంటాయి. అల్లుడు మంచివాడు కాదని తెలుసుకొని పిల్లనిచ్చుకొనిన తల్లిదండ్రులు మనసులో పడేబాధ వాస్తవికతకు ఎంతో సన్నిహితంగా ఉంది. ఇందులోని హాస్యం పేలవంగా, నీరసంగా కాకుండా ఒక విధమైన ఠీవితోను, హుందాతనంతోను నడిచింది.

*పునస్సంధానము* అనే నాటికలో మీనాక్షి అనే భార్య నగలమోజు, పున్నయ్య అనే భర్త పిసినిగొట్టుతనం కారణంగా ఒక వివాదం ఏర్పడి విడిపోయే సందర్భంలో సూక్ష్మపతి లక్ష్మింపతి కారణంగా మళ్ళీ కలసిపోయిన ఘట్టం ఎంతో హాస్యభరితంగా చిత్రించబడింది. ఈ నాటికలో దంపతులిద్దరూ కలిసి ఉంటామని చివర చేసిన ప్రతిజ్ఞ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంది.

*సారెగదిలో* అనే నాటికలో శాస్త్రపువాసన విశేషంగా తగిలిన పల్లెటూరి శోభనపు పెళ్ళికొడుకు పెళ్ళికూతురితో సారెగదిలో సాగించిన సంభాషణ సరళంగా, సరసంగా ఉంటుంది. *అపశ్రుతి* అనే నాటికలో భార్యాభర్తల ప్రణయ కలహము, భర్త లాలింపులు, భార్య మూతి బిగింపులు, చివరకు ఒప్పందం కుదరడం ఇతివృత్తం. గ్రాంథిక, గ్రామ్య భాషావాదాలను విమర్శించే నిమిత్తము కవిరాజు *ప్రహ్లాద* నాటికను వ్రాశారు.

*రాజీ* అనే నాటికలో కవిరాజు నిర్మాణకుశలత అంతా కనబడుతుంది. ఇందులో సగభాగం భర్త కోపము, తక్కిన సగభాగము భార్య కోపము. కథ ముగిసిందని ప్రేక్షకుడు అనుకునేటంతలో మళ్ళీ కథ మొదలౌతుంది. ఇంతలో భార్యకు లాటరీ రావడంతో ఇద్దరూ రాజీ పడతారు.

కాంట్రాక్టు నాటకాల మీద విమర్శగా *నేపథ్యం* అనే నాటికను వీరు వ్రాశారు– ఇలా పరిశీలించి చూస్తే కవిరాజు ఇతివృత్తం కోసం ఎప్పుడూ వెతుక్కోలేదని, ఆయన పరిసరాలలో కుటుంబ జీవితంలో, భార్యా–భర్తల మధ్య సహజంగా అలుకలు–కలహాలు, బిర్రులు–బింకాలు, బుంగమూతులు–బుజ్జగింపులు వంటివి ఎంతో సహజంగా కనిపిస్తాయి.

సర్వసాధారణమైన వస్తువును రసవత్తరంగా మలచి ప్రేక్షకులకు అందించడంలో తన సమకాలికులైన నాటికా రచయితలలో కవిరాజుది అందెవేసిన చెయ్యి అయింది. కవిరాజు తన అభిరుచికి అనుగుణంగా నాటికలు వ్రాశారు గానీ ప్రేక్షకుల మెప్పుకోసం రాయలేదు. సకృత్తుగా ఆయన సంభాషణలలో కన్యాశుల్కం ప్రభావం కనిపిస్తుంది.

కవిరాజు ప్రారంభించిన హాస్యనాటికా యజ్ఞాన్ని ఆయన కుమారుడు అవధాని, సోదరుడు వేంకటకృష్ణశర్మ పూర్తి చేసారనిపిస్తుంది. అవధాని దాదాపు నూరు నాటికలు, వ్రాశారు. *అసంపూర్ణ రామాయణం, గాలి* వాన, *నాదిర్షా, ఆనందో(బ్రహ్మ* వంటి నాటికలు; *ఖడ్గతిక్కన, జగజ్జ్యోతి, భారతయోధులు, నవద్వీపం, జగన్నియంత* వంటి ఏకాంకికలు అందులో ప్రధానమైనవి. తండ్రి కోవలో రచనలోను, విమర్శలోను అవధాని ప్రఖ్యాతుడయాడు. 'నాట్యభారతి గ్రంథమాల'ను స్థాపించి తన తండ్రి రచనలను, తన రచనలను ప్రచురించారు.

వేంకట కృష్ణశర్మ సురభినాటక సమాజంతో సన్నిహిత సంబంధం కలిగినవారు. ఆ సమాజం కోసం చాలా నాటకాలు, ఏకాంకికలు వ్రాశారు. వీరి నాటకాలలో *వారసత్వము* సుప్రసిద్ధమైన రచన. *ప్రత్యక్షదైవము, సుబ్బమ్మ విరహం, గతిలేనిదేశంలో మతిలేని మనుష్యులు* మొదలైనవి ఆయన రాసిన ఏకాంకికలు. ఇవి హాస్య ప్రధానమైనవి. హాస్య రచనలో వీరుకూడా పూర్తిగా కవిరాజుగారి పద్ధతినే అనుసరించారు. కవిరాజు చలనచిత్రాలకు కూడా సంభాషణలు రాసినట్లు తెలుస్తోంది.

*రైతుబిడ్డ* చలనచిత్రానికి సంభాషణలు రాసినవారిలో కవిరాజు ఒకరు. ప్రఖ్యాత నటీమణి భానుమతీ రామకృష్ణ విశ్వనాథ కవిరాజును తన గురువుగా భావించేవారు.

గురజాడ తరువాత గాడితప్పిన సాంఘిక నాటకాన్ని తిరిగి ఆ మార్గానికి మళ్ళించడానికి కృషి చేసినవారిలో విశ్వనాథ కవిరాజు ప్రముఖుడు. తన రచనలలో స్త్రీ పాత్రలను శక్తివంతమైన పాత్రలుగా, తెలివిగల పాత్రలుగా, ధైర్యం గల పాత్రలుగా తీర్చిదిద్దడంలో కవిరాజు గురజాడను అనుసరించారు. స్త్రీ పాత్రలను ఎక్కడా కించపరచలేదు. స్త్రీలను కించపరచడానికి ప్రయత్నించిన పురుషపాత్రలకు శృంగభంగం చేసిగానీ వదలలేదు.

రసము, వస్తువు, నిర్వహణము వంటి ప్రధాన అంశాలలో సాంప్రదాయక లక్షణాలను అతిక్రమించి కొత్తతోవ తొక్కడంలో కూడా కవిరాజు గురజాడనే అనుసరించారు. నాటకశిల్పంలో, నాటకీయశైలిలో ఈ ఇద్దరకు దగ్గర పోలికలున్నాయి. గురజాడ దిద్దుబాటు కథను, కవిరాజు *దొంగాటకం, డొంకలోషరాబు* వంటి నాటికలను పోల్చిచూస్తే ఆ ఇద్దరి మధ్య గల సన్నిహితత్వం తెలుస్తుంది. ఉత్తమాభిరుచి గల మధ్యతరగతి ప్రేక్షకుల కోసం, పాఠకులకోసం కవిరాజు తన రచనలు చేశారు. మునిమాణిక్యం తన కథలతో ఏ ప్రయోజనం సాధించారో కవిరాజు తన నాటికలతో అంతటి ప్రయోజనాన్ని సాధించగలిగాడు.

విశ్వనాథ కవిరాజు జీవితాన్ని గురించి, రచనలను గురించి ఇంతవరకు సమగ్రమైన అధ్యయనం జరుగలేదు. నాటకరంగ ప్రముఖులు ఈ అధ్యయనానికి పూనుకొని కవిరాజు ఖ్యాతిని భావితరాలకు అందజేయాలి.



మగవాళ్లకే ధైర్యం చెప్పిన మగువ

# ఇస్మత్ చొగ్తాయి!

*- సామల సదాశివ*

***ఆ*** *మధ్య* ***'మిసిమి'*** *సంపాదకులు సామల సదాశివను ఆదిలాబాద్ లో వారి ఇంటివద్ద కలిసి ముచ్చటించారు. ఆటోబయోగ్రాఫికల్ వీడియోగ్రఫీ రికార్డ్ చేశారు. ముఖ్యంగా దాదాపు మూడుతరాల తెలుగు పద్య, గద్య రచయితలతో వారి పరిచయాలు, హిందుస్తానీ సంగీతంతో వారి అనుబంధం- సదా బెజవాడ గోపాలరెడ్డి ప్రోత్సాహం, ప్రాంతీయ మాండలిక వత్తిడి లేకుండా వారి విశాల దృక్పథం - ఈనాటి సంకుచిత భావ, ప్రాంత రాజకీయాల పట్ల ఆయన స్పందించిన తీరులో ఎక్కువ బాధే కనిపించింది కాని నిర్లక్ష్యం కాదు.*

*రెండు తరాల వారసులతో ఇళ్లంతా కళ కళ లాడుతుండగా దాదాపు రెండు గంటలు మాట్లాడారు. అప్పటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రాలేదు. ఎనభై ఏండ్లు దాటిన సుదీర్ఘ ప్రయాణంలో ఎక్కువ ఒడిదుడుకులు లేకపోయినా వయసు అలసట తప్పదు కదా. వినికిడి, కంటి చూపు తగ్గినా-ఆయన పలకరింపులో ఆత్మీయత తగ్గలేదు. తెలుగు నేలపై ఆయన కలవని రచయిత - కవి లేరంటే అతిశయోక్తి కాదు.*

***'మిసిమి'*** *కి ఆయన చాలా వ్యాసాలు రాశారు. కేంద్ర పురస్కారం పొందిన సందర్భంగా ఈ వ్యాసాన్ని* ***మిసిమి*** *పాఠకులకు అందిస్తున్నాము. సదాశివ కేవలం తెలుగు ప్రజలందరికీ చెందిన వ్యక్తే కాదు - అటు మరాఠీ సాహిత్యానికి, హిందుస్తానీ సంగీతానికి ఆత్మీయుడయిన మనీషి! ఈ రచనా శైలిలో ఏ మాండలికపు ఛాయలు తొంగి చూడక పోవడం- ఆయన విశాల దృక్పథానికి నిదర్శనం.* ***మిసిమి*** *సదాశివ నిండునూరేళ్ళు జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆశిస్తూ.....*

---

**మృ**ణాల్ సేన్, హృషీకేశ్ ముఖర్జీ కొన్ని మంచి సినిమాలు తీసి "గరమ్‌హవా" అనే ఇంకో మంచి సినిమా తీయబోతున్నారు. అందులో ఒక వృద్ధ మహిళ పాత్ర వున్నది. చిన్నపాత్రే కాని విశిష్టమైంది. ఆ పాత్రను సృష్టించిన ఇస్మత్ ఆపా చేతనే ఆ పాత్ర వేయించాలనుకున్నారు వాళ్ళిద్దరూ. ఆమె ఇంటికి వెళ్ళినారు. అప్పుడామె వయస్సు డెబ్బైయేళ్ళు దాటింది. తెల్లని ముగ్గుబుట్టలాంటి తల, ఖద్దరు చీర. దళసరి కళ్ళద్దాలు. వాటిల్లోంచి ఎదుటివాళ్ళను శోధిస్తున్నట్లు చూచే నిశితమైన చూపులు. మాటలో దురుసుతనం. మనసు నిండా మమకారం. ఆమె పేరు ఇస్మత్ చొగ్తాయి. అంతా ఆమెను 'ఆపా' అని పిలిచే వాళ్ళు. ఆపా అంటే అక్క. 'గరమ్‌హవా' రచయిత్రి ఆమే. అలా వెళ్ళిన ఆ ఇద్దరు సినీ నిర్మాతలు "ఆపా! ఆ వృద్ధ మహిళ పాత్ర మీరు పోషిస్తే చాలా గొప్పగా వుంటుంది" అని విన్నవించుకున్నారు. ఆమె ఆశ్చర్యంతో నోరంతా తెరచి ఏమిటి! ఈ వయసులో నేను ముఖానికి రంగు పూసుకొని కెమెరా ముందు నిల్చోనా? ఇంట్లో ఇద్దరు ఎదిగిన అమ్మాయిలున్నారు. ఎవరేమయినా అనుకోరా?" అన్నది. పెద్దల ముందర నవ్వటం మర్యాద కాదని తెలిసినా ఆ ఇద్దరూ నవ్వాపుకోలేకపోయినారు. ఆమె ఇంకా ఆశ్చర్యపడి "ఇందులో నవ్వేందుకేమున్నది? అలా నవ్వుతారెందుకు?" అని అడిగింది. వాళ్ళు నవ్వాపుకొని " ఆపా! ఇన్నాళ్ళకు మీలో ' ఎవరేమనుకుంటారో!" అనే ఆలోచన కలిగినందుకు నవ్వక మరేం చేయమంటారు?'' అన్నారు. అలా ఆలోచించినందుకు ఆమె నిజంగా సిగ్గుపడ్డది. "ఆ పాత్ర నేను నటిస్తాను" అని హామీ ఇచ్చి పంపింది. చక్కగా నటించింది.

ఆమె యూనివర్సిటీ చదువు ముగిసీ ముగియకముందే అప్పటి ప్రసిద్ధ పత్రికలకు తన కథలు పంపింది. ఆ కథలు అచ్చవగానే సమాజంలో పేద్ద సంచలనం బయల్దేరింది. ముఖ్యంగా "లిహాఫ్" అనే కథ. ఘరానా కుటుంబాల్లో జరిగే అశ్లీల అసభ్యతను అసహ్యించుకొనే పెద్దలు అది బయటికంటే తమలోనే బాగా వున్నదని తెలుసుకొని గాభరాపడ్డారు. అలాంటివే మరికొన్ని కథలు. మర్యాదస్తులు పరువునష్టం దావాలు వేసినారు.

ఆ కాలంలో అనేక కథలకు గాను కోర్టుకీడ్వబడిన రచయిత సాదత్ హసన్ మంటో. అయితే అతడు మగవాడు. ఈమె గొప్పింటి ఆడపడుచు; అలాంటి ఇతి వృత్తాలను కథా వస్తువుగా గ్రహించడాన్ని సమాజం పెద్దలు సమ్మతించ లేక పోయినారు.

పురుషాధిక్య సమాజంలో తమ మాటే చెల్లుబడి అవుతుందని నమ్ముతూ వచ్చిన పురుష పుంగవులు రంకెలు వేసి రాద్ధాంతం చేసినారు. బురఖాలలో వుండే ఘరానా స్త్రీలు బుగ్గలు నొక్కుకున్నారు. కానయితే ఆమె స్త్రీలకు జరిగే అన్యాయాలనే చిత్రించింది. కానీ స్త్రీలే ఆమెకు "బరితెగించిన ఆడది" అనే బిరుదప్రదానం చేసినారు. ఇంటివాళ్ళూ ఈసడించుకున్నారు. అయినా ఆమె ఖాతరు చేయలేదు. "ఎవరేమనుకుంటే నాకేమి?" అనే ధోరణిలో రాస్తూ పోయింది.

అలాంటి ఇస్మత్ చొగ్తాయి నోట "ఎవరేమంటారో!" అనే మాట విని ఆ సినిమా నిర్మాతలిద్దరూ నవ్వాపు కోలేకపోయినారు. సిగ్గెరుగని ఆమె తన ఆలోచన అలా సాగినందుకు జీవితంలో మొదటి సారి సిగ్గుపడ్డది.

ఆమె కుటుంబం జోథ్‌పూరుకు చెందింది. ఆమె తండ్రి కలెక్టర్‌గా చాలా నగరాల్లో పనిచేసినాడు. అతని పిల్లల చదువులు అల్హాబాద్‌లోను, ఆలీగఢ్‌లోను సాగినవి. అతని పెద్దకొడుకు, అంటే ఇస్మత్ చొగ్తాయి పెద్దన్న అజీంబేగ్ చొగ్తాయి అలీగఢ్ యూనివర్సిటీ నుండి లా డిగ్రీ పుచ్చుకొని ప్రాక్టీసు ప్రారంభించాడు. అతని ఆరోగ్యం మొదటి నుంచి అంతమంచిది కాదు. కొన్నాళ్ళకతనికి టి.బి. అని తేలింది. అప్పట్లో ఆ వ్యాధికి తగిన చికిత్సా సదుపాయాలు లేకుండేవి. అతడు అధిక సమయం మంచంలోనే గడిపినాడు. కాబట్టి పడుకొని విసుగుపుట్టినప్పుడల్లా ఏదో రాస్తుండేవాడు. అతనిపట్ల అంతా జాలి చూపేవాళ్ళు కనుక ఆరోగ్యంగా ఉల్లాసంగా వుండే వాళ్లపట్ల అతనికొక రకమైన కసి యేర్పడింది. అందరిని నొప్పించే మనస్తత్వం అలవడింది. అతని రచనల్లో ఆ మనస్తత్వం వ్యంగ్యాత్మకంగానూ, హాస్యాత్మకంగానూ వ్యక్తమయ్యేది. అతని వ్యంగ్యం, హాస్యం కేవలం నొప్పించటానికి, నవ్వించటానికి కాదు. సంస్కార వంతుడూ, విద్యాధికుడూ కనుక అతని రచనలు సామాజిక స్పృహతో చేసినవే, ఆలోచింపజేసేవే. అందుకే ఈనాడు కూడా అతని రచనలు పఠితులను హాయిగా చదివిస్తాయి ఆలోచింప జేస్తాయి. అతని నవలలూ, కథాసంకలనాలూ ఇరవై.

ఇస్మత్ చొగ్తాయి బి.ఎ; బి.టి. చేసి విద్యాశాఖలో ఉద్యోగం సంపాదించింది. అజీంబేగ్ అచ్చయిన తన ప్రతికథను ఇంటి వాళ్ళందరికి వినిపించేవాడు. ఇస్మత్ చొగ్తాయి రచయిత్రి కావటానికి ఆమె అన్నగారే కారకుడు. అయితే అజీంబేగ్‌కు తన సోదరి రచనలపట్ల ఎలాటి అభిప్రాయం వుండేదో కాని పైకి మాత్రం ఎన్నడూ ప్రశంసించలేదు. పైపెచ్చు సిగ్గులేని రచనలు చేస్తున్నందుకు మందలించేవాడు.

ఇస్మత్ చొగ్తాయి మధ్య తరగతి ముస్లిముల జీవితాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఆమెకూడా ఆ వర్గంలోంచి వచ్చిందేనాయె. వాళ్ల సామాజిక, నైతిక, ఆర్థిక, సైద్ధాంతిక సమస్యలే ఆమె కథలకూ, నవలలకూ ఇతివృత్తాలు. లైంగిక సమస్యల్ని కూడా ఆమె స్పృశించకుండా వదిలి పెట్టలేదు. ఏది చెప్పినా నిర్భయంగా నిస్సంకోచంగా, నిజాయితీతో చెప్పింది.

ఆమె కథల్లో వాస్తవికత వుంటుంది. అందుకే ఆమె మీద వేసిన పరువునష్టం దావాలేవీ నెగ్గలేదు. లైంగిక సంబంధాలను చిత్రించేటప్పుడు అశ్లీలతను, అసభ్యతకు ఆస్కారం వున్నది. కాని ఆమె అసభ్యమైన వాక్యంకాదు గదా అసభ్యమైన శబ్దాన్ని కూడా ప్రయోగించలేదు.

సందర్భానికి తగిన సబలమైన, సశక్తమైన శబ్దాన్ని ప్రయోగిస్తూ సమాజంలోని మంచిని, చెడును గురించి కళాత్మకమైన శిల్పంతో నుడికార శోభితమైన భాషలో కథలు కథలుగా చెప్పింది. ఆమె కథలను మరే భాషలోనైనా అనువదిస్తే భావం మిగులుతుంది. కానీ భాషాసౌష్టవం మిగులదు.

ఆమె కథ చెప్పేతీరే అద్భుతమైంది. అద్వితీయమైంది. అది ఆమె ఉర్దూలోనే సాధ్యం. ఆమె పురుషాధిక్యతను, పురుషాహంకారాన్ని జీవితాంతం నిరసించింది. కాని ఆమె పురుషద్వేషిణి కాదు. మనసూ మానవతా ఎవరిలో వున్నా గౌరవించింది. ఆమె బొంబాయి మహానగరాన పాఠశాలల విద్యాధికారిణిగా పనిచేస్తున్నప్పుడు షాహిద్ లతీఫ్ అనే యువకునితో పరిచయమైంది. అతడూ రచయితే. కాని అనామకుడు. బొంబాయి సినీ జగత్తులో పరిభ్రమిస్తూ తాను రాసిన కథలను కారుచౌకగా అమ్ముకొంటూ తిరిగేవాడు.

కొందరు నిర్మాతలు, డైరెక్టర్లు అతని కథలు తీసుకొని ఎవరిచేతనో మార్పించి సినిమాలు తీసేవాళ్ళు. కొన్ని కొన్ని భాగాలు రాయించేవాళ్లు. సంభాషణలు రాయించేవాళ్లు. ఏదో కొంత అతని చేతిలో పెట్టేవాళ్లు. అతని నెలసరి ఆదాయం మూడు వందలకు మించేది కాదు.



సదాశివ

ఇస్మత్ చొగ్తాయి రచనలు చదివినాడా యువకుడు. ఆమె కీర్తినీ, అపకీర్తినీ విన్నాడు. వెళ్లి ఆమెతో పరిచయం చేసుకున్నాడు. తన రచనలామెతో దిద్దించుకునేవాడు. సలహాలు తీసుకునేవాడు. సాహిత్య చర్చ చేసేవాడు. ఆ సాహిత్య పరిచయం కొన్నాళ్లలాగే సాగింది. ఉండి నిలిచి ఆ యువకునికి ఏమితోచిందోయేమో ఒకనాడు "ఇస్మత్ మనిద్దరం పెళ్లిచేసుకుందామా?" అన్నాడు. ఆశించని ఆ ప్రస్తావనతో ఆమె అదిరిపడింది. ఆమేమో గజిటెడ్ ఆఫీసర్. ప్రఖ్యాత రచయిత్రి. అతడేమో నికరమైన ఆదాయం లేని నిరాశ్రయుడు.

"చూడు షాహెద్! నువ్వు బుద్ధిమంతుడివి, మంచివాడివి. నీకు తగిన అమ్మాయిని పెళ్లి చేసుకొని సుఖపడితే చూచి సంతోషిస్తాను. మన అంతస్తుల గురించి మాట్లాడటం లేదు. స్వభావాల గురించి మాట్లాడుతున్నాను.

నీ భార్య ఎలా ఉండాలో నీకు కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. నేను నీకు తగిన భార్యను కాలేను. పురుషాహంకారాన్ని సహించటం నా స్వభావం కాదు. సతీసావిత్రిలా పతిసేవ చేసే దాన్ని కాను.

నన్ను చేసుకొని నువ్వేమి సుఖపడతావు? బ్రతికినంతకాలం పశ్చాత్తాపడతావు. నీవుద్దేశం మార్చుకో" అని బడిపిల్లవానికి చెప్పనట్లు నచ్చచెప్పింది. అయినా, అతడు ఆమె దగ్గరికి రావటం మానుకోలేదు. పెళ్లిప్రస్తావన తేవటం మానుకోలేదు. ఈ సంగతి ఇస్మత్ ఇంటివాళ్ళకు తెలిసింది.

ఆమె అన్న కోర్టు పనిమీద బొంబాయికి చెల్లెలి దగ్గర షాహెద్ లతీఫ్‌ను చూచినాడు. అతడు వెళ్లిపోయిన తర్వాత "ఏమే రాక్షసీ! ఆ కుర్రాడు అమాయకుడు. బుద్ధిమంతుడు. నిన్ను కట్టుకొని ఏమి సుఖపడతాడే! అలాంటి వాని వెంట పడ్డావేమి? వదిలిపెట్టు" అని మందలించినాడు.

"నేనేమీ వెంటపడలేదు. అతడే పడ్డాడు. ఎంత చెప్పినా వినడు. నువ్వయినా బోధించి పుణ్యం కట్టుకో" అని బతిమాలిందావె. ఎందరు నచ్చచెప్పినా, ఎందరు బోధించినా షాహిద్‌లతీఫ్ తన అభిప్రాయం మార్చుకోలేదు.

వాళ్లిద్దరి పెళ్ళి జరిగింది. గతిలేనివాడు గజిటెడ్ ఆఫీసర్ భర్త అయినాడని అతని మిత్రులు అపహాస్యించ వచ్చుననే భావంతో ఇస్మత్ తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. రచయిత్రిగా తన కీర్తి ప్రతిష్ఠలు భర్తలో న్యూనతా భావాన్ని కలిగించ వచ్చునని రచనా వ్యాసంగాన్ని కట్టిపెట్టింది.

వాళ్లిద్దరు కలిసి నడుస్తూ వుంటే వెనుకనుంచి ఎవరో అన్నారట: "ఇద్దరి ఎత్తు సమానమే!" అని. మర్నాటి నుంచి హైహీల్డ్ షూస్ వేసుకోవటం మానుకున్నది.

సతీసావిత్రి లాంటి దాన్ని కాను అని చెప్పిన మనిషి! ప్రొడ్యూసర్ల చుట్టు చక్కర్లు కొట్టే లతీఫ్‌నే ప్రొడ్యూసర్‌గా చేసి తాను రాసిన *జిద్దీ* నవలను, ఇతర కథలను మంచి ఫిల్ములు తీయించింది. ఆ ఫిల్ములకు స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ మొదలయినవి ఆమె రాసేది. పేరు షాహిద్‌ది. నిర్వహణ అంతా ఇస్మత్‌ది.

వాళ్ల సినిమాలకు మంచి మార్కెట్ దొరికింది. దేవానంద్, నిమ్మి, దిలీప్‌కుమార్, కామినీ కౌశల్ లాంటి ఆనాటి మేటి తారలు నటించినారు వాళ్ల ఫిల్ముల్లో, ఆర్థికంగా,

సామాజికంగా స్థిరపడ్డారా దంపతులు. వాళ్లది సుఖసంసారం. ఇద్దరమ్మాయిలు కలిగిన తర్వాత షాహిద్‌లతీఫ్ మరణించినాడు.

మరణించటానికి కొన్ని రోజుల ముందు "నన్ను చేసుకుంటే బ్రతికినంతకాలం పశ్చాత్తాపపడతావన్నది ఇస్మత్. నా కటువంటి అవకాశమే కలిగించలేదు. నన్ను కట్టుకుని ఏమి సుఖపడతావు అన్నది. కాని నేను పొందిన సుఖం, నేను పొందిన గౌరవం ఏ కొద్ది మంది భర్తలో పొందగలరు." అని తన డైరీలో రాసుకున్నాడు. షాహిద్ అకాల మరణం వలన ఇస్మత్ చౌగ్తాయి బాధ్యతలు పెరిగినవి. అమ్మాయిలను చదివించాలె. పెళ్ళిళ్లు చేయాలె. మళ్లీ రచయిత్రిగా మారింది. "మేము ముస్లిములమైనా మా మూలం భారతదేశంలోనే వున్నది. కాబట్టి నా అమ్మాయిల చేత భారత రామాయణాలు, భగవద్గీత చదివించాను." అని ఒకచోట రాసిందామె.

అమృత్‌లాల్ నాగర్ హిందీలో గొప్ప రచయిత. అతడు భంగ్ ప్రియుడు. భంగ్ నూరించి త్రాగటమేకాక పాన్ బీడీలలో కూడా భంగ్ పొడి కలుపుకొని నమిలేవాడు. ప్రతి సంవత్సరం హోలీ పండుగనాడయితే అతనింట్లో భంగ్ తయారీ ఒక యజ్ఞంలాగా జరిగేది. తనకు సన్నిహితులైన కొందరు హిందీ, ఉర్దూ కవులను ఆహ్వానించేవాడు. ఇస్మత్ ఆపా అతనింటికి సాధారణంగా వెళ్లేది. కాని హోలీనాడెన్నడూ ఆమెను ఆహ్వానించలేదు.

ఒక హోలీ పండుగకు ఆమెనూ ఆహ్వానించాడు. తాను జగమెరిగిన రచయితే అయినా తన తాజా కథల సంకలనానికి ఆపా చేత ప్రస్తావన రాయించాలన్నది అతని బహుకాలవాంఛ. ఆపా ఒప్పుకున్నది.

కానీ అక్కడందరూ భంగు తాగుతుంటే తానూ తాగుతానని పట్టుపట్టింది. "ఆపా! అది మీ వొంటికి పడదు" అని నాగరేకాక అక్కడున్న వాళ్లంతా మనవి చేసినారు. "అంటే మీరంతా మగవాళ్లు. మీ వొంటికి పడుతుంది. నేను స్త్రీని నా వొంటికి పడదు. ఈ దౌర్భాగ్యపు ఆలోచన మీకు అన్ని విషయాల్లోనూ వుంటుంది. నాకిప్పుడు భంగు కావాలె." అని హఠం చేసింది. ఆమెను వారించటం ఎవరి తరం కాలేదు, కాబట్టి అంతా తలో భంగు గ్లాసు తీసుకుని, ఆమెకు భంగులేని చిక్కని పాల గ్లాసిచ్చినారు. ఒకటి తర్వాత ఒకటి, మూడు గ్లాసులు తాగింది. అంతా నవ్వుతున్నారు తుళ్లుతున్నారు, తూలుతున్నారు, వదురుతున్నారు. తనకేమి కావటం లేదు. "నాగర్! నాకు ధోకా చేసినావు గదా! భంగని చిక్కని పాలు తాగించి నావు. ధూర్తునివి. అబద్ధాల కోరువు." అని కోప్పడింది ఆపా.

ఆ కోపంలోనే "నీ కథకు సంకలనంతే – ఇప్పుడు రాస్తా" అన్నది. రాసింది. భంగు ప్రహసనమంతా రాసి "ఈ అమృతలాల్ నాగర్ ఎంత గొప్ప నవలలు రాసినా, ఎంత కథలు రాసినా ధూర్తుడు. అబద్ధాల కోరు, కాని ఇతని కలం మాత్రం సత్యం తప్ప తదన్యం రాయజాలదు'' అని ముగించింది. అది పెద్ద సర్టిఫికెటే.

ఆమె, తన అన్న అజీంబేగ్ చౌగ్తాయి చావును గురించి చెప్పిన కథ ఉర్దూ కథా సాహిత్యంలో ఉత్కృష్టమైందని విద్వాంసుల అభిప్రాయం. మొదటి నుంచి చివరి వరకు, చివరి ఒక చిన్నవాక్యం తప్ప, తన అన్న కుటుంబ సభ్యుల నెలా హింసించి బంధించి ఆనందించేవాడో, తామందరికి అతని పట్ల ఎంతటి విరక్తి కలిగిందో చెప్తుంది. అన్నను గురించి చెల్లెలు చెప్పినట్లుగా వుండదు. ఇష్టంకాని వ్యక్తి గురించి ఇష్టం లేనట్లుగా వుంటుంది.

బన్నేభాయి అని వాళ్లంతా పిలుచుకునే అజీంబేగ్ చౌగ్తాయి రచయితగా గొప్పవాడు. కాని క్షయవ్యాధి పీడితుడు. కనుక రోగగ్రస్త మనస్తత్వం కలవాడు. ఒకవైపు దగ్గుతూ, నెత్తురు కక్కుతూనే సరిగా నిద్రాహారాలు లేక పగలూ, రాత్రీ సేవచేసే భార్యను చీటికి మాటికి ఏడిపిస్తుండేవాడు.

దీనంగా, దిగులుగా చూస్తుండే తలిదండ్రులను సూటిపోటి మాటలతో నొప్పిస్తుండేవాడు. తమ్ములను, చెల్లెండ్లను కసురుకుంటుండే వాడు. ఒకనాటి రాత్రి పరిస్థితి విషమించింది. డాక్టర్లు పెదవి విరిచి వెళ్లిపోయినారు.

అయినవాళ్ళ ఆశచావదుగదా. అంతా అతని మంచం చుట్టు చేరి సపర్యలు చేస్తున్నారు. నిద్ర, విశ్రాంతి సరిగాలేని ఇస్మత్ రాత్రి మూడు గంటలప్పుడు ఎక్కడో ముడుచుకొని పడుకున్నది. అంతలోనే చిన్న చెల్లెలు వచ్చి, "ఆపా! లే,లే మన బన్నేభాయి మరణించినాడు" అని లేపింది. అలసట, నిద్రమత్తు, చిరాకు, చీదరగా ఆమె ఒళ్లు విరుస్తూ లేచి, "మన బన్నేభాయి ఎక్కడ చస్తాడే. అతనికి చావులేదు." అన్నది. ఈ వాక్యం చీదరతో అన్నట్లున్నది. కాని సుప్రసిద్ధుడైన ఒక

**చు**గుతాయ్ (1915-1991) ఈమె రచనలు, *కథలు మసుమా* (2011), *క్రూకెడ్ లైన్* (1995), *ఎ వెరీ స్ట్రేంజ్ మాన్* (2007), *ది క్విల్ట్* ఇంగ్లీషు లోనికి అనువదించబడ్డాయి.

*గరమ్ హవా* - ఇస్మత్ చుగుతాయ్ కథ ఆధారంగా ఎమ్.ఎస్. సత్యూ దర్శకత్వం వహించిన *గరమ్ హవా* హిందీలో వచ్చిన (1974) న్యూవేవ్ చిత్రం. 1947 లో అఖండ భారతదేశం, ఇండియా, పాకిస్తాన్‌గా విడిపోయి స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించిన తరువాత ఇండియాను తమ మాతృదేశంగా భావించి ఇక్కడే ఉండిపోయిన ఒక దిగువ తరగతి ముస్లిం కుటుంబం ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలను మన ముందుంచి విశ్లేషించిన చిత్రం. సత్యూ దర్శకత్వ ప్రతిభను, బలరాజ్ సాహ్ని నటన మనల్ని కదిలించి వేస్తుంది. మనుషులను మతం దృక్పథంతో చూడటంలోని లేకితనాన్ని ఈ చిత్రకథ ఎండగడుతుంది.

చిత్రకథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలకు గాను మూడు ఫిలింఫేర్ అవార్డులు లభించాయి. కేన్స్ ఫిలింఫెస్టివల్ లో ఉత్తమ దర్శకునిగా నామినేట్ అయ్యాడు సత్యూ.




రచయితకు అతని చెల్లెలు సమర్పించిన సాహిత్య నీరాజనమది. దీని శీర్షిక 'దోజఖీ' అంటే నరకవాసి అని అర్థం. డాక్టర్ రాజ్‌బహదూర్‌గౌడ్ 'సియాసత్' పత్రికలో కొన్నాళ్ల క్రిందట రాసిన ఒక ముచ్చట చెప్పి ఈ వ్యాసం ముగిస్తాను.

ట్రేడ్ యూనియన్ లీడర్‌గా, ఉర్దూ రచయితగా రాజ్ బహదూర్ గౌడ్ సుప్రసిద్ధుడు. ఢిల్లీలో ఒక సాహిత్య సభకు రాజ్ బహదూర్ గౌడ్, ఆపా అతిథులు. ఇద్దరు కలిసి సభకు వెళ్ళారు. ఆపా మాత్రం కార్యకర్తలతో మాట్లాడుతూ అలాగే కూర్చున్నది. "ఆపా! ఇక వెళ్దామా?" అని రెండు మూడు సార్లన్నాడు డాక్టర్ గౌడ్. ఆమె వినిపించుకోలేదు. అతనిలో గాభరా మొదలయింది. అప్పట్లో అపరాత్రివేళ ఢిల్లీ రోడ్లమీద స్కూటర్ ప్రయాణం ప్రమాదరహితం కాదు.

చివరి ప్రయత్నంగా, "ఆపా! చూడండి, మహిళలంతా వెళ్లిపోయినారు అన్నాడు. ఇస్మత్ చొగ్తాయి గట్టిగా నవ్వి, "ఓ, అదా నీ భయం? ఒంటిగా మిగిలిపోయినావా? భయమెందుకు? వెంట నేనుంటానుగా" అన్నది.

''అలాంటి వాళ్ల ముందు పురుషాధిక్యత, పురుషాహంకారం అనే మాటలకు అర్థం లేదు" అంటాడు డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్.

# అవే రాగాలు-అవే కృతులు

- పన్నాల సుబ్రహ్మణ్యభట్టు

ఈ సాహిత్య సభ పెళ్ళి పందిరి లాంటిది. కొందరిని సన్మానించుకొనే వేదిక. అందులో చిన్న సదస్యం పెట్టుకొనడం ఒక వేడుక. సదస్యం శబ్దాలతో కూడుకొన్నది, ధ్వని ప్రకాశం గలది. ధ్వనులంటేనే మళ్ళీ శృతి పేయమైనవీ, అపశృతులతో కూడుకున్నవీ వుంటాయి. మన వర్తమాన సాహిత్యం అనేక వైరుధ్యాలతో తలెత్తింది. మనలని మనమే అభినందించుకునే పర్వం అనేక రాయితీలతో ఆరంభమయింది. ఆంగ్ల విద్యావ్యాప్తి వల్ల వచ్చి పడిన ప్రక్రియ వైవిధ్యం ఒకవైపు రచయితలని కష్టపెట్టింది.

సామాజిక కాఠిన్యాల మధ్య పైకెత్తవలసి వచ్చిన వాత్సల్య ప్రకటనలు మరొక వైపు పాఠక మిత్రులని అల్పసంతోషులను చేశాయి. మనకి మధ్య తరగతి శ్రేణి నుంచే రచయితలూ, పాఠకులూ రావటం పెద్దలోపమయింది. ఆధునిక సాహిత్యానికి దిద్దుబాట్లు చేసుకుంటూ పోవటమే పనిగా మారింది. కుటుంబాలు కాపాడుకోవటంతోనే సరిపోతోంది. ఇప్పుడు భూమిని కాపాడుకోవడమో పెద్దపని. పై తరగతి కుటుంబాలలోని సంపన్న వర్గాలలోని కౌటుంబికమైన సంఘర్షణలు తప్ప - వారి ఇతర సంఘర్షణలు ఇప్పటికీ సాహిత్యంలో చోటు చేసుకొనటం లేదు.

పై తరగతి వర్గాలకి రచన చేయటం ఇప్పటికీ గౌరవప్రదమైన కళ కాదు. అలా సాహిత్య శిబిరం తన చుట్టూ గల పరిమితి సమాజాన్ని మరమ్మత్తు చేసే చిన్నరకం కార్ఖానాగా మిగిలిపోయింది, తప్ప పెద్ద రోగ నిర్ధారక కేంద్రంగా పెరగలేదు. రోగాలకి నాణ్యమైన రకరకాల మందులు దొరికే కేంద్రం కాలేదు. రచయిత ఉత్సాహంగల ఛాయాగ్రాహకుని వలె, ఏరకమైన కెమెరా చేతికి వస్తే ఆ కెమెరాతో కనపడ్డ ఫోటోలు తీసిపారేస్తున్నాడు. అనుభవంలోకి వచ్చినవే రాయాలి అనే నియమం పెట్టుకొన్నాడు. భూమిపైనే అతని కన్ను. నీటిలోని జలచరాలు, ఆకాశంలోని వస్తువులు రచయిత కెమేరా పని కాదట. తెలుగులో ఒక్క గజ ఈతగాడి మీద, అంతరిక్ష వాహనం వైఫల్యం మీద ఒక్క కథ వచ్చిందా? కవిత వచ్చిందా? ఈ స్థితి ఇన్ని దశాబ్దాలు గడిచినా కొనసాగుతోంది. యూరపులో వచ్చిన సాహిత్య సృజన ముందుకు దూసుకుపోయింది.

పాశ్చాత్యా విమర్శ అందించిన పరావర్తన కోణాలు, లోచూపులు అర్థం చేసుకోవడానికి మనకి ఓపిక లేనంతగా పదునెక్కాయి. షెల్లీని సంధించటానికీ, ఎలియట్‌ని నింపుకోటానికి, కామూను అభిమంత్రించటానికి మన తెలుగు రచయితలు కొన్ని దశాబ్దాలు నిరీక్షించారు. వాల్టర్‌పేటర్ (శైలి)ని పట్టుకోడానికి, రిచర్డ్స్ (అర్థవిస్తరణ)ను రమ్మనటానికి, క్లీన్త్ బ్రుక్స్ (వ్యంగ్య నిర్మాణం)ను ఆరాధించటానికి మన విమర్శకులకు దగ్గులు అడ్డొచ్చాయి. పోనీ సార్త్ర్ రంగు ఎరుపే అయినా అతని చొక్కా చాలా బిగుతయింది. నెరుదా వాక్యాలు చదవటానికే విసుగు. ప్రత్తి, శిల్కు నాణ్యం తెలియనిదే వస్త్రాలని రచయితలు ఎలా నేస్తారు. కొలతలే తెలియనిదే పొట్టీ పొడుగూ, ఇరుకనీ, వదులనీ విమర్శకులు ఎలా చెప్తారు.

**శ్రుతుల తేడా :**

ఇక నిర్వహణలో ఎన్నో అసమానతలున్నాయి. ఇందుకు వారిలోని విత్తుల ఎంపిక లోపం కారణంగా కనపడ్తోంది. రచయిత తను దేనికి పనికివస్తాడో తెలుసుకొనక, ఆ ప్రక్రియలో సాధించే మనసుతో అందులో మాత్రమే నడవలేదని తోస్తోంది. గురజాడ గొప్ప నాటకం రాసినవాడు, అంతకు సరితూగే కవిత్వం కానీ కథగానీ రాయలేదు. వీరేశలింగం గారు అన్నిటా తన ముద్ర, ప్రథమ కబళకాంక్ష వ్యక్తం కావాలనుకొన్నారు. ఆయనలో మంచి హాస్యాన్ని వెలువరించే ప్రతిభ వున్నా ఆ కత్తికి పదును పెట్టనివారు.

పన్నాల సుబ్రహ్మణ్యభట్టు, ఫోన్ : 0866-2475120

శ్రీశ్రీ నాటక రచనలో ప్రయోగాత్మక వస్తు వివేచన కలవారయినా ఆ దారిలో వెళ్ళడానికి ఇష్టపడనివాడు. ఆరుద్ర కవిత్వంలో శిఖరాలు కట్టగలిగినా పరిశోధన సానువుల్లో సాగిపోవాలనుకున్నారు.

ఇక కథ, నవల – జంట వాహనాల సవారీ చేసేవారు ఆనేక మంది వచ్చారు. అనేక ప్రక్రియల్లో ఒకరే సారధులుగా పాత్ర నిర్వహించే దురాశకు లోనయ్యారు. మన విత్తనాలు శుద్ధి చేయబడలేదనీ, మన సాహిత్య సారథులు అతి నిపుణులు కారని మనవి చేయడానికి పేర్లు చెప్పవలసి వచ్చింది. శరీరధారుడ్యం వున్నంత మాత్రాన భీముడి పాత్రకు పనికివస్తాడనుకోలేము. మనకి సాహిత్యభీములెక్కువ.

ఈనాటి సాహిత్యం నడిచే మార్గం, అది నడిచే హొయలు, పొందిక, గ్రేసు ఎలా వున్నాయి? తెలుగు సాహిత్యంలో అనేకరకాల ప్రక్రియలు సాగే దారి ఎలా వుందీ వివరించాలంటే అదో ఉద్గ్రంథం అవుతుంది. గ్రంథనం అవుతుంది. కష్టం కాదు కానీ, వర్ణించడానికి భూమిపై కక్ష్య నుంచి ఉపగ్రహం పెట్టి చూడాలి. అన్నీ రకరకాల దృశ్యాలలో కనబడతాయి. రకరకాల నీడల్లో, వాలుల్లో గమన భేదాలు, మతి భేదాలు, వాసనాభేదాలు కల్గివుండటంవల్ల – అన్ని ప్రక్రియలు సమాంతరంగాలో, సమోన్నతంగానో పెరగవు. ఇదొక సైనికపటలం నడకలాంటిది. శత్రువులు యుద్ధాలు, భౌతికంగా కనపడవు.

ఇవి దారిలో ఎదురు కాకపోయినా ఈ సైన్యం శిక్షణకీ, సన్నద్ధతకీ కావలసిన వ్యూహ, ప్రతి వ్యూహాలు, శిక్షణ, అన్నీ వుంటేనే కాని సాహిత్య సృజన అనే కథనం కథనకుతూహలం, సరిగా నిర్వర్తింపబడవు. పైగా మన భారతీయ సైన్యంలాగే – ఇప్పుడు ఆధునిక సాహిత్యం కూడా విదేశీ శిక్షణకి పద్ధతులకీ క్రమశిక్షణ ఉపచారాలకీ కట్టుబడి వుండి, వాటికి లోనయిసాగుతోంది.

ఈ దేశపు ఆలోచనా, తర్క సామ్రాజ్యపు వనరులు, ప్రచారంలో లేక పోవటం వలన, ఆ జ్ఞాన భాండారం నెత్తికెక్కించుకోడానికి ఈ నాటి భాష, బోధన వివేచన దూరం చేయటం వలన సమస్య జటిలమయమయింది. పాశ్చాత్య తత్త్వవేత్తల సారభూతమైన ఆలోచనల వలన రాజ్య పాలన, న్యాయం, ఉద్యమాల వలన ప్రభావితమై రచనలు మనుగడ సాగిస్తున్నాయి.

ఇందువలన పాలితుల పక్షాన వకాల్తా పుచ్చుకొనే రచయితలు సమకాలీన సృజన కర్తవ్యం నిర్వహించడంలో అనేక చిక్కులు ఎదుర్కొంటున్నారు. గతకాల తర్క భాస్కరుని కంటె, గతితార్కిక భాస్వరం ఎక్కువ వెలుగునిస్తోంది. అందువల్ల ఈ వెలుగులోనే తెలిసీ తెలియక రచయితలు నడవక తప్పటంలేదు.

రచనలదీ ఈ దారే. రచన చేసే ఆఖరి సోపానస్పర్శ రచనలో ఏర్పడే ముందు ముళ్ళు ఒకే విధంగా దర్శనమిస్తున్నాయి. అందువలన పీడించే వాడూ, పీడితుడూ అనే చట్రం మధ్యనే సమకాలీన సాహిత్యయాత్ర సాగుతోంది. అందుచేత సైనిక కవాతులో అదుపుగల అడుగుల చప్పుడు తప్ప నృత్తచరణాల గతి వైవిధ్యం లేదు. కుండపోత వర్షపు జల్లు శబ్దం తప్ప అలల తాకిడికి వచ్చి పడిన తీరులోనే భిన్న లయల ఊహించని ధ్రుతి లేదు.

ఉన్నదల్లా స్వయం ప్రతిభ గల్గిన రచయితలు చూపిన ముద్రలు. వాళ్ళు ఇలా వెళ్తే భద్రమనో, ఇలా వెళ్తే భద్రం కాదు జాగ్రత్త అనో సంకేతాలు ఇస్తారు. అంటే రచయితలు పోలీసుల వలె, స్కౌటు సంఘ వలంటీర్ల వలె పనిచేశారు తప్ప ఆచార్యుల వలె విద్యాబుద్ధులను రచన చేసే తరువాతి తరాలకి నేర్పలేదు. అయితే తన ప్రతిభను తాను వెదుక్కోడం అనే క్రమంలో తపస్సు చేసిన ఋషులమల్లే నిలబడిన వారున్నారు.

కాని ఋషుల మార్గంలో నడవడం ముళ్ళమీద నడవటం కనుక తరువాతి తరపు రచయితలకి కష్టమయింది. అందువలన ఎవరిదారి వారిదయింది. కొందరు కూడలి వద్ద దీపస్తంభం వలె నిలబడిన వారున్నారు. వారికి ఇంకా జయమాలలు వేస్తున్నాం. రకరకాల దారుల్లో అస్తవ్యస్తంగా సంచరించిన గుంపు జనం తీరులా వర్తమాన సాహిత్యం నడుస్తోంది. దేవానంద్ మాదిరి క్రాపు పెంచుకొన్న యువకులున్నట్లే, ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి సిగలో మల్లె దండలాంటి అలంకరణ అనుకరించిన గృహిణులున్నట్లే రచయితలు రచయిత్రులూ రచనలు చేసినదారి మనది.

**వివాది స్వరాలు :**

ఎందరో మన ఆధునిక సాహిత్య వికాస వాహనం 'అపాలజీ' అనే ఇంధనంతో యాత్ర ఆరంభించింది. 'క్షమించండి, వ్యావహారికభాష పనికిరాదనవద్దు. ఇదిగో

నాటకం, ఇదిగో శిష్టులు మాట్లాడుకునే విశిష్టభాషలో కథ' అన్నారు. మా దేశంలో పొలాలు, జలాలు, కొండలు, గుట్టలు ఒకటే ఆత్మఘోషను పద్యంలోనూ చెప్పగలవు అన్నారు. మా భవ్యగతాన్నీ, స్వాతంత్ర్య కాంక్షనీ దేశభక్తినీ మా పద్యం, పాట బంధించగలదు సుమీ అని చెప్పుకోడంతో సరిపోయింది.

మా సాహిత్యంలో స్వేచ్ఛాకాంక్షనే వత్తి అంటించి, సంస్కరణ మందు పేలిస్తే దెబ్బకు పడిపోతారు అని ఛాలెంజి చేయడంతో సరిపోయింది. ఈ భారతదేశంలో అన్ని వర్ణాలూ, వర్గాలు పరుల హితాన్ని కోరతాయనీ, త్యాగనిరతిని చాటుతాయనీ మాకు భావోద్వేగం గలదనీ వ్యక్తీకరించటంతో సరిపోయింది.

ఈ జాతి పున:స్థాపన జరుగుతుందనే భావనల దారాలలో నాలుగు దశాబ్దాల పాటు రచయిత భుజాలు ఆకాశంలోకి చేతులు చాచాయి. అంటే ఈనాటి సాహిత్య ప్రక్రియల్లో ఆఖ్యానాల వంటి విలేఖరి కథనాలు రావటానికి ఆనాడే విత్తనాలు, నారు నాటారు. అదే ట్రెండు – విలేఖరి ధోరణి ఇప్పటికీ సాగుతోంది. 30 టి.వి. ఛానెల్స్‌లో ఒకే కథ వుంటుంది. చెప్పే వాడి గొంతు వేరు. విజువల్స్ వేరు. అలాగే మన సాహిత్యం వర్తమానంలో ఏక మూస ధోరణిలో సాగిపోతోంది.

దేశంలో అధికారం మన చేతుల్లోకి వచ్చినా ఈ ధోరణి మారలేదు. పేదవాడికి మేలు చేయడానికి మన ఫ్యూడల్ వ్యవస్థ పనికిరాదు కదా ! పరపీడన పరాయణత ఇంకెన్నాళ్ళూ? స్వలాభం చూసుకునే పాలన అంత మొందించటం ఎలా? – ఇటువంటి మాక్రో (విస్తృత) విషయాలను సాహిత్య ప్రక్రియలనే పేటికలలో ఇమడ్చాలని తాపత్రయం ఎక్కువయింది. ఇమడని వస్త్రాలని సూట్‌కేసులలో ఇరికించే వ్యవహారం మొదలయింది.

అగ్గిపెట్టెలో ఆకాశాన్ని బంధించే ప్రయత్నం ఇప్పటికీ కొనసాగుతోంది. వామపక్ష ఉద్యమం, తరువాత ఉప ఉద్యమాలు వచ్చి నెమ్మదిగా రాజకీయాలకు సమాంతరంగా వర్గ చైతన్య యాత్రలు మొదలయ్యాక సాహిత్యం కెమెరాకు గ్రూపు ఫోటోలే తప్ప సముఖాన మెలిగే వెలుగునీడల కోణాల సూక్ష్మ పరిధుల పరావర్తనం మృగ్యమయింది. కుటుంబ సమస్యలు, పాలనవైఫల్యాలు, అసమానతల ఘోరాలు – ఎలుగెత్తుతూ ఫిర్యాదుల శరపరంపరలు కురిపించటమే నేటి సాహిత్యపు గమ్యమయింది. ఇవన్నీ మనిషి స్వార్థమే కేంద్రకంగా నివేదించటమే వ్యాపకమయింది. నివేదికలయిన రచనలలో సాహిత్య కళాంశాలను చొప్పించటం ఎలాగో రచయితకి మింగుడు పడటంలేదు. రచయితకు ఎక్కిళ్ళు మొదలయ్యాయి.

సమాంతరంగా 1945నుండి చిత్రసీమ మాధ్యమం ప్రేమలకీ, గృహ సంబంధాల వికాసానికీ, కక్షలకీ, ఫాక్షన్ సమస్యల కేంద్రీకరణలకి, బాంబుల సంస్కృతికీ కొమ్ము కాయటంతో మన సాహిత్య ప్రక్రియలకి చెడు సావాసం అబ్బింది. ఆటవిడుపు కాలక్షేప రూపాల నిర్మాణ దశ పెచ్చరిల్లింది, ఉధృతమయింది. ఇది రెండవ అర్థశతాబ్దపు సాహిత్య జ్ఞానబుద్ధి కోశాలకి చిల్లులు పెట్టింది. అపాలజీ నుంచి ఎస్కేపిజం దాకా ఈ యాత్ర కొనసాగుతూనే వుంది.

అప్పుడు అక్షరాస్యత తక్కువ అయినా ఎంచదగిన సంఖ్యలో ఆ రచనకి పాఠకులున్నారు. ఇప్పుడు అక్షరాస్యత ఎక్కువ. కాని దామాషా ప్రకారం ఎంచదగిన పాఠకుల సంఖ్య పెరుగలేదు. అప్పుడూ, పాఠకమిత్రులంటే కవులకోవలోనివారే. ఇప్పుడు పాఠక మిత్రులు రచయిత్రులలో కూడా కరువయ్యారు. ఆ మధ్య పెరిగిన మహిళా పాఠకులు ఇప్పుడు టివికి బందీలు. ఇప్పుడు ఏతీరుగ సరస్వతీసేవ చేయాలి? ఇది ఈ దశాబ్దపు రచయితల దీక్ష ముందున్న ప్రశ్న. వర్తమానంలో ఈనాటి సాహిత్యం దర్శించేది నాలుగు గోడల మధ్య ప్రదేశాన్ని, వర్గాలు, పాలన, కాంక్ష, పరిష్కార సిద్ధి – ఇవే నాలుగు గోడలు.

అసహనం, పోటీ, తిరస్కారభావం, అతిశయం – అనే నాలుగు గుణాలుగల పాత్రలు ఈ గోడల మధ్య చేసిన విన్యాసాలే ఈ నాటి సాహిత్యం. వీటికి ఆలోచన అనే రక్తం – రసం ప్రవహించటం లేదు. అందుకే వీటిలో బుద్ధి వికసించలేదు. ఆలోచన, బుద్ధి, వివేచన తాకని 'ఎరుకల ప్రకటన' (సాహిత్యం) కళావిలసితమై ప్రకాశించదు.

అసహనంతో వ్రాసిన కవి పాలనను తూర్పారపడతాడు. ప్రశ్నల రంగు కలిపినా, శక్తి గల్గిన న్యాయవాది వాదన వలె ప్రకటితమౌతుంది. దానిని ప్రస్తుతం కవిత్వం అనుకుంటున్నాం. తిరస్కార భావానికి గురయిన కథకుడు కాంక్షతో సమానత్వం కోరుతూ అన్యాయాన్ని నివేదించినా విలేఖరి చెప్పిన కథవుతుంది.

అతిశయంతోనో కల్పనతోనో పరిష్కార సిద్ధి కోసం ఉద్వేగంతోనో జీవన శకలాల వాస్తవికతను విపులీకరిస్తే పేజీల పుట్టవుతున్నది కాని నవల కావటం లేదు.

ప్రేమను ఎగదోస్తూ పాట రాస్తే సంగీతంతో కూడిన వాక్యమవుతుంది తప్ప బెల్లంతో కూడిన పానకంలా రుచించటం లేదు.

అలాగని ప్రస్తుతం వస్తూ వున్న సాహిత్య వ్యాసంగమంతా నిరాకారంగా లేదు. ముగ్గురు, నల్గురు అన్ని ప్రక్రియలలో మంచి విషయంతో అల్లికతో నేస్తున్న వాళ్ళున్నారు.

రచనలో ఏటికి ఎదురీదే పాత్రలు విఫలమయినా విజయులైనా పాఠకునికికల్గే అనుకంపన శిరోధార్యమైనది. ఓటమిలో చీకటిలోని వంచితుల పట్ల దశాబ్దాలుగా పాఠకుడు ఉద్విగ్నతతో కంట తడి పెడుతూనే వున్నాడు. భాష అర్థాన్ని విస్తరించి విలోకించి క్రొత్త పదముక్తాలతో గొలుసుల వాక్యాలు, పేరాల సోపానాలు నిర్మించినవారు ఆదరాన్ని పొందుతూనే వున్నారు. పుడమికి చిన్న బెజ్జం పెట్టి పిపీలకాల శ్రేణులను చూసినా, పెట్రోలు బావులు తవ్వినా – ఆ రచయిత పనితనాన్ని పసికడ్తూనే వున్నారు పాఠకులు.

ఒకే రకం కృషి ఇక చాలు. ఇక మన చుట్టూ వున్న ఆక్రందనలకు వెయ్యి మైకులు అక్కర్లేదు. మన మనోఫలకంపై విచ్చుకున్న నెమళ్ళ విన్యాసాలను మాత్రం వెయ్యి అంతర్నేత్రాలతో చూడగగాలి. వంద కలాలతో చెప్పగలగాలి. అదీ రచయితలు చేయవలసిన పని.

చిత్రకారుని చిత్రం చూసిన తర్వాత కలిగే అనుభూతి కథ చదివిన తర్వాత నాకు కల్గుతున్నదా? సముద్రపుటలలు తీరాన్ని చూసి చతికిల పడిన దృశ్యం వేసిన ముద్ర ఒక నవల చదివిన తర్వాత నాకు కల్గుతున్నదా? ఆకాశం మేఘావృతమైనపుడు నల్లమబ్బుల వైవిధ్య భారం చూసిన మన కళ్ళకు కలిగే స్మరణ, రచన చదివిన తర్వాత మనకు కల్గుతోందా? ఇవీ మంచి పాఠకుడు వేసే ప్రశ్నలు. దీనికి రచయితలు సమాధానం చెప్పాల్సినరోజు వచ్చింది. ఇప్పటి చిత్రం ఏమిటంటే కథ కొంత చిక్కనయిందేమో! నాలుగు నవలల రోజాలు విరిసాయేమో! కాని ఇంతకాలమయినా,

**చలం కొనసాగింపు వృత్తాలూ**
**కుటుంబరావు సరళరేఖలూ**
**శ్రీదేవి చతురస్రాలు**
**పాలగుమ్మి ఆత్మపరిశీలన కోణాలు**
**రావిశాస్త్రి దీపాల నీడలూ, శ్రీశ్రీ జాడలూ**

మన వర్తమాన సాహిత్య చిత్రపటంమీద చిమ్ముతూనే ఉన్నాయి. ఇంకానా? ఇంకానా? అన్నది వర్తమానాన్ని వేధిస్తున్న ప్రశ్న.

**మంచి ముక్తాయ :**

కలం పట్టిన ప్రతివాడూ జిగీషతో రచన చేయడం మనం చూస్తున్నదే. వ్రాసినది ప్రచురించబడటం ఒక విజయం. తన అనుభవంలోకి వచ్చిన విషయానికి కథారూపం ఇచ్చి ఉత్సాహ పడటం ఒక సోపానం. అటువంటి రచన, పోటీలలో నెగ్గడం మరొక జిగీష, తనకు నచ్చిన, ఇతరులు మెచ్చిన, తన రచనలను పుస్తక రూపంలో తీసుకొని రావటం మరొక మెట్టు. పేరున్న, పేరు లేని సంస్థల ప్రభుత్వ సాహిత్య వేదికల గుర్తింపు బహుమతులు అందుకొనడం మరొక విజయం. జ్ఞానపీఠ పురస్కారం, జీవిత సాఫల్య పురస్కారాలు అందుకొనటం పర్యవసిత ఆనందం. ఈ ప్రయాణంలో రచయిత తన వస్తువును ఎంచుకొనే కాలంలోనో యత్నంలోనో తన సృజన ధర్మాలను నిర్వర్తిస్తున్నాడు. గుర్తింపు, బహుమతులకోసమే వ్రాస్తున్నాడని ప్రకటించలేము కాని, రచయిత కాలక్రమంలో ప్రకటించే అభిప్రాయాల వలన ఈ గుర్తింపు కోసం చూసే గుణం ఉన్నదని స్పష్టంగా తెలుస్తోంది.

ఈ జిగీష యాత్రలో వేటిని రచనలుగా మలచాలనే ఎంపిక కార్యక్రమం నిర్ణయాత్మకంగా మరుతోంది. ఈ ఎజెండా సెట్టింగ్‌లో వచ్చే అంశాలు – ఆయా రచయితలను కొన్ని ఒత్తిడులకు లోను చేస్తున్నవి. కాలక్షేపసాహిత్యం, వామవాద సాహిత్యం, ఉద్యమ నేపథ్య సాహిత్యం, ప్రయోగ చోదిత సాహిత్యం, దళిత, స్త్రీవాద సాహిత్యం – ఇలాటి ఎంపిక అవకాశాలు రచన సృజన ధర్మానికి పరీక్ష పెడుతున్నాయి. దేనిలో మనం ముందుకు పోగలం? అనే ప్రశ్నను ఈ నాటి రచయిత ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్యమైనదయింది. ఈ తడిమట్టి మస్తిష్క చక్రంపై తిరుగుతూ వుంటే రచయిత కుమ్మరికి దీనికి ఏ రూపం ఇవ్వాలి అనే సవాలు ఎదురవుతోంది.

రచయితకి తన రచనని ఆకర్షణీయంగా, చదివించేలా, తనకి ప్రత్యేకతనిచ్చే విధంగా తీర్చి దిద్దటంలో ఉక్తి వైచిత్రీ, శైలీగత, భాషాగత సాంకేతికాలు మరికొన్ని కష్టాలను

తెస్తున్నవి. తీరుగా, తిన్నగా రచన చేస్తే - సహపంక్తి రచయితలు, విమర్శకులు తేలిపోయిందంటారు.

కథలో కథనంలో యిమడగల కళాత్మక ప్రతిభ చూపితే - తోటి రచయితల మన్నన లభించినా పాఠకులు ఆదరించరేమోనని సంశయం వస్తోంది. పైగా ప్రక్రియాపరంగా వున్న పరిమితుల వల్ల రాజీపడి రచన చేయవలసిన స్థితి.

వస్తువు నాటకానికి సరిపోతుందనుకుంటే, నాటకానికి అవసరమైన నడకలో పాత్రలను తీర్చిదిద్దటంలో ఫలితాంశాన్ని అందించటంలో, సంభాషణలు సమకూర్చడంలో రాజీ పడాలి. కథా వస్తువయితే ఎలా నేపథ్యం ఆకర్షించాలీ అనే సమస్య, కవిత్వ వస్తువయితే శైలీ, కుదింపూ సమస్య - ఇలా అనేక పరిమితులలో వస్తువు వినియోగించుకోవలసిన స్థితి.

నా పాఠకుడెవరు? యువకులు చదవాలంటే వారికి నా రచన నిడివీ, రచనలోని నా భాష ఎక్కువేమో? ఇన్ని సంశయాలతో, ఇన్ని సమస్యలతో రచయిత తన చెంత లేని అందచందాలను ఈ ప్రదర్శనశాలలో రచనలనే వస్త్రాలు ధరించి ప్రదర్శిస్తూ నడుస్తున్నాడు.

రచన కాగితం మీద కుబుసం విడిచి విడుదలవుతున్నప్పుడు రచనలో రచయితకే తెలిసిన ఒక శక్తి (ఎనర్జీ) సంఘటనలోనో, పరికరాలలోనూ (వస్తువులో కాదు), పదాలలోనో, సాక్షాత్కరిస్తుంది. దానిని ఉపయోగించుకొనడంలో మలచుకొనడంలో ఆ రచయితకి కొన్ని సవాళ్ళు ఎదురౌతాయి.

దీనిని గమనించి లాభం పొందలేని వారు చాకచక్యంగా వినియోగించలేని వారూ చేవగల రచనలు చేయలేరు. ఇతరత్రా విజయం సాధించినా ఆ శక్తికి గల గుణాలను సేద్యం చేయకపోతే మరింత నాణ్యమైన రచన రూపొందదు. ఇటువంటి రచనలు ఈనాడు తక్కువగా వస్తున్నాయి. దారాల బలం బట్టి గాలిపటాలు పైకి ఎగురుతాయి. మి




**మిసిమి**
మాసపత్రిక
చందాదారులుగా చేర్పించండి

## బహుమతి

పొందండి!

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల - ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం *మిసిమి*కి చందా ₹240 పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా *మిసిమి* పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే - మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**





ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 6. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 7. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi

# నేను - నా భావావేశాలు

- ఎ. శ్రీదేవి

నన్ను, నా రచనాజీవితాన్ని సాహిత్య వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన రచనలు, రచయితలు, కవులు సన్నివేశాల గురించి వ్రాయాలంటే ఒక మహాగ్రంథమే అవుతుంది. శరత్ సాహిత్యం నుంచి శవసాహిత్యం వరకు కొన్ని వందల పుస్తకాలు చదివి, రచయితలను అభిమానించి, ఆరాధించి యింత దాన్నయ్యాను. సహజంగా పండిత వంశం మాది. నాన్నగారు కళాప్రపూర్ణ కొండూరు వీరరాఘవాచార్యులు, బావగారు శ్రీ శోభిరాల సత్యనారాయణగారు, బంధువు సాహిత్యబ్రహ్మ శ్రీవాసిలి లక్ష్మినరసింహారావుగారు. ఇంకా ఎందరో సాహిత్య మూర్తులు, నాన్నగారి కోసం మా యింటికి వస్తూ వుండేవారు.

చందమామ, బాలమిత్ర, వారపత్రికలు చదివేస్థాయి నుంచి, శరత్, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, వేదుల, శ్రీశ్రీ, బాపిరాజు వారి రచనలు చదివే స్థాయికి ఎదిగింది మనసు. నా మనసుని బాగా ఆకర్షించిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. ఆయన అభిమానిని. గురజాడ రచనలు ప్రాణం. కేట్స్‌షేల్లీ, వర్డ్స్ వర్త్, షేక్స్పియరు, మిల్టను, ఫ్రైడన్, జాన్సన్, భాసర్ ఎందరో ఆంగ్ల రచయితలు. తెనాలి వి.యస్.ఆర్ కళాశాలలో డబల్ లిటరేచర్ విద్యార్థులంటే గొప్ప ఆరాధనాభావం. ఆ సంవత్సరం ఆ గ్రూపులో ముగ్గురమే. నేను, సూర్యకుమారి, ఆది నారాయణరెడ్డి. మిగతావాళ్ళంతా ఆంగ్లసాహిత్య విద్యార్థులే.

ఇటు ఆంధ్రసాహిత్యంలో అటు ఆంగ్లసాహిత్యంలో ఒక్కోరచయిత ఒక్కో విధంగా ప్రభావితం చేశారు నా మనసుని, నాన్నగారి నుండి సంక్రమించిన సంస్కృత సాహిత్య పఠనం. సంస్కృతంలో పంచకావ్యాలు చదవటం ఆయన పెట్టిన భిక్ష! కాళిదాసు, మాఘు కవి, బాణ మహా కవి, దండి మొదలైన వారి ప్రసిద్ధ కావ్యాలు నాన్నగారు చక్కగా వివరించి చెప్పేవారు. కాళిదాసు రచనలు, యిష్టం, ప్రాణం. ఆయన రఘువంశం, శాకుంతలం ఎంతో ఆప్యాయంగా చదువుకునేదాన్ని. బాణుడి కాదంబరి చదివి ఆహా అనుకుంటూ పొంగిపోయేదాన్ని.

తిమ్మన, పెద్దన, రాయలు, తెనాలి రామకృష్ణుడు రామరాజభూషణుడు, చేమకూర వెంకట కవి, వీరంతా మధ్య మధ్య పలకరిస్తూ వుండేవారు. సంస్కరణలు, ఆధునిక భావాలు అంటే ఎంతో యిష్టం. 1960 నుండి, 1982 వరకు అలా చదువుతూనే ఉన్నాను. వ్రాస్తున్నాను. ఇంకా చదవడమంటే యిష్టమే. ఏ రచన ఎప్పుడు చదివాను అన్నది సంవత్సరాలు తారీఖులతో చెప్పలేను గానీ, ఎంతగా ప్రభావితమయ్యానో మాత్రం చెప్పగలను. కొవ్వలి వారి నవలలు చదువుతుంటే నాన్నగారు మందలించేవారు. చలం నవలలు, లత నవలలు చదువుతుంటే ఆంక్షలు విధించారు. అయినా మానలేదు. లత నవలలు వూహాగానం. నన్నెంతగానో ఆశ్చర్య పరిచేవి. చలం నవలలు కొత్త భావాలకు వూపిరి పోసేవి.

విశ్వనాథ వారి నవలలు చదువుతుంటే వూపిరాగి పోయేది. విశ్వనాథ ఊహా వైభవం, రచనావిధానం, వర్ణనలలోని, చమత్కారం, గాఢమైన ఆలోచన, ఆయన పాండిత్యం అబ్బురపరచేవి. *ఏకవీర, వేయిపడగలు,* నాలుగయిదు సార్లయినా చదివి వుంటాను. తిరుపతినుండి మహిళ అనే పత్రిక వచ్చేది. అందులో *ఏకవీర*పై వ్యాసాలు వ్రాశాను. *ముగ్ధమనోహర విషాద ప్రణయిని ఏకవీర* అని. *వేయిపడగలు*పై ఉపన్యాసాలు, రేడియో ప్రసంగాలు. విశ్వనాథ, ఆరాధ్య కవి. కృష్ణశాస్త్రి గారి *ఊర్వశి*పై మమకారం! ఆయన పదాల పోహళింపు, అంతపదజాల నిర్మాణం బాగా ఆకర్షించేవి. కృష్ణశాస్త్రి గారి సౌందర్య దృష్టిపై ఎమ్.ఫిల్ చేశాను. అప్పటికే 20 నవలల దాకా నావి అచ్చయినాయి. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలలో కొన్ని కథలు వచ్చాయి. నా మొదటి కథ కళాశాల మేగజైన్‌కి వ్రాశాను. 1960లో అదీ విధవావివాహం, చైతన్యం కలిగించే విప్లవ భావాలు. నా ఉపన్యాసాలలో వాడి, వేడి చూసి నా స్నేహితులంతా

డాక్టరు ఎ. శ్రీదేవి, ఫోన్ : 08514-247887

లేడీ వీరేశలింగం అని అభినందించేవారు. శ్రీశ్రీ భావాలు చాలా యిష్టం. ఆయన కవిత్వం గురించి మట్లాడుతున్నా, పాఠాలు చెబుతున్నా నన్ను నేను మరిచి పోయేదాన్ని. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ఎన్నో కవితలు వ్రాశాను. అవన్నీ ఆకాశవాణి కడపకేంద్రం ద్వారా ప్రసారమయ్యాయి. వాటిని *స్వాప్నికశిల్పాలు* కవితా సంకలనం గా వేయించాను. సంఘసంస్కరణలంటే బాగా యిష్ట పడేదాన్ని. జాషువా రచనలు చదివి పొంగిపోయేదాన్ని. రాయప్రోలు, నండూరి, వేదుల, బంగారమ్మ రచనలు, బసవరాజు అప్పారావు గేయాలు, యిష్టంగా చదివేదాన్ని. అదొక అందాల సాహిత్యలోకం. నేనూ అందులో స్థానం సంపాదించాలని ఆరాటం!

శ్రీమతి శ్రీదేవినయ్యాక, నాలోని ఆవేశాన్ని విప్లవభావాలనీ చూచి లేడీ శ్రీశ్రీ అనేవారు మిత్రులంతా. ఆధునిక సాహిత్యం కన్నా ప్రాచీన సాహిత్యం యిష్టంగా చదివేదాన్ని. శ్రీకృష్ణదేవరాయలు పోతన, మొల్లల ఆ పద్యాలు అలవోకగా ఉపన్యాసాలలో దొర్లిపోతుండేవి. ప్లాటోనిక్‌లవ్ ఆధారంగా *కీర్తికిరణాలు* అనే నవల వ్రాశాను. నా నవలన్నిటిలో *స్త్రీ వాదం , కదిలేది కదిలించేది, పరిపూర్ణపు బ్రతుకిచ్చేది, కావాలోయ్ నవకవనానికి,* అనేవి యిష్టపడేదాన్ని.

'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని ఆహ్లాదంగా రసవంతంగా కవిత్వం వ్రాసే బాలగంగాధర తిలక్ నాకు ఆదర్శప్రాయుడే. ఆయన మీద రేడియో ప్రసంగాలు చేశాను. నన్నయ ప్రసన్న కథా కవితార్థయుక్తి, తిక్కన గారి అల్పాక్షరాలలో అనల్పార్థ రచన రాయలలోని, వర్ణనాచమత్కారం ఊహావైభవం, చేమకూర పదప్రాభవం, పోతనగారి అలంకారాలు, రామరాజభూషణుల సంగీత ప్రియత్వం, మొల్ల సుకుమార భావాలు, వెంగమాంబ భక్తితత్వం. ఇవన్నీ నా రచనలలో ప్రతిఫలిస్తాయి. శరత్ అంటే ప్రత్యేకమైన అభిమానం. యిప్పటికీ ఆ *చరిత్రహీనులు, శేషప్రశ్న, బాటసారి, దేవదాసు* ఎంతో అపురూపంగా అనిపిస్తాయి. ప్రేమ్‌చంద్, రవీంద్రనాథ ఠాగూర్ కూడా నా మీద ఎంతో ప్రభావాన్ని చూపించారు. షేక్స్‌పియరు, నాటకాలు, కీట్స్ షెల్లీ కవిత్వం, బెర్నార్డ్‌షా అపూరూపభావాలు, థామస్ హార్డీ రచనలు, బేకన్సే ఎస్సేస్, యివన్నీ కూడా యిష్టంగా చదువుకుని ప్రేమగా పాఠాలు చెప్పేదాన్ని. ఒక్కోరచయిత, ఒక్కో కవీ నన్నెంతగా ప్రభావితం చేశారో అది వ్రాస్తే ఒక గ్రంథమే అవుతుంది. బాపిరాజుగారి లోని కళాపిపాస, సౌందర్య తృష్ణ నాకెంతో నచ్చుతాయి. అలాంటి కథానాయకుల్ని ప్రేమమూర్తులని నా నవలలో చిత్రించాను. విఫలమనోరథులైన స్త్రీలపట్ల జాలి, సానుభూతి! అందుకే నా పి. హెచ్.డి సిద్ధాంత గ్రంథం. "ప్రాచీన తెలుగు కావ్యాలలో విఫల మనోరథ స్త్రీ పాత్రలు" నన్నయ నుంచి క్షీణయుగం వరకు ఉన్న ప్రబంధాలు, కావ్యాల ఆధారంగా, అరవై స్త్రీ పాత్రలతో యీ గ్రంథం నిండిపోయివుంటుంది.

శిల్పసాహిత్యములు, నాకు జీవగఱ్ఱలు ఔపనిషదవనాలు విహారవీధులు, అంటూ ప్రతిజ్ఞ చేసి సాహిత్యలోకాన్ని ప్రభావితం చేసిన విశిష్ట కవి, పండితుడు, రచయిత మానాన్నగారు శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు. ఆయన రచనలలోని, శిల్ప, శాస్త్ర, యోగ, వేదాంతపు విషయాలు ఎంతగానో ఆకర్షించాయి. యిప్పుడవి ఎవరికీ అవసరం లేదు. ఈ నాడు ఎవరికీ పఠనాసక్తి, చదవాలన్న అభిలాష లేదు. చదివి, చదివించి, వ్రాసి, వ్రాయించి, ఆలోచించి, ఆలోచించేలా చేసి, నా నలభై అయిదేళ్ళ సాహిత్య జీవతం సాగిపోతూ వుంది. నా సాహిత్య రచనలు జీవితం కొంత మందికి ఆదర్శమయ్యాయి, అదే ఆనందం. *స్వాప్నిక శిల్పాలు కవితా సంకలనం* పై బి.రవి కుమార్ తెలుగు విశ్వ విద్యాలయం నుంచి ఎమ్.ఫిల్ చేశాడు. అదొకటి ఆనంద దాయకమైన విషయం.

ముప్పైయికి పైగా నవలలు, వందలకొద్దీ సాహిత్య వ్యాసాలు, ఎన్నో రేడియో ప్రసంగాలు ఇదీ నా సాహిత్య జీవితం. *కలల చెలి, తరంతరం నిరంతరం* నవలలు స్వాతి మాసపత్రికలో సీరియల్‌గా వచ్చాయి. విజయవాడ జయంతి పబ్లిషర్స్ వారు నా నవలలు అచ్చు వేశారు. కర్నూలు రేడియోస్టేషన్ నుంచి నా సాహిత్య ప్రసంగాలు, తరచు వినిపిస్తూనే వుంటాయి. ఎన్నెన్నో జ్ఞాపకాలు సన్నివేశాలు, కవులు సభలు సమావేశాలు, కవి సమ్మేళనాలు, సాహిత్య ప్రసంగాలు, సన్మానాలు, సత్కారాలు 2005లో ప్రభుత్వ కళాశాల నుండి పదవీ విరమణ, ఇదీ నా జీవితం. ఒక సాహిత్య తరంగం తరిగిపోని జ్ఞాపకాల అనుభూతులు. ఇదొక సజీవ సాహిత్య మందిరం.

# అవధానాలు-ధారణ

– పానుగంటి శేషకళ

**చ**తుర్విధ కవితల్లో ఆశుకవితశాఖకు చెందినది అవధానం. తెలుగునాట విస్తృతంగా. ప్రచారం పొందిన ప్రక్రియ ఇది. అంతో ఇంతో పద్యకవిత్వం చెప్పగలిగిన ప్రతీవ్యక్తీ అవధానం చేయాలని తపనపడడం కనబడుతుంది. డు ధాఞ్ ధారణ పోషణయోః అనే ధాతువురి అవ అనే ఉపసర్గ చేరితే అవధానం అనే పదం ఏర్పడుతుంది. అవధానం సమాధానం ప్రణిధానం తదైవ చ అని, ప్రమాదోనవధానతా అని అమరం. వామనుడు తన కావ్యాలంకార సూత్రవృత్తిలో చిత్తైకాగ్ర్య మవధానం అని సూత్రించారు.

కొరవి గోపరాజు తన సింహాసన ద్వాత్రింశికలో చతుష్షష్టి కళల్లో అష్టావధానం ఒకటని పేర్కొన్నాడు. శతలేఖిన్యవధాన పద్యరచనా సంధాసురత్రాణ చిహ్నితనామా చరిగొండ ధర్మసుకవీ అని చరిగొండ ధర్మన తన చిత్రభారతం (1-18) లో అవధాన పదాన్ని ప్రయోగించాడు.

అవధానం అనేది బౌద్ధిక ప్రక్రియ. దీనికి ఎంతో కృషి, ఏకాగ్రత, ఛందోవ్యాకరణాది శాస్త్రాల జ్ఞానం అవసరం. అవధానాలు చేయాలనుకునే వ్యక్తి ముందుగా పద్యరచనలో నైపుణ్యం సాధించాలి. ఈ తర్వాత కాదేదీ కవితకనర్హం అన్నట్టు ఏ అంశంపైనైనా చమత్కారయుక్తంగా పద్యం చెప్పగలగాలి. అప్పుడు అవధానం చేయగల సామర్థ్యం అలవడినట్లే. అవధానికి ఇవన్నీ ఒక యెత్తైతే పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలను అన్నింటినీ పూరించిన తర్వాత వాటిని ధారణ చేసి చెప్పడం కూడా ఒక యెత్తు. ధారణను గురించి మానసికశాస్త్రవేత్తలు ఏం చెప్పారో ముందు చూద్దాం.

మనం నేర్చుకున్న విషయాన్ని నిలవచేసుకోవడం ధారణ. అభ్యసనానికి ధారణ ముఖ్యం. ధారణను పరీక్షించడానికి ఉపయోగించే పద్ధతులు పునఃస్మరణ, గుర్తింపు, పునరభ్యసనం.

పునఃస్మరణ అంటే నేర్చుకున్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవటం. పునఃస్మరణ ద్వారా ధారణను తెలుసు కోవడానికి శాబ్దిక పునఃస్మరణ అశాబ్దికి పునఃస్మరణ అని రెండు పద్ధతులను అవలంబిస్తారు. పునఃస్మరణలో మూడు పద్ధతులు ఉన్నాయి. అవి–

**స్మృతి – విస్మృతి:** ఒకసారి విన్న విషయాన్ని లేదా చూసిన విషయాన్ని తిరిగి జ్ఞాపకం చేసుకోవడం.

**ద్వంద్వ సంసర్గులు:** అర్థవంతమైన అర్థరహితమైన పదాల జంటలను జాబితాగా తయారు చేసుకోవడం.

**శబ్దప్రమాణం:** కొంతకాలం క్రితం జరిగిన విషయాన్ని ఇప్పుడు చెప్పమన్నప్పుడు స్మృతిలో ఆఘటన అలాగే ఉండదు.

ధారణలో పునస్మరణ కంటే తేలికైనది గుర్తింపు. మన నిత్యజీవితంలో చాలాకాలం క్రితం చూసిన వ్యక్తిని ఇప్పుడు చూస్తే మిమ్మల్ని ఎక్కడో చూశాను అంటూ జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నించడం గుర్తింపు.

ధారణలో గుర్తింపు తర్వాతది పురభ్యసనం. కాలవ్యవధిలో మరచిపోయిన విషయాన్ని తిరిగి నేర్చుకోవడం పురభ్యసనం.

**ధారణ:**

బట్టీ స్మృతి – తార్కిక స్మృతి, స్వల్పకాలిక స్మృతి, నిష్క్రియాత్మక స్మృతి

**బట్టి స్మృతి:** ఒక విషయాన్ని యథాతథంగా, అర్థం తెలీకపోయినా కంఠస్థం చేయడం బట్టీ స్మృతి.

డాక్టరు పానుగంటి శేషకళ, ఫోన్ : 9492751774

**తార్కిక స్మృతి:** చిన్నతనంలో చదివే పద్యాలు, ఎక్కాలు ఇటువంటివే. విషయాన్ని అవగాహన చేసుకుంటూ జ్ఞాపకం పెట్టుకోవడం తార్కిక స్మృతి.

**స్వల్పకాలిక స్మృతి:** దీర్ఘకాలిక స్మృతి ఏ తరగతిలో నేర్చుకున్న విషయాలను ఆ తరగతి తర్వాత మరచిపోవడం స్వల్పకాలిక స్మృతి. ఎక్కువకాలం గుర్తుపెట్టుకునేవి దీర్ఘకాలిక స్మృతి.

**నిష్క్రియాత్మక స్మృతి:** క్రియాత్మక స్మృతి కొన్ని అంశాలు జ్ఞాపకం పెట్టుకోవడం అనవసరమైనవి. ఉదాహరణకి మనకు బాధకలిగించే అంశాలు. వీటిని స్మృతిలో ఉంచుకోవడం నిష్క్రియాత్మక స్మృతి. అలాకాక కొన్ని విషయాలను మనం జీవితకాలం గుర్తుంచు కోవలసినవి ఉంటాయి. వాటిని గుర్తుంచుకోవడం క్రియాత్మక స్మృతి.

ఏదైనా విషయాన్ని మనం స్మృతి పథంలో నిక్షిప్తం చేసుకోవాలి అంటే అందుకు కొన్ని పద్ధతులను నిపుణులు సూచించారు.

ప్రేరణ, అభిరుచి, అవధానం, భావోద్రేకాలు తక్కువగా ఉండడం, భావాల సంసర్గం, అతి అభ్యసనం, వల్లె వేయడం, కొండగుర్తులు–యమాతారాజభానసలగం అని గణాలను గుర్తు పెట్టుకోవడం, నేర్చుకొనే విషయంపై కుతూహలం, శ్రద్ధ ఉండడం, అర్థం చేసుకుని చదవడం, నిర్విరామంగా నేర్చుకోవడం- విరామం ఇస్తూ నేర్చుకోవడం, మొత్తం అంతా ఒకేసారి చదవడం – భాగాలుగా విడదీసి చదవడం, ఆత్మస్థైర్యం.

మెదడును సరిగా విభజించుకోక పోయినా ప్రశ్నలు వినేటపుడు అవాంతరం వచ్చినా ధారణ సరిగ్గా కుదరదు. ఆ ప్రశ్న ధారణలోకి వెళ్ళేవరకు ఒకటికి రెండుసార్లు అంటూ ఉంటారు. ధారణ సరిగ్గా కుదరకపోతే అవధానం రక్తి కట్టదు. అందుకు అవధానులు ఏకాగ్రతకు, ధారణకు అంత ప్రాధాన్యం ఇస్తారు.

ఇది ధారణ విషయంలో సైద్ధాంతిక ప్రతిపాదన. అవధానాల్లో ధారణకి ఈ లక్షణాలు ఉండాలి, ఉంటాయి కూడా. ఐతే అవధానాల్లో బుద్ధిబలాన్ని చూడాలి కాని కవితారసాన్ని కాదంటారు తిరుపతి వేంకటకవులు. ధారణశక్తికి అభ్యాసం కారణమని చాలామంది అవధానుల అభిప్రాయం.

కొందరు ఈధారణకి ఉపాసనాబలం కారణమని. కొందరు అభ్యాసం కారణమని, కొందరు బుద్ధిబలమని, కొందరు పూర్వజన్మసుకృతమని ఇలా రకరకాలుగా భావించారు.

ఈ ధారణ గురించి శ్రీవేలూరి శివరామశాస్త్రి గారు ఏకాగ్రత ఒక్కటే శరణ్యమని అంటారు. ఏకాగ్రతనే శ్రీకాశీకృష్ణాచార్యులుగారు హయగ్రీవుడు అంటారు. పిశుపాటివారు గణపతి అంటారు. ఎవరి విద్యాదేవతను వారు ప్రార్థించి వారు ఏకాగ్రతను సాధిస్తారు.

అవధాన సమయంలో అవధాని మెదడు చాలా చురుకుగా హాయిగా పదునుగా ఉంటుంది. పృచ్ఛకులు అడిగే ప్రశ్నలకు వేటికి వాటిని విడివిడి అరలు ఏర్పాటు చేసుకుంటారు. రైతు నాగేటిచాళ్ళను తీర్చుకుని పెట్టుకున్నట్లు మెదడులో భాగాలను కేటాయించుకుంటారు. మొదటి ప్రశ్న అడిగినపుడు ఆ పృచ్ఛకుని చూసి, ఆ ప్రశ్నను ధారణ చేస్తారు. మళ్ళీ ఆవృత్తం వచ్చినపుడు ఆ పృచ్ఛకుని చూస్తే ఆ ప్రశ్న స్ఫురిస్తుంది. ఇలా జరగడం అభ్యాసం వల్లే సాధ్యం అవుతుంది.

మెదడును సరిగా విభజించుకోక పోయినా ప్రశ్నలు వినేటపుడు అవాంతరం వచ్చినా ధారణ సరిగ్గా కుదరదు. ఆ ప్రశ్న ధారణలోకి వెళ్ళేవరకు ఒకటికి రెండుసార్లు అంటూ ఉంటారు. ధారణ సరిగ్గా కుదరకపోతే అవధానం రక్తి కట్టదు. అందుకు అవధానులు ఏకాగ్రతకు, ధారణకు అంత ప్రాధాన్యం ఇస్తారు. నిజానికి లేఖన సంప్రదాయం లేనికాలంలో మన విద్యావిధానం అంతా మౌఖికంగానే సాగేది. గురుముఖతః వినడం, వచ్చేవరకు వల్లెవేయడం అంతే. బహుశా 'శ్రుతము వలన శ్రోత్రియుడగున్' అనేమాట ఇలాగే పుట్టిందేమో.

నేటికి శతాబ్దం క్రితం వరకు కూడా చాలామంది గురువులకు రాయడం కూడా వచ్చేది కాదట. తిరుపతి వేంకటకవుల గురువు చర్లబ్రహ్మయ్యశాస్త్రి కూడా మౌఖికంగానే విద్య నేర్పేవారట. వారికి రాయడం రాదట. భాషానైపుణ్యాల్లో కూడా లేఖనం చివరిదే. ముందుగా ఉండేది శ్రవణమే. శ్రవణం, భాషణం, పఠనం లేఖనం ఇదీ వరస.

ఈ ధారణ అనేది అవధానాలకే పరిమితం కాదు. విద్యార్థులకు అత్యంత ఆవశ్యకమైంది. దీనిని సాధన ద్వారా సాధించవచ్చు. అనగననగ రాగమతిశయిల్లినట్లు గానే.



### నీలగిరి పత్రిక స్థాపకుడు

# షబ్నవీసు

*– కుర్రా జితేంద్రబాబు*

షబ్నవీసు వెంకటరామనరసింహారావు తన జీవితాన్ని ధన, విద్యావైదుష్యాలను సాహితీసేవకు, సమాజస్ఫూర్తికి అర్పించిన మహానుభావుడు. వార్తలేనిచో లోకము అంధకారబంధురమవుతుందని భావించి వార్తలను ప్రజలకు అందజేసే పత్రిక లేని పక్షంలో, ప్రజలకు రక్షణ కరువవుతుందని పత్రిక అవసరాన్ని గుర్తించి నల్లగొండ జిల్లాలో 24-8-1922లోనే "నీలగిరి" అను పేర పత్రికను స్థాపించి ప్రజాసేవ చేసిన ధన్యుడు నరసింహారావు. ఆనాడు నిజాం పాలనాకాలంలో నిర్బంధాన్ని అధిగమించి "ఉస్మానియా ముద్రణాలయం" స్థాపించి దాని ద్వారా "సంస్కారిణీ గ్రంథమాల" ద్వారా ప్రతినెల ఒక మంచి పుస్తకాన్ని పాఠకులకు అందించి ఆనాడు సాహితీ సేవ చేసిన ధన్యుడు.

షబ్నవీసు వెంకటరామనరసింహారావు మన్మథనామ సంవత్సరం, కార్తీకమాసం అనగా 1896 నవంబరు నెలలో షబ్నవీసు లక్ష్మీనారాయణరావు, రంగనాయకమ్మలకు జన్మించారు. లక్ష్మీనారాయణరావు తండ్రి గోపాలరావు నల్లగొండకు సమీపాన గల మామిళ్ళగూడెం గ్రామాన్ని మఖ్తాగా సంపాదించారు. వీరు ప్రతి సంవత్సరం హైదరాబాదు వెళ్ళి నిజాం ప్రధాని అయిన నవాబు సాలార్‌జంగ్ బహదూరును వారి అనుచరులను కలిసి వచ్చేవారు. లక్ష్మీనారాయణ రావు కొన్ని సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగము చేసి కొన్ని గ్రామాల్లో భూములు, వ్యవసాయం చేయిస్తూ మామిళ్ళ గూడెంలో పెద్ద బంగళా కట్టించిన సంపన్నులు. వీరి కుమారుడు వెంకట రామనరసింహారావు స్వయంకృషితో సంస్కృతాంధ్ర, ఫారసీ, ఉర్దు భాషలలో పాండిత్యం సంపాదించినాడు. పదహారవ యేట పులిజాల తిరుమలరావు, రామచూడమ్మ గారి జ్యేష్ఠ కుమార్తె మరియు పులిజాల రంగారావుగారి సోదరి రాధమ్మను వివాహం చేసుకొని ఆతరువాత ఆమె పేరును జానకీబాయిగా మార్చినారు. ఆమెకు ఆంధ్ర భాషలో ప్రవేశం కలిగించి, గ్రంథావలోకానికై నరసింహారావు చాలా కృషి చేశారు. నల్లగొండలో ఆరోజుల్లో మహబూబియా రీడింగురూము అనుపేరున ఒకే గ్రంథాలయం ఉండేది. 18 మార్చి, 1918లో ఆనాటి అవ్వల్ తాలూకు దార్ ఆధ్వర్యంలో వెంకటరామ నరసింహారావు ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి ఆంధ్ర సరస్వతీ నిలయమను పేర ఒక గ్రంథాలయాన్ని స్థాపించి నిర్వహించారు. ఈ గ్రంథాలయం ఆ తర్వాత జిల్లా గ్రంథాలయ సంస్థలో విలీనం అయింది.

11,12 నవంబరు 1921 నాడు హైదరాబాదు నగరంలో సంఘసంస్కార సభ మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడు, అయిన కార్వే పండితుని అధ్యక్షతన జరిగినది. అతని అధ్యక్ష ఉపన్యాసం మరాఠీలోనూ, ఇంగ్లీషులోను చేశాడు. తదనంతరం వక్తలందరు మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో అచ్చట ప్రవేశపెట్టిన తీర్మానాలపై ప్రసంగిస్తూ వచ్చినారు. ఆ సమావేశానికి హాజరయిన తెలుగు ప్రముఖులకు ఈ విషయం మనస్తాప కారణమయింది. దానితో నగరంలో సుప్రసిద్ధ న్యాయవాదిగా ఉన్నటువంటి శ్రీ అలంపల్లి వేంకటరామారావు గారు, ఒక తీర్మానముపై తెలుగులో ప్రసంగించటానికి ఉపక్రమించగానే సభికులు అరచి గోలచేసి ప్రసంగము కొనసాగనీయకుండా చేశారు. ఈ సంఘటన మాతృభాషకు జరిగిన అవమానంగా భావించి వెంటనే సభలోయున్న తెలుగువారు సభాకార్యక్రమములు పూర్తికాకముందే నిరసనతెలుపుతూ బయటకు వచ్చేశారు. అదేరోజురాత్రి 8 గంటలకు ట్రూపు బజారునందు హైకోర్టు వకీలుగానున్న టేకుమాల రంగారావు గారింట్లో, (1) టేకుమాల రంగారావు, హైకోర్టు వకీలు, (2) మాడపాటి హనుమంతరావు, హైకోర్టు వకీలు, (3) మిట్టా లక్ష్మీరసయ్య,

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

వకీలు, (4) ఆదిరాజు వీరభద్రరావు, (5) నడింపల్లి జానకిరామయ్య, (6) బూర్గుల రామక్రిష్ణారావు, (7) మందుముల నరసింగరావు, (8) బోయినపల్లి వేంకటరామారావు, (9) కొమ్మవరపు సుబ్బారావు, (10) బూర్గుల నరసింహారావు, (11) డా॥ పందిటి రామస్వామి నాయుడుగార్లు సమావేశమై ఆ రాత్రి ఆంధ్రజన సంఘమును స్థాపించి సంవత్సరమునకు ఒక రూపాయి చందా నిచ్చువారు సభ్యులుగా ఉందురని నిర్ణయించినారు. ఆ తర్వాత రెండు నెలలు సభ్యులను జేర్పించి, తగినంతమంది సభ్యులుజేరిన తర్వాత వారి అభిప్రాయానుసారము నియమాలను ఏర్పరుచు కొనవలెనని తీర్మానించారు. ఎన్నికలు జరుగువరకు తాత్కాలిక కార్యదర్శిగా శ్రీ టేకుమాల రంగారావు వ్యవహరించవలెనని తీర్మానిస్తూ "పుట్టుక వలన గాని స్థిరనివాసమువలన గాని హైదరాబాదు రాజ్యములోని యాంధ్రులగు వారందరును ఈ సభలో చేరవచ్చును. ఇట్టివారి వయస్సు 18 సంవత్సరములకు మించి యుండవలెను" అని సభ్యులుగా చేరువారికి నియమము ఏర్పాటు చేశారు. నూరుగురు సభ్యులు త్వరలోనే ఆంధ్రజనసంఘములో చేరారు. 24-2-1922 నాడు సాయంత్రం ఆంధ్రజనసంఘ సమావేశం కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన రెడ్డి విద్యాలయములో జరిగింది. 17 మార్చి, 1922, 4 ఏప్రియల్ 1922లలో తిరిగి సమావేశములు జరిగినవి. ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళటానికి నీలగిరి పత్రికను షబ్నవీసు వెంకటరామనరసింహారావు 24-8-1922లో నల్లగొండలో ప్రారంభించారు.

ఆంధ్రజన కేంద్ర సంఘ ప్రథమ సమావేశము హైదరాబాదులోని ట్రూపు బజారులో గల మాడపాటి హనుమంతరావు ఇంట్లో 27 జూలై, 1923నాడు జరిగింది. ఆంధ్రజన కేంద్ర సంఘ ద్వితీయ సమావేశము 'నీలగిరి' పత్రికా సంపాదకులు షబ్నవీసు వేంకటరామనరసింహారావు కార్యాలయ ఆవరణలో నల్లగొండ నందు 21 మార్చి 1924న జరిపినారు. ఈ సమావేశానికి రావు బహదూర్ వేంకటరెడ్డి అధ్యక్షత వహించారు. తెలంగాణా జిల్లాలనుండి 7గురు ప్రతినిధులు, వివిధజిల్లాల నుండి 50 మంది ప్రేక్షకులు హాజరయినారు. ఈ సభలో చిత్రాడ జమీందారు సాహిత్యపోషకుడు చెలికాని లచ్చారావు, శతక కవుల చరిత్ర గ్రంథకర్త, సాహితీవేత్త వంగూరి సుబ్బారావుల మృతికి సంతాపం ప్రకటించిరి. (2) నిజాం రాష్ట్రంలో ఆంధ్రోద్యమ వ్యాప్తికి "నిజాం రాష్ట్రాంధ్రనిధి"ని ఏర్పాటు చేయాలని దానికి కొండా వేంకటరంగారెడ్డి వ్యవహర్తలుగా ఉండాలని నిర్ణయించినారు. (3) వేతనముతో పూర్తికాలము పని చేయుటకు ప్రచారకుని నియమించాలని నిర్ణయించినారు. (4) 'ఆంధ్రపరిశోధకమండలి' అను పేరుతో స్థాపితమై కొమర్రాజు వేంకటలక్ష్మణరావు మరణించిన తర్వాత "లక్ష్మణరాయ పరిశోధకమండలి"గా నామకరణము చేయబడిన పరిశోధన సంఘం ఆంధ్రజనసంఘము ఆధీనంలో పనిచేయుచుండెను. దానిని కేంద్ర సంఘము యాజమాన్యము క్రింద వచ్చునట్లు నిర్ణయించినారు. (5) ఎచ్.ఎస్.ఎస్.సి., ఉస్మానియా విశ్వ విద్యాలయపు మెట్రిక్, ఇంటర్మీడియట్, బి.ఎ. పరీక్షలందు ఆంధ్రభాషలో ప్రథములుగా వచ్చినవారిని బంగారు, వెండి పతకములతో సత్కరించాలని కూడ నిర్ణయించినారు. (6) ఆంధ్రవాఙ్మయం ప్రచారము చేయుటకు పరీక్షలనేర్పాటు చేయుటకు ఒకవిధానము సిద్ధము చేయాలని నిర్ణయించినారు. (7) నిజాం రాష్ట్రంలో ఆంధ్రుల స్థితులను తెలుపు లఘుపుస్తకమును వ్రాయించి అణాకుమించని వెలకు విక్రయించాలని నిర్ణయించినారు. నల్లగొండనందు ఈ సమావేశము ముగింపున బహిరంగసభను పింగళి వెంకటరమారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసభలో శేషాద్రిరావు వకీలు, మౌల్వీ మన్సూర్ సాహెబ్, ఇంకొందరు నాయకులు ప్రసంగించారు. ప్రభుత్వంనందలి తామీరాత్ శాఖలో ఉద్యోగం చేయుచుండిన శ్రీ కూర్మారావుగారు కేంద్రసంఘ సభ్యులకు ఆ రాత్రి విందును ఏర్పాటు చేసినారు.


జానకీబాయి

ఆంధ్రజనసంఘం ప్రారంభమైన తర్వాత 8 సెప్టెంబరు 1921 నాడు నిజాం ప్రభుత్వం "రాజకీయ పరిణామములు గలిగించునను అనుమానము కల్పించునట్టి సభలను గానీ, ఎవరును ప్రభువుగారి స్వంత అంగీకారము పొందనిది సమావేశ పరచగూడ"దని, "అట్టి అంగీకారమునకు పూర్వము

ముందుగా సభాకార్యక్రమమును బాబెహుకూమత్ వారు అంగీకరించిననే గాని సభాకార్యక్రమములు జరుపకూడ" దనియు శాసించిరి. (5 మొహర్రం 1340 హిజ్రి. 3-12-1330 ఫ). ఈ ఫర్మానాతో నిజాంరాష్ట్రంలో రాజకీయసభలను నిర్వహించుటకు ఆస్కారంలేకుండా పోయింది.

షబ్నవీసు వెంకటరామనరసింహారావు 'నీలగిరి' పత్రికతోపాటు "వీరేశలింగం కంఠాభరణ గ్రంథమాల" అనే ఒక ప్రచుణ సంస్థను ప్రారంభించారు. కంఠాభరణమంటే కాసు. ఆనాడు రెండణాల బిళ్లను బేడాకాసు అనేవారు. ప్రచురించిన ప్రతి పుస్తకం ఖరీదు రెండు అణాలు మాత్రమే. అందువల్ల దీనికి వీరేశలింగం కంఠాభరణ గ్రంథమాల అని పేరు పెట్టారు. ఈ గ్రంథమాల పక్షాన దాదాపు పది పుస్తకాలను ప్రచురించారు. అందులో ఒకటి వెంకట నరసింహారావు గారి తండ్రి ప్రేరణతో "మామిళ్ళగూడెం మఖ్తా, రామా శ్రీ ఆంజనేయ ధార్మిక దేహ" అనే మకుటంతో శేషభట్టరు రామానుజాచార్యులు రచించిన శతకం ప్రచురించారు. "సంస్కారిణీ గ్రంథమాల" అనే సంస్థ ద్వారా నెలకో పుస్తకం అందించే కార్యక్రమంలో భాగంగా "బాలికావిలాపం" అను గ్రంథాన్ని 1921లో తొలి గ్రంథంగా రచించారు. ఈ గ్రంథంలో సమాజంలో ఉన్న దురాచారాలు, దుర్నీతి, దుర్వృత్తిని ప్రజలందరికి తెలియజేసే ఉద్దేశంతో రచించారు. ఎవరినీ కించ పరిచే ఉద్దేశంతో ఈ "బాలికావిలాప" రచనను చేపట్టలేదని నరసింహారావుగారు తమ అవతారికలో పేర్కొన్నారు.

కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో స్త్రీవిద్య, వితంతు వివాహాల ప్రయత్నాల కృషి నరసింహారావు, జానకీబాయిలు చేపట్టారు. జానకీబాయి వితంతు సోదరి పునర్వివాహానికై దంపతులిద్దరు ప్రయత్నిస్తున్న సందర్భంలో నరసింహారావు బాలికా విలాపం ద్వారా బాల్య వివాహ వ్యవస్థను అంతమొందించడానికి ఈ రచనను అందించారు. ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన నలుగురు అక్కచెల్లెళ్ల దీనగాథే ఈ బాలికావిలాపం. పసివయసులో పెళ్లి జరిగి ఈ సోదరీమణులు భర్తలను పోగొట్టుకొని తల్లిదండ్రుల రక్షణ లేక, బంధువుల ఆదరణ లేక, ఇతరుల సహాయం లేక, ఆత్మహత్యకు ప్రయత్నిస్తారు. ఆ గాథనే బాలికావిలాపంగా తెలుపుతూ చివరలో...

**సీ॥ "అతి బాల్యమున వివాహముల సేయక ముద్దు**
**బిడ్డలఁ గరుణతో బెంచుఁడయ్య**
**ఆఁడు లేబిడ్డల గోడు జెందించెదు**
**బాల్య వివాహముల్బాపుడయ్య**
**పసుపు గుంకుమ కోర్కెబాయని సుతులకు**
**మఱలనుద్వాహముల్ జరుపుడయ్య**
**అబలలకీరేదు నందాక బెండ్లిండ్లు**
**జేయు నాచారము బాయుఁడయ్య**
**పది నెలలు మోసి పెంచిన బాలికలను**
**వెతలపాల్జేయుమనుచు నే శ్రుతివిధించె**
**నకటఁయన దలఁ గరుణచే నాదరించ**
**బూనుకొనరయ్య దేశాభిమానులార!**

నరసింహారావు భార్య జానకీబాయి జీవితాన్ని "ఉదయలక్ష్మి" అను పేరుతో శేషాద్రి రమణకవులు రచించిన 107 పద్యాలను కూడా ప్రచురించారు. షబ్నవీసు వెంకటరామనరసింహారావు భార్య జానకీబాయి నీలగిరి పత్రికా ప్రచురణకు ప్రోత్సాహాన్ని అందించింది. పత్రిక ప్రారంభించిన రోజే ఆమె మరణించింది. ఆమె జ్ఞాపకార్థం పత్రిక ముఖపత్రం మీద...

**"పూప ప్రాయమునందు యీ భువిని విడిచి**
**స్వర్గగతయైన తన తల్లి; షబ్నవీసు**
**జానకీబాయి స్మారక శాసనముగ**
**నీలగిరి పత్రికాపుత్రి నెగడుగాత."**

అను ఈ పద్యాన్ని ప్రచురించేవారు. ఆమె జ్ఞాపకార్థం దేశాభివృద్ధి, భాషాభివృద్ధేకాక ఆమె ఆత్మశాంతికై నీలగిరి పత్రికను నడిపాడు. జానకీబాయి భర్తకు అన్నివిషయాలలో సహకరిస్తూ ప్రోత్సాహాన్నిచ్చి తోడునీడగా నిలిచిన ఆదర్శ గృహిణి. స్త్రీకి విద్యలేని రోజుల్లో గ్రంథాలు చదివి ధర్మం నీతిని గ్రహించి ఆచరించిన సద్గుణశీలి. షబ్నవీసు వెంకటరామనరసింహారావు మిత్రులైన శేషాద్రి రమణకవులు జానకీబాయి మరణానికి తపించి తమ మిత్రుల ఆవేదన తమ ఆవేదనగా భావించి, తమను ఆదరించిన ఆమె జీవితాన్ని స్మృతి కావ్యరూపంగా "ఉదయలక్ష్మి" పేర మలిచి ఆమె చరిత్రను లోకోత్తరం చేశారు. ఆమె కార్యాచరణను గూర్చి తెలుపుతూ...

**సీ॥ "సంఘ సంస్కరణమ్ము సలుప నెంచును గాని**
**విగ్రహారాధన విముఖ గాదు**
**విధవా జనోద్వాహ విధికియ్యగొను గాని**
**ప్రౌఢ వివాహ తత్పరత లేదు**
**స్త్రీవిద్యకై కృషి చేయుచుండును గాని**
**స్త్రీ స్వతంత్రమున కాశింపబోదు**
**భర్త కేలూతతో పనులు తీర్చునుగాని**
**స్వచ్ఛంద మతితోడ సాగిరాదు**

తల్లిగా తండ్రిగా పతి తలంచుగాని
శూన్యవాదంబునకు మదిజొచ్చనీదు
జానకీబాయి సౌజన్య సౌహృదంబు
లుభయ వంశంబులకు కీర్తినొసగసాగె"

ఎనిమిది సంవత్సరములు మాత్రమే భర్తతో సంసారము చేసి సంతానము లేకుండానే మరణించింది. చివరి రోజులలో కూడా భర్త నిర్వహించే కార్యక్రమాలకు బాసటగా నిలిచింది.

సీ॥ గ్రంథాలయంబు గల్పించి యాంధ్ర భా
షాసేవ గావించు సమయమందు
ముద్రణాలయమును పురమున స్థాపింప
తలచి యత్నించిన తరుణమందు
సంఘసేవకు నాంధ్ర సాస్కారిణీ గ్రంథ
మాలను నిల్పిన వేళయందు
పూర్వ మందిరము నపూర్వ మందిరముగా
నిర్మింపనెంచిన నిమిషమందు
నీలగిరి పత్రికా రత్న నిర్వహణము
మొదలు పెట్ట దలంచిన యదను నందు
పతికి బాసటయై కార్యభారమూనె
జానకీబాయి కేసతి సాటివచ్చు"

నీలగిరి పత్రికకు శ్రీ వేంకట రామనరసింహారావే సంపాదకులు. నీలగిరి పత్రిక ప్రథమ సంపాదకీయంగా ఈమె మరణాన్ని గూర్చే రాయబడింది. దాదాపు అయిదు సంవత్సరాలు నీలగిరి పత్రికను నిర్వహించాడు. నీలగిరి పత్రిక వెలువడిన నాలుగో రోజుననే ఒద్దిరాజు సోదరులు వరంగల్ జిల్లా ఇనుగుర్తి నుండి "తెనుగు" పత్రికను ప్రారంభించారు. ఈ రెండు పత్రికలు ఒకే సారి ప్రారంభమయి ఒకేసారి నిలిపివేయబడ్డాయి.

నీలగిరి పత్రికలో నిజాం దేశ వార్తలు, నీలగిరి గ్రంథాలయాలు, నవలా ప్రపంచం, తాళపత్ర గ్రంథాలు, వృత్తాంతములు, పుక్కిటి పురాణాలు మొ॥గు శీర్షికలు ఉండేవి. షబ్నవీసు వెంకటరామనరసింహారావు వ్రాసే సంపాదకీయాలు ఆనాటి రాజకీయ, సాంఘిక, సాహిత్య, సంగీత, శిల్ప కళలకు సంబంధించిన అనేకవిషయాలను ప్రచురించేవారు. ఈ నీలగిరి పత్రిక కొన్ని ప్రతులు నాంపల్లి లోని వేమన గ్రంథాలయంలో మాత్రమే నేటికీ చూడవచ్చు. ఈ పత్రికలో బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, శేషభట్టరు రామానుజాచార్యులు, శేషాద్రి రమణకవులు, గవ్వా అమృతరెడ్డి సోదరులు మొ॥న వారి రచనలు ప్రచురించేవారు. శేషభట్టరు వేంకటరామానుజాచార్యులు రచించిన "ఆంధ్రనామ సంగ్రహం" లకు పేరడీ పద్యాలు నీలగిరి పత్రికలో ప్రచురించ బడ్డాయి. కె. రాములు "బుద్ధుని సందేశం" అనే పేరుతో ఒక శీర్షిక నిర్వహించేవారు. ఆంధ్రప్రాంతం నుండి తెలంగాణాలో అడుగు పెట్టిన శేషాద్రి రమణకవులను శ్రీ రామనరసింహారావు ఆదరించి నల్లగొండలో వీరి అవధానాన్ని ఏర్పాటు చేసి ఆర్థికంగా, తోడ్పాటును అందించారు. ఆ మైత్రి నరసింహారావు మరణం వరకు కొనసాగి నీలగిరి పత్రికలో అనేక వ్యాసాలను, పద్యాలను రచించారు.

22 ఫిబ్రవరి, 1925న ఆంధ్రగ్రంథాలయ మొదటి మహాసభ మధిరలో పింగళి వెంకటరామారెడ్డి అధ్యక్షతన జరిగింది. దానిలో నీలగిరి గ్రంథాలయం తరపున షబ్నవీసు వెంకటరామనరసింహారావు కూడా పాల్గొన్నారు.

జానకీబాయి మరణం తరువాత శ్రీ రామనరసింహారావు బరంపురంలో లక్ష్మిబాయిని వివాహం చేసుకున్నారు. వారికి కూడ సంతానం కలుగలేదు. వేంకటనరసింహారావు ఈ పత్రికా నిర్వహణ సందర్భంగానే అనారోగ్యంపాలై 18-10-1929న మరణించాడు. వీరి మరణం తెలంగాణలో జరిగిన ఆంధ్రోద్యమానికి, సాహితీ సాంస్కృతోద్యమాలకు తీరని లోటు.

నరసింహారావు మరణం తరువాత ఆయన భార్య పులిజాల వేంకటరంగారావు గారి పెద్దకుమారుడు మనోహరరావును దత్తతగా తిరుపతి దేవస్థానంలో తీసుకున్నారు. ఆ దత్తతను న్యాయశాస్త్ర ప్రకారం నిజాం రాష్ట్రంలో అనుమతి తీసుకున్నారు. దత్తత విషయమై తరువాత అభిప్రాయ బేధాలు ఏర్పడి పులిజాల వేంకటరంగారావు, లక్ష్మిబాయి రాజీపడ్డారు. మనోహరరావు కూడా 24 అక్టోబరు, 1947లో మరణించాడు.

నల్లగొండ జిల్లా సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి, సాహితీ ప్రచారానికి, సంఘసంస్కరణకు శ్రీకారం చుట్టిన షబ్నవీసు వెంకటరామనరసింహారావు జీవితం నేటికీ స్ఫూర్తిదాయకం.

"ఆంధ్ర సాహిత్య విభవ గీతాళినెల్ల
నీలగిరి వీణపైన వినిపించినావు
నాతి ఘోషల భేరీ నినాదగళము
విప్పి గర్జించితివి షబ్నవీసు ఘనుడ!"

Statement about ownership and other particulars of **MISIMI**

## FORM IV (SEE RULE - 8)

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 5. | Editor's Name | : | CHENNURU ANJANEYA REDDY |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**ALAPATI BAPANNA**
Publisher

Date : March 31, 2012.

## ప్రేలాపన

"**నా**టకాలంకార సాహిత్యము మా వంటి శిష్టాచార విపన్నులకు దగదని మానివేసినంత మాత్రము చేత నాటకమేదో యెఱుగని వాడనగుదునా? పురుషులు, స్త్రీలు నొక పాకలో చేరి రాత్రివేళ జూచువారి యెదుట గ్రంథమెప్పుడు వినిపించి తెయితక్కలాడుదురో యది నాటకము కంటె నెన్నడు భిన్నము కాదు. నాటకములో గాయకులుందురు, నటకులుందురు. నాటక మెప్పడో యొక కవి చేయవలసినది గదా! కవులు, నటకులు, గాయకులు, పంక్తి బాహ్యాలు. వారి ముఖము చూచుసరికి సచేతిస్నాన మాచరింపవలయును. కవి యెప్పుడు భ్రష్టుడైనాడో యతని గ్రంథమప్పడే బహిష్కార యోగ్యమన్నమాట. ఇప్పడింకను దెలుగు మీఱుటచేత నంత పట్టుదల లేదుగాని, మా నాన్నగారి చిన్నతనములో గవి యెవ్వడైన గ్రామము లోనికి వచ్చుసరికి వెట్టి కుక్కను గొట్టినట్లు గొట్టువారట!"

**– సోమావధానులు,**

(కంఠాభరణము – పానుగంటి లక్ష్మీనరసింహారావు)

# అగాధం

(DE PROFUNDIS)

– ఆస్కార్ వైల్డ్

– అశ్విని.కె

*ఈ ప్రపంచం ఎంతో మంది అమాయకులను శిక్షించిన దాఖలాలున్నాయి– అది న్యాయవ్యవస్థలోని బలహీనత. కాని నేరస్తులు ఎంతటి వారైనా శిక్షించకుండా వదిలిపెట్టలేదు– అదీ ఆ వ్యవస్థ గొప్పదనమే...*

*సామాన్యునికి, ఒక సాహిత్యకారునికి ఒకే వ్యవస్థలోని చట్టాలు విధించే శిక్షలో వ్యత్యాసం వుండకపోవచ్చు. ప్రపంచంలో ఏ వ్యవస్థలోనైనా చట్టం ముందు ఎవరైనా చేతులుకట్టుకుని నిలబడాల్సిందే! కాని ఒక మేధావి రచయిత లోనయ్యే సంఘర్షణలోనించి ఎంతటి సాహిత్యమైనా వెలువడుతుంది. ఆ దుఃఖసంద్రపు అగాధంలోని చీకట్లు చీల్చుకొని వెలువడే వెలుగు రేఖలు కేవలం రచయితే చూడగలడు. అవమాన భారాన్ని మోస్తూనే తన అంతరంగాన్ని పునీతం చేసుకొనే ప్రయత్నమే తన రచనా వ్యాసంగం.*

*దుఃఖపు లోయ లోతుల్లో ఎంత చీకటి వుంటుందో, ఆ గాఢాంధకారంలో అక్కడక్కడా వెలిగే మిణుగురుల కాంతిని చూడగలిగిన ఆస్కార్ వైల్డ్ "డి ప్రోఫండిస్" రచనలో ఎంతటి భావ సాంద్రత వున్నదో తెలుస్తుంది, చదవండి.*

* * *

ఆస్కార్ వైల్డ్ ఏప్రిల్ ఒకటవ తేదీన; 1897లో, రీడింగ్ కారాగారం నుంచి రాబర్ట్ రాస్‌కు రాసిన ఉత్తరం:–

**ప్రియమైన రాబీ,**

ఈ లేఖతో పాటు నీకు ఒక రాతప్రతిని పంపుతున్నాను. అది జాగ్రత్తగా చేరుతుందని ఆశిస్తూ.

ఆ రచనని శ్రద్ధగా నకలు చేయించు. ఇలా అడగటానికి చాలా కారణాలే ఉన్నాయి. మనకున్న దానితోనే సరిపుచ్చుకోవాలికదా.

ఒకవేళ నేను మరణిస్తే నా సాహిత్య సంపదకు నీవే అధికారివి కావాలని ఆశిస్తున్నాను. అన్నీ నీ అధీనంలోనే వుండాలని కోరుతున్నాను. నాకు న్యాయపరమైన అధికారం రాగానే వీలునామా రాస్తాను. నా భార్యకు నా రాతలు అర్థంకావు. అంతేకాదు, ఆమె అంత ఆసక్తి కూడా చూపదు. సిరిల్ చిన్నపిల్ల. అందువల్ల నీకే ఈ బాధ్యత అప్పగించాలి, మిగతా ఎన్నో విషయాలమాదిరిగానే!

నా రచనలు– పుస్తకాలు, వీటి అమ్మకాల ద్వారా వచ్చే సొమ్మును వివియన్, సిరిల్ ఖాతాలకే జమ చేయించు. నా సాహిత్యం, ఇతర రచనలు నీ అధీనంలో వున్నపుడు, ఈ రచనా నీ చెంతనే వుండవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, నా అసాధారణ ప్రవర్తనకు వివరణ దీనిలోనే ఉంది. నీవు ఈ ఉత్తరం చదివినపుడు నామానసిక సంఘర్షణ – ఇతరులు అపార్థం చేసుకున్న నా వ్యక్తిగత జీవితం– వికృతమైన ఆధిపత్యంతో పాటు అంతులేని మూర్ఖత్వం– ఇవన్నీ, వీటన్నిటికీ కారణాలు, వివరణలు తెలుసుకోవలసిన



అవసరంవుంది. అలాగే వీటిని ప్రపంచానికి తెలియ జేయవలసిన బాధ్యతా వుంది. కాని ఆ పని నేను జీవించి వుండగా చేయకు. ఎందుకంటే ఈ సమాజం నన్ను ఇరికించిన బాధాకరమైన చట్రంలోనే నేను కూర్చుండి పోను; నాకు వారసత్వంగా వచ్చిన కీర్తి ప్రతిష్టలను శాశ్వతంగా మలిన పరుస్తూ ఇక్కడే వుండిపోను. ఆ మాలిన్యాన్ని వదిలించు కోవలసిన అవసరం వుంది. నన్ను నేను సమర్థించు కోవటం నా వుద్దేశ్యం కాదు. కాని దీనికి పూర్తి వివరణ ఇవ్వవలసిన బాధ్యత నాదే. అంతేకాదు, ఈ జైలుగదిలో నా మానసికస్థితి లోనయిన ఎన్నో అనుభూతులను తెలియజెప్పాలి. నా మేధోపరమైన పరిణామాన్ని, జీవితం పట్ల నా దృక్పథాన్ని పూర్తిగా వివరించాలి. నేను బైటకు వచ్చినపుడు, ఏ విధంగా ఈ ప్రపంచాన్ని ఎదుర్కోవాలి! అంతేకాదు...

ఒక విధంగా ఇది నాకు తెలిసిందే- అదే నేను విడులయ్యే రోజున నా ప్రయాణం ఒక కారాగారం నుంచి మరో దానిలోకే-

అవును - ఈ ప్రపంచం అంతా ఇపుడు నేనున్న ఈ జైలు గది కంటే పెద్దది కాదని అనిసిస్తోంది. అదీకూడా నన్ను భయభ్రాంతుణ్ణి చేసేదే అని!

అయినా నా నమ్మకం- మొదట్లో దేవుడు ప్రతివానికి- ఎవరి ప్రపంచం వాడికి సృష్టించాడని- మనలోనే వున్న ఆ లోకంలో ఎలా బ్రతకాలో ప్రయత్నించాలి.

నేను ఈ ఉత్తరంలో రాయబోయే ఆ విషయాలన్ని నిన్నంతగా నొప్పించక పోవచ్చు - ఇతరుల్లాగా - నీకు నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదుగా-

నిరంతంర ప్రవహించే ఆలోచనలతో పాటు - మన ఉద్వేగాలన్నీ ఎంత అస్థిరమైనవిగా మారిపోతుంటాయో- కాని అవి సృజన ప్రక్రియ ద్వారా ఒక గమ్యం వైపు పయనించగలవని అనిపిస్తుంది...

వేదన అనేది వర్తమాన కాలంగానే అనుకుంటాను- దాన్ని ఋతువులుగా విడదీయలేం. మనం చెయ్య గలిగిందల్లా ఆవేదన సాంద్రతను గుర్తుంచుకో గలగటమే- బాధ పునరావృత తీవ్రతను అక్షరబద్ధం చేయటమే! మనతో కాలం ముందుకువెళ్లదు. అది ఆవృత్తమే. అది ఒక దుఃఖకేంద్రం చుట్టు పరిభ్రమిస్తుంది!

ఈ జీవితం స్తంభించినపుడు అందులోని సంఘటనలన్ని ఒక పద్ధతిలో మార్పులేకుండ ఉండిపోతాయి. అలాగే మన దినచర్యలో కూడా. ఎటొచ్చీ మోకాళ్ళపైవాలి మొక్కు తుంటాము.

ఇదంతా ఒక ఇనపచట్రంలో బిగిసిపోయిన చట్టం! కదలని గుణం ప్రతిక్షణాన్ని నరకప్రాయం చేస్తుంటుంది. బాహిర శక్తులకు దీని అంతస్సారం ఒక అనంతమైన మార్పేనని చాలా వివరంగా తెలియవస్తుంది.

ఎటొచ్చీ శీతగాలులు-శశిరవనాలు- వెచ్చని ఎండపొడలూ జైలులో మనకు తెలియవు కదా-

మనకు ఒకటే ఋతువు! అది దుఃఖ ఋతువు! మన జీవితంలో నుంచి సూర్య చంద్రులు నిష్క్రమించి నట్లే- బయట వెలుతురు బంగారు కాంతులీను తుంటే, ఈ జైలుగది కటకటాల కిటికీ అద్దపు మరకల్లోంచి తొంగి చేసేది నైరాశ్యపు నీడలే !

ఈ బందిఖానాలో ఎప్పుడూ సంధి చీకటే- గుండెల్లో ముసురే! ఆలోచనలన్నీ స్తంభించినట్లు ఇక్కడ కాలం కూడా కదలదు కదా. నువ్వు ఏనాడో మరిచి పోయిన విషయం- ఇప్పుడు నన్ను కలవరపెడుతూనే వుంది. ఇది గుర్తు పెట్టుకుంటే చాలు- నేను ఈ ఉత్తరం ఈ విధంగా ఎందుకు రాస్తున్నారో గ్రహించగలవు...

* * *

ఈ ఉత్తరం నువ్వు టైపు చేయించు. కాని రాతప్రతిని ఎవరిపరం చేయకు. అది నీ అధీనంలోనే ఉండాలి. శ్రీమతి మార్బల్‌ని ఒక టైపిస్టును పంపమని అడిగితే మంచిది. ఎందుకంటే ఈ విషయంలో ఆడవాళ్ళను నమ్మవచ్చు. వాళ్లు ముఖ్యమైన విషయాలేమీ గుర్తుంచుకోరు. అంతేకాదు. టైప్ మిషన్ జాగ్రత్తగా వాడితే, దాని శబ్దం మన ఇంట్లో ఆడవాళ్లు నేర్చుకునే హార్మోనియం కంటే ఎక్కువ ఇబ్బంది పెట్టదు!

మంచి కాగితం వాడండి. ఎక్కువ మార్జిన్ ఉంచండి. తప్పొప్పులు దిద్దు కోవాలి కదా!

ఈ తతంగం అంతా హారన్‌టన్ వీధి భవనంలో చేస్తే- ఆ టైపిస్ట్‌కు తలుపు సందులో నుంచి భోజనం పంపండి. అదే పోప్‌ను ఎన్నుకునే ముందు కార్డినల్స్‌కు ఆహారం

ఇచ్చినట్లు: అలాగే టైపింగ్ అయి పోయిన తర్వాత బాల్కనీలోకి వచ్చి ఆమె 'Habet Mundus Epistolam' అని ప్రపంచానికి చెప్పాలికదా! నిజాకిది Encyclical letter!

నిజానికి ఈ జైలు జీవితం ఎవరికైనా బయట వ్యక్తుల్ని, వ్యవహారాల్ని నిజాయితీగా పరిశీలించటానికి అవకాశం కల్పిస్తుంది.

వారంతా జీవనక్రమంలో పరిభ్రమిస్తూ ఒక అసత్య ప్రపంచానికి కారణభూతులవుతున్నారు. ఇక్కడ మేము బందీలుగా వున్నా చూడగలం- తెలుకోగలం. ఈ ఉత్తరం రాస్తున్నది ఒక వేళ మన సంకుచిత సమూహాలకు ఏమయినా మంచి చేయగలదా అని ఆశతో కాదు - నాకు మాత్రం చాలా మేలుజరుగుతుంది. 'నా మనసులోని ప్రమాదకరమైన భారాన్ని వదిలించు కున్నాను' - ఇది మనం ఒకసారి కష్టాలనుంచి నుంచి రక్షించాలనుకున్న కవి వాక్యాలే!

కళాకారునికి భావవ్యక్తీకరణే జీవిత పరమావధి అని నేను నీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కేవలం ఒక మాట (వ్యక్తీకరణ)తోనే బ్రతుకుతాం.

జైలు అధికారికి ఎన్నో విధాల ఋణపడి వున్నాను. ముఖ్యంగా, నాకు ఎంతైనా రాసుకునే అవకాశం కల్పించినందుకు!

రెండు సంవత్సరాలుగా నాలో ఒక చేదునిజం పేరుకు పోయింది. ఆ బరువు ఇప్పుడు దించుకుని, వదిలించు కుంటున్నాను.

ఈ జైలుగోడ ఆవలివైపు కొన్ని చెట్లు మసకబారిపోయి వున్నాయి. వాటి కొమ్మలు ఇప్పుడే పూతకు వచ్చి, పచ్చని పిందెలుగా విచ్చు కుంటున్నాయి. నాకు తెలుసు అవి తమ వునికిని చాటు కుంటున్నాయని.

* * *

వారం తరవాత ఇక్కడకు మార్చారు. మూడునెలలుగా, ఇక్కడే వున్నాను. ఇంతలో అమ్మ చనిపోయింది. ఆమెను ఎంతగా ప్రేమించాను, ఎంతగా గౌరవించానో ఎవ్వరికీ తెలియదు. ఆమె లేని లోటు నేను భరించలేనిది. కాని ఒకప్పుడు భాషమీద అధికారం చలాయించిన వాణ్ణి - ఇప్పుడు నా బాధను నా అవమానాన్ని చెప్పుకునేందుకు నాకు మాటలే కరవయినాయి.

నా తలిదండ్రులు నాకు వారసత్వంగా ప్రసాదించిన పేరు ప్రఖ్యాతులు, కేవలం సాహిత్యం, కళ, పురాతత్వం- విజ్ఞానశాస్త్రం, వాటిలోనే కాక, నా దేశ చరిత్రలో, దాని పరిణామ క్రమంలో కూడా వుంది. నేను దానికి మాయనిమచ్చ తెచ్చాను. అవమాన పరిచాను. నీచాతినీచంగా దిగజార్చాను. బురదలోకి లాగాను. మూర్ఖులకు అందించాను. పనికిరాని వాళ్ల పాలు చేశాను. నేను పడిన బాధ-ఇంకా అనుభవిస్తున్న వేదన-ఇది కాగితం మీద పెట్ట తగినది కాదు. నా భార్య- ఆమె దయ, కరుణ ఎప్పుడూ నాకందిస్తూనే వుంది. జెనోవా నుంచి-అంత జబ్బులో కూడా వచ్చి-చెప్పుకోలేని అవమానం, తిరిగి తెచ్చుకోలేని గౌరవం, మా జీవితాలలో ఎంత నష్టం జరిగిందో వణికే పెదవులతో చెప్పింది.

ఓదార్పు సందేశాలు చేరుతూనే వున్నాయి. నా జీవితం లోకి చొరపడిన దుఃఖానికి సాంత్వన వచనాలు, తెలిసిన వాళ్ల దగ్గర్నుంచి, పరిచయం లేని వారినుంచి అందుతూనే వున్నాయి.

అవును, మూడు నెలలు గడిచి పోయాయి. నాగది బైట తగిలించిన అట్టమీద నా రోజువారీ ప్రవర్తన, నేను చెయ్యవలసిన కాయకష్టం రాసిపెడుతూనే వున్నారు. అదే గుర్తుచేస్తోంది. ఇది 'మే' మాసమని.

సంపద, సౌఖ్యం, విజయాలు ఇవన్నీ ఒక ముతక తాను ముక్కలే-కాని దుఃఖం మాత్రం అన్నింటి కంటే సున్నితమైనది.

బాధకు వణకని కణం లేదు భావ ప్రపంచంలో!

మనం కంటితో చూడగలిగిన, పండిపోయి రాలిపోతున్న ఆకుల కదలికలను తెలిపే గాలివాలు కూడా, కాస్త మోటు గానే వుంటుంది- కాని ప్రేమతో ఓదార్చే ఒక స్పర్శ - గాయాన్ని కరుణతో-బాధించ కుండానే-మళ్లీ రేపుతుంది.

ఈ జీవితం బాధతోనే పునీతమవుతుంది. ఏదో ఒక రోజు మనం దీనిని గుర్తించగలం- అప్పటి వరకు జీవితమంటే తెలియనట్లే...

* * *

నన్ను జైలుగది నుంచి దివాళాకోర్టుకు బేడీలు వేసి తీసుకొస్తున్నపుడు- అక్కడి కారాగారపు కారిడారులో చాలాసేపు - ఆ జనసమూహం ముందు నిలబడివున్నాము. వారి నిశ్శబ్దపు గౌరవసూచన ఎంత మధురంగా వుంది!

అందులో ఒక వ్యక్తి తన టోపీ తీసి నాకు అభివాదం చేశాడు. నేను చేతికి బేడీలతో కనీసం తల కూడ ఎత్తుకో లేక పోయాను.



ఇంతకంటే చిన్న కార్యాలకే చాల మంది స్వర్గద్వారాలు చేరారుకదా. అదిగో అలాంటి ఉద్వేగం, ప్రేమకోసమే కదా, సాధువులంతా నేలకు వాలి పేదల పాదాలు కడుగుతారు – కుష్ఠురోగుల చెక్కిళ్లు ముద్దు పెట్టుకుంటారు!

ఇప్పటి వరకు అతని చర్యకు ప్రతిస్పందన కూడా చూపలేకపోయాను. కనీసం అతని అభివాదాన్ని గమనించానని అతనికి తెలుసో తెలియదోగదా. కృతజ్ఞతలు తెలియజేయటానికి అతని అభిమానం అమూల్యమైనది కదా.

నా గుండెల్లో పదిలంగా, అపురూపంగా దాచు కుంటున్నాను. నేనెప్పటికీ తిరిగి చెల్లించలేని ఋణం ఇది. ఈ విషయం సంతోషంగా అంగీకరిస్తాను– కన్నీళ్ళతో!

జ్ఞానం నాకు ఉపయోగపడనపుడు, తత్వం ఎండిపోయి నపుడు, నాకు సాంత్వన చేకూర్చవలసిన పదాలు– సామెతలు దుమ్ము–ధూళి లాగా నా నోటికి అడ్డుపడు తున్నపుడు– ఇదిగో, ఇతని ఈ చిన్న – మధురమైన అభివాదం నన్ను కరుణతో ముంచెత్తి వేసింది. ఎడారిలాంటి నా గుండెలో గులాబీలు పూయించింది. క్షతగాత్రులు, వికలాంగులతో పాటు ధైర్యంగా నిలబడేట్లు చేసింది.

ఏదో పైపై తీపి పలుకులతో గాక, అర్థం చేసుకునే మనసుంటే, ఇదంతా నాకు ఎందుకు ముఖ్యమైనదో తెలుసుకోవచ్చు. ఆ తెలివిడితోనే నాకు దగ్గర కావచ్చు–

పేదవాళ్ళు తెలివిగలవాళ్ళు– దాతృత్వం గలవాళ్ళు. దయగలవాళ్ళు, మనకంటే సున్నిత మనస్కులు. వారి దృష్టిలో జైలుజీవితం, దురదృష్టం! ఒక దుర్ఘటన, ఒక ప్రమాదం. ఎదుటవారి సానుభూతికై ఎదురు చూస్తుంది. జైలుపాలయిన వాడి గురించి మాట్లాడేటప్పుడు అరె – అతనికి ఎంత కష్టం వచ్చింది. అని అంటారు. అందులో ఎంతో ప్రేమ సానుభూతి నిండి వుంటుంది. మనలాంటి వారి విషయంలో అది మరో విధంగా వుంటుంది. మనల్ని సాటివారు జైలుపక్షి అంటారు. నాలాంటి వాడికి గాలి, వెలుతురు కూడ తగలవు. మన వునికే ఇతరులకు ఇబ్బంది గలిగిస్తుంది. మనం కనపడితే ఆహ్వానం ఉండదు. మళ్ళీ వెన్నెల వెలుగులు చూసే అవకాశం మనకు లేదు. మన సంతానమే మనకు దూరమయ్యారు. మనవాళ్ళంతా వుండగానే, గాయపడిన హృదయాలకు లేపనం, ఆవేదన పడే ఆత్మకు సాంత్వన కరవయి పోయిందికదా–

నన్ను నేను నాశనం చేసుకున్నాను. ఎంతగొప్ప వాడయినా, అనామకుడైనా తనని తనే నాశనం చేసు కుంటాడు. ఇప్పటి నా దయనీయ స్థితికి, నా నిర్దయే కారణం. అవును ఈ ప్రపంచం నన్ను ధ్వంసం చేసింది. అంతకంటే ఎక్కువగా నన్ను నేను విధ్వంస పరుచుకున్నాను.

నా జీవిత కాలంలోనే నాగరకతకు, కళాప్రపంచానికి నేనొక చిహ్నంలా నిలిచాను. నా తొలియౌవనపు రోజులతోనే నేనీ విషయం గుర్తించాను. నా చుట్టూ వున్న ప్రపంచంతో ఈ నిజాన్ని అంగీకరింప జేశాను కూడా. చరిత్రలో చాలా కొద్దిమందికి మాత్రమే ఈ అవకాశం వుంటుంది. ఈ అరుదైన గుర్తింపు లభిస్తుంది. కాని విమర్శకులు, చరిత్రకారులు ఈ సత్యాన్ని గ్రహించగలరు– ఎప్పుడు? ఆ వ్యక్తి గతించిన తర్వాతే. నా విషయంలో అది భిన్నం– ఈ ప్రత్యేకతను నేను గ్రహించగలిగాను. అంతే కాదు. ఇతరులూ గుర్తించే విధంగా చేయగలిగాను. బైరన్ (Byron) గుర్తింపు గల వ్యక్తి. కాని తన కాలానికి సంబంధించిన ఆసక్తి అప్పటికే సన్నగిల్లి పోయింది. నా విషయంలో ఈ ప్రత్యేకత ఎంతో గౌరవాన్ని శాశ్వతత్వాన్ని పొంద గలిగి అంతటా వ్యాపించింది!

* * *

దేవతలు నాకన్నీ ఇచ్చారు. నేను విపరీతపుటాకర్షణలకు లోనై అర్థంపర్థం లేని లౌకిక సుఖాలలో విషయలోలత్వంలో మునిగిపోయాను. వింత వింత వేషధారణలతో రూపలాలసతో ఆనందించాను. నా చుట్టూ అలగా రీతులను–పనికిరాని

వాళ్ళను తిప్పు కున్నాను. నా మేథో సంపత్తిని వృథాగా ఖర్చు చేశాను. నా యౌవనాన్ని ఆవిరి చేసుకోవటం నాకు వింత ఆనందాన్ని యిచ్చేది.

ఈ ప్రక్రియలో ఉన్నత శిఖరాల నుంచి ఆగాధాలలోకి జారిపోయాను. నా ఆలోచనలలోని విరుద్ధభావాలు, నా ఆసక్తిని వంకర దారుల్లోకి నడిపించాయి.

కోరిక చివరకు దుఃఖాన్ని మిగులుస్తుంది. నా ఆనందం కోసం ఇతరులను నిర్లక్ష్యం చేశాను. నా కెక్కడ తృప్తి కలిగితే అదే ఆనందమనుకున్నాను. అలాగే ప్రయాణించాను.

ఈ ప్రయాణంలో ప్రతి చిన్న కార్యం, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుందన్న సంగతి మరచిపోయాను. అందుకని–రహస్యంగా చేసిన చిన్నసంగతికూడా ఏదో ఒక రోజున బహిరంగపరచక తప్పదని మరిచిపోయాను. నన్నునేను నియంత్రించుకోవటం మానివేశాను. నా మనస్సును అదుపులో వుంచలేక పోయాను. అదీ తెలియకుండా జరిగిపోయింది. భౌతిక సుఖాల సుడిగుండంలో పడిపోయాను. చివరికి భయంకరమైన అవమానంలో కూరుకు పోయాను.

ఇక ఇప్పుడు నాకు మిగిలింది– అధోగతి. తలవంపులే. ఇప్పటికి రెండేళ్ళుగా ఈ జైలుగదిలో పడివున్నాను. నా ప్రవర్తనలో అంతులేని– వికారమైన నిరాశ పొడసూపుతోంది. దిక్కుమాలిన విచారం దయనీయంగా దర్శనమిస్తోంది.

భయంకరమైన ఆగ్రహం, అశక్తి వల్లనే దహించి వేస్తోంది. చేదు అనుభవం, అలక్ష్యం, తిరస్కారం, బిగ్గరగా ఏడ్వాలనే ఆరాటం, పైకి చెప్పుకోలేని దురవస్థ– దౌర్భాగ్యం, అన్ని విధాలయిన బాధలు, వికారాలు, వేదనలు తెరలు తెరలుగా తరలి పోయాయి.



రీడింగ్ కారాగారం

"ఆవేదన అంధకారమయం–నిగూఢమైనది, అనంత మైనది కూడా" అని వర్డ్స్‌వర్త్ అన్న మాటల అర్థం నాకు బాగా తెలియవచ్చింది!

కాని నా కష్టాలకంతంలేదని అనుకున్నపుడు– ఆ భావనలో ఒక సాంత్వన, పొందాను. ఇవన్నీ కేవలం అర్థం లేకుండా భరించానా? ఇప్పుడనిపిస్తోంది– నాలో ఎక్కడో దాగిన లోగొంతు చెప్పటం వినిపిస్తోంది. ఈ ప్రపంచంలో అర్థం లేనిది ఏదీ లేదని. అందులోనూ 'బాధ'–

అలా నాలోపల దాగినది– ఒక పెన్నిధిలాగా నిక్షిప్తమైనది– **నా అవమానమే.** చివరికి మిగిలింది. నాలో మిగిలిపోయింది– అదే గొప్పది. బహుశా అదే నేను కనుగొన్నది. మరొక సరికొత్త మర్మం తెలియవచ్చింది. తెలుసుకోగలిగాను. ఇది సరైన సమయంలోనే బయటపడింది. ఎవరైనా తెచ్చినా తీసివేసే వాడినే, కాని అది నేను కనుగొన్నది కాబట్టి పోగొట్టుకోను. అవును తప్పనిసరిగా కాపాడుకోవాలి. ఇపుడు దానిలోనే జీవిత రహస్యాలు దాగివున్నాయి. కొత్త జీవితం చిగురిస్తుంది. Vita Nuova నాకు!

కాని ఎన్నో విషయాలలో, సంఘటనలలో అది చాలా వింతయినది. దాన్ని సాధించలేము. మనకున్నవన్నీ సమర్పించుకుంటేనే గాని అది లభించదు. అన్నీ పోయిన నాడే–దాని ఉనికిని గుర్తించగలం!! ఇప్పుడు నేను తెలుసుకోగలిగాను. కాబట్టి నేను చేయవలసిన కర్తవ్యం తెలియవస్తోంది.

ఇవన్నీ చెప్పేటప్పుడు–నన్ను ఏ బహిఃశక్తులు నియంత్రిచటంలేదు. ప్రోద్బలించనూలేదు. అవేమీ నేను అంగీకరించను.

ఇదివరకటికంటే కూడా ఇప్పుడు నా వ్యక్తిత్వం ప్రత్యేకత సంతరించుకుంది. నా అంతరంగపు ప్రబోధాన్ని మించి విలువైనది ఏమీ లేదు. ఇప్పుడు నన్ను నేను అర్థం చేసు కుంటున్నాను. ఇప్పటికిదే నా కర్తవ్యం. నేను చేయవలసిన మొట్టమొదటి పని– ఈ ప్రపంచం అంటే ద్వేషభావాన్ని వదిలించుకోవటం!

* * *

ఇప్పుడు నాకు గూడు లేదు. కూడు లేదు. కాని ఇంతకంటే విషాదకరమైన విషయాలెన్నో ప్రపంచంలో

వున్నాయి. ఇక్కడ నుంచి బైటకు అడుగుపెట్టేందుకు సిద్ధంగానే వున్నాను. నాలో ఇప్పుడు ఏ ద్వేషభావము లేదు. ఇంత తిండి కోసం తిరిపెం ఎత్తుకోవటానికి గడపగడపకూ తిరగటానికీ వెనుకాడను. ఉన్న వాళ్ళు ఏమీ ఇవ్వకపోయినా, పేదలు ఇచ్చిందే తీసుకుంటాను. అవును ధనికులదెప్పుడూ లోభితనమే. నా మనసులో ప్రేమ వున్నంతకాలం నేను ఎక్కడ విశ్రమించినా, శీతగాలులు చలి, వేసవి విసుగు ఇవేమీ నన్ను బాధ పెట్టలేవు. ఇప్పటి నా మానసిక స్థితిలో భౌతిక (లౌకిక) సుఖాలు ముఖ్యంగా కాదనే అన్పిస్తోంది!

నీకు తెలుసుగా, నా అస్తిత్వపు సాంద్రత ఎంత ప్రగాఢమైందో. అవును ఈ స్థితికి చేరటానికి నేను చాలా చాలా దూరం ప్రయాణం చేశాను. నేను నడిచిన దారి ఎంత కర్కశమైనది! నా అడుగులు పడిన చోటల్లా రక్కిస పొదలే మరి!

అయినా రోడ్ల మీద అడుక్కోవటం నా నైజం కాదని నీకు తెలుసు. ఎప్పుడైనా, మంచులో తడిసిన పచ్చిక మీద పడుకుంటే–అది చందమామకు ప్రేమలేఖ రాయటానికే.

ఇక్కడ నుంచి బైట పడినపుడు– రాబీ, ఆ మందపాటి ఇనుపతలుపుల కావైపు నాకోసం ఎదురు చూస్తుంటాడు. అతని వాత్సల్యానికి గుర్తుగా ఇంకా మిగతా వారి అభిమానానికి మూర్తిగా నిలబడే ఉంటాడు!

ఇంకా పద్ధెనిమిది నెలలు బ్రతకాలి. తరువాత నేను మంచి పుస్తకాలు రాయలేక పోవచ్చు–కాని మంచి పుస్తకాలు చదువుకోవచ్చు కదా–అంతకంటే ఆనందం ఏముంటుంది?

ఆ తర్వాత నా సృజనాశక్తిని మళ్ళీ వెలిగించుకోవాలి. కాని నాకు ఒక్క స్నేహితుడు లేడు. ఒక్క ఇంటి తలుపూ నాకోసం తెరచిలేదు. ఎవరి దయాదాక్షిణ్యం మీద ఆధారపడాలి? ఈ తిరస్కారం–కాఠిన్యం–తృణీకరణ నుంచి విడుదలయితే అప్పుడు–ఈ జీవితం ప్రశాంతంగా, ఆ విశ్వాసంతో, బైటకు అడుగుపెట్టి–నూలు దుస్తులు ధరించవచ్చు.

ఇంత సంకటంలోనూ నాకేమీ కష్టం లేదు–నీవు నిజంగా–మనస్ఫూర్తిగా కోరుకుంటే–నీకోసం నీకు కావలసిన వాళ్ళు వేచివుంటారు.

ఇంతటితో నా కర్తవ్యం తీరిపోయిందా? కాని అలా జరిగితే ఎంత బాగుండును–ఇంకా చేయవలసింది ఎంతోవుంది–ఎన్నో ఎత్తైన కొండలు ఎక్కాల్సి–వుంది; ఎన్నో చీకటిలోయలు దాటాల్సి వుంది. ఇదంతా ఒంటరిగానే చేయాలి. ఈ విషయంలో, నైతికత, మతం, వివేకం ఇవేమీ నాకు సహాయపడవు!

నీతిగా వుండటం ఒక్కటే నాకేమీ వుపయోగపడదు. నేను పుట్టుకతోనే మతానికి దూరంగా వున్నాను. అన్నింటికీ వ్యతిరేకంగా, చివరికి చట్టానికి కూడా, వుండి పోయాను. మనం చేసే పని ఏదీ తప్పుకాదనుకుంటే – ఆ కార్యాల ద్వారానే మనల్ని అంచనా వేస్తారు. ఆ విధంగా నేర్చుకోగలిగితే మంచిదే– మతమూ నాకు సహాయకారి కాదు–మరొకరి విశ్వాసం–అదీ మనకు దర్శనమీయనిది, సహాయం ఎలా చేస్తుంది?

నేను స్పర్శ ద్వారానే నమ్మకాన్ని ఇచ్చాను–దాని ద్వారానే నేను చూశాను. నా దేవుళ్ళందరూ– చేతులతో తయారయిన దేవాలయంలోనే వుంటారు. అనుభూతి వృత్తాలలోనే నా మతం నిక్షిప్తమయింది. అక్కడే ఆవిష్కరించబడింది. అదే–అందమైన భూతలస్వర్గంగా కనుగొన్నాను. అంతేకాదు, అక్కడే, భయానకమైన నరకాన్ని చూశాను.

నేను మతం గురించి ఆలోచించినపుడు నమ్మకం లేని వాళ్లకు ఒక పద్ధతిని తెలియ జెప్పాలనుకుంటున్నాను. నాస్తిక సమాహారం అనవచ్చు. వీరికోసం ఖాళీ సిలువ, నమ్మకంలేని పూజారి, కుళ్లిన రొట్టెముక్క, ఖాళీ వైనుగిన్నె! సత్యమయిన వన్నీ మతంలా మారాలి. అలాగే నాస్తికులందరకూ అన్ని రకాల కర్మకాండలన్నీ వుండాలి. వీరి త్యాగమూర్తులు వీరికున్నారు. వీరి సన్యాసులు వీరికున్నారు–వీరూ రోజూ దేవుణ్ణి కీర్తిస్తారు–మనిషికి కనపడకుండా దాగివున్నందుకు!

కాని అది విశ్వాసమైనా, నాస్తికమయినా, అది నాకు భౌతికంకాదు. దాని గుర్తులు నా సృజన కావాలి. ఏదయితే ఆధ్యాత్మకమో, అదే మూర్తి మంతంకావాలి. దాని రహస్యాలు నాలో నేను ఛేదించలేకపోతే, నాకెలా దాన్ని గురించి తెలుస్తుంది? ఇప్పటికీ నాకు తెలియరాకపోతే–ఇక ఎప్పటికీ తెలియదు. జ్ఞానం కూడా నాకు సహాయం చేయలేదు – ఎందుకంటే, ఈ చట్టాలు, చట్రాలు, నన్ను–నాప్రవర్తనను తప్పుపట్టి శిక్షించాయి. ఈ అవ్యవస్థలోనే నాకీ అవస్థ పట్టింది. కాని నేను రాజీపడక తప్పదు. (కళారూపాలలో) కళలో ఏ విధంగా ఒక సందర్భంలో–ఒక విషయం ఆవిష్కృత

మవుతుందో, ఒక వ్యక్తి నైతిక స్వరూపంలోకూడా అంతే-పరిణామక్రమం ఉంటుంది.

ఇంతవరకూ నాకు సంభవించిన సంఘటనలన్నీ మంచిగానే తీసుకోవాలి. ఈ చెక్కమంచం, కంపుగొట్టే రొట్టిముక్క, పీచుతో పేనే తాళ్లరాపిడికి మొద్దుబారిన చేతి వేళ్లు-రోజువారీ నీచమైన చిల్లర పనులతో గడిచిపోయేకాలం; వార్డెన్ వాళ్ల అరుపులు; అవమానకరమైన దుస్తులు; దు:ఖాన్ని దిగమింగే నిశ్శబ్దం; చేతగాని ఒంటిరితనం; లజ్జాకరమైన ఏవగింపు, వీటన్నిటినీ నేను-ఆధ్యాత్మక వస్తువులుగా మార్చుకోవాలి. భ్రష్టమవుతున్న ఈ శారీరక కదిలికలన్నింటినీ ప్రతి అనుభవాన్ని ఆత్మ సంబంధమైన అధ్యయనంగా తీసుకోవాలి!!

ఒక్క విషయం సూటిగా చెప్పాలి. నా జీవితంలో రెండు స్పష్టమైన మలుపులున్నాయి-ఒకటి నాన్న నన్ను ఆక్స్‌ఫర్డ్‌కు పంపించటం! రెండోది-ఈ సామాజికవ్యవస్థ నన్ను జైలుకు పంపటం!!

జైలుకు రావటం గొప్ప విషయంగా నేను చెప్పటం లేదు. అలా అంటే, నన్ను నేను అవమానపరచుకోవటమే. నా చిన్న తనం నుంచీ, నేను ప్రత్యేక రీతిలోనే ప్రవర్తించాను. వ్యతిరేకంగానే నడిచాను. దానితోనే నా జీవితంలో మంచి విషయాలన్నీ విషపూరితాలయినాయి. చెడు సంగతులన్నీ మంచిగా మారాయి-

* * *

ఎవరేమి చెప్పినా, నాతోసహా, దానికి విలువేలేదు. అసలు ముఖ్యమైనది ఇప్పుడు నా ముందున్నది నేను చెయ్యవలసిన- కర్తవ్యం- జరిగిపోయిన రోజుల గుర్తులను- మరచిపోతూ- చెరిపి వేసుకుంటూ - నాలో వాటి ప్రభావాన్ని దిగమింగుకొని - నా అంతర్భాగంగా భయపడకుండా అంగీకరించి ముందుకు కదలటమే ముఖ్యం-

అన్నింటిలోకీ దౌర్భాగ్యమైనది లేకితనం. ఏదైతే తెలుసుకో గలుగుతామో అదే సత్యమైనది!

* * *

నన్ను కారాగారానికి తీసుకువచ్చిన కొత్తలో- నేనెవరో, నన్ను మర్చి పోమ్మని అన్నారు కొందరు. ఆ సలహా నన్ను నాశనం చేసేది. నన్ను నేను తెలుసుకోవటంలోనే నాకు ఎంతో కొంత ఊరట ఉంటుంది. నెమ్మది కలుగుతుంది. ఇప్పుడు మరి కొంతమంది- నేను విడుదలయిన తర్వాత- ఈ జైలు గది సంగతే మర్చి పొమ్మంటున్నారు.

ఇదికూడా చాలా ప్రమాదకరమైన ఆలోచనే అని తెలుసు. అలా చేస్తే భరించశక్యంకాని అవమాన భారం నన్ను వెంటాడుతూనే వుంటుంది. ప్రకృతి అందాలు- పగటి వెలుగు - రాత్రివెన్నెల, ఋతువుల సోయగాలు- ఉషోదయపు కిలకిలా రావాలు- నిశిరాత్రి నిశ్శబ్దం- వాన చినుకులు ఆకుల్లోంచి రాలటం - పచ్చిక మీద మంచు బిందువుల పరచుకోవటం - ఇవన్నీ నాకు మసకబారి పోతాయి- నాకు సాంత్వన కలిగించలేవు- నాకు సంతోషాన్ని అందించలేవు! మన అనుభూతులను గురించి విచారించటం- మన అభివృద్ధిని నిరోధించటమే కదా- ఇది మన అంతరంగాన్ని కాదనుకోవటమే కదా-

మన శరీరం అన్ని హరాయించు కుంటుంది. మంచి-చెడు-పవిత్రము-అపవిత్రమైనవన్నీ కూడా మన కండరాలుగా, శక్తిగా, మన రక్తమాంసాలుగా, వంకీల జుత్తుగా, ఎర్రని పెదవులుగా, మెరిసే కన్నులుగా, మార్చు కుంటుంది. అలాగే అంతరంగపు ఆలోచనలు కూడా- భావోద్వేగాలు- వాటిలోని క్రూరమైన - అవమాన కరమైన కోణాల నుంచి గొప్ప విశ్వాసం బహిర్గత మవుతుంది- పుటంపెట్టిన బంగారంలాగా మెరుపు వస్తుంది! ఈ అతిసాధారణ కారాగారంలో నేను సాధారణ ఖైదీ ననే సంగతి అంగీకరించాలి. నేను అనుభవించే శిక్ష వలన నేను అవమానభారం భరించనపుడు- ఇంక ఈ శిక్షకు అర్థం ఏముంటుంది?

నేను చేయని నేరాలకు నాకు శిక్ష విధించారు. అలాగే నేను చేసిన చాలా 'పనులకు' నన్ను శిక్షిస్తున్నారు. ఇంకా నా జీవితంలో నా చాలా కర్మలకు శిక్షలేకుండానే ఉండిపోతాను.

దేవుళ్ళు వింత అయినావాళ్ళు సుమా ! మన మంచినీ- మానవత్వాన్ని-మన చెడునీ, వక్రనడతనూ అన్నింటినీ సమంగానే శిక్షిస్తారు!

అందుకనే-మన కర్మలన్నింటికి-మంచి-చెడు- అన్నింటినీ మనకు శిక్షపడక తప్పదు. అదే సరైన న్యాయమను కుంటాను. అలా జరిగినప్పుడే- మన భ్రమలన్ని తొలిగిపోతాయి. అపుడే అది అవమానం నుంచి మనలను

*పందొమ్మిదవ శతాబ్ది చివరి దశాబ్దాలలో ఇంగ్లీషు సాహిత్యాకాశాన తళుక్కుమన్న తోకచుక్క ఆస్కార్ ఫింగల్ ఓఫ్లాహెర్టి విల్స్ వైల్డ్ (1856-1900). జననం ఐర్లండ్ రాజధాని డబ్లిన్‌లో. తల్లికి రచయిత్రిగా పేరుంది. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్నపుడు జాన్ రస్కిన్, వాల్టర్ పీటర్ కళాసిద్ధాంతాలతో ప్రభావితుడయ్యాడు వైల్డ్.*



ఆస్కార్ వైల్డ్

*'కళకోసమే కళ' అని గాఢంగా నమ్మిన రచయిత పలు వ్యాసాలు, నాటకాలు, కథలు, ఒక నవలతో తన అభిప్రాయాలను ప్రచారం చేశాడు. ప్రత్యేక వింత వేషధారణతో అందర్నీ చకితుల్ని చెయ్యటం ఈయనకు సరదా. గొప్ప సంభాషణాచతురుడుగా, మాటల మాంత్రికుడుగా పేరుగడించాడు. ఆయన రచనల్ని చదివి ఎవరెంత ఆనందించినా, వైల్డ్ స్వయంగా చదివినప్పుడు, మాట్లాడినప్పుడు శ్రోతలకు కల్గిన అద్భుతానుభవంతో పోల్చితే, అది కేవలం పదిశాతమేనంటారు. నైతికతకూ, కళకూ సంబంధంలేదన్నది ఈయన మరో సిద్ధాంతం. కథకుడిగా, కవిగా వైల్డ్‌కు కొంత గుర్తింపు వచ్చినా, 1892 నుండే బ్రిటిష్ రంగస్థలం మీద సంచలనం సృష్టించిన నాటకాలు, 'లేడీ విండర్ మీయర్స్‌ఫాన్,' 'ఏ వుమన్ ఆఫ్ నో ఇంపార్టెన్స్,' 'ఏన్ ఐడియాల్ హజ్బెండ్,' 'ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్' లతో కీర్తి, డబ్బు వరించాయి. సుఖలాలసతే జీవితధ్యేయంగా బ్రతికిన వైల్డ్‌లో స్వలింగ సంపర్కం మీద మోజు కలిగింది. 1991లో ఈయన ప్రచురించిన, 'పిక్చర్ ఆఫ్ డోరియన్‌గ్రే' లో కూడా పాత్రల స్వభావం యిలాంటిదే. (జర్మన్ మహాకవి గ్యోతే రాసిన ఫాస్ట్ కావ్యాన్ని తిరగరాశాడన్నారు విమర్శకులు)*

*మరో నాలుగేళ్లకు, వైల్డ్ కామప్రవృత్తికి నిదర్శనంగా కోర్టువారు కూడా ఈ నవలను పరిగణనలోనికి తీసుకున్నారు. భార్యా, యిద్దరు కుమారులున్న వైల్డ్ లార్డ్ ఆల్ఫ్రెడ్ డగ్లస్ అనబడే యువకుడితో బహిరంగంగా సంబంధం పెట్టుకున్నాడు. ఆ కుర్రాడి తండ్రి మార్క్విస్ ఆఫ్ క్వీన్స్‌బరీ, వైల్డ్‌ను* Posing Sodomite *అని తిట్టాడు. అందరిముందు అవమానించినందుకు, వైల్డ్ అతనిమీద కేసు వేశాడు. విచారణ అనేక నెలలు కొనసాగింది. వైల్డ్‌కు యితర యువకులతో కూడా లైంగిక సంబంధాలున్నట్టు రుజువైంది. రెండేళ్ళు కఠిన కారాగార శిక్ష పడింది. 1898లో రీడింగ్ జైలునుండి విడుదలై ఫ్రాన్సుకు వెళ్లిపోయాడు వైల్డ్. నాటకశాలల యజమానులు, ఒకనాటి మిత్రులు పలకరించటానికి కూడా యిష్టపడలేదు. జైల్లో వున్నప్పుడు వైల్డ్, తన సన్నిహితుడు డగ్లస్‌కు రాసిన సుదీర్ఘ లేఖ* ***డి ప్రోఫండిస్.*** *పారిస్‌లో రెండేళ్ళు దుర్భర దారిద్ర్యంలో గడిపిన వైల్డ్ 1900 నవంబర్, 30న మరణించాడు. స్వయంకృతాపరాధమూ, సమకాలీన సమాజపు కృత్రిమ విలువలూ ఒక ప్రతిభాశాలిని బలితీసుకున్నాయి.*

---

రక్షిస్తుంది. అపుడే నేను సరిగా ఆలోచించగలను- హాయిగా స్వేచ్ఛగా బయటకు వెళ్లి జీవించగలను-

చాలామంది విడుదలయిన తర్వాత కూడా జైలు వాతావరణాన్ని తమతో తీసుకు వెళ్తారు- ఆ అవమానంతో కుళ్లిపోతూ చివరికి మరణిస్తారు. నిజానికి ఇది చాలా బాధాకరమయిన విషయమే. దీనికి బాధ్యత సంఘానికీ వుంది. ఒక రకంగా వారి మరణానికి బాధ్యత సాంఘికమైనదే. అంతేకదా- తప్పు చేసిన వాళ్లను శిక్షించే బృహత్తరమైన బాధ్యత తలకెత్తుకున్నపుడు- ఆ శిక్ష అనుభవించి- విడుదలయిన వాళ్ల బాధ్యతకూడా దానిదేకదా- ఇంతటి ముఖ్యమైన విషయాన్ని గుర్తించక పోవటం నేరమేకదా-శిక్ష అనుభవించిన వాడిని అతని మానానికి అతన్ని వదలివేయటం- లేదా అతనికి ఎంతో అవసరమైన సమయంలో - అతణ్ణి నిర్లక్ష్యం చేయటం- తన, ముఖ్యమైన ధర్మాన్ని నిర్వర్తించక పోవడమే. ఇది ఎంతో సిగ్గుపడవలసిన విషయం- సంఘపరమైన బాధ్యతను నెరవేర్చకుండా-అతడు కనపడితే- ఏదో బాకీ వున్నా వాడి నుంచి తప్పించుకొన్నట్లు ముఖం చాటువేయటం- ఈ జనానికి న్యాయమేనా? ఇంక శిక్షించబడిన వాడు - మళ్లీ సంఘంలో సాధారణ జీవితాన్ని గడిపే వాతావరణం కల్పించక పోవటం-దానికి అతనికి అర్హత లేదనట్లు ప్రవర్తించటం ఎంతవరకు సబబు?

**ఇంకావుంది...**

# చరిత్ర గర్భంలోకి..

– నండూరి పార్థసారథి

*(గత సంచిక తరువాయి)*

**భా**రతీయ కళారంగంలో ప్రతి కాలంలో ఏవో కొన్ని మార్పులు జరుగుతూనే వున్నాయి. కొత్త ప్రక్రియలు అవతరిస్తూనే వున్నాయి. ఇకముందు కూడా మార్పులు వస్తాయి. రాకుండా వుండవు. ప్రతిభావంతుడైన కళాకారుడు తన మదిలో కొత్త కొత్త భావనలు మెదులుతున్నప్పుడు వాటికి రూపాలు ఇవ్వకుండా వూరుకోలేడు. నూతన ప్రక్రియలు అవతరిస్తున్నప్పుడు కొన్ని పూర్వ ప్రక్రియలు అంతరించి పోతుంటాయి. ఇది అతి సహజంగా జరిగే పరిణామం.

సంగీత రంగంలో కూడా ఇలా కొన్ని కొత్త ప్రక్రియలు అవతరించడం, కొన్ని పాత ప్రక్రియలు అంతరించడం జరిగింది. ఈ మార్పులు అమీర్ ఖుస్రో వంటి ఏ ఒక్కరో తీసుకువచ్చినవి కావు. ఖుస్రో లేకపోయినా మార్పులు ఆగేవి కావు. అయితే, ఇంతకుముందే చెప్పినట్లు ఈ మార్పులవల్ల భారతీయ శాస్త్రీయ సంగీత 'మౌలిక' స్వరూపం మారలేదు. మతంగముని కాలానికే 'రాగం' అవతరించగా, శార్ఙ్గదేవుని కాలానికి శాస్త్రనిర్మాణం దాదాపుగా పూర్తయింది. ఆ తర్వాత జరిగినవన్నీ ప్రక్రియలకు సంబంధించిన మార్పులే. అంటే– కొత్త రకం సంగీత రచనలు వచ్చాయి; రాగావిష్కరణ పద్ధతులు అభివృద్ధిచెందాయి; బాణీలు మారాయి. కొత్త అందాలు వచ్చాయి; వైశాల్యం పెరిగింది; నగిషీలు పెరిగాయి; ఆకర్షణ, రంజకత పెరిగింది; కొత్తరాగాలు వచ్చాయి. పాతరాగాలకు కొత్త పేర్లు వచ్చాయి; శాస్త్ర పరిధిలోనే స్వేచ్ఛాగానానికి అవకాశం పెరిగింది.

అయినా, 'మౌలిక' స్వరూపం మారలేదని అంటున్నాము. 'మౌలిక' అంటే ఏమిటి? సప్తస్వరాలు, శ్రుతులు, శుద్ధస్వరాలు, వికృతస్వరాలు; ఒక్కొక్క స్వర ఆవరణలో గల శ్రుతుల సంఖ్య, గమకాలు; మూర్ఛనలు; క్రమసంచారం, వక్రసంచారం; సంవాదిత్వం– ఇవన్నీ భారతీయ సంగీతంలోని ముఖ్యాంగాలు. వీటిన్నింటితో నిర్మాణమైనది, ప్రాణవంతమైనది 'రాగం'. ఆరోహణలో, అవరోహణలో ఏడు స్వరాలు, ఆరుస్వరాలు, ఐదుస్వరాలు, రకరకాల మేళనాలతో, రకరకాల సంచారాలతో, అనంత వైవిధ్యంతో వందల, వేల.. అసంఖ్యాక రాగాల అవతరణ... ఇదీ భారతీయ శాస్త్రీయ సంగీత 'మౌలిక' స్వరూపం; ఇదీ రాగ విశ్వరూపం; ఎవరో, ఎందరో అజ్ఞాత సంగీత జ్ఞానులు, ఋషులు దర్శించిన మహాద్భుత, నిత్య చైతన్య రూపం.

భారతీయ సంగీతంలో రాగోదయమైన తర్వాత కాలక్రమంలో అవతరించిన సంగీత రచనలను, ప్రక్రియలను పరిశీలిద్దాం. త్రేతాయుగంలో కుశలవులు రామాయణాన్ని ఎలా గానం చేసి వుంటారో, ద్వాపరయుగంలో కృష్ణుడు వేణువుపై ఏమి వాయించాడో, నారదతుంబురులు, సరస్వతీదేవి వీణపై ఏమి వాయించారో ఊహించలేము గాని క్రీస్తుశకం పన్నెండో శతాబ్దం వాడైన జయదేవుని 'గీతగోవిందం' నుంచి పరిశీలన ప్రారంభిద్దాము. అంతకంటే ముందుగా నిబద్ధ, అనిబద్ధ గాన పద్ధతులను గురించి తెలుసుకోవడం అవసరం.

**నిబద్ధగానం**

స్వరబద్ధమైన, తాళ బద్ధమైన సాహిత్యరచనను ఎవరో వాగ్గేయకారుడు సిద్ధంగా వుంచితే దానిని యథాతథంగా గానం చేయడం నిబద్ధగాన పద్ధతి. సాహిత్యం లేకపోయినా, తాళబద్ధం కూడా కాకపోయినా ముందుగా రచించి సిద్ధంగా వుంచిన స్వర రచనని యథాతథంగా వాయించినా అదీ నిబద్ధగానమే అవుతుంది. తాళబద్ధమైన గానాన్ని 'సతాళ' అనీ, తాళ బద్ధం కాని గానాన్ని ' అతాళ' అనీ అంటారు. ఇవి నిబద్ధగానంలోని రెండు రకాలు. నిబద్ధగానంలో

నండూరి పార్థసారథి, ఫోన్: 9959734534

గాయకునికి, లేదా వాద్య కళాకారునికి స్వయం ప్రతిభను ప్రదర్శించే అవకాశం వుండదు. ఆ గానం బాగుంటే నూటికి ఎనభయ్యో, తొంభయ్యో మార్కులు ఆ రచన కర్తకే దక్కుతాయి. గాయకునికి, లేదా వాదకునికి- అతడి గానం శ్రుతిశుద్ధంగా, శ్రావ్యంగా వుంటే - పదో, ఇరవయ్యో మార్కులు దక్కుతాయి.

నిబద్ధగాన పద్ధతికి ఉదాహరణ ప్రబంధగానం, పాశ్చాత్య శాస్త్రీయ సంగీతమంతా నిబద్ధగానమే. అందులో గాయకులు పాడేవిగాని, వాద్యకళాకారులు వాయించేవిగాని అన్న మోజార్ట్, బీతోవెన్ వంటి కంపోజర్ల రచనలే. వాటిని ఒక్క స్వరం పొల్లు పోకుండా వాయించవలసి వుంటుంది. అది అద్భుతంగా వుంటే 'ఫలనా మహానుభావుడి రచన' అని ప్రశంసిస్తారు. ఆరచనను వాయించే కళాకారుడి గొప్పతనం అతడు ఎంత మూలవిధేయంగా, శ్రుతిశుద్ధంగా వాయించాడనేదానిపై ఆధారపడి వుంటుంది. ఆ రచన తాలూకు టెంపో (వేగం)ను, వాల్యూమ్ (ధ్వని తీవ్రత)ను కూడా కంపోజరే తన రచనలో నిర్దేశిస్తాడు.

సినిమా పాట కూడా నిబద్ధగానమే. ఎవరో ఒక కవి పాట రాస్తాడు. సంగీత దర్శకుడు దానికి స్వర రచన కూరుస్తాడు. అతడు చెప్పినట్లుగా గానం చేయడం గాయకుని విధి. అందులో మార్పులు చేసి, తన యిష్టం వచ్చినట్లు పాడే అధికారం గాయకునికి లేదు. కాని, గానం మధురంగా వుంటే గాయకునికి మంచి మార్కులు వస్తాయి. (అయితే యిప్పుడు చాలా సందర్భాలలో కవికంటే, సంగీత దర్శకుని కంటే గాయకునికి ఎక్కువ ఖ్యాతి లభిస్తున్నది.)

**అనిబద్ధగానం**

సృజనాత్మక ప్రతిభగల గాయకునికి, లేదా వాద్య కళాకారునికి నిబద్ధగాన పద్ధతిలో సంతృప్తి లభించదు. వారికి తమ స్వీయ ప్రతిభను ప్రదర్శించుకోవాలన్న తపన వుంటుంది. తమ సొంత రచనే అయినా ముందుగా సిద్ధం చేసి పెట్టుకొన్న దానిని గానం చేయడం కాకుండా అప్పటికప్పుడు తమ భావనాశక్తితో కల్పించి స్వేచ్ఛగా గానం చేయాలనుకుంటారు. అదే అనిబద్ధగానం. రాగాలాపన అంతా అనిబద్ధగానమే. ఆలాపన తాళబద్ధం కాదు. అది 'అతాళ' గానం.

అనిబద్ధ, అతాళ గానం అంటే శుద్ధ ఆలాపమే. అందులోనే-గాయకుని ప్రతిభమేరకు-రాగ సౌందర్య ఆవిష్కారానికి, రసావిష్కారానికి సంపూర్ణ అవకాశం లభిస్తుంది. సాహిత్య బంధం, తాళ బంధం లేని ఈ అనిబద్ధగానమే ప్యూర్ మ్యూజిక్ - శుద్ధగానం. సాహిత్య రచనతో గానం చేసేది అప్లైడ్ మ్యూజిక్ - ప్రయుక్తగానం.

**ప్రబంధ గానం**

జయదేవుని కాలంలో- అనగా 12వ శతాబ్ది పూర్వార్థంలో- ప్రబంధగాన పద్ధతి వాడుకలో వుండేది. అతడు రచించిన 'గీతగోవిందం' ప్రబంధ పద్ధతిలో గానం చేయడానికి ఉద్దేశించినది. తర్వాత ఇంకో వందేళ్ళు- శార్ఙ్గదేవుని కాలందాకా - ప్రబంధ గాన పద్ధతి ప్రయోగంలో వుంది. ఆ తర్వాత క్రమంగా దాని ప్రాభవం తగ్గి 14వ శతాబ్ది నుంచి ధ్రువపద పద్ధతి వాడుకలోకి వచ్చింది.

గానానికి ఉద్దేశించిన సాహిత్యరచనలలో ఇప్పటి వరకు దొరికిన తొలిరచన 'గీతగోవిందం'. ఈ కావ్యం చదువుకొని ఆనందించడానికి, పాడుకోడానికి, నృత్యాభినయానికి కూడా ఉద్దేశించినది. ఇందులోని అష్టపదులనూ, శ్లోకాలనూ సంగీత నృత్యాలతో వరుసగా అభినయిస్తే అది ఒక మహానాటకంగా కనిపిస్తుంది. జయదేవుడు ఈ కావ్యంలోని అష్టపదులన్నింటికీ రాగతాళాలను నిర్దేశించాడు. అయితే స్వరలిపిలో అవి లభించక పోవడం వల్ల యిప్పుడు వాటి సంగీతరూపం స్పష్టంగా తెలియడం లేదు. సంస్కృత రచనలు కావడం వల్ల- అవి ఎనిమిది శతాబ్దాల తర్వాత- యిప్పటికీ దేశమంతటా గానం చేయబడుతున్నాయి- ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క బాణిలో, ఎవరికి తోచిన రాగాలలో వారు గానం చేస్తున్నారు. సినిమాల్లో సినిమా పాటల ధోరణిలో కూడా అష్టపదులు వినిపించాయి.

జయదేవుడు వంగ-ఓఢ్ర ప్రాంతం వాడు. వంగ, ఓఢ్ర భాషా ప్రాంతాలు ఒకే రాజ్యంగా వున్నకాలం వాడు అతడు. వంగదేశానికి గౌడ దేశమనే పేరు కూడా వుంది. ఆ దేశాన్ని లక్ష్మణసేన మహారాజు పాలించిన కాలంలో ఆయన ఆస్థానంలో జయదేవుడు వుండేవాడు. అతడి మాతృభాష వంగ భాషో, ఓఢ్ర భాషో కచ్చితంగా తెలియదు. అతడి జన్మస్థలం నేటి ఒడిషాలోని జగన్నాథ క్షేత్రం సమీపాన గల బిందుబిల్వమని కొందరు, వంగదేశం (పశ్చిమ బెంగాల్)లోని బీర్భూం ప్రాంతంలోని కిందుబిల్వమని మరి కొందరు వాదిస్తున్నారు. జయదేవుడు మావాడంటే మావాడని ఓఢ్రులు, వంగీయులు ఇప్పటికీ వాదులాడుకొంటూనే వున్నారు. పూరీ

జగన్నాథాలయంలో గీతగోవిందంలోని అష్టపదులను ఇప్పటికీ సంప్రదాయ పద్ధతిలో నిత్యం గానం చేస్తున్నారు. ఒడిస్సీ గాయకుడు రఘునాథ్ పాణిగ్రాహి అష్టపదులను గానం చేసే పద్ధతి ప్రబంధగాన శైలికి దగ్గరగా వుంటుందని భావించవచ్చు. ఒడిస్సీ నృత్యకార్యక్రమాలలో తప్పనిసరిగా అష్టపది ఒక అంశంగా వుంటుంది.

'ప్రబంధము' అంటే స్థూలంగా రచన లేక కృతి అని అర్థం. అది సాహిత్య రచన కావచ్చు, సంగీతరచన కావచ్చు. సాహిత్యంలో అయితే కావ్యం, లక్షణగ్రంథం, కథ, కవిత ఏదైనా కావచ్చు. సంగీతంలో అయితే అష్టపది, కీర్తన, కృతి, పదం వంటి రచన ఏదైనా కావచ్చు. కాని, 'ప్రబంధగాన పద్ధతి' గురించి చెప్పుకొనే సందర్భంలో దానికి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. శార్ఙ్గదేవుడు 'సంగీత రత్నాకరం' లోని ప్రబంధాధ్యాయంలో ప్రబంధ లక్షణాలను వివరించాడు.

ప్రబంధ రచనలలో సాధారణంగా నాలుగు ధాతువులుంటాయి. అవి ఉద్గ్రాహ, మేలాపక, ధ్రువ, ఆభోగ. కొన్ని రచనలలో ధ్రువ, ఆభోగ ధాతువుల మధ్య 'అంతర' అనే మరొక ధాతువు వస్తుంది. ధాతువు అంటే విభాగం. ఈ ధాతువులు కాక ఆరు అంగాలుంటాయి. అవి– స్వర, బిరుద, తేన, పద, పాట, తాళ. ప్రబంధ రచనలలో ఎన్నో రకాలున్నాయి. అన్నింటిలో తప్పని సరిగా నాలుగు ధాతువులు ఉండాల్సిన అవసరం లేదు. కొన్నింటిలో మూడు, రెండు ధాతువులే ఉండ వచ్చు. వాటిని త్రిధాతు, ద్విధాతు ప్రబంధాలంటారు. ధాతువులను, అంగాలను గట్టిగా నిబంధించిన రచన అనే అర్థంలో 'ప్రబంధం' అనే ప్రక్రియ ఏర్పడింది. సద్యః కల్పనకు, 'మనోధర్మ' గానానికి – అనగా ఆలావన, స్వర ప్రస్తారం, సాహిత్య విస్తారం వంటి వాటికి ప్రబంధగాన పద్ధతిలో అవకాశం వుండదు. జయదేవుని అష్టపదులు నాలుగు ధాతువులుగల ప్రబంధ రచనలు.


జ్ఞానదేవ్

మహారాష్ట్ర భక్తకవులు జ్ఞానదేవ్, నామదేవ్‌ల మరాఠీ అభంగాలు కూడా చతుర్ధాతు ప్రబంధ రచనలే. వారిద్దరూ 13వ శతాబ్దికి చెందినవారు; శార్ఙ్గదేవుని సమకాలికులు. అష్టపదులు, అభంగాలు భక్తి రచనలు కావడం వల్ల అవి ప్రధానంగా దేవాలయాలలో గానం చేయడానికి ఉద్దేశించినవి. వాటిలో సంగీత పాండిత్యాన్ని ప్రదర్శించడానికి అవకాశం వుండదు. అలా ప్రదర్శించడం ఎబ్బెట్టుగా వుంటుంది కూడా.

**ధ్రువపదగానం**

సుమారుగా 14వ శతాబ్దారంభం నుంచి ధ్రువపద గాన పద్ధతి వాడుకలోకి వచ్చింది. అదే 'ధ్రుపద్'గా ప్రసిద్ధమయింది. ఉత్తర భారతీయ శాస్త్రీయ సంగీతానికి సంబంధించి నంతవరకు 14వ శతాబ్దం అత్యంత కీలకమైనది. 'హిందూస్థానీ సంగీతం' పేరు వాడుకలోకి వచ్చినది అప్పుడే. ఆ శతాబ్దంలోనే పాతిక, ముప్ఫయి సంవత్సరాలు ఆలస్యంగా దక్షిణ భారత సంగీతానికి 'కర్ణాటక సంగీతం' అనే పేరు వాడుకలోకి వచ్చింది. ఉత్తర భారతంలో ధ్రువపద గాన పద్ధతి ఆ కాలంలోనే వాడుకలోకి వచ్చింది. అది దక్షిణ భారతీయ సంగీతంలో లేదు. అంటే భారతీయ సంగీతం ఉత్తర, దక్షిణ పద్ధతులుగా విడిపోయిన తర్వాతనే ధ్రుపద్ పద్ధతి ఆరంభమయిందనుకోవచ్చు.

అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఆస్థానంలో అమీర్ ఖుస్రోకు, గోపాల నాయక్‌కు మధ్య పోటీ జరిగినప్పుడు గోపాల నాయక్ పాడినది ధ్రుపద్ సంగీతమే అయివుంటుంది. అయితే బహుశా అప్పటికింకా ధ్రుపద్ పద్ధతికి పూర్ణరూపం వచ్చి వుండక పోవచ్చు; ఇంకా పరిణామ దశలో వుండి వుంటుంది.

ధ్రుపద్ వైభవం 15వ శతాబ్దంలో గ్వాలియర్ ప్రభువైన రాజామాన్‌సింగ్ తోమర్‌తో ప్రారంభమై 18వ శతాబ్దం పూర్వార్థం వరకు నిలిచింది. ఆ మూడు శతాబ్దాల కాలంలో మాన్‌సింగ్‌తో పాటు అక్బర్, జహంగీర్, షాజహాన్‌లు కూడా ధ్రుపద్ సంగీతాన్ని విరివిగా పోషించారు. మాన్‌సింగ్ తోమర్ పోషకుడు మాత్రమే కాదు– స్వయంగా కొన్ని వందల ధ్రుపద రచనలు చేశాడు. హిందీలో 'మాన్ కుతూహల' అనే లక్షణ గ్రంథం రచించాడు. అతడి ఆస్థానంలో బక్షు అనే వాగ్గేయకారుడు వుండేవాడు. బక్షు కొన్ని వేల ధ్రుపద్‌లు రచించాడు. మాన్‌సింగ్ మరణానంతరం అతడు మరి ముగ్గురు ప్రభువుల పోషణలో వున్నాడు. బక్షు మరణించిన



తాన్‌సేన్



అమీర్ ఖుస్రో

తర్వాత 200 సంవత్సరాలకు షాజహాన్ అతడి రచనల సేకరణ జరిపించాడు. బక్షు రచనలు కావేమోనన్న అనుమానం కలిగిన కొన్నింటిని పక్కన బెట్టి వెయ్యి రచనలను 'సహసరస' (సహస్రరస) పేరుతో ఒక సంకలనాన్ని ప్రచురించాడు. ఆ సంకలనంలోని కొన్ని రచనలలో 'పోషకముద్ర'ను మార్చి షాజహాన్ పేరును చేర్చి కొందరు గాయకులు గానం చేశారు.

అప్పటికి 200 సంవత్సరాల పూర్వుడైన బక్షు రచనలలో షాజహాన్ పేరును చేర్చడం హాస్యాస్పదమని ఆ గాయకులకు అనిపించలేదు.

అక్బర్ (16వ శతాబ్ది) ఆస్థాన గాయకుడు సంగీతసమ్రాట్ తాన్‌సేన్, అతడి గురువు స్వామీహరిదాస్, బైజూబావరా వేలాది ధ్రుపద్ రచనలు చేశారు. ధ్రుపద్ సంగీతానికి అది అత్యుచ్ఛ దశ. సంగీతద్వేషిగా ముద్రపడిన ఔరంగజేబు కూడా కొందరు ధ్రుపద్ వాగ్గేయకారులను ఆదరించాడు. కొన్ని రచనలను అంకితం తీసుకున్నాడు. శాస్త్రీయ సంగీతంలోని శృంగార ప్రధాన రచనలనే అతడు ద్వేషించాడనీ, భక్తి, వైరాగ్య రచనలను నిరాదరించ లేదనీ 'మాన్ కూతూహల' గ్రంథాన్ని 'రాగదర్పణ' పేరుతో పర్షియన్ భాషలోకి అనువదించిన ఫకీరుల్లాఖాన్ తన గ్రంథంలో పేర్కొన్నారు.

భారతీయ సంగీతాన్ని కాదని పర్షియన్ సంగీతాన్నో, అరేబియన్ సంగీతాన్నో ప్రోత్సహించిన ముస్లిం ప్రభువులెవరూ లేరు. ధ్రుపద్ రచనలన్నీ సంస్కృతం, లేదా హిందీ భాషల్లోనే వున్నాయి. వాటిల్లో చాలా రచనలు భక్తి ప్రధాన రచనలే. ప్రబంధ గాన పద్ధతికీ ధ్రుపద్ పద్ధతికీ చాలా తేడాలున్నాయి. ప్రబంధపద్ధతి పూర్తిగా నిబద్ధ, సతాళ గాన పద్ధతి. ధ్రుపద్ పద్ధతిలో రచన మాత్రమే నిబద్ధ, సతాళ గానంగా వుంటుంది. రచనకు ముందు విస్తారంగా రాగాలాపన వుంటుంది. అదంతా అనిబద్ధ, అతాళ గానమే. ఆలాపనలో రాగ సౌందర్యాన్ని, రాగ రసాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించే అవకాశం వుంటుంది.

ఆలాపనలో రెండు దశలు వుంటాయి. మొదటి దశలో సాహిత్యం, తాళం, లయ ఏవీ వుండవు. రెండవ దశలో సాహిత్యం, తాళం లేకపోయినా ఆలాపన లయబద్ధంగా సాగుతుంది. నొం, తొం, అనే అక్షరాలతో లయబద్ధంగా సాగుతుంది కనుక దాన్ని 'నొం తొం ఆలాప్' అంటారు.

అది కర్ణాటక సంగీతంలోని 'తానం'ను పోలి వుంటుంది. ధ్రుపద్ గానంలోని శుధ్ ఆలాప్, నొం తొం ఆలాప్ విభాగాలు కర్ణాటక సంగీతపు పల్లవి గానంలోని రాగం, తానం లను పోలివుంటాయి. పల్లవిలో సాహిత్య రచన ఒక్క పంక్తి మాత్రమే వుంటుంది. ధ్రుపద్ రచన – స్థాయి, అంతర, సంచారి, ఆభోగ అనే నాలుగు ధాతువులతో – పెద్దదిగా వుంటుంది.

కర్ణాటక సంగీతంలోని పల్లవిలాగానే ధ్రుపద్ రచనలను కూడా సాధారణంగా మగవారే గానం చేస్తారు. ధ్రుపద్ లలితంగా, సుకుమారంగా వుండేది కాదు. అది గంభీరమైన, చాలా బరువైన గాన పద్ధతి.

మి

# నోటీసు

**- సి.వి. కృష్ణారావు**

*"ఈ ఫిర్కాలో పటేళ్ళు, పట్వారీలు, దేశ ముఖులు, జాగీర్దార్లు పోలీసులతో కలసి అపరిమితమైన దుండగాలు చేస్తున్నారు. కాబట్టి నేటినుండి ఏ పోలీసు అధికారిగాని, ప్రభుత్వోద్యోగికాని ఇంకెవరైనాగాని ప్రజలపై జులుం చేస్తే తగిన శిక్ష అనుభవిస్తారు."*

**ఇట్లు ప్రజారక్షణ సంఘం**

వైరా అనే నైజాం గ్రామంలో ఒక గోడమీద ఈ నోటీసు అంటించబడింది. ప్రొద్దున ఒక పోలీసు దారిన పోతూ కాగితం చూశాడు. చదువుకున్నాడు.

"ఏయ్ షావ్‌కార్, బైటికి రారా"!

పైపంచ సవరించుకుంటూ గడపలోకొచ్చాడు షావుకారు.

"ఈ కాగితం ఎవరంటించారు?"

గడపదాటి అరుగు దగ్గరకు వచ్చి కాగితం చదివి "ఏమో" అన్నాడు.

"అది చించెయ్"

"నీవే చించెయ్ రాదూ-నాకేంబట్టింది. ప్రాణంమీదకి తెచ్చుకోను"

"బద్మాష్" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయినాడు పోలీసు.

"ఏంది? వెంకయ్య మామా, అంటూ ఆ దార్నే బోతూ ఒకాయన, ఈ దార్నేబోతూ ఇంకో ఆయనా పదిమంది చేరారు. ప్రతివాడూ ఆ కాగితం అంటించినందుకు ఉబ్బి తబ్బిబ్బౌతున్నాడు.

"ఎవరంటావు?" / "ఎవరో!"

ఎక్కువ మాట్లాడితే ఎవరు ఏ చాడీలు అమీన్‌కు చెప్తారోనని ఎవరిపని మీద వాళ్ళు పోతున్నారు.

ఇంతలోకే హెడ్‌కానిస్టేబుల్ వచ్చాడు ముగ్గురు పోలీసుల్తో...

"ఏయ్ వద్దరీ ఇదర్ ఆవ్" / "ఏందండయ్యా!"

"ఆ కాగితం చించెయ్"

"ఒరికి చాతనైతది. కథలు చెప్తుండారు. గుబు లేస్తుండది." ఎవర్ని చూసినా వంగేట్టులేరు. తీరావాడు తలకాయ వంచుకొనిపోయినాక "ఆ ముండకు మాత్రం ధైర్యం చచ్చిందా" అన్నాడు ఎల్లప్ప.

"బారెడు తుపాకి మూరెడు టోపి ఉంటే సరా? గుప్పెడు గుండెలేని ముండనాయాళ్ళు" అన్నాడు వీరప్ప. అమీన్ సాబ్ వస్తున్నాడని బైట తాళం వేసి పక్క గొంది గుండా తప్పుకున్నాడు గోడ సావుకారు. భయం పుట్టిన వాళ్ళు పోగా ఓ ఇరవైమంది వున్నారు. అమీన్ లాఠీ ఊపుకుంటూ వచ్చి ఒకతన్ని ఆ కాగితం చించమన్నాడు.

"హుజూర్ అని జోరుగా చదవండి".

"అరవ్వాకు బుద్ధిహీనుడా!"

ఓ ముసల్తాత అన్నాడు " మీరే చించరాదండే పంతులుగారు"

"నీవు చించెయ్ తాతా!"

"నా చేత కాదు తండ్రి"!

పెద్దపులిని చూసినట్లు కాగితం వంక యింకోసారి చూసి తప్పుకున్నాడు అమీన్ అమ్మనాలిబూతులు కూసుకుంటూ రెండు లారీలు ఖమ్మం కలెక్టర్‌తో యింటి ముందు ఆగినవి. సరాసరి అమీన్ కలక్టర్‌తో మాట్లాడ్డానికి వెళ్ళాడు. జరిగిన సంగతంతా చెప్తే-

"చివరకు గోడమీద నోటీసు చించలేకపోయినావా?"

"అది ప్రభుత్వానికి ఉద్వాసన చెప్పే నోటీసు సార్"

"మరి నీవే చించెయ్యలేకపోయినావా?"

"నా చేతుల్తో అది చించేస్తే ఆ ఊళ్ళో ఎన్నాళ్ళు అమీన్ గిరీ చెయ్యగలుగుతాను?"

"అవును"

కలెక్టర్, అమీన్ యిద్దరు బుగ్గన చేతులు జేర్చి, ఒక అనామక కార్యకర్త నైజాం నాజీత్వంపై వ్రాసిన నోటీసు చించే నిమిత్తం ఆలోచించసాగారు.

"అచ్ఛీ బాత్, నేను వరంగల్ నుంచి ఒక రజాకార్‌ను పంపుతాను. అతను హిందువు లాగా తల గుడ్డ చుట్టుకొని, ధోతీ కట్టుకుని, మీరడగంగానే ముందుకొచ్చి చించేట్టు ఏర్పాటు చేస్తాను. కానీ మీరు ఒక పనిచేయాలి"

"చిత్తం! ఏంటది"

"వచ్చి చూచే జనంలో ఎవరి వద్దా కాగితం కలం లేకుండా జేయండి!!"

సేకరణ: కర్లపాలెం హనుమంత రావు, ఫోన్ : 9440361381

## చీకటంతా చీల్చి పాడిన...

# ఊట్ల కొండయ్య

జ్ఞాపకం వున్న చిన్ననాటి మొదటి సంఘటన బర్మాయాత్ర. గత శతాబ్దం చివరి పాదంలో గుంటూరులో సెకండు ఫారం చదివిన చిన్నబ్బాయి అనే బాలుడు రంగం పారిపోయాడు.

రంగం అంటే రంగూను : అంటే బర్మా, ఇప్పుడది మైన్మ్యార్ : రంగూన్ యాంగూనైంది. ఉత్తరాంధ్ర జిల్లాల వారికది కొత్త కోరంకి. ఆ జిల్లాలనుండి చాలామంది బ్రతుకు తెరువు వెతుక్కుంటూ అటు వెళ్తూ వుండేవారు. మా గురువర్యులు అడవి బాపిరాజుగారు తరచు, సాహిత్యసభలలో అభినయసమేతంగా పాడుతూ వుండే పాట ఒకటి ఇందుకు సంబంధించిందే.

ఇదుగో ఇలాంటి కొత్త కోరంగికి వెళ్ళిన చిన్నబ్బాయి జిల్లా ఫారెస్టు ఆఫీసరుగ రిటైరైనాడు. రంగూను లోని సంపన్నులైన బర్మావారి పిల్లను పెండ్లాడాడు. వారికిద్దరు కొడుకులు. వారి నివాసం మాండలేలో.

చిన్నబ్బాయిగారు గుంటూరులోని తన తమ్ముని కుమారులకు ధన సహాయం చేసి చదివించారు. ఆ ఇద్దరిలో పెద్దవారు రాఘవులు. ఆ అబ్బాయి షార్ట్‌హాండ్ – టైపు హయ్యరు పాసై బి.ఏ. తప్పాడు. అతనికి నా పిన్ని భ్రమరాంబనిచ్చారు. చిన్నబ్బాయిగారు ఆయనకు యమెథిన్ జిల్లాకోర్టులో ఉద్యోగమిప్పించారు. పిన్ని అక్కడకు కాపురానికి వెళ్ళేటప్పుడు నేను తోడు వెళ్ళాను. అక్కడ అద్దెకున్న ఇంటి వాళ్ళ అమ్మాయితో ఆడుకొంటూ వుంటే నాకు బర్మా భాష త్వరగా అబ్బింది. అటు పిమ్మట బాబాయిని మోమియాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత ఆయనకు జబ్బుచేస్తే చికిత్స కోసం మాండలే వెళ్ళాము. 10 నెలల తరువాత తిరిగి వచ్చాము.

పేరాల నా జన్మస్థలం. ఇక్కడి జంటనగరాల వంటివే అక్కడి చీరాల – పేరాల జంట గ్రామాలు. నాలుగు మైళ్ళ దూరంలో వున్నా సముద్రం హెూరు వినిపిస్తూ వుంటుంది, అప్పుడప్పుడు – దానికి కోపం పొంగినప్పుడో, ఆనందం ఉప్పొంగినప్పుడో ! ఈ జంట గ్రామాలపై 75 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మునిసిపాలిటీని విధిస్తే, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి పిలుపందుకొని, ఈ రెండు గ్రామాల ప్రజలు ఇళ్ళు వదిలిపెట్టి, పేరాల పొలిమేరలలో ఆయన నిర్మించిన రామనగర్ వెళ్ళి, పాకలలో వుండి ఎన్నో కష్ట నష్టాలు అనుభవించారు. ఇలాంటి సత్యాగ్రహం దేశంలో మొదటిదిదే? గాంధీ మహాత్ముని సత్యాగ్రహెూద్యమానికి తొలి మెట్టిది. "పాకలప్పుడు" అనే కొలమానం మాట, ఆ ప్రాంతపు తెలుగులో నాటి నుండి ప్రవేశించి కొనసాగుతున్నది.

బర్మానుండి తిరిగి వచ్చి పేరాల చేరేసరికి అది 1926వ సంవత్సరం? పూర్వం చదువుతూ వుండిన పేరాలలోని రాజగోపాలం వీధిబడిలో చేరి నాల్గవ తరగతి వరకు అక్కడే చదివాను.

వీధి బడినుండి, చీరాల మునిసిపలు హైస్కూలులో ఐదవ తరగతిలో ప్రవేశించి ఆరవ తరగతిలోనికి వచ్చేసరికి, ఆటలలో, సబ్ జూనియరుగ నేను జిల్లా ఛాంపియన్‌ను, మెడలిస్టును. నూరుగజాల పరుగులోనూ, హైజంప్‌లోనూ, లాంగ్ జంప్‌లోనూ జిల్లాలోని పాఠశాలలన్నింటిలోనూ, ప్రథముణ్ణి. ఇప్పటి ప్రకాశం జిల్లా కూడా అప్పుడు గుంటూరు జిల్లాలో కలిసి వుండేది.

సర్వమిత్ర వ్యాయామ సంఘం అనేపేర, పేరాలలో, సాముగరిడీలు, వ్యాయామం, సర్కసు విద్యల సంస్థ ఒకటి వుండేది. అది చిన్న గ్రంథాలయం కలిగి వుండడమేకాక, సభ్యుల నైతిక వర్తనపై కూడా యాజమాన్యం కలిగి వుండేది.

దానిలో చిన్న నాటినుండి నేను సభ్యుణ్ణి. దండేలు, బస్కీలు, హారిజాంటిల్‌బార్, పార్లర్‌బార్, కుస్తీలు, బాణాకర్ర తిప్పడం, పట్టాకత్తి త్రిప్పడం వంటి సాము గరిడీలు, తీగపై నడవడం వంటి సర్కసు పనులు పెద్దలతో పాటు చేసేవాణ్ణి. కాళ్ళు చేతులు కర్రతో కట్టివేయడం వంటి రహస్య విద్యలు దీనిలో వున్నాయి. విశ్వాసపాత్రులైన శిష్యులకే ఇది నేర్పుతారు. ఇక్కడ మతపరమైన సంగతి ఒకటి చెప్పవలసి వుంది. రత్నం

పంతులుగారనే ఒక క్రైస్తవ సత్పురుషుడు ఈ వ్యాయామ సంఘానికి తరచు విచ్చేస్తూ, క్రైస్తవ మతపరంగా నీతినీ, సత్ప్రవర్తననూ గూర్చి ప్రభోదిస్తూ ప్రసంగిస్తూ వుండేవాడు. ఆయనతో నాకు సాన్నిహిత్యమేర్పడడంతో ప్రతి ఆదివారం ఆయనతో పాటు ఉపవాసం చేస్తూ, ఊరివెలుపలి సరివి తోటలకో, జీడిమామిడితోటలకో వెళ్ళి ప్రార్థనలు చేస్తూ వుండేవాణ్ణి. అలా బైబిలుతోనూ క్రైస్తవమతంతోనూ సన్నిహిత సంబంధమేర్పడింది. ప్రపంచ ఖ్యాతి పొంది ఒరిస్సా క్రైస్తవ భక్తుడు సాధు పాట్నాయక్ గారు చీరాల సందర్శించడానికి వచ్చినప్పుడు, ఆయనకాతిథ్యమిచ్చిన గృహస్థు, నాచేత ఆయన సమక్షంలో ప్రార్థన చేయించాడు. సాధుజీ నన్నాశీర్వదించారు. పాట్నాయక్ గారి అంగ్లోపన్యాసాలు గంగా ప్రవాహాలే.

థర్డ్ ఫారం చేరేసరికి అన్నీ పోయి కవిత్వం పట్టుకొన్నది. అప్పటికే మాకు క్లాసులో ఛందస్సు నేర్పి వున్నారనే మాట వేరే చెప్పక్కరలేదుకదా? ఏకసంథాగ్రాహి అనే పేరు కూడా పుట్టింది. మాస్టర్లు ట్రాన్స్‌ఫరయితే వీడ్కోలు సభలో నా పద్యాలు తప్పకుండా వుండేవి. అప్పటిలో నాకు సీనియర్ విద్యార్థి, ఆ తరువాత గొప్ప విద్వత్కవిగ పేరు పొందిన ఇటీవల స్వర్గస్థులైన వంగవోలు ఆదిశేషయ్యగారితో కలిసి, స్కూలు మూసిన అనంతరం ప్రతిదినం సాయంత్రపు వేళలలో చీరాల పేరాల రోడ్డుపై పచారు చేస్తూ, ఏది కనిపిస్తే దాని మీద ఆశువుగ కవిత్వమల్లుతూ వుండేవాళ్ళం. ఇలా కొంతకాలం కవితాసాధన నడిచింది.

ఆ కాలంలో చీరాలలో తరుచు అవధానాలు జరుగు తుండేవి. అన్నింటిలోనూ నేను పృచ్ఛకుడిగా తప్పక పాల్గొంటూ వుండేవాణ్ణి. ఒక అవధానంలో "మానము పోయెడి నటంచు మగనింబిలిచెన్" అని నేను నిక్కరు కవిగ సమస్య ఇస్తే సభలో అందరు గొల్లున నవ్వారు. ఆరోజులలో నేనూ మా ఆదిశేషయ్యగారు కలిసి, 'క్రొక్కారు' అనే లిఖితమాస పత్రికను నడిపాము.

అదే కాలంలో అంటే 1931-32 మధ్యకాలంలో గూడవల్లి రామబ్రహ్మంగారు గొప్పగ నడుపుతూ వుండిన 'సమదర్శిని' అనే పత్రికలోనూ, భారతి పత్రికకు దీటుగా, లోధ్ర కూనరిగారు నడుపుతూ వుండిన 'గృహలక్ష్మి' పత్రికలోనూ నా పద్యాలు, గేయాలు వెలువడ్డాయి. మరొక మాసపత్రికలో పద్యాలలో రచించిన ఈసపు నీతి కథ ఒకటి కూడా వెలువడింది.

అంతటితో కవితారచనపై మోజుతగ్గి సాహిత్యాధ్యయనం మీదికి దృష్టి మళ్లింది. మా హైస్కూలు లోనే సీనియర్ ఆంధ్రోపాధ్యాయుడైన నారపరాజు సీతారామయ్యగారి పంచ పట్టాను. 'కవిత పుట్టిల్లు ఇంకొల్లు కరణమిల్లు' అని చెప్పుకొన్నవాడు, ఉభయ భాషలపెన్నిధి అయిన వారి వద్ద, శబ్దాలు, అమరం, సుందరకాండ, లఘుకౌముది చెప్పు కున్నాను.

1935 జూలై నెలలో విజయ నగరం వెళ్లి మహారాజా వారి సంస్కృత కళాశాలలో చేరాను. అక్కడ చదువుతూ వుండగా విజయనగర సంస్థానాస్థాన కవీ, బాలకవి అనే ప్రశస్తి పొందిన శ్రీ భోగరాజు నారాయణమూర్తి గారితో సాన్నిహిత్యవేర్పడింది. ఆకాలంలో, కొమర్రాజు లక్ష్మణరావుగారి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారు ప్రకటించిన తొలి నవలల పోటీలో తన *విమలాదేవి* అనే నవలకు ప్రథమ బహుమతి పొందినవాడాయన.

నౌరోజ్, అల్లాహెూ అక్బర్, మొదలైన గొప్ప నాటకాలు, నవలలు వ్రాశారు. రాజావారి హైస్కూల్‌లో నామమాత్రంగా పని చేస్తూవుండే వారు. ఆ రోజులలో రామాయణం రచిస్తూ వుండేవాడు.

ఒకచేత కలం, ఒక చేత సిగరెట్టు పట్టుకొని నాతో మాట్లాడుతూనే పద్యరచన చేస్తూ వుండేవారు. ఎప్పుడు గాని ఒక కొట్టివేత చేసినట్లు ఎరుగను. అదియేమి మేధస్సో! వారి *కంకణము* అనే పద్యకావ్యం ఆ కాలంలో వెలువడిన పద్యకావ్యాలలో మేటి అని చెప్పవచ్చు. ఒక వాన నీటి బొట్టు సముద్రం లోని ఒక ముత్యపు చిప్పలో పడి, ముత్యంగా మారడం దీని ఇతివృత్తం.

ఆకాలపు నవ్య సాహిత్యపరులైన భావ కవులతో ఆయనకు సయోధ్యలేక పోవడంతో ఆ కావ్యానికి తగినంత ప్రశస్తి రాలేదు. ఏనాటి కానాడు సంస్కృత కళాశాలకు ఎగనామం పెట్టి ఆయన వద్ద కూర్చుంటూ వుండేవారు. నాకాయనగారు ఆంధ్ర మహాభారతం లోని నన్నయ్య గారి ఆది, సభా పర్వాలు పాఠం చెప్పారు. అక్కడ నుండి 1936 ఏప్రిలు నెలలో నిడుబ్రోలు వచ్చి ఆచార్య రంగా గారి "రైతాంగ విద్యాలయం" అనే రాజకీయ పాఠశాలలో చేరాను, 1933లో గాంధీజీ తన హరిజన యాత్ర సందర్భంలో ఈ పాఠశాలకు ప్రారంభోత్సవం జరిపారు. నేనప్పటికి 18వ సంవత్సరంలో

ప్రవేశించాను. శ్రీ వి.వి.గిరిగారి వంటి దేశ నాయకు లెందరెందరో వచ్చి ఆయా విషయాలపై మాకు పాఠాలు చెబుతూ వుండేవారు.

సర్దార్ గౌతులచ్చన్న, శ్రీ పి. తిమ్మారెడ్డి, శ్రీ కందుల ఓబుల రెడ్డి గారలు వంటి దేశసేవకులక్కడ నాకు సహాధ్యాయులుగా వున్నారు. ఆ మండలం రోజులలో దేశదేశాల రాజకీయ విధానాలను గూర్చి భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని గూర్చి, ఆర్థిక పరిస్థితులను గూర్చి భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని గూర్చి, ఆర్థిక పరిస్థితులను గూర్చి మాకు వివరంగా చెప్పారు. రంగాజీ, మన ఆర్థిక పరిస్థితులను గూర్చి చెప్పిన నోట్సు ఎం.ఎ. విద్యార్థులు నానుండి తీసుకుపోయి వ్రాసుకున్నారు.

ఆ రాజకీయ పాఠశాల ముగియగానే "కవితాభినివేశం కలవాడు" అంటూ భోగరాజు నారాయణమూర్తి మహాకవి గారిచ్చిన పరిచయలేఖతో బందరు (మచిలీపట్నం)లో ఆంధ్ర విద్యాపీఠం నిర్వహిస్తున్న ఆంధ్రజాతీయ కళాశాల అనే గురుకులంలో ప్రవేశించాను. అక్కడ అడివి బాపిరాజుగారు ప్రిన్సిపాలు, మహాకవి కాటూరి వేంకటేశ్వరరావు గారు సాహిత్యాచార్యులు; ఆంధ్రదేశంలో హిందీ అధ్యాపకులు; దేశభక్తుడూ అనేక గ్రంథకర్తయైన కవివర్యుడు మానికొండ సత్యనారాయణ శాస్త్రి గారు చరిత్ర, రాజకీయ శాస్త్రాధ్యాపకులు, సాహిత్యం, గ్రామ పునర్నిర్మాణము మా పాఠ్య ప్రణాళికలోని ముఖ్యాంశాలు.

1933లో గాంధీజీ హరిజన యాత్రా సందర్భంలో ఇక్కడ గ్రామ పునర్నిర్మాణ విద్యకు ప్రారంభోత్సవం చేశారు. కాటూరి వారు భారతం మొదలు ఆనాటి భావకవిత్వం వరకు గల పురాణ, ప్రబంధ, కావ్య, నాటకాదుల్నీ, అప్పటి తెలుగులో వెలసిన మాలపల్లి వంటి గొప్ప నవలల్ని మాకు పరిచయం చేసి, భావబలం, భాషాబలం చేకూర్చారు.

సంస్కృత కావ్య నాటకాలు కూడా కొన్ని చదివి వినిపించారు. ఇక కులపతి అడివి బాపిరాజు గారి మాటకు వస్తే, ఆయన మాకు బోధించని విషయమంటూ లేదు. భూగోళ, ఖగోళ శాస్త్రాలూ, స్వాతంత్ర్యోద్యమం, జ్యోతిష్యం, హస్తసాముద్రికం, లలితకళలు – ఒకటేమిటి, ఆయనకు తెలిసిన సర్వమూ చెప్పారు. ఒకనాడు, వంకాయ కూరెన్ని రకాలుగా వండవచ్చునో కూడా చెప్పారు. వంటపనిలో ఆయన ఎంత నేర్పరి అంటే – ఆ సంవత్సరంలోనే గుంటూరులో జరిగిన నవ్యసాహిత్య పరిషత్సభలను మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు కృష్ణా ప్రతికలో సమీక్షిస్తూ, "ఈ సభలో చెప్పుకోదగిన రుచికరమైన అంశం, బాపిరాజుగారు శిష్యవర్గంతో కలిసి పాకంచేసిన తోటకూర పప్పు మాత్రమే" అన్నారు. అయితే, అంతటి మహోన్నతులైన గురువుల సాన్నిధ్యంలో వుండి మీరేమి నేర్చారయ్యా అంటే ఎవరి మనస్సు పట్టినంత వాళ్ళు తీసుకుపోయారు.

గురుకులం కనుక, అధ్యాపకులందరు కళాశాల ఆవరణలోని భవంతులలో వుండేవారు. బాపిరాజు గారక్కడ తల్లివలె, కాటూరివారు తండ్రివలె మమ్ములను దయతో చూస్తూ వుండేవారు. రాత్రి భోజనాలైన పిమ్మట వెళ్ళి చూస్తే, బాపిరాజుగారు తమవాటా ఇంటి పంచలో, చాపవేసుకొని గోడకానుకొని కూర్చుండి గేయాలో, కథలో, నవలలో వ్రాస్తూ కనిపిస్తారు.

ఆయింటి అవతలి వాటాలో పంచలో పడక కుర్చీలో కూర్చుండి, చుట్ట కాలుస్తూ, మధ్యమధ్య లేచి ముందుగదిలో టేబులు మీద పెట్టి వున్న కాగితాలపై ఏవో పద్యాలెక్కించి తిరిగి వచ్చి కూర్చునే కాటూరి వారు కన్పిస్తారు. బాపిరాజుగారి వద్ద నాకు అమ్మ దగ్గరున్నంత చనువుండేది. వారి శశికళ ఆంధ్రకవితాలోకంలోని ఒక గొప్ప ఊహాసుందరి. తుఫాను నవల బాపిరాజుగారు చెబుతూవుంటే వ్రాసింది నేను. వారి కొన్ని స్వంత జాబులు కూడా నాకు చెప్పి వ్రాయించేవారు. ఎక్కడో చూస్తూ, పరిసరాల స్పృహలేని వానివలె బాపిరాజు గారు చెప్పి వ్రాయిస్తూ వుంటారు.

నిజజీవితంలో బాపిరాజుగారి మతిమరపు చెప్పతరంకాదు. ఒకనాటి ఉదయం, బామ్మగారు, అంటే వారి తల్లిగారు, బియ్యం కొనితెమ్మని వారిని బజారు పంపారు. బాపిరాజుగారు బజారుకు వెళ్ళి, అక్కడ కనిపించిన మల్లాది రామకృష్ణ శాస్త్రి, జరుక్ శాస్త్రి, పింగళి నాగేంద్రరావు గార్లతో కలసి, మంజప్ప హోటలులో కాఫీ సేవించి తనకు ప్రియమైన కుటికుర పౌడరు డబ్బా, గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టు పెట్టె కొనుక్కొని పాటలు పాడుకొంటూ మహోల్లాసంతో ఇల్లు చేరారు. ఎసరు పొయ్యి మీద పెట్టి ఎదురుచూస్తున్న బామ్మగారు "బాపిరాజు! బియ్యం ఏవిరా" అంటే, "బియ్యమేమిటే అమ్మా ! అని ఆయన అంటూ వుంటే, ఆ దృశ్యం చూస్తూ వుండిన కాటూరి వారు

తమ కుమార్తె చేత బియ్యం పంపారు. ఇలాటి సందర్భాలు నవ్వు పుట్టించేవే అయినా కాటూరివారు నవ్వలేదు సరికదా, వారి ముఖంలో విచారం ద్యోతకమైంది.

ఇక్కడ, ఆ త్రిమూర్తుల మాట ఒకటి చెప్పాలి. మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు, పింగళి నాగేంద్రరావు, గారు, చిట్టి గూడూరు ప్రాచ్యవిద్యాలయంలో ఉభయ భాషాప్రవీణుడై వచ్చిన జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారు రచనా వ్యాసంగంతప్ప మరేపని పాటలు లేని వాళ్ళు, స్వేచ్ఛగల బందరు రోడ్లమీద పచారులు చేస్తూ సాయంత్రమయ్యే సరికి కృష్ణా పత్రికా దర్బారుకు చేరతారు. మల్లాది వారు మూడు చుక్కల కథలు, నాగేంద్రరావు గారి నాటకాలు, సమీక్షలు, జరుక్ శాస్త్రి ప్యారడీలు బాగా పేరు పొందేయి.

వేంకటేశ్వరరావు గారికి నేను కన్నకొడుకును కాకపోయినా కన్న కొడుకులను మించిన కొడుకునైనాను. అది నాభాగ్యం, నా పుణ్యఫలం, సెలవులలో ఆయన నన్ను తమ స్వగ్రామమైన కాటూరుకు వెంటబెట్టుకు వెళ్లేవారు. ఎందుకు? నా సాహిత్యాభ్యాసానికి అంతరాయం రాకూడదని. తొలిసారి కాటూరు వెళ్లినప్పటి ఉదంతం మనవిచేస్తాను. ఆకాలంలో పల్లెటూళ్లలో కులభేదాల సంగతి తమకు చెప్పనక్కరలేదు కదా?

ఆ తండ్రి నన్ను బహిర్భూమికి వెంట తీసుకువెళ్లారు. తమ పొలం చూపించారు. అవిభక్త కుటుంబపు వంద ఎకరాల మాగాణిలో వారిది యాభై ఎకరాలు. ఇంటికి వెంటబెట్టుకు వచ్చి, పండ్లుతోము కోవడానికీ, స్నానం చేయడానికి ఏర్పాట్లు చేయించి, అనంతరం 'జిస్కా' అనే ఇంగ్లీషు నవల నాచేత పెట్టి ఇంటి ముందు గదిలో కుర్చీలో నన్ను కూర్చుండబెట్టి వారు గ్రామంలో బంధు మిత్రులను చూడ్డానికి వెళ్ళారు. "జిస్కా" పునర్జన్మల నవల. ఐదు జన్మలలో ప్రియుణ్ణి వెన్నాడుతూ వచ్చే ఒక ప్రియురాలి అద్భుతకథ. ఏనాటినవలో అది! ఇటీవల దాని పునర్ముద్రణ ప్రతులు బుక్‌స్టాల్సులో కన్పించాయి.

కాటూరి వారి ప్రస్తావన వచ్చినప్పుడు "నాన్నగారు" అనడం నాకు అలవాటు. ఈ కారణం చేతనే, వారిని బాబాయి గారు అని పిలిచే "త్రివేణి" సంపాదకులు శ్రీ భావరాజు నరసింహారావు గారు నన్ను తమ్ముడని సంబోధించారు. నాటి భోజనవేళకు నాన్నగారు ఇంటికి తిరిగి వచ్చారు. వారు స్నానాదికాలు ముగించుకొనగానే, ముందుగది వెనకటి వసారాలో అమ్మగారు పీటవేసి, విస్తరి పెట్టి నాకు వడ్డించి "మీరురండి అంటూ వంటగదిలోనికి ఆహ్వానించారు. అమెకెరుకే నాపై నాన్నగారికి నేనంటే ఎంత వాత్సల్యమో. నాన్నగారేమన్నారంటే "ఎందుకు? కొండయ్య ప్రక్కనే పెట్టునాకు" అన్నారు. (వారి పెద్దకుమారుని పేరు కొండలరావు.) అతన్ని ఇంటిలోని వారందరూ కొండయ్య అంటారు. నన్ను ఇంటిపేరు కలిపి కొండయ్య అనేవారు: కొండలరావును మాత్రం కొండయ్య అని మాత్రమే అనే వారు.

అప్పటికి నేను పూర్తిగా సన్యాసి అవతారమెత్తలేదుకాని, సాత్వికాహారిని మాత్రం. "అంతకారం కూర అతడు తినలేదు. పప్పుపెట్టి నెయ్యి వెయ్యి తిన్న తర్వాత పెరుగు పొయ్యి" అంటూ, అమ్మగారికి సలహాలిస్తూ తాను భోజనం చేశారు. ఎప్పుడైనా అదృశ్యం జ్ఞాపకం వస్తే కళ్ళు చెమరుస్తాయి. నాన్నగారికి నా మీద ఎంత కరుణ అంటే ఉదయం పూట కళాశాల కాగానే, వారు భోజనం చేసి, విశ్రాంతి తీసికొని, నేనుండే గది తలుపుతట్టి, లోపలికి వచ్చి బల్ల మీద కూర్చుండి, భండార్కర్ వ్యాకరణ పాఠం చెప్పి వెళ్ళేవారు.

కాటూరి వారి సంపదను వారి ఔదార్యం సఫలం చేసింది. వారిని ముట్నూరి వారు 'గుప్తదాత' అని అంటూవుండేవారు. ఒక చేతితో ఇచ్చినది రెండవ చేతికి తెలియనిచ్చేవారు కారు. పెండ్లిండ్లకు, పేరంటాలకు, కష్టసుఖాలకు వారి సహాయం పొందని కవి పండితులా కాలంలో లేరంటే అతిశయోక్తికాదు. ఇలా అడగకుండానే తన కుమారుని పెండ్లికి సహాయం పొందిన మహాకవి ఒకరు ఆ వృత్తాంతాన్ని ఒక కథగ చెప్పారు నాకు. కొందరు అప్పు పేర తీసికొనేవారు. వారు తిరిగి ఇస్తే తీసికొనేవారు. ఇవ్వకుంటే అడిగే వారుకాదు.

అప్పటికి నా అవతారం మారిపోయింది. తిరుక్షవరం చేసిన తల, మొలకు అంగవస్త్రం, మీద తుండుగుడ్డ, పండ్ల తిండితో తీవ్రహఠయోగాభ్యాసినైనాను. తెల్లవారుజామున నాలుగు గంటలు లగాయతు ఉదయం ఏడు గంటలవరకు ఆసనాలు వేసి, ధాతి, వస్తి మొదలగు క్రియలు చేస్తూవుండే వాణ్ణి. ఒక్క శీర్షాసనమే 45నిమిషాలు సేపు వుంచే వాణ్ణి, వృక్షాసనం మునివేళ్ల మీద వేయగలిగే వాణ్ణి. బక్కగా వున్నా, చేయి పట్టుకుంటే ఏనుగంతబలశాలియైనా విడిపించు

కోలేనంత స్థాయి శక్తి వచ్చింది. ఎవరైనా నన్ను గూర్చి ఒకమాట అనుకొంటే, ఆ మాట వెంటనే స్ఫురించేది. బ్లాక్ బోర్డుమీద చాక్‌పీస్‌తో రాసినట్టు మనస్సుకు తోచేది. అనంతరం ఆ వ్యక్తి కనిపిస్తే అడిగి ఆమాట రుజువు చేసికొనేవాణ్ణి. నాకేదయినా కావాలనిపిస్తే వెనువెంటనే ఎవరో ఒకరు తమంతతాము తెచ్చి ఇచ్చేవారు.

ఒక ఉదాహరణ: ఒకనాటి మధ్యాహ్నవేళ పూజ్యురాలైన నా తల్లిగారు నన్ను చూడగోరుతున్నట్లనిపించింది. సాయంత్రం, బందరు నుండి విజయవాడకు వెళ్ళే రైలుంది. దాన్ని పట్టుకోవాలి. చేతపైసాలేదు. అయినా చేతి సంచి పట్టుకొని బయలుదేరాను. అందులో ఏముంది? మరొక అంగవస్త్రం, మరొక తుండుగుడ్డ, మరొక గోచి, భారతం ఆది సభాపర్వాలు వావిళ్ల ప్రతి వున్నాయి. ఆరోజులలో ఆ రెండు పర్వాలు మరొకసారి కాటూరి వారి దగ్గర చెప్పుకొంటుండే వాణ్ణి. అలా ఆ సంచి ఒక చేత, గొడుగు మరొక చేతిలో పట్టుకొని తలవంచుకు నడుస్తూ వుంటే, కళాశాల ఆవరణం దాటకుండానే కాటూరి వారెదురు వచ్చి నాకు రెండు రూపాయలిచ్చారు.

"ఎందుకది?" అని అడిగాను. నాన్నగారు నివ్వెరపోయి "దానికేమిటి? మీరు అవధూతలు, మేము గృహస్థులం; ఇది మా కర్తవ్యం" అన్నారు. ఈ సారి నివ్వెర పోవడం నా వంతైంది "నన్ను మీరు అనకండి" అంటూ వారిని తప్పుకొని చరచరా నడిచి వెళ్ళాను. బందరునుండి చీరాలకు రైలు టిక్కెట్టు వెల సరిగ రెండు రూపాయలే! రైలు స్టేషన్ చేరి టికెట్టుకొని రైలెక్కాను. చీకటి పడుతూవుండగా రైలు విజయవాడ స్టేషను చేరింది.

అక్కడ దిగి, మదరాసు ప్యాసింజరెక్కి కిటికీ వద్ద కూర్చుండి చూతును కదా, విజయవాడ కనకదుర్గమ్మ కొండ మీద ఒక నక్షత్రం వెలుగుతూ కనిపించింది. దగ్గరున్న ఏదో హోటలు నుండి సన్నగా గ్రామ్‌ఫోను పాట వినిపిస్తుంది. ప్లాట్ ఫారం మీద రవాణాకు సిద్ధంగా గుట్టపడి వున్న చేమంతి పూల బుట్టలనుండి మెల్లమెల్లగ సువాసనలు బైట పడుతున్నాయి. "గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అని కదా నండూరి సుబ్బారావుగారన్నారు? నాకు మాత్రం నోటిలో ప్రాణవాయువు అక్షరాకృతి పొందుతున్నట్లనిపించింది. నిజానికి మనలోనిగాలేకదా నోటి యంత్రంలో దంత్య, తాలవ్య, ఓష్ఠ్యోదులై శబ్దాకృతులను పొందుతుంది?

**ఎవరవో నీవెవరవో / ఎవరవో నీవెవరవో॥**
**కొండమీదే వుండి నవ్వే / చిన్ని చెక్కా చెప్పవానా ॥కెవరవో॥**
**వాసనలతో విచ్చి పిలిచే / చిన్ని పూవా చెప్పవానా**
**చీకటంతా చీల్చి పాడే / చిన్ని గొంతాచెప్పవానా ॥కెవరవో॥**

ఈ పాట అప్రయత్నంగా బయట పడింది. బాపిరాజు గారి ప్రభావం తెలియకుండానే ఎలా పనిచేసిందో ఆ పాట చెప్పకుండానే చెబుతుంది. దీనితో గేయరచనకు శ్రీకారం చుట్టినట్లయింది. కాటూరి నాయనగారు క్లాసులలో రవీంద్రుని గీతాంజలి, స్ట్రేబర్డ్‌ని, సాధన వంటి కవితలు, తాత్విక ప్రబంధాలు మాకు తరుచు చదివి వినిపిస్తూ వుండేవారు. వీటి ప్రభావంకూడా మనసు మీద బాగా పనిచేసింది. అది మొదలు చాలా గేయాలు బైటపడ్డాయి. కూనిరాగం తీస్తూ పాడుకొంటూ వుండేవాణ్ణి. ఒక సహాధ్యాయి ద్వారా వేణువుపై కొంతకాలం సంగీత సాధన చేసి వుండడం చేత సంగీత జ్ఞానం కొంచెమలవడింది. 1932లో అంతర్వాణియై పోయిన కవిత్వ ధోరణి ఇప్పుడీ విధంగా గేయ రూపాన వెలువడిందన్నమాట.

ఒకనాడేం జరిగిందంటే ఉబ్బసం వ్యాధి పీడితుడైన పోతరాజు సీతారామారావు అనే సహాధ్యాయి దగ్గిదగ్గి తూలిపడబోతే, నేను ఒడిలో పడుకోబెట్టుకున్నాను. నా నోటినుండి "ప్రాణమా! ప్రాణమా! చలియించు ప్రాణమా! జ్వలితయించు ప్రాణమా!" అనే పాట బయలు దేరింది.

ఆ పాట పాడుతూ వుంటే, అతడు కొంచెం సేపు ఒడిలో నిద్రపోయి, నవ్వుతూ లేచాడు. నేనప్పుడు గేయాలు బాగాపాడుతుండేవాణ్ణి. పాటలన్నీ దార్శనిక ప్రణయగేయాలే; సూఫీ కవితకు దగ్గర గేయాలన్నిటికీ పల్లవి వుండేది. పల్లవి పెట్టడంలో నాకు నేర్పు ఉందనీ బాపిరాజుగారంటూ ఉండేవారు. ఆ పాటల సంగతి కాటూరి వారు పసిగట్టి ఒకనాడు ముట్నూరి వారి కృష్ణాపత్రిక దర్బారులో, "కొండయ్య పాటలు వ్రాస్తాడు" అని వెల్లడించారు. ముట్నూరివారు తల పంకించారు చదవమన్నట్లు, పాడాను.

ఆ మరునాటి దర్బారులో ముట్నూరి వారు ఆపాటను గురించే మాట్లాడినట్టు తెలిసింది. రోజూ వెళ్ళే అలవాటే ఉన్నా ఆ రోజెందుకో నేనటువెళ్ళలేదు. "అవి వ్రాసి వెంకట్రావు గారికివ్వు" అని కాటూరి వారాదేశించారు. మరుసటి వారపు కృష్ణాపత్రికతో మొదలు పెట్టి ఆ పాటలు "చిరంజీవి పాటలు"

అనే శీర్షికతో వెలువడనారంభించాయి. కమలాకర వేంకటరావుగారు కృష్ణాపత్రికలో అసిస్టెంటు ఎడిటరు; ప్రసిద్ధ చలన చిత్ర దర్శకుడైన శ్రీ కమలాకర కామేశ్వరరావుగారి అన్నగారు.

ఒకనాడు వారి యింటిలో నేనుండగ, కాగడా పత్రిక సంపాదకులు శ్రీ తాపీ ధర్మారావుగారు అటువచ్చి నన్ను చూచి, తెలిసికొని కొన్ని పాటలు పాడించి విన్నారు. వానిలో ఒక పాట తీసుకుపోయి 'కాగడా' పత్రికలో ప్రచురించారు. అప్పుడా పత్రిక మద్రాసు నుండి వెలువడుతుండేది. దాని కటింగు తీసికొని శ్రీవేమూరి ఆంజనేయ శర్మగారొకనాడు నరసింహమూర్తి గారి యింటికి వచ్చారు. అప్పుడు నేనక్కడే వున్నాను. "నరసింహమూర్తిగారు! చూడండి ఈ పాట ఎంతగొప్పగా వుందో" అంటూ ఆయన ఆ కటింగు నరసింహమూర్తిగారి చేతికందించారు. దాని రచయితను నేనేనని తెలిసికొని వారాశ్చర్యపోయారు.

**ఆపాట: చీకటోయ్ ! చీకటోయ్ ! / లోకమంతా చీకటేనోయ్ !**
**కనుమూత విప్పుకోయ్ / కాళరాత్రోయి! ॥వగైరా॥**

నేషనల్ కాలేజీలో తటస్థపడిన ఇరువురు ప్రముఖుల మాట ఇప్పుడక్కడ స్మరింపక తప్పదు. ఒకరు ప్రభాకర్జీ; నా సహాధ్యాయి; అనంతపురంవాడు; హరిజన క్రైస్తవుడు. నా ప్రోత్సాహంతో సేవాగ్రాం వెళ్లి, గాంధీజీకి సన్నిహితుడై, వారి ముఖ్య శిష్యుడుగా, భారతదేశమంతటా గాంధేయుల చేత భాయిజీ అని పిలువబడిన వాడు. అతడు కాలేజీలో వుండగా బాపిరాజు గారికి నమ్మినబంటు, రెండవాడు వెంపటి పెదసత్యం.

బాపిరాజుగారి వలన నాట్యశాస్త్ర విశేషాలు తెలిసికోగోరివచ్చి, కొన్నిరోజులక్కడ వున్నాడు. నేనప్పటికే బాపిరాజుగారి ప్రోత్సాహంతో అభినయ దర్పణం. భారతశాస్త్రం అధ్యయనం చేసివుండటం చేత సత్యానికి నోట్సు వ్రాసియిచ్చాను. అతడు ఆ తరువాత గొప్ప నాట్యాచారుడై, చలన చిత్రాలకు డాన్సు డైరెక్టరై ప్రసిద్ధి పొంది, చాలాకాలం తరువాత హైదరాబాదు వచ్చినప్పుడు, నాయింటికి వచ్చి, "అన్నా! నీవిచ్చిన నోట్సు నావద్ద భద్రంగా వున్నాది." అన్నాడు.

కృష్ణాపత్రికా స్వరూపులైన ముట్నూరి కృష్ణారావు పంతులుగారు తెప్పించుకొన్న "తాండవ లక్షణమ్" అనే ఆంగ్ల గ్రంథం నావద్ద వున్నది. దానిపై ము.కృ. అని వారి సంతకం కూడా వున్నది. దానిని సత్యానికి బహూకరించి పంపించాను. ఆ గ్రంథాన్ని గూర్చి ఇక్కడ ఒకటి రెండు మాటలు చెప్పవలసి వున్నది. దానిని సంకలనం చేసి, ఆ గ్రంథం తెనుగులోనికి అనువదించి ప్రచురించినవారు ముగ్గురు మదరాసు ప్రభుత్వంలో చాలా పెద్ద ఉద్యోగాలు చేసి రిటైరైన వాళ్ళు. ఈ గ్రంథంలోని ప్రత్యేకత ఏమంటే – చిదంబరం నందలి నటరాజాలయంలోని 108 కరణాల, 32 అంగహారశిల్పాల చిత్రాలు ముద్రించారు.

రోజూ సాయంత్రం కృష్ణాపత్రికా దర్బారుకు హాజరవుతూ వుండేవాణ్ణి. బందరులోని కవిపండిత, దేశభక్త బృందమంతా అక్కడ చేరుతుండేది. వారేదో ఒక విషయం ఎత్తికొని మాట్లాడుతుండేవారు. సాహిత్యం, లలిత కళలు, రాజకీయాల మీద, వేదాంతం మీద చర్చలు జరుగుతుండేవి. మాట్లాడి మాట్లాడి ఏకంగా అందరు చర్చ ఆపి, అందరూ చిరునవ్వుతో మైనియో ఆలకిస్తున్న ముట్నూరి వారి వంక చూచేవారు.

అప్పుడాయన అనర్గళంగా, కవన భూయిష్టంగా, తీర్పు చెప్పేవారు. ఆయన విజ్ఞాన సర్వస్వం వంటివారు; ఆ మధురభాషణం, ఆ భాషణావేశం ఆకనులలోని వెలుగు చూచి తెలిసికోవలసిందే కాని చెప్పి చూపలేము. అంతకు కొంత కాలం వెనుక బందరు టౌను హాలులో వారు రోజూ రెండు మూడు గంటల వంతున పరిణామవాదంపై 18 దినాలు ప్రసంగించినట్లు కాటూరి నాయునగారి వలన తెలుసుకొన్నాను.

తామారంభించిన ఉపనిషత్యారాలలో పాల్గొనమని దయతో వారు నన్నాజ్ఞాపించినప్పుడు, ప్రతిదినం సాయంకాలంలో కృష్ణాపత్రిక కార్యాలయం మీది గదిలో వారి జ్ఞానతేజాన్ని ఒక సంవత్సరం కాలం ప్రత్యక్షంగా చూచే భాగ్యానికి నోచుకొన్నాను. వారు తెలుగులో ఉపన్యసిస్తూనే పట్టరాని జ్ఞానావేశంతో కన్నులు వెలుగుతూ వుండగ ఇంగ్లీషులోకి వెళ్ళిపోయేవారు.

ఒకనాడు ఈ శోషనిషత్సారం చెబుతూ, కృతగ్, స్మర, కృతగ్ంస్మర" అనేటప్పుడు, Remember what you have done, remember what you have done అంటూ పెద్దకేకలు పెడుతూ వుంటే, వేదాలే అరుస్తున్నట్లు, హెచ్చరిస్తున్నట్లు తోచేది. వారు అరవిందుల యోగ

సమన్వయతత్త్వం మాకు బోధించారు "యథాతథ్వదోర్వాన్ వ్యధాధత్ శాశ్వతఈఖ్యస్య మాభ్యరి" అనే ఉపనిషత్సూత్రం. ఎక్కడ ఏది ఎలా ఉండాలో ఎల్లప్పటికి అక్కడ ఆదిపరమేశ్వరుడు ఏర్పరచి వుంచాడనే అర్థం కలదికదా: ఈ సిద్ధాంతం ప్రకారం మతాలన్నిటికి ఎక్కడ దేనికి స్థానమిస్తే విశ్వజనీన మతమేర్పడుతుందో యోగ సమన్వయం చెబుతుంది.

పూజ్యురాలైన తల్లిగారు నా ఆహారవేషాలు చూచి బాధపడుతుండడం గమనించి ఆరెండింటినీ మార్చుకొని, విశ్వనాథ సత్యనారాయణగారి "డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు రాని పాదుకాలాన్ని వెంటబెట్టుకొని, కళాశాలనుండి గుంటూరు చేరాను అక్కడ శారదానికేతనంలో అప్పుడు విద్వత్కవి శ్రీ వావిలాల సోమయాజులగారు ప్రిన్సిపాలుగా, ఉభయభాషా ప్రవీణుడు, సాహిత్యరత్న మిత్రుడు రాచకొండ నరసింహమూర్తి గారు ఉపాధ్యాయులుగ పనిచేస్తుండేవారు. వారి వలన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారి పరిచయమేర్పడింది.

అక్కడ చిన్న పిల్లలిద్దరికి వారు నన్ను ట్యూటరుగా నియమించారు. శారదానికేతనం మహిళలకు చేసిన సేవలను గూర్చి, ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతుల గొప్పదనాన్ని గూర్చి మీ అందరకూ తెలిసిందే. అప్పటికి చాలాకాలం క్రితం వెలువడి ఆగిపోయిన దేశాభిమాని అనే వార పత్రికలు శ్రీపాములచెట్టి వెంకట కృష్ణయ్య చౌదరిగారు పునరుద్ధరిస్తూ దానికొక సహాయ సంపాదకుడు కావలెనని శ్రీ ఉన్నవ వారికి వ్రాశారు. వారు నన్ను పంపారు. అంతకు ముందు మదరాసు నుండి కొన్ని మాసాల పాటు వెలువడి ఆగిపోయిన హారతి అనే మాసపత్రికలో కొంతకాలం పనిచేసి వచ్చాను. ఆ కాలంలో డిగ్రీలు లేని పాండిత్యం పత్రికల వారికి మాత్రమే పనికి వచ్చేది.

దేశాభిమానిలో పనిచేస్తూవుండగనే 1942 ఆగష్టు క్విట్టిండియా ఉద్యమం చెలరేగింది. కలెక్టరేటులో ఒకనాటి రాత్రి టెలిఫోను తీగలు తెంపడానికి యత్నించి, చాల ఎత్తునుండి క్రింద పడ్డాను. ఎడమకాలు తొంటి ఎముకమూలం చిట్లిపోయింది. స్వగ్రామం పేరాల చేరాను.

పోలీసులకు భయపడి, ఇంటిలోనే వుంటూ, 'గచ్చాకు పుచ్చాకు' కట్టులుకట్టితే బాధ తీరిందే కాని కుంటితనం మిగిలింది. కవిత్వం మరల అంతర్వాహినే అయింది. 1947 స్వాతంత్ర్య దినోత్సవంనాడు ప్రజాబంధు శ్రీప్రగడ కోటయ్యగారు, 'చేనేత' అనే వారపత్రికను ప్రారంభించి నా సహాయం కోరితే, నిడుబ్రోలు వెళ్లి దానికి వర్కింగ్ ఎడిటరుగ 1950 వరకు పనిచేశాను. ఆ పత్రికలో పిచ్చాపాటి అనే కబుర్ల కాలమూ 'ఈ వారం కందాలు' అనే రాజకీయ పరిహాసం పద్యాలూ వారం వారం వ్రాసే వాణ్ణి. ఆ కాలంలో ఆంధ్రప్రభలో సీనియర్ సబెడిటరుగ వున్న శ్రీ నార్ల వేంకటేశ్వరరావు గారూ, ఆంధ్రదిన పత్రికలో పనిచేస్తూ వుండిన శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావుగారూ, ఇవి చూడడం కోసం మా పత్రిక ఆఫీసుకు వ్రాసి తెప్పించుకొన్నారు. మరికొన్ని పత్రికలు "ఈవారం కందాలు"ను తమ పత్రికలలో పునర్ముద్రించుకొనేవి.

అక్కడ నుండి గుంటూరు వెళ్లి శ్రీ కోటయ్యగారి సహాయంతోనూ, శ్రీశ్రీ, ఆకురాతి ఆంజనేయులు గారి సహకారంతోనూ, 'చేనేత' పత్రిక సంపాదకులుగ వున్న శ్రీ దామర్ల రమాకాంత రావు గారి తోడ్పాటుతోనూ 'భారత్' అనే వారపత్రిక నడపడానికి యత్నించాను. అది రెండు నెలలు నడిచి ఆగిపోయింది. అనంతరం విజయవాడ లోని కేంద్ర చేనేత సహకార సంఘంలో పబ్లిసిటీ ఎసిస్టెంటుగా చేరాను. రెండేండ్ల అనంతరం ఆ ఉద్యోగం మానుకొని, దేశికవితామండలి వారికి రచయిత నైనాను. ఇంతలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం 1956 నవంబరు 1వ తేది దగ్గరకు వచ్చింది. నేత పత్రికకు సంపాదకుడుగ హైదరాబాదు రావలసిందని మాన్య మిత్రులు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి నుండి పిలుపు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నాటి ఉదయవేళ హైద్రాబాదు చేరాను.

అక్కడ రెండేళ్ళు పనిచేసి, హైదరాబాదు రేడియో స్టేషనులో గ్రామీణశాఖలో స్క్రిప్టురైటరుగా చేరాను. ప్రసిద్ధ నవలా కథా రచయిత త్రిపురనేని గోపీచంద్‌గారు ఆశాఖలో ప్రొడ్యూసరు. ఆయన గొప్పదనం మీరందరెరిగిందే. ఆయన గారు చండశాసనుడు. ప్రతిదినం సాయంత్రం ప్రసారమయ్యే గ్రామీణ కార్యక్రమాలకు ఏదో ఒకటి వ్రాయ వలసిందని పురమాయించేవారు. 'జరత్కారువు' వంటి నాటకాలూ, ప్రమద్వర వంటి నాటికలూ రేడియో కోసం ఎన్నో వ్రాశాను.

హైదరాబాదు నుండి వెలువడుతున్న కృష్ణాపత్రికలో 1963లో చేరి, దాని సర్క్యులేషన్ 3,500 నుండి 8,500 వరకు వృద్ధి చేయగలిగాను. 1963లో ఇదేహాలులో

కృష్ణాపత్రిక వజ్రోత్సవ సభ జరిగినప్పుడు, పెద్దలకు దూరాన వుండి ఒక మిత్రునితో మాట్లాడుతున్న నన్ను గమనించిన విశ్వనాథ సత్యనారాయణగారు రివ్వున బాణంవలె నావైపు వచ్చారు. ఏమంటారోనని జంకాను. ఆయన నాకళ్ళలోనికి చూచి, 'కృష్ణాపత్రిక' ప్రత్యక్షరం రమ్యముగా నున్నది" అంటూ వచ్చినంత వేగంతోనూ మరలివెళ్లారు. జర్నలిస్టుగా నాకది గొప్ప కితాబు.

దేవునికంటే నాకు మిన్నయైన నా తల్లి ఇక్కడ 1960లో స్వర్గస్థురాలైనప్పుడు, పాడు పడిన బావి, ఇల్లు కల ఒకటిన్నరెకరం పొలంకొని అందులో ఆమె తులసికోట కట్టించాను. ఆ పొలంలో పదేళ్ల పాటు శ్రీనాథ వ్యవసాయం చేసి, దాన్ని విక్రయించి చిన్న ప్రెస్సుకొన్నాను. దాని ఆధారంతోనే గురుదేవులైన మహాకవి కాటూరి వేంకటేశ్వరరావు గారి పేర, కాటూరి కవితాపీఠంనే నెలకొల్పుకొని, ప్రసిద్ధ పద్యకవుల గ్రంథాలు వెలువరించడమైనది.

మానసిక శక్తిపై విశ్వాసం కల వాడనని మీరీపాటికి తెలిసి కొని వుంటారు. చిట్ట చివరి రోజులలో ఒక అద్భుతం జరిగి నాటినుండి కవితా ఝరి నిర్విరామంగ పొంగి ప్రవహి స్తున్నది. నాకు తెలియ కుండగనే నోటిలో ఒక పద్యం ఆడింది. ఇంచుమించుగ అరవై ఏండ్ల క్రితం యువ గేయకవిగ ఇంతో అంతో పేరు తెచ్చుకొన్న నోట పద్యం పుట్టడం నాకు ఆశ్చర్య మనిపించింది.

మానసిక శక్తిపై విశ్వాసం కల వాడనని మీరీపాటికి తెలిసి కొని వుంటారు. 1989 చిట్ట చివరి రోజులలో ఒక అద్భుతం జరిగి నాటినుండి కవితా ఝరి నిర్విరామంగ పొంగి ప్రవహిస్తున్నది. ఏదో తెలియని ఒకచోటనుండి భగవాన్ సత్యశాయికి సంబంధించిన కరపత్ర మొకటి మధ్యాహ్నం పోస్టులో వచ్చింది. వెంటనే నాకు తెలియకుండగనే నోటిలో ఒక పద్యం ఆడింది.

ఇంచుమించుగ అరవై ఏండ్ల క్రితం యువ గేయకవిగ ఇంతో అంతో పేరు తెచ్చుకొన్న నోట పద్యం పుట్టడం నాకు ఆశ్చర్యమనిపించింది.

**"శరణము సత్యశాయికి ప్రశాంతి పదస్థునకున్, ప్రసన్నతా**
**కరుణకు, లోకపూజ్యున, కఖండ కృపాపరతంత్రవర్తికిన్**
**గురునకు, సృష్టిలోన తనకున్ ప్రతిబింబము చూచు వానికిన్**
**శరణము సర్వజీవ భయశంకల తీరిచిప్రోచుస్వామికిన్"**

అలా విడువకుండ పద్యాలు పుట్టుకొస్తూనే వున్నాయి. రాత్రి 10 గంటల వరకు 19 పద్యాలు వ్రాసి భోజనం చేసి పడుకొన్నాను. మొదటి ఖండకావ్య సంకలనమైన "వానవచ్చె - వరదవచ్చె"లో ఈ పద్యాలు వెలువడ్డాయి. రెండవది 'చాకిరేవు' దీనికి తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ పద్యకావ్య పురస్కారమీయడం మీకు తెలిసిందే. దీనికే యలమంచిలి లోని శిష్టా 'చిన్ని' స్మారక పురస్కారం. కోరుట్లలోని భారతీసాహిత్య సమితి వారి వానమామలై వరదాచార్య పురస్కారము 'కవిపితామహా' బిరుదము లభించాయి. ఐదవది 'మృత్యుమాత' విద్వత్కవి ఆచార్య బిరుదురాజు రామరాజుగారు దీనిని 'అమృతోపాయనము' అన్నారు. కవియైన ఒక వృద్ధుడు లోకుల శీలభ్రష్టతను చూడలేక మృత్యువుతో మొరపెట్టు కొంటాడు. "అమ్మా! ఇకచాలు, నన్ను తీసుకుపొమ్మని" మృత్యువంటుంది కదా ''నాయనా? నీవేకారణం చేత తీసుకుపొమ్మంటున్నావో, ఆ కారణం చేతనే నీవిక్కడవుండక తప్పదు. తరుణం రాగానే నేనే తీసుకుపోతాను" అంటూ మృత్యువు అతణ్ణి గృహోన్ముఖుణ్ణి, కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది.

ఆరవది 'యుగయుగమ్ముల భారతీయుడనునేను'' అనేకావ్యం. భారతీయ సంస్కృతిని ఉద్ఘాటించే 324 పద్యాలివి. ఏడవది ప్రతిబింబాలు' అనేది. ఇది ఖండకావ్య సంకలనమే. ఇక ఎనిమిదవది గృహిణి ఆయా పరిస్థితులలో ఉత్తమ ఇల్లాలు ఎలా ప్రవర్తిస్తుందో తెలిపే మనోహరమైన 18 కల్పిత పద్యకథల కావ్యమిది. తొమ్మిదవది "నిర్వేదము" భారతదేశం ఎన్నివిధాలుగా పాడుబడి పోయిందో చెప్పుకొని యేడ్చే 300 పద్యాలివి. 9 కాండలలో దేశ రాజకీయ, సాంఘిక, నైతిక సమస్యలనూ, ప్రజాల కష్టసుఖాలను అనుతాపంతో ఆలోకించిన పద్యకావ్యమిది.

పదియవది ''స్కూలుకి పోతున్నానేను'' అనే 27 చతురబాలగేయ సంభాషణలు. ఇప్పుడు రచన సాగుతున్న బృహత్కావ్యం 'రామబాణము' స్రవంతి సాహిత్య మాసపత్రికలో నెలనెలా దాదాపు రెండేళ్ళుగా వెలువడుతున్నది. ఇది మహాకవి దాశరథిగారికి, విశ్వకవి సినారె గారికీ సంయుక్తంగా అంకితమీయబడినది. 79 ఏండ్ల ఈ వయస్సులో ఒకటో అరో పద్యం వ్రాయకుండ దినం కడవదు. ఊపిరితో కలసి పేనుకుపోయినదా కవనతంతువు. వినయ వినమితుడనై కవిలోక శుభాశాసనములు ప్రార్థిస్తున్నాను. శుభం.

# అట్టమీది బొమ్మలు

**మ**ధ్యయుగంలో పరమ ప్రేమనే భక్తిగా భావించటం వలన ప్రేమకు అత్యున్నతమైన శృంగారం భక్తి భావంలోకి ప్రవేశించింది. భగవంతునికి అర్పించే భక్తి భావాల్ని రతితో పోలుస్తూ బృహదారణ్యకోపనిషత్తులో "యథాప్రియాయ... పరమ భక్తి రతిశయిత ప్రీతిః" (బృ. ఉపనిషత్తు 4.3.21 ప్రకారం) అని పేర్కొనటం జరిగింది.

ప్రియురాలి పరిష్వంగంలో ప్రియునిది బాహ్యాంతరస్పృహలు నశించి పోయినట్లు భగవంతుని పరిష్వంగణలో జీవునికి బాహ్యాంతర భేదం ఉండకూడదనే భావన వలన భక్తుడు ఆత్మకాముడు (అనగా తీరిన కోరికలు కలవాడు) అవుతాడు. పరమాత్మ మాత్రమే అతని కామం. ఆ దశలో అతనికి ఏ కామం ఉండదు, ఏ శోకం ఉండదు. భగవంతుని పట్ల అనురక్తి, ఆత్మరతి ఉంటుంది. (ఇది జయదేవుని రచనలపై నితిష్ కుమార్ ఛటర్జీ విశ్లేషణ.) దీనివల్ల భక్తికి, శృంగారానికి అభేదమేర్పడింది. జయదేవునికి తరువాత వాడైన చైతన్యుడు భక్తిరసానికి స్థాయి భావం మధురరతి అని భావించాడు.

భాగవతంలో ఎక్కడా కనిపించని రాధ పేరు మొదటిసారిగా పురాణ వైర గ్రంథమాలలో ఉదహరించ బడింది. 'రాధ' అన్నా 'రాధిక' అన్నా రసములను రాధించినది (జయించినది) అని అర్థం ఉంది. భాగవతంలో కనిపించని రాధ శృంగార మూర్తిగా కృష్ణభక్తిలో స్థానం సంపాదించింది. ఇది మరీ ముఖ్యంగా ఉత్తర హిందుస్థానంలో బహుళ ప్రచారంలో ఉంది. కృష్ణునికి అష్ట భార్యలు ఉన్నా ఎక్కువ దేవాలయాలలో రాధ మాత్రమే కృష్ణుని సఖిగా ఉంటుంది.

సామాన్యంగా దక్షిణా పథంలో ఒక తరం క్రితం వారు అలసటొచ్చినా, అలుపొచ్చినా, ఆశ్చర్యమేసినా, ఆప్యాయత వచ్చినా "రామరామనో", "నారాయణ, నారాయణ" అనో అంటుంటారు. అలానే ఉత్తరాదిలో చాలా ప్రాంతాలలో 'రాధేశ్యామ్', 'రాధేశ్యామ్', అంటూంటారు.

వంగదేశాన్ని పన్నెండవ శతాబ్దంలో పాలించిన లక్ష్మణసేన మహారాజు ఆస్థాన పండితుడు జయదేవుడు. జయదేవుని అష్టపది సంస్కృత భాషలో మధురమైన పాండిత్య ప్రకర్షకు శిరోమణిలా భాసించే లఘుకావ్యం. రాధను జయదేవుడు శృంగార దేవతగా అభిషేకిస్తే, మీరా తన భజనలలో తాత్త్విక రూపాన్ని ఇచ్చింది. నిజానికి జయదేవుడు, మీరాబాయిలు తమకు కృష్ణునిపై గల అనురాగాన్ని రాధ రూపంలో వ్యక్తపరచుకున్నారు.



**కరతలతాళ తరళ వలయావళి కలిత కలస్వనవంశే**
**రాసరసేనహ నృత్యపరాహరణా యువతిః ప్రశంసే ॥** 4.6 (1.45) **(ముఖచిత్రం)**

***తాత్పర్యము:*** వేణుగానలోలుని మురళిని విని తన్మయత్వంతో పరవశించి తన మణిమయమైన కంకణాలతో తాళం వేస్తున్న యువతిని ప్రశంసిస్తూ ఆమెతో కలిసి కృష్ణుడు నృత్యం చేశాడు.



**యది హరిస్మరణే సరసంమనో / యది విలాస కలాసు కుతూహలం**
**మధుర కోమల కాంత పదావళీం / శృణుతదా జయదేవ సరస్వతీమ్ ॥** 1.3

***తాత్పర్యము:*** హరిని స్మరిస్తూ సరస మనోహర శృంగార భావాలపై మనసు లగ్నం చేసిన మధుర కోమల కాంత పదావళిని బోలిన గీతాలు తనవని చెప్పుకున్నాడు జయదేవుడు.

ఇక్కడి చిత్రంలో కవయిన జయదేవుడు సుఖాశీనుడై ఆశువుగా రచన సాగిస్తుండగా తన ప్రియురాలు, భార్య అయిన పద్మావతి నృత్యం చేయటం చూడవచ్చు. జయదేవుని ఊహ నేపథ్యంలో మురళీగానము చేస్తున్న కృష్ణుని రూపం కనిపిస్తుంది. ఈ అట్టమీది బొమ్మలను అత్యంత మనోహరంగా చిత్రించిన వారు విద్యాధికులైన టి. సాయికృష్ణ. వీరు గీతగోవింద శ్లోకాలకు దృశ్యరూపాన్నిస్తూ ఒక అద్భుతమైన చిత్రకల్పనా విశిష్టమైన పుస్తకాన్ని అందించారు. అంతే కాకుండా సంస్కృత తెలుగు ప్రాచీన కావ్యాలైన *మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఋతుసంహారం, అన్నమయ్య సంకీర్తనలు, క్షేత్రయ్య పదాలు, దక్షిణ వేదం, కిన్నెరసాని, అమరకం* లాంటి రచనలకు రసస్ఫూర్తి దాయకమైన చిత్రాలను అందించారు. ఇవి వివిధ పత్రికలలో ప్రచురించ బడ్డాయి.





# నా స్వగతం

*- భాగవతుల యజ్ఞనారాయణ శర్మ*

**మా** స్వస్థలం కూచిపూడి, భాగవతుల వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి దంపతులకు సెప్టెంబర్ 5వ తేదీన 1931లో నేను జన్మించాను. మా తాతగారు జోస్యుల నారాయణ మూర్తిగారు, మా మామగారు మహంకాళి సత్యనారాయణ శర్మగారు, వీరు రాక్షస పాత్రలకు పెట్టింది పేరు. ఈ నేపథ్యంలో మా నాన్నగారు నా 5వ ఏట మన కులవృత్తి నాట్యం, కనుక నువ్వు నాట్యం అభ్యసించాలి అని అప్పటికి స్త్రీ పాత్ర పోషణలో మిక్కిలి ప్రసిద్ధిపొందిన శ్రీ వేదాంతం రాఘవయ్యగారి వద్ద నన్ను చేర్పించారు. అప్పుడు మేళాలుగా ఉంటూ కళాకారులు ప్రదర్శనలిచ్చేవారు.

నేను రాఘవయ్యగారి వద్ద నాట్యాభ్యాసం చేస్తున్నపుడు కుంగి చెయ్యకపోతే విపరీతమైన కోపంతో కాళ్ళమీద కొట్టేవారు అంత నిశితమైన శిక్షణ అది. ఐనా ఎంతప్రేమో! వారి ప్రథమ శిష్యుణ్ణయిన భాగ్యం నాది. బాలాత్రిపురసుందరీ దేవాలయంలో గుంజీళ్ళు, సాముగరిడీలు, అడుగులు, జతులు, అంశములు, ఆవిధంగా సాగేది మా సాధన. ఆ తరువాత యక్షగానాలలో అందెవేసిన చేయి అయిన శ్రీ చింతా కృష్ణమూర్తి గారి నేతృత్వంలో లవకుశులు, లోహితాస్యుడు, ప్రహ్లాదుడు, పిమ్మట సహదేవుడు, నారదుడు ఇత్యాది పాత్రలు పోషించాను. ఇలా నాకు 20 సం॥లు వచ్చేవరకు నాటకాలలో వేశాను.

అప్పుడు రాఘవయ్యగారు చిత్రసీమకు వెళ్ళిపోవడంతో మద్రాస్‌లో వెంపటి పెదసత్యం గారి వద్ద నాట్యాభ్యాసం చేసి వచ్చిన వెంపటి చినసత్యం గారు బందరులో చదువుతున్నారని తెలిసి నేను వారి వద్దకు వెళ్ళడం జరిగింది. వారు అప్పుడు 'అజాద్ బాలికా పాఠశాల' అనే చోట పనిచేస్తూ ఒక గది అద్దెకు తీసుకొని ఉండేవారు. ఆ సమయంలో వారికి నేను వంటచేసి పెట్టేవాడిని. వారు నాకు భరతనాట్య సాంప్రదాయంలో అలరింపు, నటనమాడినార్, కల్యాణి జతిస్వరం, తిల్లాన మున్నగునవి నేర్పించారు. వెంపటి సౌదామిని గారి వద్ద నేర్చుకొనిన అంశాలవి. అలా కొంతకాలం గడిచింది. మద్రాస్ నుంచి చినసత్యం గారికి కబురు వచ్చింది. అన్నగారి వద్ద ఎక్కువ సినిమాలున్నాయి సహకారంగా ఉండాలని, పెదసత్యంగారు గొప్పనృత్య దర్శకులు కదా! ఏ నిర్మాత వారిని వదిలేవారు కారు ఆ రోజుల్లో!

అప్పుడు నాకు కూడా మద్రాస్ చూడాలనిపించి 5 రూపాయలతో రైలు టికెట్ కొని మద్రాస్ స్టేషన్‌లో దిగితే, నా అదృష్టం కొద్దీ అపుడే పసుమర్తి కృష్ణమూర్తి గారి తండ్రి రామయ్యగారు ఎదురై వివరం తెలుసుకొని చినసత్యం గారి అడ్రస్ వెతికి, నన్ను వారింట్లో దించారు. చినసత్యం గారిని చూడగానే నాకు ప్రాణం లేచివచ్చింది. వారూ ఎంతో సంతోషంగా నన్ను దగ్గరకు తీసుకున్నారు. ఎందుచేతనంటే బందరులో ఉన్నరోజులలో ఆయనా నేనూ ఒక కంచంలో తిని, ఒకే మంచంలో పడుకునే వాళ్ళం. ఆ ఆప్యాయత అనురాగం ఈ రోజుల్లో మనం చూడగలమా?

అప్పుడాయన నన్ను 'అర్ధాంగి' సినిమా షూటింగ్‌కి తీసుకువెళ్ళారు. ఆ చిత్రానికి వారే నృత్యదర్శకులు. ఆ

సందర్భంలో పి.పుల్లయ్యగారు (చిత్ర దర్శకులు) మీ కూచిపూడి శైలిలో ఒక కందార్థంగాని, దరువుగాని, పాడవయ్యా అని నన్నడిగితే, నేను దాని రూపాన్ని ఒకసారి పాడాను. వెంటనే ఆ చిత్రంలో 'అర్థనారీశ్వర' నృత్యానికి కావలసిన శైలి ఇదే అని సెట్లో ఉన్న ఆరుద్ర గారిచే పాట రాయించారు. అది మిశ్రచావులో - 'నా తండ్రి దక్షుని యజ్ఞము చూడగ పోయివత్తును నాకు శెలవునిమ్మ' - పిలువని పేరంటమునకేల మనకిది మరియాద కాదిది- వినవే- పుట్టినింటికి పోవడానికి పిలుపుదేనికి- ఓసి వినవే! ఓరి వినరా!

ఈ విధంగా కూచిపూడి బాణీలో అప్పటికప్పుడు కూర్చిన పాటయిది. అపుడు సత్యంగారు నువ్వు వచ్చినందుకు మంచి పని జరిగిందని నన్ను ప్రశంసించారు కూడా! ఆ తరువాత వారు నాకు బెంగుళూరు లో పాఠం చెప్పమని నియమించారు. అక్కడ్నించి నెలకొక్కసారి సత్యంగారిని చూడటానికి వచ్చేవాడిని.

అప్పుడే పసుమర్తి కృష్ణమూర్తి, మహంకాళి వెంకయ్య, వేదంతం రాఘవయ్య వెంపటి పెదసత్యం మున్నగు మా కూచిపూడి వారందర్నీ కలుస్తుండే వాణ్ణి.



ఆ రోజుల్లో చినసత్యం గారూ నేనూ మగవేషం వేస్తే, రాజసులోచన అమ్మణ్ణి, ముక్కురాజు, ధర్మరాజు వంటివారు ఆడ వేషాలతో ప్రదర్శన లిస్తూ ఉండేవాళ్ళం.

ఆ తరువాత కొంతకాలానికి సుమారు 1960 ఆ ప్రాంతంలో విజయవాడలో స్థిరపడి నాట్యాలయం స్థాపించి విద్యార్థులను తయారు చేసేవాడిని. 'నటరాజ ఆర్ట్ అకాడమీ' అని దాని పేరు.

అలా కొంతకాలమయ్యాక మళ్ళీ 1967లో 'రహస్యం' చిత్రంకోసం 'గిరిజాకల్యాణం' యక్షగానరూపంలో చేయాలని సంకల్పించి మా గురువుగారు వేదాంతం రాఘవయ్యగారు నన్ను, వారి సోదరుడు రత్తయ్యశర్మను పిలిపించి సూత్ర ధారులుగా వారి ప్రక్కన నటింపజేశారు. అది నా జీవితంలో మరచిపోలేని అనుభూతి. ఆ సమయంలో ఘంటసాల, ఎ.ఎన్.ఆర్ వంటి ప్రముఖులందరూ షూటింగ్‌కి వచ్చేవారు. కానీ ఆ శ్రమ తట్టుకోలేక నా ఆరోగ్యం సహకరించక మరల నేను విజయవాడ వచ్చేశాను. అప్పటికి మా పిల్లలు కూడ కొంత పెద్ద వాళ్ళయ్యే సరికి వారికీ నాట్యవిద్య నేర్పాను. ఆ తరువాత 'క్షీరసాగర మథనం' నృత్యరూపకాన్ని తయారు చేసి ప్రదర్శింప జేశాను. 'సుఖీభవ' అను రూపకం రేడియో కోసం తయారు చేశాను.

ఇవేగాక క్షేత్రయ్య, అన్నమయ్య, సంక్రాంతి సంబరాలు, మున్నగు నృత్యరూపకాలు చేశాను. వింజమూరి శివరావు గారు వ్రాసిన 'సుఖీభవ' నాటకానికి గొప్పపేరు వచ్చింది. బెజవాడ గోపాలరెడ్డిగారు బ్రాడ్‌కాస్ట్ మినిస్టర్‌గా ఉన్నరోజులవి. అప్పుడు వారి ప్రోత్సాహంతో మా తమ్ముడు భాగవతుల సీతారామశర్మ మున్నగు బృందంతో ఢిల్లీలో ఆ నాటక ప్రదర్శనలిచ్చాము. అది ఒక సామాజిక అంశం ఆధారంగా తీసుకుని కరువు కాటకాలతో పంటలు పండక అల్లాడుతున్న రైతులకు, పంటలు పండినా పండకపోయినా శిస్తులు చెల్లించాల్సిందే అనే జమీందారీ వ్యవస్థకు మధ్యనున్న సమస్యను దృష్టిలో ఉంచుకుని - సమాజానికి ఉపయోగపడే సందేశాత్మకంగా రూపొం దించాము. ఇంకా మా పెద్ద కుమారుడు భాగవతుల వెంకట్రాయ శర్మ చేతికి అంది వచ్చాక 'మేనకా విశ్వామిత్ర' వంటి నృత్యరూపకాలు కూడా కొన్ని రూపొందించాము. ఈ నాటికీ ఇంకా నాట్య శిక్షణనిస్తూనే నా జీవితాన్ని గడుపుతున్నాను. నా జీవితం నటరాజస్వామికే అంకితం.

# అముక్తం

**- వి. భార్గవి**

అయిదేళ్ళకే అమరం విన్నాడు. పదేళ్ళకే పద్యాలు చదివాడు. పదహారేళ్ళకే ప్రబంధాలు పఠించాడు. తండ్రి పండితుడు. అన్న చిత్రకారుడు. అమ్మ ఆధ్యాత్మిక జీవి. చుట్టూ సమాజం అవిశ్రాంతంగా పరుగులు పెట్టే గందరగోళం. తనకేం కావాలి? అది తెలియకే పద్దెనిమిదేళ్ళకు హిమాలయాలకు ప్రయాణమయ్యాడు. అక్కడ అందరూ సాధువులే. వాళ్ళు నేలమీదే ఉన్నారు. తలక్రిందులుగా తాంత్రిక శక్తులతో ప్రశాంతంగా ఉన్నారు. ఏదో ఆశ్రమంలో శనగలు తింటూ చలిలో చావుకు దగ్గరగా వెళ్ళి తపస్సులాంటిది చేస్తున్నాడు. ఇరవై ఏళ్ళకే తపస్సు ఫలించి దేవత ప్రత్యక్షమైంది 'నరుడా ఏమి నీ కోరిక' అంటూ...

అతని ఆనందానికి హద్దేలేకుండా పోయింది.

'నా దగ్గర ఎక్కువ వరాలు లేవు. నీలాంటి చాలామంది వరుసలో ఉండటంతో ఇంకా కొన్నే మిగిలాయి. వాటిలో నీకు కావల్సింది ఇస్తాను.'

'అలాగే తల్లి' అని సాష్టాంగపడ్డాడు.

'మరణం, సంపద, కీర్తి, ప్రేమ, సుఖం, ఆలోచించి ఎంచుకో' అని దేవత ముగించకముందే

'ఆలోచించడానికేముంది? ఇన్నాళ్ళు ఏ సుఖం లేకుండా చలికి, గాలికి ఎండుటాకులా అయిపోయాను. సరిగా తిండి తిని ఎన్నాళ్ళయిందో! నాకు సుఖం ప్రసాదించు తల్లీ....'

అన్నాడో లేదో దేవత 'తథాస్తు' అంటూ అంతర్థానమైంది.

కోడె వయస్సులో కోరికలకేం కొదువ. మంచి ఆహారంతో బుసబుస పొంగాడు. బుసకొట్టే కోరికలతో సుఖాన్వేషణలో ఆనందంగా గడిపాడు. ఏ బాధ్యత లేకుండా సౌఖ్యాలన్నీ సొంతం చేసుకున్నాడు. ఏ సుఖమైనా ఎన్నాళ్ళు బాగుంటుంది? వయస్సు వేడి మూడు నిమిషాలే. అన్ని సుఖాలు మూణ్ణాళ్ళ ముచ్చటే. శారీరక సౌఖ్యం స్వేదంతో చెల్లు. అలసటతో అంతం. కొత్త పాతబడటం, పాత విసుగుపుట్టడం వరుసగా జరిగిపోతాయి. ఇది తెలియడానికి ఎన్నాళ్ళు కావాలి? విసుగు విరక్తిగా మారి ఓ అపరాత్రి 'అమ్మా ఎక్కడున్నావు దయలేదా' అంటూ మనస్సుతో గావుకేక పెట్టాడు.

తపస్సు ఫలం ఇంకా వుండటంతో దేవత పలికింది.

'ఏమిటి నీ కోరిక'--ఇంకా పూర్తి చేయలేదు.

'ఈ క్షణిక సుఖాలు జీవితాన్ని వృథాచేస్తున్నాయి.' అన్నాడు.

'అవునయ్యా--ఈ జీవితం శాశ్వతం కాదుగదా--అందుకే ఆలోచించుకోమన్నాను'--

'ఆలోచించానమ్మా-ఈ సుఖాలు ఎందుకు విసుగు పుట్టాయి? అంతా యాంత్రికమైపోయి.

'నాకు ప్రేమకావాలి తల్లీ...'

'తథాస్తు' అంటూ దేవత వెళ్ళిపోయింది.

ప్రేమించాడు. ప్రేమతో ప్రయాణం చేశాడు. ప్రేయసి కౌగిలిలో కరిగి పోయాడు. ఆ కన్నులలో వెన్నెలలే చూశాడు.

కాని, ఆ కళ్ళు ఎటో చూస్తున్నాయి. ఆమె కాళ్ళు ఎటో నడిచాయి. తర్వాత ప్రియురాలు చనిపోయింది. దుఃఖంతో కుమిలిపోయాడు. కొత్త స్నేహాలు, కొత్త మోహాలు.

ప్రేమ ఎడారిలో కలవటానికి, ప్రేమించినవాళ్ళు ద్రోహం చేయడానికి ఎంతకాలం కావాలి? ప్రేమలన్నీ కామాలనీ, కామాలన్నీ కాలిపోయే కట్టెలని తెలుసుకొనే సరికి బూడిదే మిగిలింది. ఎందుకిలా జరిగింది? తన దగ్గర ధనం లేదు. ప్రేమవుంటే చాలదు. బహుమతులివ్వాలి. సంపదతో ఆకర్షించాలి.

'ఎంత పొరపాటు చేశాను. అమ్మా నాకు కావలసింది తెలిసింది తల్లీ!' అని తల్లడిల్లిపోయాడు--

తపఃఫలం ఇంకా మిగిలినట్లుంది. దేవత దిగింది. 'ఇప్పుడేం కావాలి ఆలోచించావా?'

'అనుభవంతో ఆలోచించాను. నాకు సంపద లేక పోవడంతోనే అందరూ దూరమైపోతున్నారు. ప్రేమలు, స్నేహాలు ఏవైనా సంపద ఉంటేనే నిలుస్తాయి--' 'సంపద తల్లీ' అన్నాడు.

'అలాగే' అంటూ అంతర్థానమైపోయింది.

ఇబ్బడి ముబ్బడిగా సంపద వచ్చి పడింది. సంపదతో సఖులు, సఖియలు వచ్చారు. వయస్సు హారతైపోతుంది. ఎవరికి కావలసింది వారు తీసుకుపోతున్నారు. ఎన్ని రకాల

మోసాలున్నాయో అన్నీ చేస్తున్నారు. నమ్మక ద్రోహానికి చిరునామాలాగా నవ్వి పోతున్నారు. స్నేహితులు అసూయతో ఆర్పేశారు. ప్రియురాళ్ళు ఉన్న రాళ్ళన్ని ఎత్తుకు పోయారు. కాలం కరిగిపోతుంది. నిత్యవైభవం కాంతి తగ్గింది. పచ్చతోరణాలు ఎండిపోయాయి. చివరకు కప్పుకొనేందుకు కంబళి కూడా లేక వణుకుతూ... 'అమ్మా' అని అరిచాడు.

'ఎందుకు--నా దగ్గర ...' ఇంకా పూర్తిచేయలేదు.

'తెలుసుతల్లి. కీర్తి ప్రతిష్ఠలున్నాయి. నన్ను మోసం చేసినవారు సిగ్గుపడేలా వెలిగిపోవాలి. నాకు అంతులేని కీర్తి ఇవ్వమ్మా-- ఈ భూమ్మీద శాశ్వతంగా నిలిచిపోతాను--' దేవత కన్నీళ్ళు పెట్టింది.

'కాని నా దగ్గర మృత్యువు కూడా వుంది. ఆలోచించావా? అంది.

'నాకు కీర్తి కావాలమ్మా-శాశ్వతంగా వుండిపోతాను.' అన్నాడు.

'సరే, అలాగే' అని దేవత తన దారిన వెళ్ళిపోయింది.

తను చదివిన విద్యతో ఎన్నో రచనలు చేశాడు. పాఠకులు బ్రహ్మరథం పట్టారు. ఎన్నో చిత్రాలు గీశాడు. విమర్శకులు పురస్కారాలు, ఆస్కారులు ఇచ్చారు. ఎన్నో శిల్పాలు చెక్కాడు. ప్రపంచం అంతా పాదాక్రాంతమైంది. బ్రతికుండగానే విగ్రహాలు పెట్టారు (తన విగ్రహాన్ని తనే మలుచుకున్నాడు). దండలు వేశారు. ఎవరో గిట్టని వాళ్ళు ఇదంతా ప్రతిభకాదు. మరేదో అన్నారు. ఈ నిప్పు మంటలై ఇతని కీర్తిని కాల్చడానికై ఎన్నో నాళ్ళు పట్టలేదు. అసూయ అగ్నికీలల్లో అతని ప్రతిష్ఠ ఆహుతి కావడానికి ఏళ్ళు కావాలా?

విగ్రహాలపై కాకులు రెట్టలు వేశాయి. గిట్టని వాళ్ళు చేతులు విరగ్గొట్టారు. దుండగులు తలలే తెగ్గొట్టారు. నాలుగు రోడ్ల నడుమ చెప్పులతో, పిడకలతో కంపుకొడుతూ విగ్రహంలా నిలబడిపోయాడు. తన కీర్తి విగ్రహానికి, తన అవమానానికి దిష్టిబొమ్మలా ఆకాశం వైపు చేతులు చాచి...

'ఏమిటమ్మా నేను చేసిన పాపం--కీర్తి కుళ్ళిన ఫలమేనా? నాకు విముక్తి కలిగించు తల్లీ!' అని తెల్లమొహం వేశాడు.

నిలబడే ఓపిక లేక వణికే శరీరంతో 'అమ్మా! నన్ను తీసుకుపో. మరణాన్ని ప్రసాదించు తల్లీ అని వాపోయాడు.

' అయ్యో, నాయనా! ఇంతకుముందే తల్లి ఒడిలో ఉన్న ఓ పాప నా మీద నమ్మకంతో అడిగితే ఇచ్చేశాను. ఇంక నా దగ్గర వరాలేమీ లేవు.'

'అయితే నా గతి?

'ముందే చెప్పాను కదా! ఆలోచించి కోరుకో' అని--అంటూ వెళ్ళిపోయింది.

అవమానాలన్ని మూటకట్టుకొని, అవయవాలన్ని పట్టుతప్పి, చావురాక, చావలేక దుఃఖంతో కృంగి కృశిస్తూ అశ్వత్థామలాగా బ్రతుకీడుస్తున్నాడు, జ్ఞానంలేని మన పండితుడు. మి

## సద్గతి - దుర్గతి

**ఒ**క బోగముదాని ఇంట్లో మహాపండితుడైన ఒక బ్రాహ్మణుడు కూర్చుండి మాట్లాడుతూవుండగా వీధిలో ఒక పీనుగను ఎత్తుకొని పోతూవుండే చప్పుడు విని అది తన బోనగత్తెను పిలిచి ఆ పొయ్యే పీనుగ స్వర్గమునకు పొయ్యేటిదా లేక నరకమునకు పొయ్యేటిదా చూచి రమ్మనెను. ఆ బోనకత్తె వాకిటికి పోయి చూచివచ్చి అమ్మా అది స్వర్గమునకు పొయ్యే పీనుగ అనెను. ఈ మాటలు వింటూ ఉండిన ఆ పండితుడు ఆశ్చర్యపడి, నేను బ్రాహ్మణుడను--మరిన్ని పండితుడను--ఇటువంటి నాకు ఆ పీనుగగతి ఎట్టిదో ఎంత మాత్రమున్ను తెలియలేదు. ఈ బోగముదాని దాసి వాకిటపోయి చూచిన మాత్రం చేతనే ఆ పీనుగ స్వర్గమునకు పొయ్యేట్టిదని ఎట్లా తెలుసుకున్నదో అని మనస్సున కొంత సేపు ఆలోచించి ఆ బోగము దాన్ని (స్వర్గమునకు పొయ్యే సంగతి) దానికి ఎట్లా తెలిసెనని అడగడమునకు సంకోచించినప్పటికిన్ని అడిగితేగాని ఆ సందేహనివారణము కాదని తుదకు తెంపు చేసి ఆ బోగముదాన్ని అడిగెను. అందుకు అది అయ్యా ఇదేమి అతిశయము. వాకిట పోతే ఏ పీనుగను చూచి అయ్యో పుణ్యాత్ముడు చనిపోయినాడా అని నలుగురు అంటారో ఆ పీనుగ స్వర్గమునకు పోవు. ఏ పీనుగను చూచి పాపిష్టిముండా కొడుకు చచ్చినాడా అని నలుగురు అంటారో, ఆ పీనుగ సిద్ధముగా నరకమునకుపోవు అని చెప్పినది.

విదేశీయులు ప్రచురించిన

# తెలుగు గ్రంథాలు

*- వెలగా వెంకటప్పయ్య*

**ముద్రిత గ్రంథాలు అందరికీ అందుబాటులో ఉంటాయనే ఉద్దేశంతో క్రైస్తవ మిషనరీలు గ్రంథ ప్రచురణకు అంకురార్పణ చేశారు. విలియం కేరీ అనే మిషనరీ అన్ని భారతీయ భాషలలో అచ్చులు పోత పోయించి, బైబిల్ అనువదింపజేసి, అచ్చు వేయించారు. ఇది అనితరసాధ్యం. ముద్రణలో మిషనరీల చొరవ భారతీయ భాషల ప్రగతికి తోడ్పడిందని పండిట్ నెహ్రూ చెప్పారు.**

జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లాండు తదితర దేశాల నుంచి మత ప్రచారం కోసం భారతదేశంలో అడుగుపెట్టిన మిషనరీలు, ఇతరులు తొలుత తెలుగు, తమకు అవసరమైన ఇతర భాషలు నేర్చుకున్నారు. కొందరైతే అతినిష్ఠతో సంస్కృతం అభ్యసించారు. అంతేగాక కొందరు అధ్యయనం చేశారు.

## ముగ్గురు చిరస్మరణీయులు

వీరిలో ముందుగా ముగ్గురు ప్రముఖులను తలచుకోవాలి. వీరు చిరస్మరణీయులు- ప్రాతః స్మరణీయులూనూ. ఇందు మొదటివారు...



బెంజిమన్ షూల్జి

**రెవరెండ్ బెంజిమన్ షూల్జి (1690-1790) :** వీరు జర్మనీ దేశానికి చెందిన మిషనరీ, డెన్మార్కు రాజు పంపగా మత ప్రచారం కోసం 1719లో భారత దేశంలో అడుగుపెట్టారు. 1728 నుంచి చెన్నైలో పని చేశారు. 1728లో Grammatica Telugica అనే తెలుగు వ్యాకరణ గ్రంథాన్ని చెన్నైలో రాశారు.

భారతీయుల లాగ వస్త్రధారణ చేసేవారు. దీన్ని జర్మనీ దేశంలోని హల్లే పట్నంలోని ఫ్రాక్ ఫౌండేషన్‌లో భద్రపరిచారు. ఈ గ్రంథం రాసిన దాదాపు 250 సంవత్సరాల పిదప జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్ తమ 35వ, వార్షికోత్సవ సందర్భంలో 1984లో ముద్రించి మహోపకారం చేశారు. షల్జి 1744 జూలై 27న జర్మనీలోని హల్లే పట్నానికి చేరి, ఒక ముద్రణాలయాన్ని నెలకొల్పారు. 1728-1732లో చెన్నైలో చేసిన అనువాదం ముద్రణకు సమాయత్త మయ్యారు. అప్పటికి తెలుగులో మువబుల్ టైపు లేదు.

అందుచేత చెక్కపై అక్షరాలు -చీరలపై అద్దకాల పద్ధతిలో అక్షరాలు చెక్కించి - దిమ్మల సాయంతో ఆరు గ్రంథాలు 1746, 1747 సంవత్సరాలలో అచ్చు వేయగలిగారు. ఇందుకు షూల్జీ మిషనరీ శతథా అభినంద నీయులు.

1-2 మోక్షానికి కొంచ్చు పోయే దోవం. ( ఈ గ్రంథ శీర్షికలో రెండు వేర్వేరు పుస్తకాలున్నాయి) 1746.

3 సత్యమైన వేథంలో వుండే జ్ఞాన ఉపదేశాల యొక్క సంక్షేపం 1746.

4 ఒక గురువు అయిదు బ్రాహ్మల యొక్క నుడుమన... పెద్దస్వామి మీద ప్రసంగించిన తర్రమితె 1747.

5-6 బుద్ధి కలిగిని - మారు జ్ఞాన వచనాల యొక్క చిన్న పుస్తకం. (ఈ గ్రంథ శీర్షికలో రెండు వేర్వేరు పుస్తకాలున్నాయి.)

ఈ పుస్తకాలన్నీ లండన్‌లోని బ్రిటీషు గ్రంథాలయంలో ఉన్నాయి. కోల్‌కత్తా సమీపంలోని శ్రీరాంపుర్ మిషనరీ లైబ్రరీలో ఉన్నాయి. ఆ తర్వాత తెలుగు ముద్రణ శ్రీరాంపూర్‌కు తరలించడం జరిగింది. ఈ స్ఫూర్తితో

డాక్టరు వెలగా వెంకటప్పయ్య, ఫోన్ : 08644 - 228585

మిషనరీలు దిమ్మలు సాయంతో ముద్రించి ఆధారాలు కొన్ని లేకపోలేదు. షూల్జి నూరు జ్ఞాన వచనాల గ్రంథాన్ని రాజమండ్రిలో సెంటర్ ఫర్ సోషల్ ఛేంజ్ అనే సంస్థ 2006లో పునర్ముద్రించింది. దీని సంపాదకులు కె.ఎన్. వెస్లే, తదితరులు. ఇచట మరొక విషయం గమనించాలి. "చెన్నై సెంటు జార్జి కోటలోని పుస్తకాలలో 1719లో నమోదైన తెలుగు బైబిల్ అచ్చు పుస్తకమే. అయితే షూల్జి కన్నా ముందే ఎవరో మొదటి తెలుగు పుస్తకాన్ని అచ్చు వేశారని భావించక తప్పదు. అతని పేరు మాత్రం చరిత్ర పుటల్లో మరుగు పడిందని చెప్పక తప్పదు" అంటారు ఆరుద్ర. (పుట 298)

**విలియం కేరీ:** వీరు బ్రిటన్‌లో నార్తంప్టన్ హైర్ పాలెర్స్పరి అనే చిన్న గ్రామంలో 1761లో జన్మించారు. కొంతకాలం చెప్పుల తయారీ కర్మాగారంలో పనిచేశారు. స్వయంకృషితో విద్య నభ్యసించారు. బాల్యం నుంచి చర్చికి చేరువయ్యారు. 1787లో మతాచార్యులుగా అభిషేకం పొందారు.

లెసిస్టరులోని హార్వే సంఘానికి అధిపతి అయ్యారు. తానే స్వయంగా 1792లో చిప్పక్టు మిషనరీ ప్రారంభించారు. మరుసటి సంవత్సరం భారతదేశం వచ్చి, కోల్‌కతా సమీపంలో శ్రీరాంపూర్ (సెరాంపూర్) మిషన్ స్థాపించారు. బెంగాలీ, తదితర భాషలు నేర్చుకున్నారు. బెంగాలీ భాషలో బైబిల్ అనువదించి, అదే భాషలో విశేష శ్రమకోర్చి ముచబుల్ టైపు తయారు చేయించి 1801లో ముద్రించారు.

1811 నాటికి తెలుగు గ్రంథాల అచ్చు పని సాగుతూ ఉంది. హిందీ, మరాఠీ, సంస్కృతం, తెలుగు, కన్నడం, మలయాళం తదితర 36 భాషలలో శ్రీరాంపూర్ నందు బైబిల్ గ్రంథాలను ప్రచురించారు. 1912లో "దేవుని యొక్క సమాప్తమైన వాక్యము" మరో గ్రంథాన్ని శ్రీరాంపూర్‌లో అచ్చువేశారు. విశ్వబ్రాహ్మణుల సాయంతో సీసంతో తెలుగు అక్షరాలు మొట్టమొదటి సారిగా పోత పోయించారు.

ఎంతో ప్రయాసకోర్చి ఇంగ్లాండు నుంచి ముద్రణాయంత్రం తెప్పించారు. ప్రొటెస్టెంట్ మిషనరీలయిన రెవ, ఆగస్టస్ దేస్ గ్రాంజెసీ, రెవ. జార్జి క్రాన్ 1805 లో విశాఖపట్నం వచ్చి, ఆనందరాయరు సాయంతో కొన్ని బైబిల్ భాగాలను అనువదించి 1812లో శ్రీరాంపూర్‌లో ముద్రించారు. ఈ గ్రంథ ప్రతులు లండన్‌లోని బ్రిటీషు గ్రంథాలయంలో, శ్రీరాంపూర్ మిషనరీ గ్రంథాలయంలో



తొలి ప్రెస్

లభిస్తాయి. అయితే 1813లో విలియం కేరీ తెలుగు వ్యాకరణాన్ని ముద్రించినట్లు తెలుస్తూంది.

**ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798–1884) :** బ్రౌన్ ఆంగ్లేయుడు. జన్మ స్థలాన్ని బట్టి భారతీయుడు. తల్లిదండ్రులు కోల్‌కత్తా సమీపంలో మత ప్రచారకులు. తండ్రి మరణానంతరం కుటుంబం బ్రిటన్ వెళ్ళిపోయారు. విద్యాభ్యాసం పూర్తి చేశాక, తిరిగి 1817లో చెన్నై ఉద్యోగరీత్యా చేరారు. వెలగపూడి కోదండరామయ్య వద్ద తెలుగు నేర్చుకున్నారు. తెలుగు భాషా సాహిత్యాలు అధ్యయనం చేశారు. తదుపరి మచిలీపట్నం, గుంటూరు మొ. ప్రాంతాలలో పనిచేసి తిరిగి కడప చేరారు. అచట బంగళా కొన్నారు. పండితులను తన ఖర్చుపై నియమించారు. వేమన పద్యాలు, పలు కావ్యాలు పండితుల సాయంతో పరిష్కరించారు.

ఇంగ్లీషు–తెలుగు, తెలుగు–ఇంగ్లీషు నిఘంటువులు రూపొందించారు. కడపలో ఉచిత పాఠశాలలు స్థాపించారు. ఎందరో కవి, పండితులను ఆదరించారు. వేల సంఖ్యలో రాత ప్రతులు సేకరించి, అవి ఖిలం కాకుండా కాపాడి తెలుగు జాతికి మహోపకారం చేశారు. వారే ఒక చోట "In 1825 I found Telugu Literature dead" అన్న మాటలు తెలుగు సాహిత్య స్థితిని తెలుపు తాయి. వారే మరో చోట "In thirty years raised it to life" అన్నారంటే వారి కృషి ఎంతో

మనం ఊహించవచ్చు. మరి కొందరు మిషనరీలు జేసూట్ మిషనరీగా 1606లో తమిళ నాడులోని మధుర చేరిన **రాబర్ట్ డి. నొబిలి (1577 - 1656)** తెలుగు, తమిళం, సంస్కృత భాషలు నేర్చు కున్నారు. సంస్కృత భాషలోని వేదాలకు ఫ్రెంచి భాషలో వివరణ రాశారు.

తెలుగులో జ్ఞాన సంక్షేమము, పునర్జన్మ ఆక్షేపము, విశ్వాస సల్లాపము తదితర గ్రంథాలు అనువదించారు. వీరికి మంచి పండితులు అనే పేరు ఉండేది.

**విలియంబ్రౌన్(1760-1837) :** 1783లో చెన్నై చేరి, సర్కారు జిల్లాల రెవిన్యూ శాఖలో పని చేసి బ్రిటీషు అధికార్ల కోసం తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు తయారుచేసి 1818లో ప్రచురించారు. ఫ్రాన్సిస్ వెట్ విల్సన్ 1796లో చెన్నై చేరి రెవిన్యూ కార్యదర్శిగా పనిచేసి, 1811లో మిరాసి హక్కులపై గ్రంథాన్ని, 1816లో ఎ.డి. క్యాంబెల్ రాసిన వ్యాకరణానికి ఉపోద్ఘాతం రాశారు. 1807 లో భారతదేశం వచ్చిన ఎ.డి. క్యాంబెల్ పలు ఉన్నత పదవులలో పనిచేసి 1816లో తెలుగు వ్యాకరణం, 1821 లో తెలుగు నిఘంటువు ప్రచురించారు.

జి.ఎన్. టైలరు 1820లో రాజమండ్రి జిల్లా, నర్సాపురంలో సబ్ కలెక్టరుగా పనిచేశారు. నర్సాపురంలో తెలుగు ముద్రణాలయం నెలకొల్పారు. స్వచ్ఛందంగా Rate School అనగా పన్నులు వసూలు చేసి ఆ డబ్బుతో పాఠశాలలు నిర్వహించారు. ఈ పద్ధతిని తదుపరి కంపెనీ అనుమతించలేదు.

క్రైస్తవ మతం తన ఉనికిని విస్తరించుకునేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగా చేసిన సామాజిక, విద్య సేవలు అవిస్మరణీయం. సుమారు వందేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చిన క్రైస్తవ మిషనరీలు విద్యా, వైద్యంతో ఎందరో నిరుపేదలకు చేరువైనారు. దీంతో క్రైస్తవ మతం ఎంత విస్తృతంగా వ్యాపించిందో దానికి సమాంతరంగా ప్రజలకు విద్యను, వైద్య సేవలను అందించింది.

**రెవరెండ్ జాన్ ఎడ్మండ్‌షార్కీ :** 1843లో చెన్నైలోని కాథలిక్ సంస్థలో పనిచేశారు. హితవాది అనే తెలుగు పీఠిక, పలు గ్రంథాలు ప్రచురించారు. రెవరెండ్ పి. పెర్సిలిన్ 1855లో చెన్నై చేరడం తమిళ, తెలుగు భాషలు నేర్చుకున్నారు. ప్రభుత్వ నేతృత్వంలో నడిచిన దినవర్తమాన పత్రికకు సంపాదకునిగా పనిచేశారు. వీరు సిద్ధం చేసిన ఆంగ్ల-తెలుగు నిఘంటువు 1886 నాటికి ఆరు ముద్రణలు పొందింది. అంతటి ప్రచారం ఈ నిఘంటువుకు లభించింది. ఇలా తెలుగు నేర్పడం, తెలుగులో వాచకాలు, నిఘంటువులు, కథలు ప్రచురించిన విదేశీయులు ఎందరో ఉన్నారు.

**బహుమతికి బ్రిటీషు ప్రతినిధి మందలింపు**

దీనికి ముందు ఒక విచిత్ర సంఘటన జరిగినట్లు తెలుస్తుంది. నైజాం ప్రభువును తృప్తి పరచే నిమిత్తం కెప్టెన్ సైడ్‌హామ్ అనే బ్రిటీషు అధికారికి ఒక చిన్న గాలిపంపు, ప్రింటింగు ప్రెస్, యుద్ధవీరుని ప్రతిమను బహూకరించాడు. ఈ విషయం బ్రిటీషు పాలకులకు నచ్చలేదు. ప్రమాదకరమైన ముద్రణ యంత్రాన్ని బహుమతి ఇచ్చినందుకు కెప్టెన్ గారిని మందలించడం జరిగింది. నైజం ప్రభువు ఈ బహుమతులకు అట్టే విలువ ఇవ్వలేదు. ఎక్కడో పెట్టేశారు. ఈ విషయాన్ని బ్రిటీషు పాలకవర్గానికి తెలియపరచినపుడు వారు తేలిగ్గా నిట్టూర్చారట. కెప్టెన్ బతికి బయటపడ్డారు. ముద్రణ యంత్రం అంటే పాలకులకు ఆనాడు ఉండే భయానికి ఇది ప్రబల నిదర్శనం. కనుక ముద్రణకు తొలిదశలో ప్రభుత్వ ప్రోత్సాహం లభించలేదు. మిషనరీల ద్వారా మరొక దోవన ప్రచార సాధనంగా చొచ్చుకొని వచ్చింది.

**తెలంగాణాలో మిషనరీలు**

క్రైస్తవ మతం తన ఉనికిని విస్తరించుకునేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగా చేసిన సామాజిక, విద్య సేవలు అవిస్మరణీయం. సుమారు వందేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చిన క్రైస్తవ మిషనరీలు విద్యా, వైద్యంతో ఎందరో నిరుపేదలకు చేరువైనారు. దీంతో క్రైస్తవ మతం ఎంత విస్తృతంగా వ్యాపించిందో దానికి సమాంతరంగా ప్రజలకు విద్యను, వైద్య సేవలను అందించింది.

ఈ నేపథ్యంలో 1904లో నాగర్‌కర్నూల్‌లో క్రైస్తవమతం పాదం మోపింది. నిజాం పాలనలో క్రైస్తవులు ఈ ప్రాంతానికి వచ్చి తమ మత వ్యాప్తికి చర్చిని నిర్మించుకునేందుకు గాని, అందుకు భూములు కొనేందుకు గాని అనుమతులు లభించని కాలం ఇది. ఆ పరిస్థితుల్లో నల్గొండ నుంచి వచ్చిన వంగూరు సాయన్న పేర కొన్నారు. ఈ ప్రాంతంలో వీరే తొలి క్రిస్టియన్. వెంటనే ఆ స్థలంలో 1908 నాటికి ఒక బంగ్లాను నిర్మించారు. ఇదే కాలక్రమంలో మిషన్ కాంపౌండ్‌గా పిలువబడింది. మొదట ఇక్కడో పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలలో తొలి విద్యార్థి అంకూర్ సాయన్న ఎలియాస్ సాదుసామేల్ బైబిల్ పాఠశాల కూడా ప్రారంభమై బోధకులకు శిక్షణ నివ్వడం

ప్రారంభమైనది. 1909లో హాస్పిటల్ కోసం భవనం నిర్మించాలని పూనుకొని 1912 నాటికి ఇందుకుగాను పూర్తి సౌకర్యాలను సమకూర్చు కున్నారు. బెర్గ్‌తోల్ద్ పర్యవేక్షణలో మొదలైన ఈ హాస్పిటల్‌లో వందలాది మంది రోగులు చుట్టూరా ఉన్న గ్రామాల నుండి వచ్చి చికిత్స పొందేవారు. ఇతర స్టాఫ్ నర్సులు, డాక్టర్లతో ఇక్కడ విదేశీయులే పని చేసేవారు. ఇక్కడ పూర్తి పాఠశాల 1912లో ప్రారంభమైంది. అప్పుడు ప్రారంభ విద్యార్థుల సంఖ్య 40.

తొలుత మిడిల్ కోర్స్ వరకు విద్యాభ్యాసం జరిగేది. కొన్ని సాంకేతిక కారణాల వల్ల 1960 ప్రారంభంలో పాఠశాల మూతబడింది. దీనికి అనుబంధంగా నడుస్తున్న బాలికల, బాలుర వసతిగృహాలు కూడా మూత పడ్డాయి.

1969 పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో ఆ తర్వాత అప్రతిహతంగా విద్యాబోధన సాగింది. ఈ పాఠశాలకు తొలి హెడ్‌మాస్టర్‌గా ఒంగోలు బసవయ్య పనిచేశారు. అప్పటివరకూ బైబిల్ విద్య నేర్చుకోవాలంటే రామపట్నం వెళ్ళవలసిన అవసరముండేది. ఇక్కడే ఒక బైబిల్ కాలేజీ ఎందుకు ప్రారంభించరాదని బెర్గ్‌తోల్ద్ 1920లో 'బెతనీ బైబిల్ స్కూల్'ని 25 మంది విద్యార్థులతో ప్రారంభించారు. ఏడేళ్ళపాటు ఆయనే ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఎందరో ప్రఖ్యాతులైన పాస్టర్‌లు ఈ బైబిల్ స్కూల్‌లోనే శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎదిగారు.

> **నాగర్‌కర్నూల్‌లోని మిషన్ కాంపౌండ్ నుండి 'సువార్తమాని' అనే క్రైస్తవ మత మాసపత్రిక వెలువడింది. ఈ మాన్యువల్ యంత్రంపైనే 'ది హార్వెస్ట్ ఫీల్డ్' అనే ఆంగ్ల పత్రికను ముద్రించేవారు. ఈ అచ్చు యంత్రం ఇప్పటికీ మహబూబ్ నగర్ మిషన్ కాంపౌండ్‌లో ఉంది. బెర్గ్‌తోల్డ్‌తో మొదలైన 'అమెరికన్ మెన్నోనైట్ బ్రెదరన్' సంస్థ నేడు 'ఇండియన్ మెన్నోనైట్ బ్రెదరన్' గా రూపు చెందింది.**

బహుశా చాలామందికి తెలియదేమోగాని నాగర్‌కర్నూల్‌లోని మిషన్ కాంపౌండ్ నుండి 'సువార్తమాని' అనే క్రైస్తవ మత మాసపత్రిక వెలువడిన విషయం. 1931లో చిన్న అచ్చు యంత్రాన్ని కొన్నారు. ఈ మాన్యువల్ యంత్రంపైనే 1936 నుండి 'ది హార్వెస్ట్ ఫీల్డ్' అనే ఆంగ్ల పత్రికను ముద్రించేవారు.

ఈ అచ్చు యంత్రం ఇప్పటికీ మహబూబ్‌నగర్ మిషన్ కాంపౌండ్‌లో ఉంది. బెర్గ్‌తోల్డ్‌తో మొదలైన 'అమెరికన్ మెన్నోనైట్ బ్రెదరన్' సంస్థ నేడు 'ఇండియన్ మెన్నోనైట్ బ్రెదరన్' గా రూపు చెందింది. 62 ఎకరాల విశాలావరణలో ఒకనాటి ఆసుపత్రి, బైబిల్ కాలేజీ, హాస్టళ్ళు నేడేవీ లేవు కానీ వాటి ఆనవాళ్లు మాత్రం మనకు నేటికీ ఇక్కడ సజీవంగా కనిపిస్తాయి. హాస్పటల్ కోసం ఆ కాలంలో డెస్పెన్సరీ, వార్డును, వెహికల్ షెడ్‌ను, టీచర్స్, సిస్టర్స్ క్వార్టర్స్, చర్చి అన్నీ ఒకనాటి వైభవానికి తీపి గురుతులే!"

### విశాఖపట్నం - బళ్ళారి

చెన్నైలో తెలుగు ముద్రణ ప్రారంభించిన పిదప అది కొంత సత్ప్రయోజనాన్ని సాధించడం గమనించి 1804లో లండన్ మిషన్ సొసైటీ మిషనరీలు విశాఖపట్నంలో తెలుగు ప్రెస్ ప్రారంభించారు. ఆగస్టస్ డెన్ గ్రేంజన్, జార్జి క్రేన్ అనే ఇద్దరు మిషనరీలు తెలుగు నేర్చుకుని మత్తయి, మార్కు, లుకా సువార్తలను ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించి ముద్రించారు. ఆ తర్వాత బళ్ళారి మిషనరీలు 1812లో తెలుగు ప్రెస్ స్థాపించారు. బళ్ళారి ట్రాక్టు సొసైటీ క్రైస్తవ బోధనకు సంబంధించిన గ్రంథాలను 1817లో ప్రచురించింది.

బళ్ళారి నుంచే మొదటి తెలుగు పత్రిక *సత్యదూత* 1835 నుంచి ప్రచురించారు. మిషనరీలు తొలుత మత గ్రంథాలు ప్రచురించినప్పటికి రెండవ దశలో నీతి కథలు, నిఘంటువులు ప్రచురించి వ్యవహారిక భాషను ప్రోత్సహించారు.

### మద్రాసు స్కూల్ బుక్ సొసైటీ

ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం ((1757-1857) విద్యా విధానంలో మార్పులు తీసుకురాదలచి 1820లో మద్రాసు స్కూల్ బుక్ సొసైటీని స్థాపించింది. **ఈ సొసైటీలో అదాలత్ కోర్టులో ఇన్టర్‌ప్రెటర్‌గా పనిచేసే వెన్నెలకంటి సుబ్బారావు (1784-1839) గారిని సభ్యునిగా నియమించింది. సుబ్బారావు 1820 నవంబరు 22 తేదీన కంపెనీకి సుదీర్ఘమైన లేఖ రాస్తూ ఇంగ్లీషు విద్యా విధానం, శాస్త్రీయ గ్రంథాల ప్రచురణ, వచన రచనల అవసరాన్ని వివరించారు. ప్రాచ్య విద్యల అధ్యయనాన్ని నిరసించారు. దాదాపు ఇదే భావాలతో ప్రముఖ సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ (1772-1833) 1823 డిసెంబర్ 11వ తేదీన గవర్నరు జనరల్‌కు లేఖ రాశారు. ఈ ఇద్దరి లేఖలోని**

**అంశాలను కంపెనీ ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని విద్యా విధానంలో పెద్ద మార్పులు చేసింది.**

ఛందస్సు, వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిష్యం – మొదలైన ప్రాచ్య విధానం స్థానే ఇంగ్లీషును, సాంఘిక, విజ్ఞాన శాస్త్రాల బోధన ప్రారంభించింది. ఈ మార్పు గ్రంథ ముద్రణకు చక్కని దోహదం సమకూర్చింది.

పందొమ్మిదవ శతాబ్దాంతంలో యద్దనపూడి సంజీవయ్య, బరూరు త్యాగరాయ చెట్టి, గుంటుపల్లి శేషాచార్యులు, వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రులు, ప్రభృతులు తెలుగు ముద్రాణాలయాలను స్థాపించి, ముద్రణను ప్రోత్సహించారు. మరోవైపు జమీందారులు, శ్రీమంతులు పుస్తకాల రచన ప్రచురణను ఆదరించారు.

తదుపరి తెలుగు ముద్రణ రంగం బళ్ళారి, విశాఖ పట్నంలో స్థిరపడి, తదుపరి విజయవాడ, తెనాలి, కర్నూలు, హైదరాబాదు పట్నాలకు చేరింది. ఆ దినాలలో ప్రింటింగు ప్రెస్సులను అచ్చుకూటాలు, ముద్రణాలయాలు, ముద్రణశాలలు, – అని ముద్దుగా తెలుగు పేర్లతో పిలిచేవారు.

ఛందస్సు, వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిష్యం - మొదలైన ప్రాచ్య విధానం స్థానే ఇంగ్లీషును, సాంఘిక, విజ్ఞాన శాస్త్రాల బోధన ప్రారంభించింది. ఈ మార్పు గ్రంథ ముద్రణకు చక్కని దోహదం సమకూర్చింది. పందొమ్మిదవ శతాబ్దాంతంలో యద్దనపూడి సంజీవయ్య, బరూరు త్యాగరాయ చెట్టి, గుంటుపల్లి శేషాచార్యులు, వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రులు, ప్రభృతులు తెలుగు ముద్రాణాలయాలను స్థాపించి, ముద్రణను ప్రోత్సహించారు. మరోవైపు జమీందారులు, శ్రీమంతులు పుస్తకాల రచన ప్రచురణను ఆదరించారు.

**నవభారతానికి నాంది**

19వ శతాబ్ది తుది పాదం, 20వ శతాబ్ది మొదటి భాగంలో భారత జాతీయ పునరుజ్జీవనానికి పునాదులు వేశారు. ఈ కాలంలోనే తెలుగు బోధనా భాషగా పాఠశాలలో ప్రవేశపెట్టడం వలన, ప్రజానీకాన్ని, జాగృతపరిచే ప్రతీ ఉద్యమాల వలన, ప్రపంచంలో జరిగే సంగతులు, విజ్ఞాన శాస్త్ర విషయాలు అందరికీ అందచేయాలనే ఉత్కంఠతతో కొందరు యువకులు బయలుదేరడం వలన తెలుగులో పుస్తకాల ప్రచురణను ప్రోత్సహించవలసిన సమయం ఆసన్నమైంది.

ఈ సమయంలోనే విజ్ఞాన చంద్రికా మండలి, వేగుజుక్క గ్రంథమాల మొదలైన సంస్థలు బయలుదేరి తెలుగులో సులభ గ్రాంథికంలో నవలలు, నాటికలతో బాటు విజ్ఞాన దాయక గ్రంథాలను ప్రచురించినవి, దాదాపు ఇదే కాలంలో బయలుదేరిన గ్రంథాలయోద్యమం ఈ పుస్తకాలకు మంచి ఆదరాన్ని ఇచ్చి ప్రోత్సహించింది.

ఆ తర్వాత బయలుదేరిన వ్యవహారిక భాషా ఉద్యమం పుస్తకాల ప్రచురణకు కొండంత బలాన్నిచ్చింది. చౌకధరలో సచిత్ర వార పత్రికలు మాసపత్రికలు, రావడం చేతనూ, ఈ పత్రికలూ, ఇతర సంస్థలు ఏటేటా పోటీలు నిర్వహించడం చేతనూ అనేక మంది నూతన యువ రచయితలు, ముఖ్యంగా స్త్రీలు రచనా వ్యాసంగంలోకి దిగారు.

సాధారణ విద్యాభ్యాసం గల చదువరి సులభంగా అర్థం చేసుకొని ఆనందించే రీతిలో కుప్పలు తెప్పలుగా నవలలు, కథలు–మొదలయిన రచనలు అనేక నూతన ప్రక్రియలలో వచ్చాయి. వీటికి మంచి ఆదరణ గూడ లభించింది.

1812–1900 మధ్యకాలంలో దాదాపు రెండువేల గ్రంథాల ప్రచురణ జరిగినట్లు కాశీనాథుని నాగేశ్వరరావు గారు ప్రచురించిన ఆంధ్ర వాఙ్మయ సూచిక (1928) వలన తెలుస్తుంది.

దేశం మొత్తం మీద అన్ని భాషలలో అన్ని విషయాలపై ప్రచురించే పుస్తకాలు, పత్రికలు కోల్‌కత్తాలోని జాతీయ గ్రంథాలయానికి చట్టరీత్యా పంపవలసి ఉంది. ఈ ప్రచురణల సహాయంతో భారతీయ గ్రంథ సూచిని (ఇండియన్ నేషనల్ బిబ్లియోగ్రఫీ) ఏటా ప్రచురిస్తారు.

తెలుగులో ప్రతి ఏడు సుమారు రెండువేల దాకా కొత్త పుస్తకాలు అచ్చువుతున్నాయి. ఈ పుస్తకాలు పూర్తిగా జాతీయ గ్రంథాలయానికి చేరడం లేదు.

ఈ సూచీ ఉపయోగాన్ని ప్రచురణ కర్తలు గుర్తించి, అచ్చయిన ప్రతి పుస్తకమూ విధిగా కోల్‌కత్తాలోని జాతీయ గ్రంథాలయానికి చేరేపని చూడవలసింది.

దేశంలోని ప్రచురణ కర్తలందరూ సకాలంలో పుస్తకాలను పంపినపుడే జాతీయ గ్రంథసూచీ జాతి సంపదను ప్రతిబింబించగలదు.

# శాసన పరిష్కారం

*- జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి*

**శాసనం దొరికిన విధానమెట్టిదనిన...**

అప్పటికి, నేనింకా ధారాళంగా సిగిరెట్లు తాగుతూన్నాను, మానలేదు. కుతి తీరదానిక్కూర్తిపడడమూ లేదు. ధారాళముగా వాటిమీద పాటలు రాశి ప్రచురించి ఎడా పెడా, మెప్పుల్నీ, దెప్పుల్నీ మూట గట్టుకుంటూనే వున్నాను. కొమ్ములు తిరిగిన భావకవికింద్ర చెలామణీ ఔతూన్న రోజులు అవి.

నాలో నాకే వేదన, సంతోషం, దిగులు, తబ్బిబ్బు. అల్లాంటి ఉపద్రవకరమైన రోజులు అవి. మా యింటికి పక్కయింటికి ఎదటి యింట్లో వోభాగాన ముసలి విధవ అవ్వగారున్నారని నన్నెరిగిన ప్రతివాడికీ తెలుసు. ఆ అవ్వగారిపేరు ఆ అంధరితోపాటు నాకూ తెలీదు. కాని మా ఆవిడా, నా మరదలూ, మా పాపా (మూడేళ్లున్నర ఈడు మా పాపకు) అంధరూ ఆ ఆవిడా ఆవిడ చెల్లెలికొడుకూ (పేరు పార్థసారథి, చెట్టంతమనిషి, మంచివాడే, పాపం ఆయనకు పడుచుదనంలోనే భార్యపోయింది. మళ్లీ సమ్మంధాలు రానూలేదు. ఆయనా సంసార జంజాటం, రొంపి అని పెళ్లి చేసుకోలే దంటాడు! దాసీ అంకమ్మని బాహాటంగానే ఉంచుకొన్నాడు! మందులు (వశ్యౌషధాలు) కక్కించడం ప్రధానవృత్తి. బైరాగుల్తోటీ, జంగాల్తోటీ తిరుగుతాడు. బైరాగుల కుండే అన్ని ఛండాలపుగుణాలూ ఉన్నై.) యిద్దరూ రోజూ వొచ్చేట్టుగా, మామూలుగా, రాత్తెళ్లు భోంచేశాక వొచ్చే పెత్తనాలకు వొచ్చారు. వొస్తూనే వోకథ ఎత్తుబడిచేసి మరీ వొచ్చాడు. వాడిదుంపతెగా, వన్నెలు చిన్నెలుగా, పూసగుచ్చినట్లు ఏం రంజుగా చెప్తాడనీ కథల్ని.

పక్కనుండి వింటూంటే- ఇల్లా మనం రాస్తే... అని అనిపిస్తుంది. వాడు వెళ్లిపోయాక తీరాచూస్తే అందులో ఏమీ వుండదు. వొచ్చి మా అంధరి తోటీ కథాకేళి జరిపి, కబుర్లు చెప్పి వెళ్లిపోయాడు. వాడు యివాళ చెప్పిందాంటో వొక కొత్త విషయం వుంది. పెదపెంటపాట్లో బైరాగు లుంటారట. వాళ్ళు త్రికాలవేదులట. ఆపన్నార్తి ప్రశమన ఫలు లని.

రాత్రి ఫదింబావు అవుతుంది అప్పటికి. బైరాగి విరాగిశబ్దభవం. 'వ' కు, 'బ' వొచ్చింది. సరళానికే గసడదవా దేశం. వృద్ధి. వైరాగ్యం, బైరాగ్యం కాలేదు. వైరాగ్యం, విరాగి మాటలు ప్రసవించిన విచిత్రరూపం, అని నాలో నేను తెలీకుండా యింత భాషా చర్చ చేసుకున్నాను.

మా వాడు యింతలో యాడవడం, మా ఆవిడ వేళకు తగ్గట్టుగానే భోంచేస్తూండడమూ, నన్ను కాస్త సమదాయించ రాదా అని కోప్పడ్డమూ నా ఆలోచనకు వాక్యూం బ్రేక్‌వేశినై.

తెల్లార్లూ పెంటపాడూ. బైరాగులూ, పెంటపాటి మఠాలూ, లోకసంగ్రహార్థం రాగ ద్వేషాదుల్ని చంపుకున్న, సన్యసించిన, ప్రత్యక్షగోస్వాములూ, హరనాథ బాబాలూ, గౌరాంగులూ, అవీ తెగ ఆలోచించాను. కునుకు పట్టలేదు. కృష్ణశాస్త్రి అన్నట్లు - పానుపంటని వేడినిదర

వేగించాను. తెల్లారఘుట్ట అవ్వగారు భూపాల రాగచ్ఛాయలో: పాడుతూ పేడ వేటకు బయలు దేరారు. వెంఠనే ఆవిణ్ణి కలుసుకున్నాను. పెంటపాటి సంగతి ఆరా తీశాను. "యిప్పుడా? ఆ సంగతి-" అంటూ కొంచం నసిగింది. మళ్ళీ అవ్వగారు జీవామేలుకో అని పాడుకుంటూ సందు తిరిగి వెళ్ళిపోతున్నారు! నా చెవుల్లో, నాలో ''మేలుకో'' గింగురుమంటోంది. తేలిన పర్యవసానం: పెదపెంటపాడూ, చినపెంటపాడూ అని రెండూ వున్నైట. రెండుచోట్లా బైరాగులుంటార్ట. పెదవేగీ చినవేగీ అని రెండూ వున్నట్లు, విశ్వనాథ సత్యనారాయణగారి వేగీక్షేత్రం పద్యాలు గుర్తుకొచ్చినై. నాలో నేనే అలవాటుగా గనక చదువుకున్నాను. ఆ పద్యాలు రాశేప్పుడు అక్కడ సత్యనారాయణగారు ఎంత ఉప్పొంగారో..

అక్కడ రసవాద, ధాతువాద, శిలావాద కాష్ఠవాదు లుంటారని థెగవూహిస్తోంది మనస్సు.

నన్నయ్యకు పూర్వపువీ, దగ్గరవీ శాసనాలు కొద్దిగానే దొరికనై. మన మో రొండు మూడు చులాగ్గా సంపాయించి పబ్లిష్ చేస్తిమా, భాషాసేవ ఆ సైడ్ నించి కూడా చేసినట్లౌంతుది. ఉబ్బూత లూగు తున్నాను.

చేతులో దమ్మిడీ లేకపోయినప్పటికీ అప్పుచేసి కాబూలీవాడు అప్పు యివ్వకపోతే, ఈ శాసనాలు సంచారం అప్పట్లో పడేదీకాదు, యిటు వంటి శాసనాన్ని నేను సంపాయించేవాణ్ణీ కాను. భాషాసేవ జరిగేదీ కాదు. అందుకు మీరంథా నాతో పాటు, ఆ కాబూలీవాడికీ, అప్పు యిచ్చినందుకు కృతజ్ఞత చూపడం మర్యాద. యిటు పెంటపాడు బయలుదేరాను.

అక్కడ బైరాగుల్ని కలుసుకుని, తిండీ తిప్పలూ లేక, వేళాపాళా లేక, వరసా వావీ లేని ఆ బైరాగుల్నీ ఆశ్రయించి మొత్తమ్మీద నాల్గోనాడు పెదపెంటపాట్లో శాసననాలుంటాయని గ్రహించాను. కన్యా శుల్కంలో బైరాగి, విశాఖపట్నం తీర్థపు రాళ్ళ రేవున, కొన్ని నిలువలలోతున, కంచు శివాలయం వుందని చెప్పినట్లుగా, శ్రీ భిక్షానందగిరి (నాకు శాసనాల భోగట్టా తెలిపిన సద్గురిని దీక్షానామం) వారు, చూచాయగా, పుకారుగా, మబ్బులో దోబూచిగా మాటలలో మాటగా, ఊరికి వుత్తరప్పక్కని శాసనాలుంటాయని అన్నారు. వుండలేక అప్పుడే బయలుదేరుదా మనుకుని, గురువుగారి కెక్కడ కోపంవొస్తుందో అని ఆ పూటకు అక్కడే తేవిణీవేశి, మర్నాడు పొద్దున బైలుదేరాను. ఎంత వెతికినా శాసనాలు ఏవీ నాకంటి క్కనబడలేదు. శాసనాలు ఛట్టున కనిపిస్తాయా? ఎంతకష్టపడాలీ? గిరాంమ్మూర్తీ, మానవల్లి రామకృష్ణకవి, కొమర్రాజు లక్ష్మణరావుగార్లు, ఎంతెంత కష్టపడి సంపాయించారో గదా, శాసనాల్ని. కొంత దూరం పోగా, పోగా, తులిశికోటలూ, (శ్మశానం కాదూ మరి) వోచిన్న గుంటా, దాంటో పసరెక్కిన నీళ్లూ, పక్కని యేటవాలుగా, చాళ్ళగా, బట్టలు వుతుక్కోడానికి వీలుగా, వోఎర్రనిరాయీ, కనబడినై...

తిరిగి తిరిగివున్నా నేమో, ఛాలివొస్తోంది. చేతులో ప్రయాణసంచీ, వైతాళికులూ (కవిత్వం పక్కన వుండకపోతే, బతగ్గలనా) ఆ రాతిమీదపెట్టి, అట్లాగే ఆరాతిమీద తిష్ఠవేశి, యింత అలసట తీర్చుకున్నాను.

– యింతలో సిగిరెట్టు దమ్ములు కాశిని తీసి, యిహ లేచిపోదా మనుకుంటుండగా, ఆ సాయింత్రం సూర్యుని బక్కకోపపు కిరణాలు ఆ రాతిమీద పడ్డై. అంతదాకా తుమ్మల్లో పొద్దుకూకినట్లుండే ఆ రాయి ఆ కాస్తకే, ఛర్రుమని ధగాధగా మెరిసింది. చూశాను. యింకేం? లిపీ సంజ్ఞలూ గోచరించినై. అమ్మ!

తీరా చూస్తే, వోనిలువుగీతా, (సన్నంగా) వో ఎర్రటిపేడూ (రాయిబహుపాద్ది. శాసనం చెక్కినవాడు అశ్రద్ధగా చెక్కివుంటాడు, వీడిదుంప తెగా) కనిపించినై.

కాకతీయులకు వరాహముద్రా, విజయనగరపు రాజులకు చిక్కిరిబిక్కిరి అక్షరాలతో శ్రీవిరూపాక్ష, అనీ వుంటై. అటువంటిదేమో అని చూచాను కాదు. ఏదో ఎదో సింబాలిజం!

ఐతే, యేమిటీ– ఈ సింబాలిజం?

నాకేం బోధపళ్లేదు.

జయంతి రామయ్యపంతులు, రాళ్లభండి సుబ్బారావు, భావరాజు కృష్ణరావు, మల్లంపల్లి సోమశేఖర శెర్మగార్లకు తెలీచేస్తే – వాళ్ళు చులాగ్గా తేల్చేస్తారు. భావకవినైనంత మాత్రాన, నా మనస్సౌందర్యం చూడక, మాలకాటణ్ణి చూశినట్లు చూశి, యద్దేవా చేస్తే... ఛీ, నామర్దా.

కుర్రకారు హిస్టోరియన్స్, మారేమండ రామారావు, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులకు తెలీచేస్తే – అసలు వోకమిటీని వేస్తే... భేష్!

ఏముటీభేషు?, ఆ కమిటీ వో అయిదారు నెల్లు తాత్సారంచేస్తూ, చివరికి– "రాయి బహుపాతది. అక్షరాలు తెలీటంలేదు. లోని విషయం బ్రహ్మభేద్యంగా వున్నై. తత్వం బోధపళ్లేదు. ఏంచేస్తాం ఇప్పటికి దొరికిన ప్రెమాణాలను బట్టి చూస్తే– రాయిమాత్రం బహుదొడ్డది" అని తీర్మానించి నీళ్లు నమిలితే– మళ్లీ నామెడని యీ చట్టుబండ తప్పుదాయె. ఛ్ఛ్!

వాళ్లు మటుక్కు నాకంటె హేమాహేమీలా? ఎల్లా ఓఅల్లా నేనే తంటాలు పడదా మనుకున్నాను.

మళ్లీ రాతిదగ్గరికి పోయి చూశాను. అల్లాగే వుంది. ఆలోచించగా, చించగా, స్ఫురించింది. దానకాలాన్ని గుర్తుంచాడు శిల్పి! ఎర్రటిపేడు కుజగ్రహం. ఆనిలూపాటి సన్నగీత, అనూరాధ, లేదా, విశాఖ. ఆ గ్రహం ఈతారను వేధించిన సమయం. ఆ మహాపుణ్యసమయాన. అని యింత అర్థాన్ని సింబలైజ్ చేశాడు శిల్పి! వీడమ్మకడుపుకాలా!

శాసనాన్ని తూచి బరువు నిర్ణయించడం భారతిలో ఏ శాసనం విషయంలోనో చదివాను. సోమశేఖరశెర్మగార్ని అడుగుతే, లోహశాసనాలు అల్లాతూస్తారని, తద్వారా, శాసన కాలికతను గుర్తించొచ్చనీ, వోసారి అన్నట్లు గుర్తు. వెధవ వైదీకబ్బుద్ధి. అప్పుడే శిలాశాసనాల విషయం అడిగానుకాదు.

పోనీ, దీన్నికూడా తూయకూడదా అనిపించింది ఆ తొందర వుత్సాహంలో. చుట్టుపక్కల తక్కెడ లేదు. ఉజ్జాయింపుగా అన్నా, చూద్దామని ఎత్తాను ఊతం చేసుకుని. అమ్మో. ఆముక్తమాల్ద (మహాకావ్యం) అంత బరువూ ఉంది.

– నేను కెమేరా తీసుకుపోలేదు. చెప్పొద్దూ నాకు ఫోటోలుతీయడం చాతకాదు. పోనీ యింత కాటుక మషి, మసి, తీసుకు పోలేదు. మారేడుకాయను చేసి ప్రింటు తీసుకోడానికి.

ఉత్థ ఎమ్మీజికొద్దీ వెళ్లానేగానీ, ఏం ఏం తీసుకెళ్లాలో గుర్తులేదు. నలుగుర్నీ కనుక్కుని ఐనా వెళ్ల లేదు. నా అవస్త చూస్తే నాకే డాన్‌కిక్‌సోట్ గుర్తుకొచ్చాడు.

ఆలోచించి –

గట్టిగట్టి రాగిడిమట్టి – సహం ఎండింది, యింత పట్టుకొచ్చి, దిమ్మగా చేసి, దాన్ని ఆరాతికి అతికించి, దాన్ని పదిలంగా యింకో చోట పెడుతూ, ఆ శాసనానికి నకలు ఎత్తు కున్నాను. తరువాత ఆ మట్టిదిమ్మలకు మసి పూసి, దాన్ని కాగితంమీద అద్దుకుని, దాన్ని ఫొటో చేశి, ఆ ఫొటో కాపీలు ఆ రాతి దగ్గరకు తీసికెళ్లి సరిచూసుకుని, పరిష్కరించ దలుచుకున్నాను.

ఈ శాసనాన్ని, కదిపి, కుదిపి, దులిపి, రేపి, ఊపి, దూర్చి, మార్చి, యథాయోగ్యతల గల మాటలతో తగుపాటలతో సంస్కరించి, పరిష్కరించి, ఆవిష్కరించు తూన్నాను.

ఆ తరువాత వివరణలూ, సవరణలూ రాసిపెట్టుకుని, కిందటిసారి మద్రాసు వెళ్లినప్పుడు, మల్లంపల్లి సోమశేఖర శెర్మగారి ద్వారా నా సందేహాలు తీర్చుకుని, యిప్పుడు ప్రచురించుతున్నాను. నాకు శాసనం ఎలా దొరికిందో తెలీపర్చాలంటే యింత గ్రంథం వుంది.

ఆదిలో మా ముసిలవ్వగారి చలవ, కదా, యింతలాభం తెలుక్కి చేకూర్చింది. అంచాత ఆవిడవర్ణన చేయకతప్పింది కాదు. శాసనం–

శాసనం వోమూల కోసుగా తెగి, విరిగి పోయింది. రాయి బహుపాతదని అనేకదాఖలాలు వున్నై. శాసనం చెక్కిన సన్నాసి, చాల అశ్రెద్ధగా చెక్కాడు. వో వేళ శ్రెద్ధగా చెక్కినా, చాలాకాలం కాడంచాత రాయి పేటురేగిపోతోంది. యింకా డజన్ సంవత్సరాలు దానికేశి ఎవ్వరూ, యీ దృష్టితో చూడకపోతే, చాలా చాలా శిథిలమైపోయేదే. ముసిలవ్వ రూపేణా భగవంతుడు, నా కీ సద్బుద్ధి పుట్టించాడు. నయం.

లిపి –

ఇప్పటి లిపి కానేకాదు. ఎట్టా ఔతుంది? మనం రాశేలిపే వేరు. ఈ లిపే వేరు. అక్షరాలు పొంకంగా లేవు. ఆరవీటిరాజుల కాలపుపద్ధతీ కాదు. కాకతీయులనాటి పద్ధతీ కాదు. రేనాటిశాసనాల పద్ధతీ కాదు. గాంగరాజులపద్ధతీ కాదు. చాళుక్యల పద్ధతీకాదు. రాష్ట్రకూటుల పద్ధతీకాదు. ఐతే ఎప్పటి పద్ధతీ అని నన్ను రొకాయించకండి, నాకుమట్టుకు ఏం తెలుసు? తెలీలేదు గనక, ఎంత తెలియదో అంత ప్రాచీన మని వూహిస్తున్నాను.

తలకట్లు ఏటవాలుగా వున్నై. అక్షరాలు కుదిమట్టంగా లేవు. చ, ఛ, చి, ఛీ లు స్పష్టంగా కొట్టొస్తున్నై. నసపలూ, శవర్ణమూ, ఇణీ, పులుముడుగా వున్నై. అ, డ, హలూ, మకారమూ, ఎబ్బెట్టుగా వున్నై. అచ్చులో; ఎత్వ, ఐత్వ, ఔత్వాలు మరీ గరి నాసిగా వున్నై.

కొన్ని అక్షరాలు నాకు యిప్పటికీ చాలా సందేహాస్పదంగా వుంటే – వాటిని కుండలీకరణంలో వేస్తూ, నా మార్పులు ఫుట్ నోట్స్ లో సూచిస్తో, చచ్చి చెడి, సహాళమైన ఇబ్బందులూపడి, అడ్డమైన గడ్డీకరిచి, యీశాసనాన్ని యీమట్టుకు తేగలిగాను.

భాష–

ఈ శాసనంలోని భాషయేభాసో తెమలడంలేదు. నామట్టుకు నేను 'తెలుగు' అని నమ్మి పరిశోధనలు సాగించాను. అందులో శాసనం అంథా సాంకేతికం. 'వ' అంటే వర్షమో, వారమో, తేలదు. 'వి' అంటే విషయమో, విశాఖానక్షత్రమో, తెమలదు. 'వృత్తులు' అన్న మాటకు అపభ్రంశరూపమైన 'విర్తులు' ఏమో అనీ అనుమానం.

"చాలాకాలంనించీ బట్టల రాపిడి ఎంతవున్నా, శాసనంలోని విషయం ఉతకేయబడినా, అదేంమహత్తో,

"స్వదత్తాం పరదత్తాం
యో హరేత వసుంధరాం
షష్టిర్వరుషసహస్రాణి
నిష్ఠాయాం జాయతే క్రిమిః"

అనే వ్యాసగీతలు నా మనస్సులో క్ష్యాక్ష్మామెరుస్తున్నై, ఇంకేం. అక్కడక్కడ దుర్గమంగానూ, దుర్జ్ఞేయంగానూ వుంటంచాత అనేక భ్రమ ప్రమాదాలకు లోను కావలసి వొచ్చింది.

ఉర్దూభాష యేమో అనీ, బ్రాహ్మీ లిపి ఏమో అనీ, అప్పుడు కించపడ్డాను గానీండి, చిట్టచివరకు – ఖరోష్ఠీ లిపి అని తెలుంగుభాష అని నిశ్చయం చేసుకున్నాను.

లక్ష్మణ్రావుపంతులుగారు, విజ్ఞానసర్వస్వంలో రాశిన 'అక్షరాలు' అనే వ్యాసం చదివి, ఈ శాసనం కేశి చూతునుగదా– హయ్యో! లక్ష్మణ్రావుపంతులుగారు యీ శాసనాన్ని చూసివుంటే బావుండునే... అని అనిపించింది. దిగాలుపడి గుండె రాయిచేసుకుని పరిశోధనకు మళ్లీ వుపక్రమించాను.

కాలం –

శాసన "అక్షరకర్త" ఎవరో అని ఎంత భోగట్టా చేశినా, దీంతస్సలమందూ, ఇంత వరకూ ఎవరూ చెప్పలేకపోయారు.

డా.హుల్ష్, రైస్, బర్నెల్ వేణుగోపాల చెట్టీ, వొక్కళ్లయినా, యిది ఇట్టాంటి దని అన్నవాళ్ళులేరే? ఏం గతి? 'వ' అని వుంది. ప్రకెరణం కవికీ, వారానికీ సరిపోతోంది. ఎటూ తేల్చలేక ఉక్కిరిబిక్కిరై, పోతున్నాను, పొంకమైన మీసాల్తో, 'శాసనం' అంటే మాటలా? అని నవ్వుతూ, గెంగురెడ్డి వీధిలోంచి వొస్తూ సోమశేఖర శెర్మగారు కనిపిస్తున్నారు మనోనేత్రానికి. అంచాత, నేను దక్కిస్తూ, ఆయన్ని గౌరవించడానికి 'వద్దవార'మని, గ్రహిస్తున్నాను. అట్లా గ్రహించడం ఫిరంగిపురం శాసనంలోనూ, రెండో తైలపదేవుడి ఆరోశాసనంలోనూ వొస్తుంది. పోతే, కవి ఎవరో తేలలేదు. ఎక్కాల పుస్తకంలాగా, అపౌరుషేయ మేమో అనీ అనుకుంటున్నాను.

శాసనకాలాన్ని కవినిబట్టి తెలుసుకోవీలు చిక్కలేదు. కాలాన్ని బట్టి కవినీ పోల్చుకో లేకపోతున్నాను. వొక్కపద్యం రాశి, పేరో పేరో అని ఏడుస్తామే – ఈ కుకవిగాడు తన పేరు పోరుపెట్టకుండానే గుటుక్కుమన్నాడు, వీడి తాడు తెగా. ఇందాక, విశాఖనో అనురాధనో కుజగ్రహం వేధించిన సమయం అని అన్నానే అది నిజంకాదు, నా భ్రాంతి. ఐనా ఆముహూర్తాన్ని కూడా పరిశీలిద్దామని అనుకున్నా, జ్యోతిషంలో, "మీనమేషౌ చతుర్దండీ గోకుంభే చతురర్ధకం" దాటితే నాకు రాదు. జ్యోతిర్వేత్తలయిన నా స్నేహితుల్ని కలుసుకుందామన్నా శ్రీనివాస శిరోమణి (జ్యోతిషం తెలిసిన స్నేహితుడు నాకు ఇత నొక్కడే) ఆ దిక్కుమాలిన చెన్నపట్టణం వీధుల్లో, ఊకకూరిన చవకరకం సిగరెట్లు దహీస్తూ విధికి, ఎదురు, నిలువు ఈత ఈదుతూన్నట్లు నడుస్తాడేగాని, యిల్లాంటి మంచిపని అంటే కలిశిరాడు. పైపెచ్చు, నిరుత్సాహపరుస్తాడు. పోనీ ఏలాగైనా టోపీవేద్దామన్నా తప్పుడుసమన్వయం చెబ్తాడుకూడాను. (అతనికి ఇదోపొడిదుర్గుణం. తిక్క రేగితే, మంచిగానే వుంటాడు. ఇప్పుడు రేచిక్కులో వున్నాడు. పైగా రీసర్చి ద్వేషి అయ్యాడు. మొన్న లజ్ దగ్గర కనిపిస్తే నిలేసి అడిగాను. కరవొచ్చాడు. ప్రాలుద్ధం.)

పోనీ ఇంకోరికి చూపిద్దామాఅంటే వారు ఈ ఆధారాన ముక్కట్టుక్కొచ్చుని, ముందు దీన్ని (Publish) చేసి కీర్తిని కాజేస్తే– ఎన్నింటికని ఇదవం? అంచాత జ్యోతిస్సూ పనికిరాలేదు.

దానకర్తనుపట్టి, ఛందస్సునుపట్టి తేలుద్దా మనుకొంటూన్నాను.

ఇంతవరకు మనకు లభించిన ప్రాదెలుగు ఛందఃశాసనాలలో, అద్దంకి శాసనం ప్రాచీనం.

తరువోజలోవుంది, మూడవ భీమ మహారాజు శాసనం సీసంలో వుంది. రాజరాజకూతురు సోమల్దేవి శాసనంకూడా సీసంలో వుంది. దీర్ఘాసిశాసనం కూడా మనకు వొత్తాసి వొస్తోంది.

ఇది 'కంద' శాసనం. మీద చెయ్యేయగానే, చెయ్యి చెయ్యంతా వోటేదురద. తప్ప కుండా 'కంద' ఐ తీరాలి.

దానకర్తను గురించి తేలుద్దా మనుకుంటే –

'సత్తెశ్శ్రీ' అన్నట్లు కనబడుతోంది రాతిపేడు. భారతంలో పేరుకొన్న సత్యాశ్రయుని నాటిభాష ఇదికాదు గనుక, వాడితాత సత్రాశ్రయునిదిగా స్వీకరిస్తున్నాను. 'సత్యాశ్రయుడు' అనేదానికి

'సత్తెత్రళ్' ప్రాచీన పూర్వపదంగా భావించటం మహాపాపం కాదు.

శాసనంలో 'తెఱెయ్' అనివుంది చూడండి: కన్నడ భాషలోని 'తెఱె' అని దానికి, వికృతపు తెలుగురూపం. కన్నడంలో తెఱె అన్నగా పన్ను, 'యు' సముచ్చయార్థకం. 'యు'క్లుప్తరూపం 'య్'. 'తెఱెయ్' ఇలియట్ గారు సంపాయించిన అహదనకర తామ్రశాసనంలోనూ, కొద్దిమార్పుతో వుంది. ఫ్లీటుగారు ఏం మాట్లాళ్లేదు ఇక్కడ.

'కవిజెంకు' అని యింకోమాట వుంది శాసనంలో, నేటి భాషలోకి అది మార్చాలంటే 'కవియమునకు' అని ఔతుంది. కవియమునకు సత్యాశ్రయమహారాజులుంగారు దానం యిచ్చారు అనిగదా తేలింది.

'అరిడగు' అని యింకోమాట.

ఈ రెండు మాటలనూ, కొంచం వివరిస్తాను-

యమశబ్దభవం జమ. అత్వానికి ఎత్వమై జమ జెమ అయింది. ఇంకోవిధంగా చూస్తే దేవశబ్దానికి, తెలుగు జేజె. దానిలోని ఏకదేశం జే. దానికి మహదర్థకంలో, డుజు. జేఁడు. శ్రుతికటువుగా వుంటంచాత, తస్మాత్ సాదృశ్యమునుబట్టి, రామాత్ అయినట్లుగా తస్యసాదృశ్యమును బట్టి, రామస్య అయినట్లుగా, దేముడు సాదృశ్యాన్ని బట్టి, జేముడు, దాంతరవాత జెముడు అయివుండవచ్చు నని తోచుచున్నది. దేముడు శెబ్దంబు సుప్రసిద్ధంబు.

పోతే, కుప్రత్యయానికి పూర్వం నగాగమం రాకపోవడంలో, శాసనప్రాచీనత తెల్లమౌతుంది.

ఇది సత్యాశ్రయుని తాత ఐన అసలు సత్యాశ్రయుడు (అసలు తామరమందు అన్నట్లు) నాటిది గనుక, ఆనాటిభాష యిల్లాగే వుంటం ప్రాచీన శాసనపరిష్కర్తలగు బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రమ్హయ్యశాస్త్రుల వారు ప్రభృతులకు తెలీంది కాదు.

అరిడగు అంటే : అరి అంటే భూమి పన్ను. పైరు పండింతరువాత చెల్లించాల్సిన భూమిపన్నుకు అరి అనిపేరు. అహదనకర తాంరశాసనంలో ప్రభాకరశాస్త్రులవారు ఈ అర్థబలాన్నే స్వీకరించారు. డగు అనగా తరుగుదలకై ఇచ్చేడిపన్ను.

* * *

కొన్ని కొత్తమాటలు-

సెడ్లు, నేలె, బౌణ ఇత్యాదులు.

అద్దంకి శాసనంలో "త్రిభువనాంకుశ బాణనిలిపి" అని వుంది. 'బాణ'కు సరియైన అర్థం తేలలేదని మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు అన్నారు. ఇందులో 'బౌణ' అని వుంది మరి. దీంతెగ్గొయ్యా. ఇదియు శాసన ప్రాచీనతకు తార్కాణం.

మంగి యువరాజు లక్ష్మీపురశాసనంలో : 'నేల' అని వుంది. మంచన, మంచెన; మాచమ, మాచెమ; అయినట్లు నేల, నేలెకు కొత్తరూపం కావొచ్చేమో? వీణ వీణె వీణియ వీణ్య అనే రూప పరంపర ఈ ఊహకు ప్రోద్బలం. చిన్నయ్యసూరి మహాఅన్నీ తనకు తెలిసినట్లు కోస్తాడుగానీ, బాలవ్యాకరణం అరవైమూడు పక్కపుటలో, ఇరవైయోసూత్రం ఔతలిపేజీలోని విషయం అంతా శుద్ధబోకు. ఈ శాసనాంతమున ఈ విషయం విపులంగా చర్చించగలవాణ్ణి, మా ముసిలవ్వగూడా నిజం అంటే నిజం అంటోంది.

పౌణ అని యింకో మాట వుంది. బాణకు, బౌణ, బౌణకు పౌణ, పూర్వపూర్వరూపము లేమో అనుకోడానికి ఆత్తే వీలుచిక్కలేదు. చాలా గర్తిదాఖలాలున్నాయి.

శాసనం అంతా పాతతెలుగులో వుంది. శాసనాన్ని చూస్తే చాకిరేవుబండగానూ, లిపిచూస్తే బమ్హరాతగానూ, భాష ఎలికల యానాదిభాషగానూ వుంది. ఐనప్పటికి- తెలుగుశిలాశాసనం గనక, మనకు మన తాత మెల్లకంటి కోడిరెప్పవలె సర్వదా పూజంబులు.

శాసనప్పంక్తులు అన్నీ, వ్యాసగీతలతో సహా పజ్జెనిమిది. శాసనం ప్రెతిబింబం ఇస్తే బ్లాకులు చేయించడం కష్టం. పంక్తులు ఇస్తే, మీరు సరిపెట్టుకుంటారా? నేనేదో మార్చాననీ, దూర్చాననీ, ప్రతిబింబం చూపితే- రాయి చూపమనీ, అది చూపితే, ఛెస్, ఇంతేనా? అనీ కాకిగోల చేస్తారు.

పైగా, సంధులూ కీళ్లూ, కారకాలూ, అవీ ద్రావిడభాషా సంప్రదాయానుగుణంగా వున్నాయని రామకృష్ణయ్యగారూ, కాదు- ఎంతటి తెనుగుమాటైనా, (పీనుగలు (తె) పిణై+గళ్, పిణైగళ్, పిణైగ+ళ్ = పిణైగళ్; పీనుగ+లు: యిల్లా), ముందు సంస్కృతం తర్వాత ప్రాకృతం తరువాత తెలుగు అంటూ నారాయణరావుగారూ, అబ్బే- అల్లా కాదు, తెలుగుమాటలు చాలా Sanskritise చెయ్యబడినై (గోరు+అంటు=గోరంటు=



కురంటక యిల్లా) అంటూ ప్రభాకరశాస్త్రులవారూ, మళ్లీ ముగ్గులోకి వొచ్చి, కీచులాడుకుని బాధపడతారు.

ఎల్లా మరి ?

అహాదనకర తాంరశాసనం అంతపనీ మళ్లీ గిరాంపథంలో జరుగుతుందని ఝడిసి, శాసనప్రతిబింబం యివ్వక సంక్షేపిస్తున్నాను. నిజం దాచడ మెందుకని మా అంకమ్మా, మా బావమరిదీ (వాడు ఇప్పుడు అయిదోక్లాసు చదూతున్నాడు) అంటున్నారు. కాని మా ముసిలవ్వగారు, నువ్వు రాయి, కాని యామైనా, అయినవాళ్లకూ కానివాళ్లకూ చూపద్దని కేకలేస్తున్నారు.

నన్ను మీరు తిట్టినా, దుమ్మెత్తినా, దీవించినా, యాగీచేసినా నేను శాసన ప్రతిబింబం యివ్వను. ససేమిరా అంటున్నాను.

ఇహ నేను వాళ్లమాట వింటానని జయంతి రామయ్య పంతులు, మల్లంపల్లి సోమశేఖరశర్మగార్లని మీరు బాతినీపెట్టించినా నేను ఈ విషయంలో స్థితప్రజ్ఞుణ్ణి గనక, వాళ్లమాట వినను.

శ్రీనివాసశిరోమణికి ఆచోటే చెప్పను. అతను, నవగ్రహాల్నీ పన్నెండుగళ్లల్లోనూ కట్టేసి నిజం లాగవొచ్చు. అమ్మయ్యో– దేవాంతకుడు!

మరో మాట:

ఫ్లీటుదొరా, హుల్ష్ ప్రభృతులు, దీని క్కాపీలు తీయించి, లండన్ పంపివుంటారని అనుకునేరు. లేదు. పాతానికి సౌత్ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్ వెతికేరు. దండగ.

ఆరాయిమీదనే, ఫది పన్నెండేళ్ల నించీ బట్టలు వుతికే చాకెత 'దృగ్గి' అనే ఆమె నన్ను యిల్లా అంది:

"యెక్కెడిగుడ్డి మా రాజువయ్యా? నాకు గ్యానం వొచ్చిన కాణ్ణుంచీ ఇది చాకలిరాయేగాని చదువుల రాయి కాదయ్యా, యేం తంటాలు పడతావయ్యా బ్యాంబడా'' అని. రావుబహదూర్ హొనకోట కృష్ణ శాస్త్రిగారుకూడా, నాతో, ఈ విషయమే చెప్పారు. ఇప్పటికీ నిండైన వారివిగ్రహం కళ్లక్కట్టినట్లవుపడుతోంది.

సత్యప్రమాణ పూర్తిగా, గాయత్రీ సాక్షిగా, త్రికరణశుద్ధిగా, పోట్లాటలు పెంచడం అయిష్టంచాత విశ్వశ్రేయహ్కాంక్షినై యీ శాసనాన్ని ప్రతిబింబాల్తో ప్రచురించను. పంక్తులయినా యివ్వను.

నేను యిప్పుడు సిగిరెట్లు తాగడం మానేశాను. అయినప్పటికీ, అగ్నిసాక్షిగా (రౌండ్‌టానాదగ్గర లాండ్రీలో నిర్పు మండుతోంది. యిదుగో నేను మనోనేత్రంతో చూస్తున్నాను.) నేను ప్రతిబింబంతో శాసనం చూట్టానికైనా యివ్వనని శపథం చేస్తున్నాను.

నేను రుషితుల్యుణ్ణి గనక (ఏమన్నా అనుమానం వుంటే మా మునిమాణిక్యం నరశింహారావుని అడగండి; అతను 'స్వార్థం' కళ్లు కప్పకపోతే, చాలా మంచివాడు.)

నా మాట వినండి. కేవలం దురుద్దేశంతో శాసన ప్రతిబింబాలు ఎగెయ్యడంలేదు.

యిహ నేను దస్త్రంకట్టిపెడుతున్నాను. కథకూడా 'కంచి'కి పో టిక్కెట్‌కోసం ఎగ్మూరు స్టేషనుకు వెళ్లింది.

# పలుకు తీరు

- వోలేటి పార్వతీశం

*ఆకాశవాణి బాణి*

అమ్మ పిల్లలకి అన్నంపెట్టి, చాపమీదో, మడత మంచాల మీదో పక్కలు ఏర్పాటు చేసి, వాళ్ళని పడుకోబెడుతూ కథ చెప్పిన సన్నివేశాలు, 3,4, దశాబ్దాల గతంలోకి నడచివెళ్తే మనకి ఎన్నెన్నో జ్ఞాపకాలు ఎదురొస్తాయి. అమ్మ పడుకోబెట్టడానికి ప్రయత్నం చేస్తుంటే, కథ చెప్పమని మారాం చేసిన చిన్ననాటి జ్ఞాపకం ఎదురొస్తుంది. అప్పుడు అమ్మ ఏమనేది. "కథ చెబుతా, 'ఊ' కొడతావా? మరి' అని... 'ఓ' అని వెంటనే చంటిగాడి సమాధానం ఈ రెండూ కూడ అంత వరకే, ఎందుకంటే అమ్మకథ పూర్తిచేసింది లేదు, చంటిగాడు పూర్తిగా 'ఊ' కొట్టింది లేదు - ఎందుకంటే, మధ్యలోనే నిద్రాదేవి, ఆ పిల్లవాణ్ణో, అలసిపోయిన అమ్మనో ఆవహించేస్తుంది కనుక.

ఇదంతా ఎందుకు చెప్పానంటే, మనిషిని, జీవితంలో బాల్యం నుండే వెనకకుపోయిన (ప్రక్రియ) అంశం కథ. ఈ కథకు తొలిగుణం ఆశావాదం. అంటే అది చెప్పబడేదే. కథ చెప్పడం ముందు. కథ వ్రాయడం తర్వాత. కథకి ఒక సాహిత్య స్పర్శ కలిగించిన తర్వాత, దానికి ప్రక్రియదుస్తులు తొడిగిన తర్వాత, దాని ప్రారంభ సన్నివేశాల కోసం, మనం వెతుకులాట ప్రారంభించాం, అచ్చులోకి కథలొచ్చిన రోజుల్ని ఆ లెక్కలు, ఈ లెక్కలు కట్టీ, కథవయస్సును నిర్ణయిస్తున్నాం. వందేళ్లయిందని, వంద దాటిందని, ఏదో ఒక తీర్మానం చేస్తున్నాం.

ఇదంతా సాహిత్య చరిత్రలో ఈ ప్రక్రియ ఉనికిని, ప్రకటించడానికి చేసిన ప్రయత్నం. కానీ, మనిషికి నాగరకజీవనం ప్రారంభమైన రోజుల్నుంచీ, అతనితో కథ సహజీవనం చేసింది. వ్రాసే కథకు చాలా ముందుగానే, కథ వుంది. అవన్నీ అమ్మలో అమ్మమ్మలో, తండ్రులో, తాతలో మనకి చెప్పిన కథలు.

ఆకాశవాణి కథకి ప్రసాదించిన ఒక గొప్పవరం. ఆశుగుణం. వ్రాసుకొని చదువుకునే కథలు ప్రాచుర్యంలోకి వచ్చినా, చెప్పుకొనేకథ మనం కోల్పోయాం. అంటే కథలో మూల ధాతువులాంటి ఆశుగుణం. కాలక్రమంలో అంతరించి పోయింది.

అంతరించిపోయిన ఆశుగుణాన్ని తిరిగి కథలో ప్రతిష్ఠించడానికి, ఆకాశవాణి అవతరించిన తర్వాత ఒక వీలు కలిగింది. ఈ నేపథ్యాన్ని మనం దృష్టిలో ఉంచుకొంటే ఒక విషయం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. వ్రాసేకథవేరు. శ్రవ్యమాధ్యమ కథవేరు. మామూలు కథ రేడియోలో చదివితే అర్థం కాదా? అచ్చుకోసం, రేడియో కోసం, వేర్వేరుగా బాణీమార్చి కథ వ్రాస్తున్నారా? ఇలాంటి విషయాలన్నీ చర్చనీయాంశాలు, అంచేత వాటిని అలా వుంచుదాం.

సాధారణంగా మనం చదివే కథలు, రెండు మూడు వాక్యాల వర్ణనతో ప్రారంభమవుతాయి. నూటికి తొంభై శాతం కథలు, ఇలా వర్ణనతోనే ప్రారంభమవుతాయి. ఆ వర్ణన ప్రకృతి వర్ణన కావచ్చు, కథ జరిగే పరిసర ప్రాంతాల వర్ణన కావచ్చు, లేదంటే ఆ కథలోని, పాత్రల ఆహార్యము, మనస్తత్వాల వర్ణన కావచ్చు ఇలా రకరకాలుగా వుంటాయి- ఇక్కడ, వర్ణన అనేది ఊహకు సంబంధించిన అంశం కనుక, ఎవరి ఊహ వారిదిగా వుండే అవకాశం వుంది.

రచయిత తనకు తెలిసిన ఒక ప్రాంతాన్ని వర్ణిస్తూ మొదలుపెడితే, పాఠకుడు, తనకు తెలిసిన ప్రాంతాన్ని ఊహించుకునే అవకాశం వుంది.

అంటే, రచయిత, పాఠకుడు సమాంతరంగా ప్రయాణించరు. ఆ కారణంగా వారి మధ్య సహ అనుభూతి వుండదు. ఎవరి దారి వారిది, కనుక మనకు ఒక రసభంగానికి, అవకాశం ఇచ్చినట్లైంది.

డాక్టరు వోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

రేడియో కథ ప్రధానంగా సంఘటన పరంగా ఉండటం మంచిది. కథ పాత్రల, సంభాషణల పరంగాసాగిస్తే, కథ మొదలు పెట్టీ పెట్టడంతోనే రచయిత శ్రోతని తన అధీనంలోకి తెచ్చుకునే అవకాశం వుంది. కథ జరిగే ప్రాంతపు పరిసరాల్ని వర్ణించడం కన్నా, ఆ సన్నివేశంలో తారసపడే పాత్రల మాటల్లో, ఆ వివరాల్ని పొందుపరిస్తే శ్రవ్య కథకు న్యాయం చేసినట్టు.

కథ చదివే పాఠకుడికన్నా, కథ వినే శ్రోత పరధ్యానంలో వుండే అవకాశం వుంది కనుక, అతని ధ్యాసనంతా మనవైపు తిప్పుకోగలిగే సత్తాను. ఎత్తుగడలోనే ప్రదర్శించాలి. ఈ గుణాన్ని ఎంత ప్రతిభావంతంగా నిర్వహిస్తే శ్రవ్య మాధ్యమ కథను అంత ఉన్నతంగా తీర్చినట్టు. ఇది చాలా ముఖ్యంగా గుర్తుంచుకో వలసిన అంశం – ఇవన్నీ నిర్వహణా దక్షతను తెలియజేసే అంశాలు. వాటిని కాసేపు అలా వుంచుదాం.

ఇక, వాక్య నిర్మాణాలు. శ్రవ్య మాధ్యమ కథలో మరో ముఖ్యభూమిక, ఈ వాక్యాలదే. రేడియోకథని, వ్యాకరణ సూత్రాలకి అనుగుణంగానే కాకుండా ఉచ్చారణ సూత్రాలకు అనుగుణంగా వ్రాసుకోవడం చాలా అవసరం. అప్పుడెప్పుడో, విశ్వవాణికోసం ఒక కథకుడు చెప్పిన వాక్యాన్ని ఇక్కడ ఉదహరిస్తాను.

"సుశీల గెడ్డంగీసుకుంటో అద్దం ముందు నిల్చున్న భర్త వైపు అదోలా చూసింది." అనే వాక్యం వుందనుకుందాం. ఈ వాక్యం ఒక దృశ్యాన్ని మన ముందు వుంచుతుంది. కానీ, ఉచ్చారణ సంకేతాలను సరిగ్గా పాటించకపోతే, ఇదే వాక్యం ఎంతటి రసాభాసనైనా సృష్టిస్తుంది. గమనిక, సుశీలగెడ్డం గీసుకుంటూ అద్దం ముందు నిల్చున్న భర్త వైపు అదోలా చూసింది. ఎంత దారుణమైన భావాన్ని కలిగించిందో గమనించే వుంటారు. కానీ, సుశీల, గెడ్డం గీసుకుంటూ అద్దంముందు నిల్చున్న భర్తవైపు అదోలా చూసింది. ఇప్పుడు సవ్యమైన ఊహ కలుగుతుంది.

రేడియోలో కథను చదివేటప్పుడు ఈ ప్రమాదాన్ని ఊహించాలి. అలా ఊహించగలిగినప్పుడే, రసభంగం వాటిల్లకుండా వాక్యనిర్మాణంలో మనం జాగ్రత్త పడతాం. ఈ రసాభాసను ముందే



ఊహిస్తే ఈ వాక్యం ఎలా దిద్దుకొనే అవకాశం ఉంటుందో గమనించండి. సుశీల గెడ్డం గీసుకుంటూ అద్దంముందు నిల్చున్న భర్తవైపు అదోలా చూసింది.

ఉచ్చారణా సంకేతాలు పాటించకపోయినా ఇబ్బంది లేని విధంగా ఎలా వ్రాసుకుంటామంటే, "గెడ్డం గీసుకుంటూ అద్దంముందు నిల్చున్న భర్తవైపు, సుశీల అదోల చూసింది." ఈ వాక్యాలు, కామాలు ఎక్కడ పెట్టి, ఎక్కడ కలిపినా చదివినా ఎక్కడ ఆపి చదివినా భావంపైన మాత్రం యావగింపు కలుగదు.

ఇలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు, మొత్తం మీద పరిశీలిస్తే అచ్చులో కథకి రేడియోకథకి, విలువల్లో తేడాలుండక పోవచ్చుగానీ, వలువల్లో తేడాలుంటాయి. ఆ గమనిక, రేడియో కథకు ప్రత్యేక గుర్తింపు తెస్తుంది.

* * *

తెలుగు సాహిత్యంలో ఒక విశేషమైన స్థానాన్ని ఆక్రమించుకున్న ఒకానొక ప్రక్రియ నాటకం. నాటకాన్ని ఒక సాహిత్య ప్రక్రియగానే పరిగణించి, రచనలు సాగించిన దశ మొదటిది. నాటకం ప్రదర్శనకు నోచుకోకపోతే ప్రయోజనం సిద్ధించదనే భావనతో ప్రదర్శనే లక్ష్యంగా రచనలు సాగించిన దశ రెండవది. నాటకానికి కాలక్రమంలో ఏర్పడిన అనుబంధ రూపాంతరం నాటిక. నాటకానికి క్లుప్తరూపం నాటిక అనే భావన ఒకటి జనసామాన్యంలో రూఢిగా ఏర్పడింది. కానీ అది సరైన భావన కాదు. రచనా సంవిధానంలో, సన్నివేశ నిర్వహణలో నాటకానికి, నాటికకు విభిన్నమైన శైలివుంది. ప్రేక్షకులు ఆ విషయం మీద దృష్టి పెట్టకపోయినా, రచయితకు స్పష్టంగా తెలిసిన విషయమే ఇది.

ఆకాశవాణి ఆవిర్భావం తర్వాత, పఠనకు, ప్రదర్శనకు మాత్రమే పరిమితమైన నాటకం కొత్తరూపం తొడుక్కుంది. అదే శ్రవ్య నాటకం. ఒక మాధ్యమం ఏర్పడిన తర్వాత, ఒక ప్రక్రియ ఇలా క్రొత్తరూపం తొడుక్కోవడం అసాధారణ విషయం. శ్రవ్య నాటకం విషయంలో ఇదే గమనార్హమైన తొలి అంశం. పఠనకు మాత్రమే పరిమితమైన నాటకాలను పరిశీలిస్తే, సన్నివేశాలు, సంఘటనలు జరిగే ప్రాంతాల వర్ణనలతో పాటు,

ఆయాపాత్రల ఆహార్యం, మనస్తత్వం వంటి వాటి వర్ణనతో ప్రారంభ మవుతాయి. గ్రాంథిక భాషా గ్రంథాలను గుబాళించే సంభాషణ లతో, కథనం సాగుతుంది. ముఖ్యమైన విషయమేమిటంటే సంభాషణలు, వ్యాకరణ సూత్రాల కనుగుణంగా వుంటాయి.



ప్రదర్శనానుగుణమైన నాటకాల విషయానికొస్తే రంగస్థలం మీద సన్నివేశం ఆవిష్కరించడానికి అవసరమైన వివరాలను వర్ణించడంతో ప్రారంభమవుతాయి.

జరిగేప్రాంతాన్ని, సమయాన్ని, పాత్రల ఆహార్యాన్ని వర్ణించి చెప్పవలసిన అవసరం వుంది. అనంతరం ఒక పాత్ర ప్రవేశించి, మూకాభినయం ద్వారానో లేదా, తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగానో, లేదా ఏదో ఒక సంబోధనతో మరొక పాత్రను ప్రవేశించేలా చేయడమో ఇలా సాగుతుంది.

కానీ, శ్రవ్య మాధ్యమ నాటకం అలాంటిది కాదు. రేడియో నాటకాన్ని సన్నివేశ వర్ణనతో ప్రారంభించవలసిన అవసరం లేదు. ఒక వేళ వర్ణించవలసిన పరిస్థితి వున్నా, అది సంభాషణా పరంగానే సాగుతుంది. లేదా, ఒక పాత్ర తనలో తాను మాట్లాడుకుంటున్న రీతిలో ఆ సన్నివేశాన్ని కళ్ళకు కట్టిస్తుంది.

''షాజహాన్ తన ప్రేమనంతా ఇక్కడ పోత పోసినట్లున్నాడు. ఎంత అందంగా వుందీ తాజ్‌మహల్. విద్యుత్ ప్రవాహంతో పనిలేని ఈ ప్రేమప్రాసాదానికి, పున్నమి చంద్రుడు వెన్నెల దీపం వెలిగించాడు. ఈ ధవళసౌధం ఎంత ప్రకాశించి పోతోంది. గంటకు పైగా రాధకోసం నిరీక్షిస్తున్నా, నాకెందుకో విసుగనిపించడం లేదు.

ఇదికదా! ప్రేమ మందిరిమంటే" ఇలా ఒక పాత్ర తనలో తాను మాట్లాడు కుంటూవుంటే, సన్నివేశం జరిగే ప్రాంతం, పాత్ర మనస్తత్త్వం, ప్రవేశించబోయే పాత్ర పరిచయం, అన్నీ అర్థమవుతాయి. అంతేకాదు ఉచ్చారణ ద్వారా పాత్ర అనుభూతిని ప్రకటించ గలిగితే, మొత్తం సన్నివేశం, శ్రవ్యం నుండి దృశ్యంలోకి మారిపోతుంది. ప్రదర్శన నాటకాల్ని రంగస్థలంపైన ప్రదర్శించేటప్పుడు, ఆ సన్నివేశం జరిగే స్థలాలకు కొన్ని పరిమితులుంటాయి. ఆ పరిమితులను అధిగమించగల శక్తి శ్రవ్య నాటకానికి వుంది. తాజ్‌మహల్ దగ్గరో, నడిచే రైల్లోనో, ప్రయాణించే కారులోనో, సముద్రతీరంలోనో, ఏడంతస్థుల మేడపైనో, హొటల్లోనో, సినిమాహాల్లోనో, ఆసుపత్రిలోనో, పాఠశాల ప్రాంగణంలోనో, పెరట్లోని తులసి కోటవద్దనో ఎక్కడైనా సన్నివేశాన్ని నిర్వహించవచ్చు.

రేడియో నాటకంలో, సన్నివేశ నిర్వహణకు ప్రతి బంధకాలే వుండవు. సన్నివేశానికి అనుగుణంగా, శ్రవ్య ఉపకరణాలను నేపథ్యంలో వినియోగించుకుని, గొప్ప వాక్చిత్రాలను శ్రోతల హృదయ ఫలకాలపై చిత్రించే అవకాశం వుంది. రేడియో నాటకం సాధించిన గొప్ప విజయమిది.

ప్రదర్శన నాటకాల విషయంలో చాలా సమాజాల వారు ఎదుర్కొనే పెద్దసమస్య స్త్రీ కళాకారులు. కారణా లేవైనా, ఎక్కువమంది నటీ మణులు అందుబాటులో లేని కారణంగా, స్త్రీ పాత్రలేని నాటికలు ప్రత్యేకంగా ఊపిరి పోసుకున్నాయంటే ఆ కొరత ఎంత ఎక్కువగా వుండేదో మనకి అర్థమవుతుంది. స్త్రీ కళాకారిణుల కొరతవల్ల, ఆ నాటికలకు విశేష ప్రాచుర్యం లభించింది.

ఈ పరిస్థితిని అధిగమించడానికి కొత్త ద్వారాలు తెరిచింది రేడియో నాటకం. రంగస్థలం పైన, పదిమంది ముందు, అభినయించడానికీ, కుటుంబపరమైన, లేదా ఇతరమైన ఇబ్బందులు పడే స్త్రీ కళాకారులు రేడియో నాటకంలో ఆ ప్రతిబంధకాన్ని అవలీలగా జయించారు.

రంగస్థల అనుభవం లేకపోయినా, ఇతరత్రా బిడియపడే అవకాశాలున్నా, వాటిని ప్రక్కన పెట్టి, కంఠస్వరంతో పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసిన స్త్రీ కళాకారిణులు వందల కొద్దీ పుట్టుకొచ్చారు. ఆకాశవాణి, శ్రవ్య నాటకానికి అందించిన గొప్ప బహుమతి ఈ పరిణామం.



మి



భైరప్ప

# కులాల కూడలిలో
# నిలువెత్తు ప్రశ్న దాటు

- జి. లక్ష్మి

"ఒక్క హిందూ దేవుడే కాదు. ఏ దేవుడైనా అంతే. జనాల్ని చీల్చి భేదాలను సృష్టించిన అతి పెద్దశక్తి ఏదంటే దేవుడే. అల్లా గొప్పవాడా, క్రీస్తు ప్రభువు గొప్పవాడా అని ఎన్ని యుద్ధాలు జరిగినై. అల్లా గొప్పవాడా, రాముడు గొప్పవాడా అని హిందూ దేశంలో ఎంతమంది చావలేదు. మతాంతీకరణ జరిగింది. వీళ్ళలో కూడా విష్ణువనీ, శివుడనీ తక్కువ జరిగిందా? తనపేరును నాలుగు ఐదు వేల సంవత్సరాలనుంచి జనం దురుపయోగం చేస్తున్నారు అనేది నిజమైన దేవుడికి తెలియదా? మతం, ధర్మం, దేవుడూ- ఇవన్నీ వట్టి మౌఢ్యం.'' ఒక తరం కిందటి గ్రామీణ భారతంలోని కులమత వ్యవస్థల తీరుతెన్నులను ఇంత విస్తృతంగా, గాఢంగా, లోతుగా చర్చకు పెట్టిన విశిష్ట నవల ఎస్.ఎల్. భైరప్ప *దాటు.*

ప్రేమకథ నేపథ్యంగా సాగిన *దాటును* భైరప్ప కుల వ్యవస్థకు విస్తృతమైన కాన్వాసుగా ఉపయోగించుకున్నారు. ఒకదశలో ప్రేమకథే ఉపకథగా, కులవ్యవస్థే ప్రధానకథగా అనిపిస్తుంది కూడా.

భారతీయ సమాజానికే కులవ్యవస్థ ఒక ప్రత్యేకతగా ఆవిర్భవించింది. హిందూ సమాజ మనేది కులాల సమ్మేళనం. ప్రతికులం గిరిగీసుకున్న ఒక పరిమిత సంస్థ. అందులోకి కొత్త వాడికి ప్రవేశం లేదు. కులవ్యవస్థ జాతిని సమున్నతీకరించక పోగా హిందువులను విభిన్నుల్ని చేసింది. ఇతర మతాల వారిని, జాతులను తమ మతంలో కలుపుకొని, తమ మతాన్ని తమ సమాజాన్ని విస్తరింప చేసుకొనే అవకాశం హిందువులకు లేకుండా పోవడానికి కులవ్యవస్థే కారణం. కులంతో సంబంధం లేకుండా ఒక వ్యక్తిలోని గుణగణాలను, శక్తి సామర్థ్యాలను, గొప్పతనాన్ని గుర్తించే పద్ధతి హిందూ సమాజంలో లేదు. అలా గొప్పతనం కలవాడు తన కులం వాడైనప్పుడు మాత్రమే అది గుర్తించబడుతుంది. హిందూ మతంలోని నీతి అంతా ఆటవిక నీతే. మంచికోసమో, చెడుకోసమో నిలబడటంకన్నా కులం కోసం నిలబడటం అనేదే ముఖ్యం.

ఐరోపాలో కూడా బలమైన వాళ్ళు, బలహీనులను దోచుకోవటం, కొల్లగొట్టడం ఉన్నమాట నిజమే. అయితే అక్కడ బలవంతుడు భారతదేశంలో హిందువులులాగా కింది కులాల పట్ల అంత దుర్మార్గంగా వ్యవహరించటం లేదు. ఐరోపాలోని పీడిత ప్రజలు ఇక్కడి శూద్రులులాగా అంత నిస్సహాయులుగా ఎప్పుడూ లేరు. చాతుర్వర్ణ వ్యవస్థలాంటి దుర్మార్గమైన వ్యవస్థ భారతీయ సమాజంలోనే ఉంది. ఒక్క మౌర్య సామ్రాజ్యకాలం తప్ప తక్కిన చరిత్ర అంతా అపజయాలతో, అంధకారంతో నిండి ఉందనేది చరిత్ర చెప్పే సత్యం. మౌర్యుల కాలంలో చాతుర్వర్ణ పద్ధతి నిర్మూలించ బడింది.

గ్రామీణ భారతంలో వేళ్ళూనికొని పోయిన కులవ్యవస్థను స్పృశించి వదిలివేయడం కాకుండా దానిపై విస్తృతంగా చర్చకు పెడతారు భైరప్ప. తమ ఆధిపత్యాన్ని, దోపిడీని స్థిరం చేసుకునేందుకు అగ్రకులాలు సృష్టించిన భావజాలమే కులం. ఇది ప్రధానంగా సైద్ధాంతిక సమస్య. దీనిని ఒక ప్రధాన

సమీక్ష : జి. లక్ష్మి , ఫోన్: 9490735322

సామాజిక సమస్యగా మూలాల్లోకి వెళ్ళి మరీ శోధిస్తారు భైరప్ప. మనుధర్మ శాస్త్రంతో మొదలుపెట్టి రిజర్వేషన్ల వరకు కులవ్యవస్థ తీరు తెన్నులలో వచ్చిన మార్పులను, కులవ్యవస్థను దానితో ముడిపడి ఉన్న సామాజిక అణచివేతను విస్తృతంగా చర్చించడమే కాకుండా దాని పరిష్కార మార్గాలను, పోరాట దశలను కూడా విశ్లేషిస్తారు.

సంక్లిష్టమైన కులవ్యవస్థను పెంచి పోషిస్తున్న ఆర్థిక పునాదులను కూడా భైరప్ప ప్రస్తావించకుండా వదిలి పెట్టలేదు. రిజర్వేషన్ల కారణంగా దళితులలో నూతనంగా ఆవిర్భవించిన మధ్య తరగతి తమకు సామాజిక హోదా, అధికారంలో భాగస్వామ్యం కావాలని భావించడం, దళితులలోని హరిజన, మాల వర్గాల్లోని విభేదాలు, దళిత పురుషులు, దళిత స్త్రీల పట్ల చూపించే వివక్ష – ఏదీ భైరప్ప దృష్టిపథం నుంచి దాటిపోలేదు.

మూడు నాలుగు వేల సంవత్సరాలుగా గ్రామీణ భారతంలో వేళ్ళూనికుని పోయిన వర్ణవ్యవస్థపై కూలంకషంగా ఒక చారిత్రక పరిశోధన, అధ్యయనం స్థాయిలో లోతుపాతుల్లోకి దిగి చర్చిస్తాడు భైరప్ప. కులవ్యవస్థలోని వివిధ లోపాలను, అనేక కోణాల్లో ఎత్తి చూపించడమే కాకుండా కులవ్యవస్థ అంతరించడానికి వివిధ స్థాయిల్లోని పోరాట దశలను కూడా సూచిస్తాడు.

“బలప్రయోగం లేకుండా, సంఘటితశక్తి లేకుండా నిమ్న కులాలవారు తక్కిన వారితో సమానం కావడం సాధ్యమే కాదు. అయితే “బల ప్రయోగం, సంఘవిద్రోహానికి దారి తీయకూడదు. అసెంబ్లీలోను, ఎన్నికల్లోను, వ్యాపార రంగంలోను, దేవాలయాలు మొదలైన ధార్మిక సంస్థలలోను తమ వంతు భాగాన్ని చేజిక్కుంచుకోవడానికి నిరంతరంగా పోరాటం సాగించాలి” అంటూ విశదపరుస్తాడు.

కుల వ్యవస్థకు సంబంధించిన ఒక వాస్తవిక దృక్కోణాన్ని తనదైన రీతిలో ఆవిష్కరిస్తాడు భైరప్ప. బ్రాహ్మణకులానికి చెందిన సత్య, హరిజనకులానికి చెందిన మీరాను “కుల భేదాలను నువ్వు నమ్ముతావా” అని అడుగుతుంది. “నేను నమ్మితే ఎంత, నమ్మక పోతే ఎంత” అంటుంది మీరా. “అదేం” అన్న సత్యతో “అందరికంటే కింది కులం మాది, నేను నమ్మను అని నాతో సమానంగా పరిగణించడానికి మాకంటే కింది కులం ఒకటి ఉండాలి కదా! అమెరికాలోని నీగ్రోలు వర్ణ వివక్షతను మేం పరిగణించం అంటే ఏం ప్రయోజనం? తెల్లవాళ్ళు అనాలి ఆమాట” అంటూ సంస్కరణ ఎక్కడి నుండి మొదలవ్వాలో తేటతెల్లం చేస్తుంది.

సదాచార బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సత్యభామ తన సహాధ్యాయి, గౌడ కులస్తుడయిన శ్రీనివాస్‌ను వివాహం చేసుకోవాలని అనుకుంటుంది. దానికి ఆమె తండ్రి, గుడి పూజారి అయిన వెంకటరమణయ్య తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. శ్రీనివాస్ తండ్రి, మంత్రి అయిన మేళగిరిగౌడ్ మొదట వివాహానికి సమ్మతించి పిదప రాజకీయపు ఎత్తుగడతో ఇంకో ఎమ్మెల్యే కుమార్తెతో శ్రీనివాస్ వివాహం జరిపిస్తాడు. వేరే కులానికి చెందిన శ్రీనివాస్‌ని వివాహం చేసుకోబోతుందనే కారణంగా లెక్చరర్ ఉద్యోగం పోగొట్టుకుని ఒక బట్టల దుకాణంలో సేల్స్ గరల్‌గా చేరుతుంది సత్య. తండ్రి మానసిక స్థితి సరిగా లేదని తెలిసి చివరకు ఊరికి తిరిగి వస్తుంది.

శ్రీనివాస్ భార్య కాన్పు కష్టమై చనిపోగా మేళగిరి గౌడ తిరిగి శ్రీనివాస్‌కు వివాహం చేయాలని సంకల్పిస్తాడు. అయితే సత్యభామను తప్ప వేరే ఎవరినీ చేసుకోనని శ్రీనివాస్ చెప్పడంతో ఆమెను ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు. తనకు వివాహం చేసుకోవాలనే ఇచ్ఛ నశించిందని చెపుతూ, హరిజన ఎమ్మెల్యే బెట్టయ్య కుమార్తె, మిడిల్ స్కూల్ టీచర్ అయిన మీరాను ఎందుకు చేసుకోకూడదు అని శ్రీనివాస్‌కు సూచిస్తుంది సత్య. శ్రీనివాస్ హరిజన యువతిని వివాహం చేసుకోవడం ఇష్టంలేని మేళగిరి గౌడ సత్య అన్న వెంకటేశ్వర్లుని ప్రేరేపించి సత్యమీద తిరిగి ఆశలు కల్పించి శ్రీనివాస్‌ను మీరాకు దూరం చేస్తాడు.

మానసికస్థితి సరిలేని వెంకటరమణయ్య తనకు అంతకుముందు ఒక హరిజన మహిళతో కల సంబంధం బయటపడుతుందనే భయంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటాడు. శ్రీనివాస్ నుంచి తిరస్కరణకు గురైన మీరా కూడా అదే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది.

మీసాలు పెంచాడనే కారణంగా తన తండ్రి బెట్టయ్య మేళగిరి గౌడ తండ్రి చేతుల్లో దెబ్బలు తినడం సహించలేని బెట్టయ్య కొడుకు మోహన్ దాసు ఊరిలోని హరిజనులలో చైతన్యం తీసుకువచ్చి వాళ్ళల్లో విప్లవ భావాలు రేకెత్తించడానికి ప్రయత్నం చేస్తుంటాడు. మీరా చనిపోవడంతో శ్రీనివాస్ మానసిక స్థితి దెబ్బ తింటుంది. ఊరిలోని అరాచకానికి

దేవాలయమే కారణమని, దేవాలయాన్ని ధ్వంసం చేయాలని భావించి మోహన్‌దాసు చెరువుకట్టను డైనమైట్‌తో పేల్చేస్తాడు. దానితో చెరువుకట్ట తెగి దేవాలయాన్ని నేలమట్టం చేసిన ఆ ప్రవాహపు ఉధృతిలో పడి తాను కొట్టుకుపోతాడు మోహన్‌దాసు. ఇదీ స్థూలంగా *దాటు* కథ.

సమాజంలో అస్పృస్యత, అంటరానితనం ఏ స్థాయిలో ఉన్నది వివిధ దృక్కోణాలనుండి చర్చిస్తాడు భైరప్ప. శూద్రులకు దేవాలయ ప్రవేశం ఆర్భాటంగా జరిపించి పేపర్ల కోసం ఫోటోలు తీయించి హరిజనులు ఆలయం నుంచి బయటకు రాగానే ఆలయాన్నంతటిని పాలతో, నీళ్ళతో శుద్ధి చేయించడాన్ని బెట్టయ్య కొడుకు మోహన్‌దాస్ నిరసిస్తాడు. బ్రాహ్మణ హోటల్ లోపలికి వెళ్ళి అక్కడి గ్లాసుతో టీ ఇమ్మని అడిగినందుకు తనను కొట్టి హోటల్ నుండి గెంటించడాన్ని అతను జీర్ణించుకోలేకపోతాడు.

ఒకసారి సత్య "మిడిల్‌స్కూల్‌లో ఆడపిల్లల్ని ఇప్పుడు కూడా కొడుతున్నారా?" అని మీరాను అడుగుతుంది. "తక్కిన మాస్టర్లు కొడతారు నేను పిల్లల్ని ముట్టుకోకూడదు కదా కొట్టను" అంటుంది మీరా. "అట్లా అయితే పిల్లలు రాసినది దిద్దేటప్పుడు ఏం చేస్తావు" అని ఆశ్చర్యంగా అడుగుతుంది సత్య. "దూరంగా నిల్చుని పిల్లల పుస్తకాలు మేజా బల్లపై పెడతారు. నేను దిద్ది అక్కడ పెట్టిన తరువాత దూరం నుంచీ తీసుకుంటారు అంటుంది. ఇది విన్న సత్య నిర్ఘాంత పోతుంది.

సత్య అన్న వెంకటేశం బ్రాహ్మణులలోని లౌకిక వర్గానికి, కొత్త తరం బ్రాహ్మణులకు ప్రతినిధి. తిరుమలాపురం గ్రామంలోని వివిధ కులాలు, మతాలవారి అంతస్తులను నిర్ణయించడానికి ఒక సభ జరపాలని నిర్ణయం అవుతుంది. గ్రామంలోని వివిధ కులాలకు చెందిన వారు వెంకటేశాన్ని కలుసుకుని లంచం ఇచ్చి తమ కులం సామాజికంగా పై స్థాయికి చెందిందని చెప్పమని అర్థిస్తారు. దానికి వెంకటేశం అంగీకరించడాన్ని సత్య నిలదీస్తుంది.

దానికి వెంకటేశం "బెస్తలకు వాల్మీకులనిపించుకోవాలని ఆశ. కురుమకు కాళిదాసు అనిపించుకోవాలని ఆశ. కంసాలికి విశ్వబ్రాహ్మణుడనిపించు కోవాలని ఆశ. ఈ ఆశలు, ప్రయత్నాలు అంతటా ఉన్నవే. వాళ్ల అంతస్తు పెరిగిందని పై కులాల వారి చేత అన్పించుకోకపోతే తృప్తిపడరు. మీరూ బ్రాహ్మణులే. మాతో సమానులే అన్పించుకోవడానికే వారి తహ తహ" అంటాడు. "అలా అయితే ప్రపంచంలో పుట్టిన మానవులంతా బ్రహ్మయొక్క అంశమే. మీరంతా బ్రాహ్మణులే అని చెప్పు. డబ్బుతీసుకుని దొంగసాక్ష్యాలు ఎందుకు చెప్పడం" అంటుంది సత్య. దానికి వెంకటేశం "నేను కేవలం గ్రామ పురోహితుణ్ణే కాదు, రాజకీయంగా పలుకుబడి ఉన్నవాడిని. చుట్టుపక్కల గ్రామాలలో నామాట చెల్లుతుంది. నానోటి నుంచి వచ్చిన మాట శంఖంలో పోసిన నీరు అవుతుంది" అంటాడు.

"నువ్వు చెప్పినంతమాత్రాన అందరూ ఒప్పుకుంటారా" అని అంటుంది సత్య "అదేంలేదు ఏకులం సంపన్నమై ఉంటుందో, ఇతరులకు అప్పులు పప్పులు ఇచ్చే యోగ్యత కలిగి ఉంటుందో ఆకులం వాళ్ళు పైకులం పేరు అంతస్తు కావాలని అడిగితే తక్కిన వాళ్ళు ఒప్పుకుంటారు. లేకపోతే తన్ని పింపిస్తారు" అంటూ సమాజాన్ని నడిపించే బలమైన ఆర్థిక సూత్రం అసలు గుట్టు విప్పుతాడు వేంకటేశం. అంతేకాదు కులాల సామాజిక అంతస్తుని నిర్ణయించడానికి వీలుగా తానే కొన్ని సంస్కృత శ్లోకాలను తయారుచేసి వాటినే శాస్త్ర ప్రమాణాలుగా కుల సభలో నిరూపిస్తాడు.

మూడు తరాల అంతః సంఘర్షణకు దాటు అద్దం పడుతుంది. మొదటి తరం వాడయిన బెట్టయ్య నిమ్న వర్గానికి సంబంధించి సమాజంలో ఉన్న కట్టుబాట్లను మౌనంగా అంగీకరిస్తాడు. మీసాలు పెద్దగా పెంచినందుకు ఊరిపెద్ద తిరుమలగౌడ జీతగాళ్ళతో కొట్టిస్తే పూరు విడిచి పారిపోతాడు తప్ప ఎదురు తిరగడు. హోటళ్ళలో తనకు టీ వేరుగా గ్లాసులో పోసి ఇచ్చినా దానికి అభ్యంతరం చెప్పడు. దానిని సహజమైన ప్రక్రియగానే తీసుకుంటాడు.

అయితే రెండవ తరం వచ్చేసరికి బెట్టయ్య కొడుకైన మోహన్ దాసు దీనినంతటిని వ్యతిరేకిస్తాడు. తండ్రి సమాజపు కట్టుబాట్లను ఆమోదించడం, ప్రభుత్వం రిజర్వేషన్లు పేరిట ఇచ్చే సదుపాయాలకు సంతృప్తిచెంది ఊరుకోవడం అతనికి నచ్చదు.

నాలుగువేల సంవత్సరాలు పేరుకు పోయిన చెత్తను కాల్చి బూడిద చేయకుండా కొత్తదేది మొలకెత్తడం సాధ్యం కాదని అతని భావన. అవసరమయితే దేవాలయాలతో పాటు ప్రతిదానిని డైనమైట్లతో పేల్చివేయాలని, విప్లవం లేవదీస్తే తప్ప ఏది మారదని అంటాడు. ఇన్నివేల సంవత్సరాల తరువాత ఇపుడు సమానత కోసం పోట్లాడాల్సిన అవసరం

లేదని, బ్రాహ్మణ తదితర కులాలను అణగద్రొక్కి తాము పరిపాలించాలన్నదే తమ ఆశయమని, వాళ్ళు వచ్చి తమ పొలాల్లో అరకలు కట్టాలంటాడు. పట్టుకుని తన్నకుండా ఎవ్వరూ న్యాయం చేయరంటాడు. హిందూమతం వేళ్ళను ఒక్కొక్కటిగా నాశనం చేసినా తనకు తృప్తి కలగదంటాడు.

గౌడకులస్తుడయిన మేళగిరి గౌడది ఇంకోవాదం. "దేవుడేమయినా వీళ్ళు బ్రాహ్మణులు, వీళ్ళు శూద్రులు అని పుట్టిస్తాడా? అంతా బ్రాంభలే చేశారు. వాళ్ళు కష్టపడకుండా మనల్ని నలుచుకుతింటానికి అనువుగా అన్నీ వాళ్ళే కల్పించారు. మన ఇళ్ళల్లో పెళ్ళిళ్లకు బ్రాహ్మణ పురోహితులను ఎందుకు పిలవాలి? గురువులు అంటూ మనం వాళ్ళను పూజించింది చాలు. మనం శూద్రులుగా ఉండిపోకుండా పైకి వచ్చి క్షత్రియులు కావాలి. రాజ్యం ఏలాలి" అంటాడు.

నవల అంతటిలో ప్రధానంగా కన్పించేది సత్యభామ. ఆమెవ్యక్తిత్వం. శరత్ "శేషప్రశ్న"లోని కమలలాగే సత్య ఆలోచనా విధానంలో ఒక స్పష్టత కన్పిస్తుంది. ఎమ్.ఎ. హిస్టరీ చదివిన సత్య సహజంగానే కులవ్యవస్థ చారిత్రక నేపథ్యం పట్ల ఆకర్షితురాలవుతుంది." హైస్కూలులో చదివేటప్పుడు "చాతుర్వర్ణం మయాస్సృష్టం" అని తండ్రినోట విన్నప్పుడే, "దేవుడు నాలుగు వర్ణాలను సృష్టిస్తే మరి ముస్లింలను, క్రిస్టియన్లను ఎవరు పుట్టించారు" అని ప్రశ్నిస్తుంది సత్య.

ఎవరో ఒకరు కష్టాలను అనుభవించడానికి సిద్ధపడక పోతే కులమత కట్టడులను ఎదిరించడం సాధ్యం కాదని సత్య నమ్మకం. "ధైర్యం కలవాళ్ళు కట్టుబాట్లను ఎదిరిస్తారు. పిరికి వాళ్ళు మనస్సు మీద మట్టి కప్పి బురదలో పురుగులలాగా బతుకీడుస్తారు" అంటుంది.

సమాజంలోని స్త్రీల స్థితిగతులపై కూడ సత్యకు నిశ్చితాభిప్రాయాలున్నాయి. "ఈ దేశంలో వేలసంవత్సరాలుగా స్త్రీలంతా శూద్రులుగానే ఉన్నారు. బ్రాహ్మణుల, క్షత్రియుల, వైశ్యుల స్త్రీలుకూడా శూద్రులే. వారికి సింహాసనాధిరోహణ అధికారం లేదు. ఆస్తిమీద అధికారం లేదు. తండ్రి, భర్త, కుమారుల ఆలనాపాలనకు లోబడి ఉండాలి" అంటుంది.

కులవ్యవస్థను సైద్ధాంతిక లోతుల్లోకి వెళ్ళి విశ్లేషించడంలో భైరప్ప చేసిన విస్తృత అధ్యయనం అడుగడుగునా కన్పిస్తుంది. కూర్మపురాణంలో కలియుగ వర్ణనను సైతం భైరప్ప ప్రస్తావించడం దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. "కలియుగంలో రాజు బ్రాహ్మణులను అగౌరవపరచి వారితోపాటు శూద్రులను ఉన్నత స్థానాల్లో కూర్చోపెడతాడు. వేదవిద్యలో తక్కువ స్థాయికి చెందిన బ్రాహ్మణులు పుష్పాలు, ఆభరణాలు మొదలయిన మంగళప్రదమైన వస్తువుతో శూద్రులను గౌరవిస్తారు. శూద్రుల ఇండ్లలోకి ప్రవేశించే ధైర్యం లేక వారిపట్ల తమ గౌరవాన్ని ప్రదర్శించుకునే అవకాశం కొరకు ద్వారాల దగ్గర పడిగాపులు కాస్తారు. శూద్రులు వాహనాల మీద కూర్చుని ఉండగా వారిని స్తుతించి, పొగిడి వేదాన్ని పఠించి అన్నం సంపాదించు కుంటారు" అంటుంది కూర్మపురాణం. ఇదంతా అక్షర సత్యమని చరిత్ర నిరూపించింది.

కులమతాలకు అతీతమైన బలమైన లౌకిక దృక్పథానికి *దాటు* ప్రతీకగా నిలుస్తుంది. *దాటు* అంటే అధిగమించడం. కులవ్యవస్థను అధిగమించి ముందుకు వెళ్ళడం అనే అర్థంలో భైరప్ప ఈ పదాన్ని ఉపయోగించి ఉంటారనుకోవచ్చు. కర్నాటకలోని కుగ్రామమైన తిరుమలాపురం నేపథ్యంగా భైరప్ప కులవ్యవస్థ గురించి ప్రధానంగా ప్రస్తావించినప్పటికీ గ్రామీణ భారతమంతా ఒక్కొక్కటి ఒక తిరుమలాపురం అనేది చరిత్ర చెప్పే సత్యం.

*దాటు*ని ఒక దర్పణంగా చూపించి చరిత్ర చేసిన తప్పులతో పాటు మనల్ని మనం ప్రశ్నించుకుని ఒక తరం తరువాత కూడా మనం ఎక్కడ ఉన్నామో ఏ కులాల కూడలిలో నిలబడి మనల్ని మనం గుర్తించుకుంటున్నామో ఆత్మ విమర్శ చేసుకునే అవసరాన్ని కల్పిస్తారు భైరప్ప. ఆ అవకాశాన్ని ఎవరు ఏ స్థాయికి ఉపయోగించు కుంటారనేది వారి వారి అంతఃకరణలపైనే ఆధారపడి ఉంటుంది. ఎదుటి వ్యక్తిని ఒక వ్యక్తిగా కాకుండా ఏ కులానికి చెందిన మనిషో గుర్తించి అంచనా వేయడం, అభిప్రాయాలను ఏర్పరచుకోవడం ఆ మనిషి కుసంస్కారానికి, సంకుచితత్వానికి నిదర్శనం. మనిషి సంస్కారస్థాయి సరిహద్దులలో సంచరించడం ఒక విషాదం.

కులవ్యవస్థకు సంబంధించిన అన్ని పార్శ్వాలను తడిమి కులవ్యవస్థపై వచ్చిన కథనాలలో ఒక సమగ్రమైన నవలగా నిలిచిపోతుంది *దాటు*.

భైరప్ప *దాటు*కు పరిమి రామనరసింహం చేసిన అనువాదం సరళంగా తెలుగు నుడికారానికి దగ్గరగా చక్కటి నడకతో సాగుతుంది. మి
















# చదవండి...

❖ **యేనుగుల వీరాస్వామి :** రచయిత మచ్చ హరిదాసు. వీరాస్వామి రచించిన కాశీయాత్ర చదవని తెలుగువారుండరు. వీధిబడిలో చదువుకొని స్వయంకృషితో అతిపిన్న వయసులో ఇంగ్లీషు భాషలో ధారాళమైన ప్రజ్ఞ సంపాదించి కార్యనిర్వహణలో పేరుగాంచిన వీరి జీవిత చరిత్ర అవస్యం పఠనీయం. *పేజీలు 140, వెల : ₹ 95/-*

❖ **రాజనీతిజ్ఞుడు :** బూర్గుల రామకృష్ణారావు. రచయిత ఆచార్య వెలదండ నిత్యానంద రావు. ఆదర్శ ముఖ్యమంత్రిగా, విశాలాంధ్ర నిర్మాతగా, ప్రజల న్యాయవాదిగా, సాహిత్య బంధువుగా అందరికీ తలలో నాలుకలా మసలిన నిత్య చైతన్య మూర్తయిన బూర్గుల వారి జీవన చిత్రణ. చరిత్ర విద్యార్థులు, రాజకీయనాయకులు తప్పక చదివి, తెలుసుకోదగ్గ విషయాలెన్నో వున్నాయి. *పేజీలు 140, వెల : ₹ 95/-*

❖ **తాతాచారి కథలు :** 1855వ సంవత్సరంలో సి.పి.బ్రౌన్ సంకలనం చేసిన తాతాచారి కథలు ఆ నాటి వ్యవహారిక భాషకు చక్కని నమూనాలు. తెలుగు భాషకు అమూల్యమైన సేవలందించిన బ్రౌన్ దొర చేసిన విశిష్ట సేవకు రావలసినంత గుర్తింపు వచ్చినట్లు కనిపించక పోవటం క్షమించరాని మన సాహిత్య నిర్లిప్తతకు తార్కాణం. *పేజీలు 70, వెల : ₹ 30/-*

❖ **సి.పి.బ్రౌన్ :** రచయిత ఎ.ఎస్. గోపాలకృష్ణ. తెలుగు భాషా సాహిత్యానికి అపురూపమైన సేవచేసిన బ్రౌన్‌దొర జీవితచరిత్ర రేఖామాత్ర పరిచయం ఇది. తెలుగులో ఎన్నో ప్రాచీన రచనలను భద్రపరచటం ద్వారానూ, తమ నిఘంటువుల ద్వారాను తెలుగు భాషాసాహిత్యాలకు నూతనత్వం, సజీవత్వం ప్రసాదించిన బ్రౌన్‌ను తెలుగువారు దేవుడుగా భావించాలి అంటారు ఆచార్య దేవళ్ళ చిన్ని కృష్ణయ్యగారు. తెలుగు భాషతో బ్రౌన్‌కుగల అవినాభావ సంబంధం గురించి ఈ తరం వారికి తెలియజెప్పాలన్నదే ఈ పుస్తక లక్ష్యం. *పేజీలు 370, వెల : ₹ 195/-*

❖ **కళాపూర్ణోదయం కావ్యపరిచయం :** రచయిత మల్లాది హనుమంతరావు. ఒక కవి కావ్యంలో అతని వ్యక్తిత్వం తొంగి చూస్తుంది. పింగళి సూరన వ్యక్తిగా ఎలాంటివాడో ఆయన సమకాలికులెవ్వరూ చెప్పక పోయినా కళాపూర్ణోదయం కావ్యం శ్రద్ధగా చదివితే ఆయన వ్యక్తిత్వంలో చాలా కోణాలు సాక్షాత్కరిస్తాయి. ఇది సద్విమర్శతో కూడిన వ్యాసావళి. *పేజీలు 150, వెల : ₹ 95/-*

❖ **తెలుగు-తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు :** సంకలనం చేసిన వారు జొన్నలగడ్డ వెంకటేశ్వర శాస్త్రి సి.పి.బ్రౌన్ అకాడమీ వారిచే ప్రచురింప బడిన నిఘంటువు. *పేజీలు 210, వెల : ₹ 175/-*

*పైన ఉదహరింప బడ్డ ఐదు పుస్తకాలను తెలుగు భాష, సంస్కృతీ వికాసాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రారంభించబడి తెలుగు భాషకు మహోన్నత సేవలందిస్తున్న సి.పి.బ్రౌన్ అకాడమీ వారు ప్రచురించారు. పుస్తకాలు సి.పి. బ్రౌన్ అకాడమీ 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్- 82 లో లభ్యమవుతాయి.*




❖ **నేను తిరిగిన దారులు :** రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు. అందమైన అట్టమీద బొమ్మ. అందమైన ఆధ్యాత్మికమైన స్థలాలు సందర్శన. దానివల్ల కలిగిన అనుభూతులు, సీతానందం కలిగించిన శిల్పరమణీయకత ఈ అనుభవాలను గుదిగుచ్చి చెప్పిన అందమైన భాష – వీటన్నిటి సమ్మేళనమే ఈ రచన. *పేజీలు 205, వెల : ₹ 100/-, అన్ని పుస్తకాల షాపులలో లభిస్తుంది.*

❖ **ఆత్మాన్వేషణ :** కథలు, రచయిత్రి జ్వలిత. మొత్తం పన్నెండు కథలు. ఇవన్నీ వివిధ పత్రికలలో ప్రచురితమైనవే. "శ్రీశ్రీ పాటల్లో ఉండే ఆవేశం వచన కవిత్వంలో తీసుకువచ్చిన శక్తివంతమైన రచయిత్రి జ్వలిత" అంటూ రచయిత సామాజిక తత్వవేత్తయిన బి.ఎస్.రాములు పేర్కొన్నారు. *పేజీలు 84, వెల: ₹ 100/- ప్రతులు కావలసిన వారు సెల్: 9989198943 ను సంప్రదించగలరు.*




❖ **విద్వాన్ విశ్వం :** విశ్వజీవి, విశ్వరూపి అయిన విద్వాన్ విశ్వం పై పలువురు వ్రాసిన వ్యాస సంకలనం. ఈ వ్యాసంతో పాటు విశ్వం గారు నిర్వహించిన తెలుపు-నలుపు. మాణిక్యవీణ కాలమ్స్ నుంచి ఎంపిక చేసిన కొన్ని చిన్న వ్యాసాలతో ఈ సంకలనం ఒక పరిపూర్ణత సంతరించుకుంది. సంకలన కర్తలు నాగసూరి వేణుగోపాల్, కోడేహళ్ళి మురళీమోహన్. గొప్ప హృదయం వున్న గొప్ప రచయితకిదొక నివాళి. *పేజీలు 270, వెల : ₹ 200/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9701371256లో సంప్రదించండి.*




❖ **శ్రీ ఆంధ్రనాయక శతకము :** రచయిత కాసుల పురుషోత్తమ కవి. వాఖ్యాత యార్లగడ్డ బాలగంగాధర రావు. శ్రీకాకుళంలో నెలకొన్న అధిష్టాన దైవంమైన ఆంధ్ర మహావిష్ణువుతో వ్రాయబడ్డ శతకము. తెలుగులో రసజ్ఞ పాఠకులకు చేరువైన ప్రముఖ పుస్తకాలలో ఇది ఒకటి. ఇది ఇప్పటికి ఎన్నోసార్లు ముద్రితమైంది, అయినా ఎప్పటికప్పుడు ప్రతులు దొరకని పరిస్థితి. ఇప్పుడీ పుస్తకం యార్లగడ్డ వారి సరళమైన వివరణలతో ప్రచురించబడ్డది. *పేజీలు: 125 వెల: ₹ 70/- కావలసిన వారు వాఖ్యాతయిన యార్లగడ్డ వారిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. ఫోన్: 0866-2551177, సెల్ నెం.9849499169.*




❖ **రాధికా సాంత్వనము :** ముద్దుపళని ముద్దు ముద్దుగా పలికిన రాధికా సాంత్వన కృతికి యార్లగడ్డ బాలగంగాధర రావు గారు వచనానువర్తన పూర్వక వ్యాఖ్యానాన్ని అందించారు. తంజావూరు నుండి వెలువడ్డ శృంగార ప్రబంధాలలో రాధికాసాంత్వనము కడపటిదిగా భావించబడుతుంది. ఈ కావ్యం గొప్పతనమంతా కథలో గాక కథనంలో ఉంది. ముద్దుపళని రచనలో ధీటుగా 'నామాట' పేరుతో రచయిత రాసిన పరిచయ రచన, అలానే 'పువ్వులతో బాటు నార' పేరుతో వి.ఎ.కె.రంగారావు రాసిన ముందుమాట పువ్వుకు తావి అబ్బినట్లు ఈ రచనకు సుగంధ పరిమళాలద్ది మరింత శోభాయమానం చేసింది. యార్లగడ్డ వారు ఇందులో వారి రచనతో బాటుగా రాధికాసాంత్వన కావ్యాన్ని యథాతథంగా ప్రచురించడమే కాక ఆనాటి రచనలో కానవచ్చిన పదాలు, పదబేధాలు, అర్థాలు, వివరణలు, అలంకారాది అనుక్రమణిక ధ్వన్యనుకరణ పదాలను అనుబంధాలుగా జేర్చి ముద్దుపళని రచనను సమగ్రంగా ఆవిష్కరించారు. *పేజీలు 380, వెల:₹ 200/- ప్రతులు కావలసిన వారు రచయితను సంప్రదించవచ్చు. ఫోన్: 0866-2551177, సెల్ నెం. 9849499169.*




❖ **జాజిమల్లి :** మల్లీశ్వరి ఉత్తరాంధ్ర మాండలీకంలో రచయిత్రి అవగాహనతో చేసిన వ్యానాలీ బ్లాగ్ కథలు. *పేజీలు 180, వెల : ₹ 80/-, ప్రతులు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో లభ్యమవుతాయి.*

## క్రీ.త. సం. 2030లో వేషము




చిత్రకారుడు: **తలిశెట్టి రామారావు**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | | |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ | " " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 11. | సిద్ధార్థ | " " | 50.00 |
| 12. | నాలో నేను | " " | 30.00 |
| 13. | కథాంజలి–1 | *ఎస్సారె* | 80.00 |
| 14. | కథాంజలి–2 | " " | 110.00 |
| 15. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 16. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 17. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | కథా సాహితి | 150.00 |
| 18. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 19. | గురవాయణం | *డాక్టర్ గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝూ, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 11. | నూరేళ్ళ తెలుగు కథ – మహ్మద్ ఖదీర్ బాబు | |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థ లేక మరణ వ్యవస్థ *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |

మిసిమి మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..................................................

**వీథి** ..................................................

**పేట** ..................................................

**ఊరు** ..................................................

**పిన్** ..................................................

**సెల్** ..................................................

**3. సంతకం :** ..................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi




స్నానానికి...

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



పద్మావతీ చరణ చారణ చక్రవర్తి